ఆంధ్రజ్యోతి

www.andhrajyothy.com

శనివారం | 17-2-2018 | పేజీలు: 18 + 20 | వెల: రూ.5.00 | సంపుటి: 58 సంచిక: 303 | శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: విదియ తె. 4.51 తదుపరి తదియ; నక్షత్రం: శతభిషం ఉ. 11.28 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: సా. 6.13-7.54; దుర్ముహూర్తం: ఉ. 6.45-7.31; అమృతఘడియలు: తె. 4.20-6.01; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.45; సూర్యాస్తమయం: 6.15 | విజయవాడ సిటీ

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai


బ్రాండ్ అంబాసిడర్ ప్రియాంక చోప్రాతో నీరవ్

మోసం..

మరో మోసం..

బడా మోసం..

ఇప్పటిదాకా జరిగిన మోసాలన్నింటినీ తలదన్నే మోసం.

ఘరానా మోసగాడు నీరవ్ మోదీ అక్రమాలు పీఎన్‌బీతోనే మొదలు కాలేదు. అంతకు ముందే అతనికి అక్రమాల ఘన చరిత్ర ఉందని బయటపడింది. డొల్ల కంపెనీల ద్వారా నీరవ్ రూ.వేల కోట్ల అక్రమాలకు పాల్పడినట్టు ఐటీ అధికారులు తేల్చారు. అతడి అక్రమాలపై ఐటీ శాఖ ఏడాది క్రితమే అప్రమత్తం చేసినా.. బెంగళూరుకు చెందిన వ్యాపారి ఉప్పందించినా నిమ్మకు నీరెత్తినట్టు కూర్చున్న ఆర్థికశాఖ.. ఇప్పుడు చేతులు కాలాక చర్యలు ప్రారంభించింది. విదేశాంగ శాఖ అతడి పాస్‌పోర్టును నిలిపివేసింది. అతణ్ని పట్టుకోవడానికి సీబీఐ ఇంటర్‌పోల్ సాయం కోరింది.



బ్యాంకుల్లో ప్రజల సొమ్ముకు భద్రత ఏదీ?

భారం, బాధ్యత ఎవరిది?.. బ్యాంకుల కీచులాట

నీరవ్ దెబ్బకు ఆస్తుల్ని తెగనమ్ముకుంటున్న పీఎన్‌బీ

మహా మోసం

నీరవ్‌ది 4,900 కోట్ల అక్రమార్జన

150 డబ్బా కంపెనీలతో దందా, దగా.. ఐటీ విచారణలో తేలిందిదే

పన్ను ఎగవేతలో మహా ఘనుడు.. వందల కోట్ల బోగస్ పత్రాలు

ఏడాది కిందటే మొత్తుకున్న ఐటీ శాఖ

ఎంతమాత్రం పట్టించుకోని కేంద్రం


థానేలోని వివియానా మాల్‌లో ఈడీ తనిఖీలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: రెండు మూడు రోజులుగా దేశవ్యాప్తంగా మారుమోగిపోతున్న నీరవ్‌మోదీ కేసులో.. నిన్నటిదాకా బయటపడింది అవగింజంతే! అసలు నిజాలు తవ్వుకుంటూ పోతుంటే అంతులేని అక్రమాలు బయటపడుతున్నాయి. నీరవ్ మోదీకి, అతని మామ, గీతాంజలి డైమండ్స్

మిగతా 16వ పేజీలో...

హైదరాబాద్ శివారు రావిరాలలో

రూ.3500 కోట్ల వజ్రాలు స్వాధీనం

నీరవ్ మోదీ మామ ఛోక్సీకి చెందిన వజ్రాల యూనిట్‌లో ఈడీ సోదాలు

నీరవ్‌పై కేంద్ర విభాగాల ముప్పేట దాడి

29 ఆస్తులు, 105 బ్యాంకు ఖాతాలు జప్తు

విదేశాల్లోని దుకాణాలన్నీ మూసివేత

ఈడీ కేసు.. పాస్‌పోర్టు సస్పెన్షన్

-బ్యాంకు లూటీ ప్రత్యేక కథనాలు లోపలి పేజీల్లో

హేచరీస్ గుంత మింగేసింది

5


ఏడుగురిని బలిగొన్న గుంత ఇదే

విషవాయువులు చిమ్ముతున్న సెప్టిక్ ట్యాంకు.. అది తెలియక లోపలికి దిగిన ఏడుగురు మృతి

రాష్ట్రానికి మోదీ!

ప్రారంభోత్సవ ప్రాజెక్టులపై ఆరా

పీఎంవో నుంచి వర్తమానం

వస్తే.. ఏం తెస్తారు? ఏమిస్తారు?

'మట్టీ-నీళ్లు' పునరావృతమైతే?

రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం

న్యాయంపై స్పష్టత కోరే యోచన

అమరావతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య 'సాయం'పై సమరం సాగుతున్న సమయంలో, మిత్రపక్షాలైన టీడీపీ-బీజేపీ మధ్య రాజకీయ నిప్పు రాజుకుంటున్న తరుణంలో... ఢిల్లీ నుంచి రాష్ట్రానికి అనూహ్యమైన 'వర్తమానం' అందింది! "ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మీ రాష్ట్రానికి రావాలనుకుంటున్నారు! ప్రధాని స్థాయిలో ప్రారంభించాల్సిన, శంకుస్థాపన చేయాల్సిన పథకాలు, ప్రాజెక్టులు ఏవైనా సిద్ధంగా ఉన్నాయా? ఆ వివరాలు చెప్పండి" అంటూ సర్కారుకు సమాచారం వచ్చింది. ప్రస్తుత సమయంలో ప్రధాని మోదీ రాష్ట్రంలో పర్యటించాలని భావిస్తుండటం, అదికూడా నేరుగా ప్రధాని కార్యాలయం నుంచే ప్రతిపాదన రావడం ఆసక్తి

మిగతా 15వ పేజీలో...

హోదా హక్కులన్నీ ఇచ్చి తీరాల్సిందే!

నాడు 'హోదా'తో సమానమన్నారు.. అందుకే ఒప్పుకొన్నాం

సాయంపై రంగాలవారీ శ్వేతపత్రానికి సిద్ధం!..

సాయంపై చర్చకూ రెడీ.. కేంద్రం ఇచ్చింది 777 కోట్లే

కేంద్రం తీరు నియంతలా ఉంది: గంటా, కుటుంబరావు


హైదరాబాద్‌లో జరిగిన జేఎఫ్‌సీ సమావేశంలో మాట్లాడుతున్న పవన్, పక్కన జేపీ, ఉండవల్లి తదితరులు

పాలకుల తప్పులకు.. ప్రజలకా శిక్ష!

ఇది వేర్పాటువాదానికి దారి తీస్తుంది

పద్ధతి లేకుండా రాష్ట్రాన్ని విభజించారు

హామీలు నెరవేరుస్తారో లేదో.. చెప్పాలి

జాతీయ ఎమర్జెన్సీగా పరిగణించాలి

జేఎఫ్‌సీ తొలి భేటీలో పవన్ డిమాండ్ 15

ఉక్కు ఫ్యాక్టరీలకు ఓకే!

సాధ్యాసాధ్యాలపై మెకాన్ ముసాయిదా నివేదిక


రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చిస్తామన్న కేంద్రం 5

ఇంధనశాఖకు

4000 కోట్ల లబ్ధి

ఆర్ఎన్ఎల్‌జీ వినియోగంపై సుప్రీంకోర్టు తీర్పుతో లబ్ధి

5



ఆ ఎనిమిది పాశాలతోనే అధర్మం



Paramjyothi
పరంజ్యోతి

'భీషాస్మాత్ వాతః పవతే భీషోదేతి సూర్యః భీషాస్మా ద్ అగ్నిశ్చ ఇన్ద్రశ్చ మృత్యుః ధావతి పంచమ ఇతి'

ఏ కారణం చేత వాయువు వీస్తున్నది? సూర్యోదయ, అస్తమయాలు జరుగుతున్నాయి? అగ్ని మండుతున్నది? మృత్యువు కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నది? అనంతమైన ఈ విశ్వాన్ని నడిపేది ఏది? నిగూఢంగా పరిశీలిస్తే వీటన్నింటినీ నడిపేది కేవలం 'ధర్మం' అని తెలుస్తుంది. సృష్టి, స్థితి, లయ ధర్మాలకు లోబడి ఈ విశ్వం సాగుతుంది. అందుకే 'ధర్మంయందే ఈ విశ్వం ప్రతిష్ఠితమై ఉంది' అని శాస్త్రాలు చెబుతాయి. ధర్మాన్ని ఆచరించడం అంటే.. విశ్వంతో, ప్రకృతితో మమేకమై జీవించడం. దీని వల్ల వ్యక్తి, సమాజం, విశ్వాసం సమతౌల్యాన్ని పొంది సుఖం సిద్ధిస్తుంది. ధర్మాన్ని ఉల్లంఘించినా, అతిక్రమించినా సమతుల్యత దెబ్బతింటుంది. విచిత్రమేమిటంటే.. మనిషి తప్ప ఈ ప్రకృతిలో ప్రతిదీ ధర్మబద్ధమై సమతుల్యతకు చేయూతనిచ్చే విధంగా ప్రవర్తిస్తుంది. మానవుడు మాత్రమే కొన్ని సందర్భాల్లో విపరీతధోరణితో ప్రవర్తిస్తాడు. అందుకే వ్యక్తిలో అలజడి, సమాజంలో అశాంతి, ప్రకృతిలో వైపరీత్యాలు చోటుచేసుకుంటాయి. ఇందుకు ఎనిమిది కారణాలున్నాయని ధర్మశాస్త్రం చెబుతుంది. ఘృణ(అసహ్యం), లజ్జ, భయం, శంక, జుగుప్స, కులం, మానం, శీలం.. ఇవీ ఆ ఎనిమిది పాశాలు. ఈ ఎనిమిదింటిలో ఏ ఒక్కటి పట్టుకున్నా ధర్మం క్షీణించి అధర్మం తాండవిస్తుంది. శోకానికి కారణమవుతుంది. వినాశానికి దారితీస్తుంది. ఇదే అర్జునుడిని పట్టిపీడించిన అంశం. ధర్మాధర్మ విచక్షణ కోల్పోయిన అర్జునుడు శోకతప్తుడై శ్రీకృష్ణుని పాదాలపై మోకరిల్లాడు. ఈ బలహీనత నుండి అర్జునుడిని శ్రీకృష్ణుడు ఏ విధంగా తప్పించాడో భగవద్గీత వివరిస్తుంది.

-స్వామి పరిపూర్ణానంద

ఖతర్‌లో బందీగా తెలుగు మహిళ

- లక్ష ఇవ్వాలని, లేదా మరో మహిళను పంపాలని డిమాండ్
- మంత్రి మాణిక్యాలరావుకు, విదేశాంగ శాఖకు వినతులు



బాధితురాలు ఫాతిమా

చీరాల, ఫిబ్రవరి 16: ప్రకాశం జిల్లా వేటపాలెం మండలం రామన్నపేట పంచాయతీ వినాయకపురానికి చెందిన ఓ మహిళ.. విజిటింగ్ వీసాపై ఖతర్ దేశానికి వెళ్లి అక్కడి ఏజెంట్ చేతిలో బందీ అయ్యింది. ఫాతిమా స్థానికంగా చిన్న చిల్లర దుకాణం నడుపుతూ జీవనం సాగించేది.. కుటుంబం కష్టంగా ఉండటంతో అరబ్ దేశాలకు వెళ్లి సంపాదించాలని భావించింది. తనకు తెలిసిన అజీజ్ అనే వ్యక్తి ద్వారా మంగళగిరికి చెందిన షేక్ మహబూబ్ సుభానీ అనే విదేశాలకు పంపే ట్రావెలింగ్ ఏజెంట్‌ను ఆశ్రయించింది. దీంతో మంగళగిరి ఏజెంట్ గత ఏడాది అక్టోబరు 10న ఢిల్లీ విమానాశ్రయం నుంచి ఖతర్‌కు పంపించాడు. అక్కడ ఓ ఇంట్లో పనికి కుదిరింది. అయితే.. 'మాకు ఫొటోలో చూపిన వ్యక్తివి నీవు కావు' అంటూ ఆమెను హింసించటం మొదలు పెట్టారు. వారి వేధింపులు భరించలేక స్థానిక ఏజెంట్ కార్యాలయానికి చేరుకోగా వారు మరో ఇంట్లో పనికి కుదిర్చారు. అక్క డా వేధింపులు ఎదురవడంతో తనను ఇండియా పంపించాలని అక్కడి ఏజెంట్‌ను కోరింది. అయితే.. రూ.లక్ష చెల్లిస్తేనే పంపుతామంటూ వారు వీసా, పాస్‌పోర్టులను తీసుకుని బందీగా ఉంచినట్లు ఫాతి మా ఫోన్ ద్వారా ఆమె పిన్ని కరీమూన్, కుమారుడు ఖాజావలీ, తమ్ముడు మస్తాన్ తెలిపారు. దీంతో గురువారం వేటపాలెం పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. మంత్రి మాణిక్యాలరావును కలిసి వినతి పత్రం అందజేశారు. విదేశీవ్యవహారాలశాఖకు వినతిపత్రాలు పంపినట్లు తెలిపారు.

నాకు ఏడాదంతా పరీక్షలే!

125 కోట్ల ప్రజల ఆశీస్సులతో నా బోర్డు పరీక్ష రాయబోతున్నా.. 'పరీక్షా పే చర్చ'లో ప్రధాని మోదీ





హైదరాబాద్‌లోని కవాడీగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'పరీక్షా పే చర్చ' కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మణ్, విద్యార్థులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16 : 'ప్రధాని సర్, మీ పరీక్షలు ఎలా ఉన్నాయి? బోర్డు పరీక్షల కోసం సిద్ధమవుతున్నారా, లేదా?' అని నరేంద్ర మోదీని ఓ విద్యార్థి ప్రశ్నించాడు. ఈ ప్రశ్నకు మోదీ హాయిగా నవ్వుకొన్నారు. 'రోజుకు 24 గంటలూ, నెలకు 30 రోజులూ, సంవత్సరానికి 365 రోజులూ నాకు పరీక్షలే'నని ఆ విద్యార్థికి సరదాగా బదులిచ్చారు. శుక్రవారం న్యూఢిల్లీలోని తల్కోతోరా స్టేడియంలో జరిగిన 'పరీక్షా పే చర్చ' కార్యక్రమంలో చోటుచేసుకొన్న ఆసక్తికర ఘటన ఇది. పదో తరగతి, ఇంటర్ పరీక్షల నేపథ్యంలో.. విద్యార్థుల్లో స్థైర్యం నింపడం కోసం, వారిలో భవిష్యత్తు ఆశలను నిలపడం కోసం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. విద్యార్థులు వేసిన పలు ప్రశ్నలకు స్ఫూర్తిమంతంగా సమాధానాలు ఇచ్చారు. దేశంలోని అన్ని విద్యాలయాల్లో.. దాదాపు పదికోట్ల మంది విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని టీవీల ద్వారా వీక్షించారు. చర్చలో పాల్గొన్న ఓ విద్యార్థి, రానున్న లోక్‌సభ ఎన్నికలకు ముడిపెట్టి, మోదీ బోర్డు పరీక్షల గురించి ప్రశ్నించాడు. దీనిపై జవాబు ఇవ్వడానికి ముందుగా, ఆ విద్యార్థిని ప్రధాని అభినందించారు. 'నీకు ఉజ్వల భవిష్యత్తు ఉంది. నేనే గనుక మీ క్లాస్ టీచర్‌నయితే, జర్నలిస్టు వృత్తిని చేపట్టాలని నీకు సలహా ఇచ్చేవాడిని. ఇలాంటి ప్రశ్నలు వాళ్లే వేస్తారు?' అని పకపకా నవ్వేశారు. 'మాకు ఏడాదంతా పరీక్షలు ఉంటాయి. ఎక్కడో మూలన ఉన్న చిన్న మున్సిపాలిటీకి ఎన్నికలు జరిగినా, మీడియా నావైపే చూస్తుంది. మోదీకి ఎదురుదెబ్బ.. అంటూ బ్రేకింగ్ న్యూస్‌లతో అదరగొడుతుంది' అని వ్యంగ్యంగా అన్నారు. 'జనసంఘ్‌కి (బీజేపీ పూర్వసంస్థ) గుజరాత్‌లో రాజకీయ బలం లేని రోజులవి. ఒకసారి జనసంఘ్ గుజరాత్‌లో 103 మంది అభ్యర్థులను నిలబెడితే, అందులో 99 మందికి డిపాజిట్లు గల్లంతయ్యాయి. జనసంఘ్ నాయకులు మాత్రం వీధుల్లో తిరుగుతూ మిఠాయిలు పంచారు. అదేమిటని ప్రశ్నిస్తే.. నలుగురికి డిపాజిట్లు దక్కాయని బదులిచ్చారట!' అని మోదీ వివరించారు. అలాంటి పోరాటతత్వం ఉండటం వల్లనే తాము అక్కడి (సున్నా) నుంచి ఇక్కడి దాకా (పార్లమెంటులో అతిపెద్ద పార్టీ)గా రాగలిగామన్నారు. తిరిగి ఆయన 2019 సార్వత్రిక ఎన్నికల అంశం ప్రస్తావిస్తూ.. 'పరీక్షలకు సిద్ధమవుతున్న మీకు నా ఆశీస్సులు ఉంటాయి. నాకేమో 125 కోట్ల భారత జనావళి ఆశీర్వాదాలు ఉంటాయి' అంటూ ఈ అంశంపై చర్చను ముగించారు.

పరీక్షలను వేడుక చేసుకోండి

'పరీక్ష యుద్ధ వీరులు' పేరిట తాను రచించిన పుస్తకాన్ని విద్యార్థులకు ప్రధాని పరిచయం చేశారు. 'నన్ను ప్రధానిగా చూడొద్దు. మీ స్నేహితుడు అనుకొని మీకున్న సందేహాలన్నీ అడిగేయండి' అని సరదాగా వ్యాఖ్యానించారు. అదే సమయంలో పరీక్షలకు తర్ఫీదుకు కొన్ని సూత్రాలను వివరించారు.

- పరీక్షలను ఒక వేడుకలా భావించండి.
- మీలోని ప్రతిభను వెలికితీయడమే అన్ని పరీక్షల లక్ష్యమనేది గుర్తించండి.
- వివేకానందుని బోధనలను అనుసరించండి.
- పరీక్షలకు ముందు బెరుకు సహజం. మనోస్థైర్యం పెంచుకోవడం ద్వారా ఈ సమస్యను మీరు అధిగమించొచ్చు.
- పరీక్షల నుంచి మీ దృష్టిని మళ్లిస్తున్న అంశాలను గుర్తించి, తొలగించుకొంటే సరిపోతుంది.
- యోగా మీ బుద్ధి, మనసు, దేహాలను ఏకోన్ముఖం చేసి, మీ కేంద్రీకరణ శక్తిని పెంచుతుంది.
- మీ ప్రత్యర్థిని మీలోనే కనుగొనండి. ఇతరులతో మిమ్మల్ని పోల్చుకోవద్దు. మీ తల్లిదండ్రుల ఉద్దేశ్యాలను ప్రశ్నించకండి.
- మీకిష్టమైన పనులు చేయండి. ప్రకృతితో గడపండి. మంచి పుస్తకాలు చదవండి.

తల్లిదండ్రులకూ సూచనలు...

- సామాజిక హోదాకు మీ పిల్లల విజయాలను కొలమానం చేయొద్దు.
- ప్రతి పిల్లవాడిలో ఏదో ఒక ప్రతిభ ఉంటుంది. దాన్ని గుర్తించండి. మార్కులే జీవితం కాదు. దాని కోసం పిల్లలపై ఒత్తిడి తీసుకురాకండి.
- ఇతరుల పిల్లలతో మీ వాడికి పోలికలు తీసుకురావద్దు.



అది 'పరీక్షా పే చర్చ'లో పిల్లలను అడిగారు అంటే సార్ వినడం లేదు..!

ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
అనంతపురం	15.2	31.4
హైదరాబాద్	16.7	32.5
కడప	18.0	38.0
విశాఖపట్నం	18.4	30.8
విజయవాడ	20.0	33.2

తగ్గిన ఉష్ణోగ్రతలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): వాయువ్య దిశ నుంచి వీస్తున్న పొడిగాలులతో తెలుగు రాష్ట్రాల్లో చలి వాతావరణం నెలకొంది. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి ఐదు డిగ్రీల వరకు తక్కువగా నమోదయ్యాయి. కాగా రానున్న ఇరవై నాలుగు గంటల్లో వాయువ్య గాలుల ప్రభావం తగ్గనున్నదని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో శివారుప్రాంతాలు, ఏజెన్సీలో తప్ప మిగిలినచోట్ల చలి ప్రభావం తగ్గి రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయని పేర్కొంది.



ఫేస్‌బుక్ ఒక దుష్టశక్తి సంస్థ

ఫేస్‌బుక్ ప్రపంచంలోనే అతి పెద్ద దుష్టశక్తి సంస్థ. గతంలో ఉచిత ఇంటర్నెట్ పేరుతో మోసం చేసే ప్రయత్నం చేసింది. తాజాగా తీసుకొచ్చిన 'వాట్సాప్ పే' యాప్‌లో భద్రతాఫీచర్లు లేనందున.. హ్యాకర్ల బారిన పడే ప్రమాదం ఉంది. ఇది దేశ భద్రతకే ముప్పు.

- పేటీఎం చీఫ్ విజయ్ శేఖర్ శర్మ

సమస్యలపై అర్చకుల పోరాటం

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలపట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆంధ్రప్రదేశ్ అర్చక సమాఖ్య ఆక్షేపించింది. సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న అర్చకుల 'వారసత్వ' హక్కుపై ఎలాంటి నిర్ణయం వెల్లడించకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించింది. ఇకపై సమస్యల పరిష్కారానికి ఉద్యమబాట పడతామని, త్వరలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుంటామని వెల్లడించింది. అర్చకుల వారసత్వ హక్కుపై జారీచేసిన ప్రాథమిక నోటిఫికేషన్ జీవోకు ఏడాదైన సందర్భంగా ఏపీ అర్చక సమాఖ్య శుక్రవారం 'అర్చక ఆత్మావలోకన సదస్సు'ను గొల్లపూడిలో నిర్వహించింది.

కేఈ కుమారుడినీ నిందితుడిగా చేర్చండి

- నారాయణరెడ్డి హత్య కేసులో కోర్టు ఆదేశం



కేఈ శ్యాంబాబు

డోన్, ఫిబ్రవరి 16: పత్తికొండ వైసీపీ ఇన్‌చార్జి చెరుకులపాడు నారాయణరెడ్డి హత్య కేసు మలుపు తిరిగింది. ఈ కేసులో డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి తనయుడు కేఈ శ్యాంబాబు, ఆస్పరి జడ్పీటీసీ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, అప్పటి వెల్దుర్తి ఎస్ఐ తులసి నాగప్రసాద్‌ను నిందితులుగా చేర్చాలంటూ డోన్ కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆంజనేయులు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఆ ముగ్గురికి నాన్‌బెయిలబుల్ అరెస్టు వారెంట్ ఇచ్చారు. 2017 మే 21న నారాయణరెడ్డి హత్యకు గురయ్యారు. ఈ కేసుకు సంబంధించి 15 మందిని నిందితులుగా పేర్కొంటూ హతుడి భార్య చెరుకులపాడు శ్రీదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు 12 మందిపైనే కేసు నమోదుచేసి, అరెస్టు చేశారు. తాము ఫిర్యాదులో నిందితులుగా పేర్కొన్న కేఈ శ్యాంబాబు, కప్పట్రాళ్ల బొజ్జమ్మ, ఎస్ఐ తులసి నాగప్రసాద్ పేర్లు తొలగించారని పేర్కొంటూ డోన్ కోర్టులో ఆమె ప్రైవేటు కేసు దాఖలు చేశారు. కేసు పురోగతికి సంబంధించిన వివరాలు ఇవ్వడంలేదంటూ మరో పిటిషన్ వేశారు. వీటిని విచారించిన జడ్జి.. హత్య కేసులో నిందితులుగా ఆ ముగ్గురి పేర్లు కూడా చేర్చాలని తీర్పు చెప్పారు.

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ రద్దు

- త్వరలో రాహుల్ కొత్త బృందం
- 34 మందితో సారథ్య సంఘం
- నేడు ఖరారు కానున్న ప్లీనరీ తేది

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కొత్త బృందం ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు ఐదేళ్లుగా కొనసాగుతున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీని రద్దు చేసి దాని స్థానంలో 34 మంది సభ్యులతో సారథ్య సంఘాన్ని రాహుల్ నియమించారు. ఈ సారథ్య సంఘం శనివారం సమావేశమై ప్లీనరీ తేదీని ఖరారు చేస్తుంది. మార్చి 5న పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమవుతాయి. ఆలోపే ఈ ప్లీనరీ జరుగుతుందని, ఢిల్లీలో ఒకే రోజు జరిగే ప్లీనరీలో రాహుల్ నేతృత్వంలో కొత్త వర్కింగ్ కమిటీని ఎన్నుకుంటారని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. పార్టీ నిబంధనావళి ప్రకారం ప్లీనరీ తేదీని నిర్ణయించే ముందు వర్కింగ్ కమిటీని రద్దు చేసి ఆ కమిటీని ప్రత్యేక ఆహ్వానితులతో సహా సారథ్య సంఘంగా మార్చడం ఆనవాయితీ. ప్లీనరీ తేదీని నిర్ణయించడం, సమావేశ అజెండా, తీర్మానాలు, వర్కింగ్ కమిటీ ఎన్నిక తీరుతెన్నులను నిర్ణయించడం ఈ సారథ్య సంఘం బాధ్యత. కొత్త వర్కింగ్ కమిటీ ఎన్నుకున్న తర్వాత సారథ్య సంఘం రద్దవుతుంది. సారథ్య సంఘంలో రాహుల్, కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, ఏకే ఆంటోనీ, అహ్మద్ పటేల్, అంబికా సోనీ తదితరులు ఉన్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన వారెవ్వరూ ప్రస్తుతం వర్కింగ్ కమిటీలో లేనందున వారు సారథ్య సంఘంలో కూడా లేరు. వర్కింగ్ కమిటీలో 12 మందిని నామినేట్ చేసి 11 మందిని ఎన్నుకోవాల్సి ఉండగా, అందర్నీ నామినేట్ చేసే అధికారం రాహుల్‌గాంధీకి అప్పగిస్తూ ఏఐసీసీ సభ్యులందరూ లేఖలు సమర్పిస్తారని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. రాహుల్ గాంధీ టీమ్‌లో సోనియా, మన్మోహన్ సింగ్, అహ్మద్ పటేల్, గులాం నబీ ఆజాద్, మల్లికార్జున్ ఖర్గే, అశోక్ గెహ్లాట్, సుశీల్ కుమార్ షిండే, ఆస్కార్ ఫెర్నాండెజ్, జ్యోతిరాదిత్య సింధియా, జితేందర్ సింగ్, అజయ్ మాకెన్ తదితరులను నామినేట్ చేసే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. తెలంగాణ నుంచి సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జైపాల్ రెడ్డి పేరు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. రాహుల్ టీమ్‌లో సగానికి పైగా పాత నేతలున్నప్పటికీ మిగతా వారు యువ నేతలు ఉంటారని, రాష్ట్రాల ఇన్‌చార్జిలుగా ఉన్న యువ నేతలందర్నీ ప్రత్యేక ఆహ్వానితులుగా వర్కింగ్ కమిటీ సమావేశాలకు ఆహ్వానిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.



నీట్ పీజీలో దర్శి విద్యార్థినికి టాప్ ర్యాంక్!

దర్శి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా దర్శి పట్టణానికి చెందిన నుసుం ఉమామహేశ్వరి పీజీ మెడిసిన్ ఎంట్రన్స్ పరీక్ష (నీట్)లో సత్తా చాటింది. 864 మార్కులతో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రథమ ర్యాంకు సాధించిన ఆమె జాతీయ స్థాయిలో 16వ ర్యాంక్ సొంతం చేసుకుంది. ఆమెకు ఎంసెట్‌లో రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంక్ వచ్చింది. ఉస్మానియా మెడికల్ కాలేజ్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసింది. ఈ సందర్భంగా ఉమామహేశ్వరి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ పీజీలో రేడియాలజీ లేదా జనరల్ మెడిసిన్ చేస్తానని చెప్పారు.

ఆస్తులు ఏవో చెబితే చాలదు..

- ఎలా వచ్చాయో కూడా చెప్పాలి
- వివరాలు దాస్తే 'ఎన్నికల అవినీతి' కిందే లెక్క
- ఓటేసే పౌరుడికి ఎవరేంటో తెలియాలి
- సర్వోన్నత న్యాయస్థానం స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: ఎన్నికల్లో పోటీచేసే నేతలు ఇక నుంచి తమ ప్రమాణపత్రంలో కుటుంబ సభ్యుల ఆస్తుల వివరాలతోపాటు ఆదాయ మార్గాలను కూడా వెల్లడించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. శుక్రవారం ఇచ్చిన చరిత్రాత్మక తీర్పులో ఎన్నికల ప్రక్రియకు సంబంధించి పలు చర్యలను సూచించింది. ఎన్నికైన ప్రజాప్రతినిధులు, వారి భార్యాపిల్లల ఆస్తుల వివరాలను క్రమం తప్పకుండా సేకరించే యంత్రాంగాన్ని నెలకొల్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆదాయ వనరులకు మించిన ఆస్తులు ఉన్నట్లు యంత్రాంగం పరిశీలనలో తేలితే తగిన చర్యలను సిఫార్సు చేయాలని చెప్పింది. 'అక్రమ ఆస్తులున్నట్లు తేలితే సదరు ప్రజాప్రతినిధులపై సంబంధిత చట్టసభకు నివేదిక ఇవ్వాలి. వారిని అసెంబ్లీ/పార్లమెంటులో కొనసాగించాలో వద్దో సదరు చట్టసభే నిర్ణయించుకోవాలి' అని జస్టిస్ చలమేశ్వర్, జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం తీర్పులో పేర్కొంది. అభ్యర్థి కుటుంబ సభ్యుల ఆస్తులు, ఆదాయ వనరులు వెల్లడించకపోవడం ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని అవినీతి వ్యవహారాల కిందకు వస్తుందని తెలిపింది. 'ప్రజాప్రతినిధుల ఆస్తులపై పౌరులను, ఓటర్లను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడం నిజమైన ప్రజాస్వామ్య వ్యవస్థ లక్షణం. ఈ వివరాలన్నీ తెలుసుకోవడం ఓటర్ల ప్రాథమిక హక్కు' అని పేర్కొంది. ప్రజాప్రతినిధులు, వారి కుటుంబ సభ్యుల ఆదాయ మార్గాల వివరాలను వెల్లడించే విధంగా చట్టం కూడా తేవాలని ధర్మాసనం చెప్పింది. ఎంపీలు, ఎమ్మెల్యేల కుటుంబ సభ్యుల ఆస్తులు ఆదాయ వనరులకు మించి పెరిగితే దర్యాప్తు చేసేందుకు శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రహరీ అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై సుప్రీంకోర్టు ఈ తీర్పునిచ్చింది. పిటిషన్లో కొద్దిమంది నేతల పేర్లను ప్రస్తావిస్తూ వారిపై దర్యాప్తు చేయాలని కోరగా, సుప్రీం కోర్టు అందుకు నిరాకరించింది. 'నేతలను అనర్హులుగా ప్రకటించడం వెనుక ఉద్దేశం ఎన్నికల ప్రక్రియ పవిత్రతను కాపాడటం' అని సుప్రీంకోర్టు పేర్కొంది. రాజకీయ అవినీతిని పట్టించుకోకపోతే చివరకు అది ప్రజాస్వామ్య వ్యవస్థ విధ్వంసానికి, మాఫియా పాలనకు దారి తీస్తుందని హెచ్చరించింది. దురదృష్టవశాత్తు భారతదేశంలోనే పార్లమెంటు కానీ, ఎన్నికల సంఘం కానీ ఈ సమస్యపై ఇంతవరకు దృష్టి సారించలేదంది. అడ్డగోలుగా ఆస్తులను పోగేసుకున్న ప్రజాప్రతినిధిని అనర్హుడిగా ప్రకటించడానికి అవినీతి నిరోధక చట్టం కింద విచారణ జరపాల్సిన అవసరం లేదని, నిబంధనలను మార్చే సాధికారత కేంద్ర ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేసింది. అభ్యర్థి, అతని కుటుంబ సభ్యుల ఆస్తులు, ఆదాయ మార్గాల సమాచారం తెలియడం వల్ల ఓటరుకు పూర్తి ఎరుకతో సరైన ఎంపిక చేసుకొనేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొంది. అలాంటి సమాచారం అందుబాటులో ఉంటేనే పౌరుడు తన ప్రతినిధి ఎంపికలో హేతుబద్ధమైన నిర్ణయం తీసుకోగలడని పేర్కొంది.

నివేదిక రాగానే బాధ్యులపై చర్యలు

- 'సెల్‌టార్చ్ వెలుగులో ఆపరేషన్'పై కామినేని వెల్లడి

గుంటూరు, ఫిబ్రవరి 16: గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో సెల్‌ఫోన్ టార్చ్‌లైట్ వెలుగులో ఆపరేషన్లు చేస్తున్న ఘటనపై డీఎంఈ ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తున్నామని మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. నివేదిక అందగానే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శుక్రవారం వైద్య విద్య సంచాలకులు డాక్టర్ .సుబ్బారావుతో కలసి మంత్రి కామినేని గుంటూరు జీజీహెచ్‌కు వచ్చారు. జరిగిన ఘటనపై సూపరింటెండెంట్ డాక్టర్ రాజునాయుడును ప్రాథమిక సమాచారం అడిగి తెలుసుకున్నారు.

సర్జరీ జరిగిన ఆపరేషన్ థియేటర్(ఎస్ఓటీ)ని సందర్శించి లోపల ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. బాధిత మహిళను పరామర్శించారు. అనంతరం కామినేని మీడియాతో మాట్లాడారు. గుంటూరు జిల్లా ముప్పాళ్ల మండలం లంకెలకూరపాడుకు చెందిన వెంకాయమ్మపై కుక్క దాడి చేయగా తీవ్రంగా గాయపడిన ఆమెకు గత శనివారం శస్త్రచికిత్స చేసినట్లు తెలిపారు. సర్జరీ చేస్తుండగా ఆపరేషన్ థియేటర్‌లో మొత్తం నాలుగుసార్లు విద్యుత్తు ప్రసారంలో అంతరాయం ఏర్పడినట్లు వివరించారు.

గంట సేపు ఆగి కొట్టుకున్న గుండె!

- యువకుడికి అపోలో పునర్జన్మ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: సాధారణ గుండెపోటు వస్తేనే బతికే అవకాశాలు అరుదు. అలాంటిది తీవ్ర నొప్పితో వస్తే అంతే. ఆశలు వదులుకోవాల్సిందే. కానీ, గంటసేపు గుండె కొట్టుకోవడం ఆగిపోయినా ఓ యువకుడు బతికి మృత్యుంజయుడయ్యాడు. ఢిల్లీలోని అపోలో ఆస్పత్రిలో 12 రోజుల క్రితం ఈ అద్భుతం చోటుచేసుకుంది. అలీగఢ్‌కు చెందిన ఆసిఫ్ ఖాన్(22) అనే ఇంజనీరు తీవ్ర గుండెనొప్పితో ఆస్పత్రిలో చేరాడు. వైద్యులు పరీక్షిస్తుండగా తీవ్ర గుండెపోటుకు గురయ్యాడు. గుండె కొట్టుకోవడం ఆగిపోయింది. లాభం లేదనుకొని చికిత్స ఆపేయాలి. కానీ ప్రయత్నం మానని వైద్యులు కార్డియో పల్మనరీ రీసస్‌సిటేషన్(సీపీఆర్) ద్వారా రక్తం సరఫరా అయ్యేలా చేశారు. డీఫైబ్రిలేటర్ ఉపయోగించి గుండెకు షాక్‌లు ఇచ్చారు. గంట సేపు ఇలాగే చేయగా ఒక్కసారిగా గుండె కొట్టుకోవడం ప్రారంభించింది. రక్తనాళంలో నెత్తురు గడ్డకట్టినట్లు గుర్తించి, శస్త్రచికిత్సతో దాన్ని తొలగించి, స్టంట్ అమర్చారు. ఆసిఫ్ ఆరోగ్యం కుదుటపడడంతో.. శుక్రవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. గత నెల పుణెలోనూ ఇలాంటి సంఘటనే చోటుచేసుకుంది. టాటా ముంబయి మారథాన్‌లో పాల్గొన్న ఓ అథ్లెట్ గుండె ఆగిపోగా.. అక్కడే అందుబాటులో ఉన్న ముగ్గురు వైద్యులు చికిత్స అందించి, ప్రాణాలు కాపాడారు.

రైతుల ఉన్నతికి ‘లక్ష గాయత్రి’ మహాసంకల్పం

కాశీలో ప్రారంభించిన కొండవీటి జోతిర్మయి4

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సు, ఉన్నతిని కాంక్షిస్తూ గంగానదీ తీరమైన అవిముక్తపురి (కాశీ)లో లక్ష గాయత్రి మహా సంకల్పాన్ని అమ్మ కొండవీటి జ్యోతిర్మయి గురువారం ప్రారంభించినట్లు జోతిర్మయి సెంట్రల్ ట్రస్టు, శ్రీవారిసేన చైర్మన్, డైరెక్టర్ కేవీవీ రావు ఓ ప్రకటనలో తెలిపారు. 25వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రతి రోజూ అమ్మ పాల్గొంటారని ఆయన వివరించారు.

డీసీఎంఎస్ పాలకవర్గాల గడువు పెంపు

అమరావతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 11 జిల్లాల సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)ల పాలకవర్గాల పదవీ కాలాన్ని ఆరు నెలలు పొడిగిస్తూ, ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రకాశం, అనంతపురం జిల్లాలు మినహా మిగిలిన డీసీఎంఎస్ పదవీ కాలాన్ని పెంచారు. సహకార సంస్థల పదవీ కాలాన్ని 6 నెలలు పొడిగించాలని గత నెల 20వ తేదీన రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయం మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

శ్రీకాళహస్తీశ్వరుడి వెండి.. బంగారంగా బ్యాంకులోకి..

53కిలోలు డిపాజిట్ చేసిన ఆలయ అధికారులు

త్వరలో ఇతర ఆలయాల్లో కూడా...

శ్రీకాళహస్తి/అమరావతి, ఫిబ్రవరి 16: వెండి విక్రయించి బంగారాన్ని సేకరించే ప్రక్రియను దేవదాయశాఖ చేపట్టింది. ఇందులో భాగంగా శ్రీకాళహస్తీశ్వరుడికి చెందిన 53 కిలోల బంగారాన్ని శ్రీకాళహస్తి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో శుక్రవారం ఆలయ అధికారులు డిపాజిట్ చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో రాహు-కేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకునే భక్తులు పూజల అనంతరం వెండి నాగపడగలను హుండీలో వేస్తుంటారు. ఇలా ఆలయంలో సుమారు 17 టన్నులు వెండి నిల్వలు ఉండేవి. ఇందులో 1,500 కిలోల వెండిని ఆలయ అధికారులు నాగపడగల తయారీకి రీసైక్లింగ్ కోసం వినియోగిస్తున్నారు. మిగిలిన వెండిలో 10వేల కిలోలను కొంతకాలం క్రితం కరిగించి విక్రయించారు. ఈ సొమ్ముతో వంద కిలోల బంగారాన్ని కొనుగోలు చేసి హైదరాబాదులోని ఓ బ్యాంకులో డిపాజిట్ చేశారు. మిగిలిన 4,600 కిలోల వెండిని ఇటీవల కరిగించి విక్రయించారు. అలా వచ్చిన రూ.17.50కోట్లతో 53 కిలోల బంగారాన్ని కొనుగోలు చేశారు. రాష్ట్రంలోని పలు ఆలయాల్లో టన్నుల కొద్దీ వెండి నిల్వలు ఉన్నాయి. వాటి ద్వారా ఎలాంటి ఆదాయం రాకపోగా వాటి నిర్వహణకు అదనపు ఖర్చు అవుతోంది. ఆ ఖర్చును తగ్గించుకోవడంతో పాటు ఆదాయం పెంచుకునేందుకు దేవదాయశాఖ వెండిని కరిగించి బంగారంకొనుగోలు కార్యక్రమం చేపట్టింది.





బంగారాన్ని బ్యాంకులో డిపాజిట్ చేస్తున్న శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో భ్రమరాంబ తదితరులు

ఒకే తీరుగా డిగ్రీ ప్రొవిజినల్స్!

2017-19 ఫైనలియర్ నుంచి అమలు



- **రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఏకరూపకత**
- **ప్రొవిజినల్స్‌లో మార్కులు.. క్లాసుల నమోదు నై**
- **10 పాయింట్ స్కేల్‌లో ఎస్‌జీపీఏ, సీజీపీఏ**
- **సీబీసీఎస్ విధానం అమలుతో కామన్ నమూనా**

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలు ఇకపై డిగ్రీ విద్యార్థులకు ఒకే రూపంలో ప్రొవిజినల్ సర్టిఫికెట్లు జారీచేయనున్నాయి. ఇప్పటి వరకు ఒక్కో విశ్వవిద్యాలయం ఒక్కో రూపంలో ప్రొవిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వడంవల్ల ఉన్నతవిద్య అడ్మిషన్లు, ఉద్యోగ నియామక అర్హతలకు సంబంధించి పలు సమస్యలు ఉత్పన్నమవుతుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్ (సీబీసీఎస్) విధానం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో దీనికి అనుగుణంగా ఈ మార్పులు చేస్తున్నారు. 2017-19 డిగ్రీ విద్యార్థుల నుంచి ఈ విధానం అమలు చేస్తారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నియమించిన ప్రొఫెసర్ జి. రోశయ్య(నాగార్జున వర్సిటీ), డాక్టర్ ఎం. లక్ష్మీనారాయణ(కృష్ణా వర్సిటీ), డాక్టర్ రమణారావు(రిటైర్డ్ ప్రిన్సిపాల్), శ్రీనివాసరావు(అసోసియేట్ ప్రొఫెసర్-ఉన్నత విద్యామండలి), మాథ్యూ శ్రీరంగం(ఆంధ్రా లయోలా కాలేజీ)తో కూడిన కమిటీ ప్రొవిజినల్ సర్టిఫికెట్ల జారీకోసం యూనిఫాం నమూనాను రూపొందించింది. ఈ నమూనాను అన్ని వర్సిటీలు అమలు పరిచేలా ఉన్నత విద్యా మండలి సమన్వయ కర్తగా వ్యవహరించనుంది. ఈ నమూనా ప్రకారం ఇకపై డిగ్రీ ప్రొవిజినల్ సర్టిఫికెట్లలో విద్యార్థులు పొందిన మార్కులను నమోదు చేయరు. అలాగే ఫస్ట్ క్లాస్.. సెకండ్ క్లాస్.. థర్డ్ క్లాస్.. అనేవి కూడా ఉండవు. 10 పాయింట్ స్కేల్‌లో సెమిస్టర్ గ్రేడ్ పాయింట్ ఏవరేజ్(ఎస్‌జీపీఏ), క్యుములేటివ్ గ్రేడ్ పాయింట్ ఏవరేజ్(సీజీపీఏ)లు మాత్రమే ఉంటాయి. డిగ్రీలో మొత్తం ఆరు సెమిస్టర్లు ఉన్నందున.. ఒక సెమిస్టర్ అయిన తర్వాత ఎస్‌జీపీఏతో మెమొరాండమ్ ఆఫ్ గ్రేడ్ షీట్ ఇస్తారు. అలాగే అన్ని సెమిస్టర్లకూ కలిపి సీజీపీఏతో కూడిన ప్రొవిజినల్ సర్టిఫికెట్ జారీచేస్తారు. డిగ్రీలో విద్యార్థులు సాధించిన పర్ఫార్మెన్సను బట్టి... ఓ(అవుట్ స్టాండింగ్), ఏ+(ఎక్స్‌లెంట్), ఏ(వెరీగుడ్), బీ+(గుడ్), బీ(ఎబౌ ఏవరేజ్), సీ(ఏవరేజ్), పీ(పాస్) వంటి గ్రేడ్‌లను ఇస్తారు. నిర్దేశిత మార్కులు సాధించని వారికి ఎఫ్(ఫెయిల్) అని నమోదు చేస్తారు.

ఆ అనుభవాలను పనిలో చూపండి

అధ్యయన యాత్రలపై.. ‘ఉడా’ల అధ్యక్షులకు సీఎం సూచన

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): అధ్యయన యాత్రల ద్వారా తెలుసుకున్న అనుభవాలను పనిలో చూపించాలని, మరింత మెరుగ్గా పని చేయాలని సీఎం చంద్రబాబు రాష్ట్రంలోని వివిధ పట్టణాభివృద్ధి సంస్థల(ఉడా) అధ్యక్షులను కోరారు. నవీ ముంబై సిటీ అండ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, అహ్మదాబాద్, హరియాణా ఉడాలు, గ్రేటర్ నోయిడా ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ, జైపూర్ డెవలప్‌మెంట్ అథారిటీల్లో ఇటీవల తాము జరిపిన అధ్యయన యాత్రల గురించి తెలిపేందుకు శుక్రవారం ఉడా అధ్యక్షులు సీఎంను కలిసిన సందర్భంగా ఈ సూచన చేశారు.

గ్రామాభివృద్ధికి ఏకైక అస్త్రం ‘ఉపాధి’



వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటీ మంత్రి లోకేశ్

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధికి ఏకైక అస్త్రమైన ఉపాధి హామీ పథకాన్ని గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి నారా లోకేశ్ కోరారు. ఉపాధి, భూగర్భ డ్రైనేజీ, ఎల్ఈడీ, గ్రామీణ నీటి సరఫరా అంశాలపై కలెక్టర్లతో గురువారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి పథకంలో భాగంగా ఇప్పటికే18.40 కోట్ల పనిదినాలు పూర్తి చేశామని, ఇంకా 5.60 కోట్ల పనిదినాలు కల్పించాల్సి ఉందని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరానికి కేవలం 45 రోజులు మాత్రమే మిగిలి ఉన్నందున, రోజూ 13 లక్షల పనిదినాలు లక్ష్యంగా పెట్టుకుని, అధికారులంతా క్షేత్రస్థాయిలో ఉండి పని చేయాలని సూచించారు. ఈ ఏడాది 24 కోట్ల పనిదినాలు పూర్తి చేయాలని సీఎం ఆదేశించినట్లు తెలిపారు. అనంతపురం, కడప, కర్నూలు, నెల్లూరు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల పనితీరు మెరుగుపరచాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వెయ్యికి పైగా ఫీల్డ్ అసిస్టెంట్ల ఖాళీలను వారం రోజుల్లో భర్తీ చేయాలని సూచించారు. వేసవిలో తాగునీటి సరఫరా, ట్యాంకర్ల పర్యవేక్షణ కోసం ప్రత్యేక యాప్ సిద్ధం చేసినట్లు మంత్రి తెలిపారు. గ్రామీణ గృహ నిర్మాణ పథకానికి ఉపాధి పథకం ద్వారా ఇవ్వాల్సిన రూ.61 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేస్తామన్నారు. పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి జవహర్‌రెడ్డి, కమిషనర్ రామాంజనేయులు, అధికారులు పాల్గొన్నారు.

ముందస్తు బడ్జెట్ సమావేశం

ముందస్తు బడ్జెట్ సమావేశాల సందర్భంగా శుక్రవారం సచివాలయంలోని ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు చాంబర్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల బడ్జెట్ కేటాయింపులపై సమావేశం నిర్వహించారు. శాఖాపరంగా చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, రోడ్ల నిర్మాణం, భూగర్భ డ్రైనేజీ, ఎల్ఈడీ బల్బులు, వాటర్‌గ్రిడ్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి నీరు వంటి కార్యక్రమాలు, కావాల్సిన నిధుల గురించి ఆర్థికశాఖ మంత్రి యనమల, ఆర్థికశాఖ అధికారులకు మంత్రి నారా లోకేశ్ వివరించారు.





మావోయిస్టుల మృతదేహాలు, స్వాధీనం చేసుకున్న ఆయుధాలు, సామగ్రి

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

ఇద్దరు మావోయిస్టుల మృతి.. ఆయుధాలు, మందుగుండు స్వాధీనం

ఇన్ఫార్మర్ నెపంతో కాంట్రాక్టర్ హత్య.. ఒడిశాలో మావోయిస్టుల దుశ్చర్య

విశాఖపట్నం/సీలేరు, ఫిబ్రవరి 16: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా టోక్నపల్లి అటవీ ప్రాంతంలో గురువారం రాత్రి జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. సుక్మా ఎస్పీ మీనా కథనం ప్రకారం.. చింతిగుపో పోలీసు స్టేషన్ పరిధిలోని టోక్నపల్లి అటవీ ప్రాంతంలో డీఆర్‌జీ, ఎస్టీఎఫ్ బలగాలు గాలింపు నిర్వహిస్తుండగా రాత్రి 9:40 గంటలకు మావోయిస్టులు కాల్పులు జరిపారు. దీంతో పోలీసులు ఎదురు కాల్పులకు దిగారు. ఇరువర్గాల మధ్య సుమారు 20 నిమిషాలపాటు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన మాధవీ నందా(30), కుంజమ్ లఖే(24) మరణించారు. ఘటనా ప్రాంతంలో మూడు 303 తుపాకులు, కొన్ని బుల్లెట్లు, డిటోనేటర్లు, యూనిఫారాలు, మందులను స్వాధీనం చేసుకున్నారు. మృతిచెందిన ఇద్దరూ పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ఇదిలావుంటే, ఒడిసాలో పోలీసు ఇన్‌ఫార్మర్ నెపంతో ఓ కాంట్రాక్టర్‌ను మావోయిస్టులు హత్య చేశారు. శుక్రవారం సాయంత్రం స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్ దాస్‌తున దాస్(45) కలదిండి గ్రామ సమీపంలోని పజిబహలి అటవీ ప్రాంతంలో జరుగుతున్న రహదారి పనులను పరిశీలించేందుకు వెళ్లారు. ఆ సమయంలో వంసధార, గుముసార్, నాగావలి డివిజన్ సభ్యులు దాస్‌తున దాస్‌ను అదుపులోకి తీసుకుని హత్య చేశారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఈ పరిస్థితి ఎవరికీ రాకూడదు!

చెన్నై ఆస్పత్రిలో విజయవాడ యువతి ఆవేదన

తనపై దాడి చేసినవారిని శిక్షించాలని డిమాండ్

చెన్నై, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తనపై దాడిచేసి, నగలు దోచుకోవడంతో పాటు అత్యాచారయత్నానికి సైతం పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని చెన్నైలో పనిచేస్తున్న విజయవాడకు చెందిన ఐటీ ఉద్యోగిని లావణ్య పోలీసులను కోరారు. మరే యువతికీ ఇటువంటి పరిస్థితి రాకూడదని వాపోయారు. చెన్నై శివారు ప్రాంతం ఐటీ కారిడార్‌కు సమీపంలో గత సోమవారం అర్ధరాత్రి లావణ్యపై దాడి జరిగిన విషయం తెలిసిందే. గ్లోబల్ ఆస్పత్రిలో నాలుగు రోజుల చికిత్స అనంతరం కోలుకున్న ఆమెవద్ద పోలీసులు శుక్రవారం వాంగ్మూలం తీసుకున్నారు. ఆ సమయంలో మాట్లాడేందుకు కూడా ఆమె చాలా ఇబ్బంది పడుతుండటంతో విచారణను వాయిదా వేశారు. అత్యాచార యత్నానికి సంబంధించి పోలీసులు ఇప్పటికే ఆరుగురిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. ఇదిలా ఉండగా, సెమ్మంజేరిలోని ఓ ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద లావణ్య మోపెడ్‌ను పోలీసులు గుర్తించారు.





ఉన్మాది ఘాతుకం!

అమెరికాలో తరగతి గదుల్లో రక్తం పారుతోంది. బుధవారం ఫ్లోరిడాలోని ఓ స్కూల్లో జరిగిన కాల్పుల ఘటన అత్యంత విషాదకరమైనది. మాజీ విద్యార్థి ఒకరు తాను చదివిన పాఠశాలలో విచ్చలవిడి కాల్పులకు ఎగబడి 17మంది ప్రాణం తీశాడు. గత ఏడాది స్కూలు నుంచి బహిష్కరించడంతో పగబట్టిన నికోలస్ క్రూజ్, ప్రతీకారం తీర్చుకోవడానికి గ్యాస్ మాస్క్‌తో, స్మోక్ గ్రనేడ్లతో, తుపాకీతో సంసిద్ధుడై పాఠశాలకు వచ్చాడు. ఈ ఘటన తరువాత పోలీసుల తవ్వకాల్లో అతడి గత ప్రవర్తనను, హింసాత్మక స్వభావాన్నీ, తుపాకుల పిచ్చిని లెక్కించే పని జరుగుతున్నది. అతడో మానసిక రోగి అన్న నిర్ధారణ జరుగుతోంది. ఈ ఘటనతో అమెరికాలో మరోమారు గన్‌కల్చర్ గురించిన చర్చ హెచ్చి, తుపాకుల నిషేధం గురించి జనం గట్టిగా పట్టుబడతారేమోనన్న భయం అధ్యక్షుడు ట్రంప్‌కు కలగడం సహజం. తుపాకీ తరఫున వకాల్తా పుచ్చుకున్న పెద్దమనిషి కనుక, ఈ ఘటన తరువాత ఆయన స్కూళ్ళ భద్రత గురించీ, ప్రజల మానసిక ఆరోగ్యం గురించి మాత్రమే మాట్లాడుతూ తుపాకుల ఊసెత్తడం లేదు.

వలసవచ్చినవారెవరైనా ఈ తరహా ఘాతుకాలకు పాల్పడినా, ఇస్లామిక్ ఉగ్రవాదులు కాల్పులు జరిపినా అమెరికా అధ్యక్షుడికి ఎక్కడలేని ఆగ్రహమూ పుట్టుకువచ్చి తన ప్రజల ప్రాణరక్షణ పేరిట ఏవో కఠినమైన కొత్త చట్టాలు తెస్తుంటారు. దేశం చుట్టూ గోడలు కట్టి, ఎవరూ తనదేశంలోకి అడుగుపెట్టకుండా మిగతా దేశాలపై నిషేధాలు విధిస్తానంటారు. కానీ, తనదేశంలో ఉన్న ఉన్మాద వాతావరణం ఆయనకు పట్టదు. ఇప్పటికే ఉన్న తుపాకుల నియంత్రణ చట్టాన్ని మరింత బలహీనపరచిన ట్రంప్ ఈ సందర్భంలో మానసిక ఆరోగ్యం గురించి మాట్లాడటం కూడా విచిత్రంగానే ఉన్నది. తుపాకుల విక్రయ సమయంలో విక్రయదారులు మానసిక ఆరోగ్యం సరిగా లేని వారిని ఓ డేటాబేస్ ద్వారా గుర్తించేందుకు ఒబామా కల్పించిన అవకాశాన్ని కూడా ట్రంప్ తీసిపారేశారు. ఇక, మెంటల్ హెల్త్ సేవలకు బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించివేసిన ట్రంప్‌కు పౌరుల మానసిక ఆరోగ్యంమీద శ్రద్ధ ఉన్నదని అనుకోలేం. కాల్పులకు పాల్పడిన కుర్రవాడు విశృంఖల స్వభావం ఉన్నవాడన్న మాట నిజం. కుటుంబ కారణాలరీత్యా అతడి మానసిక ఆరోగ్యం దెబ్బతిన్నదీ నిజమే. కానీ, ఈ ఘటన తరువాత అమెరికాలోని చాలా రాష్ట్రాల్లో స్కూళ్ళలో జరిపిన గాలింపులు, అరెస్టులు పిల్లల్లో తుపాకీ మోజు ఎంతగా ఉన్నదో తెలియచెబుతున్నది. తుపాకులు జేబుల్లోనూ, బ్యాగుల్లోనూ పెట్టుకొని వస్తున్న పిల్లలు అనేకమంది పోలీసుల చేతికి చిక్కారు. తుపాకీ తెచ్చి కాల్చిపారేస్తానంటూ తమను ఫలానా విద్యార్థి బెదిరించాడని అనేకమంది పిల్లలు ఈ సందర్భంగా పోలీసులకు చెప్పారు. ట్రంప్ లెక్కన తుపాకులు దొరికిన పిల్లలంతా మానసిక ఆరోగ్యం సరిగా లేనివారే కావాలి. జనాభాకు మూడురెట్ల తుపాకులున్న దేశంలో భావి పౌరులు ఈ రకంగా తయారవడంలో ఆశ్చర్యమేమీ లేదు. తుపాకీ కాల్పులతో సాగే హింసలో అమెరికాతో పోటీపడగల దేశం ప్రపంచంలోనే లేదు. పౌరుల చేతుల్లో ఉన్న తుపాకుల సంఖ్యలో దానితో సమతూగగలిగే దేశమేదీ లేదు. అమెరికాలో ఏటా ముప్పై నుంచి యాభైవేల తుపాకీ చావులు నమోదవుతుంటాయి. తుపాకులను పోగేసుకొనే సంస్కృతి అధికం కనుకనే నూటికి 90మంది వద్ద తుపాకులున్నాయి. శ్వేత జాతీయుల్లోనే అధికంగా ఉన్న ఈ తుపాకీ కాంక్షకు కారణాలు ఏమిటన్నవి అటుంచితే, తుపాకీని హోదాకు చిహ్నంగా, అవసరంగా వారు ఇప్పటికీ భావిస్తున్నారన్నది వాస్తవం. ఒబామా కాలంలో అమ్మకాలపై నియంత్రణలు విధించే దిశగా ఏవో ప్రయత్నాలు జరిగినప్పుడు అనేకమంది శ్వేతజాతీయులు మరిన్ని తుపాకులు కొనుక్కున్నారు. ట్రంప్ రాకతో నిషేధం భయం పోవడంతో అమ్మకాల జోరు తగ్గిందట. ఈ ఏడాది ఆరంభమై రెండు నెలలు కూడా పూర్తి కాలేదు కానీ, స్కూళ్ళలో ఈ తరహా ఘటనలు ఇప్పటికి 18 జరిగాయి. తుపాకులు ఏ వయసువారికి అమ్మాలో అమెరికా ఫెడరల్ చట్టం నిర్దేశిస్తున్నప్పటికీ, అనేక రాష్ట్రాలు స్వంత చట్టాలతో 18 ఏళ్ళవారికి కూడా తుపాకులు అమ్మడాన్ని అనుమతిస్తున్నాయి. వేర్వేరు మారణాయుధాలకు వివిధ కనీస వయస్సులను నిర్ధారిస్తూ అమ్మకాలు సాగుతుంటాయి. మిన్నెసోటాలో పద్నాలుగు సంవత్సరాల వారికి కూడా తల్లిదండ్రుల అనుమతి లేకుండా తుపాకులు అమ్మవచ్చునంటే పిల్లల చుట్టూ ఉన్న వాతావరణం ఎటువంటిదో ఊహించవచ్చు. అక్కడ దాదాపు అన్ని రాష్ట్రాలూ కాస్తంత గట్టిగా అమలు చేస్తున్నదల్లా 21 ఏళ్ళలోపు వారికి బీరు అమ్మకూడదన్న నియమం ఒక్కటే. ఈ తరహావాతావరణంలో అమెరికా అధ్యక్షుడితో సహా అందరూ స్కూళ్ళలో భద్రత గురించీ, మానసిక ఆరోగ్యం గురించీ మాట్లాడుతున్నారు. నిఘా కెమెరాలు, మెటల్ డిటెక్టర్లు, తనిఖీలు ఇప్పటికే దాదాపు అన్ని స్కూళ్ళలో ఉన్నా, ఈ తరహా కాల్పులు యథేచ్ఛగా సాగిపోతున్నప్పుడు ఈ వాదన అర్థం లేనిది. మూలకారణాలను పక్కనబెట్టి, నిఘాను, తనిఖీలను మరింత హెచ్చించడం వల్ల స్కూళ్ళు ఏ మాత్రం భద్రతలేనివన్న భావన ఒక్కటే మిగులుతుంది. స్వేచ్ఛగా, నిర్భయంగా స్కూలుకు పోగలిగే వాతావరణం సృష్టించాలంటే అక్కడ జరగాల్సింది అర్థం లేని తుపాకీ స్వేచ్ఛపై నియంత్రణలను పెంచడం ఒక్కటే. ముఖ్యంగా టీనేజ్ పిల్లలకు ఆయుధాలు అందకుండా చూడాలి. ఫ్లోరిడా ఘటన తరువాత పిల్లలనుంచే తుపాకీ వ్యతిరేకత పుట్టడం స్వాగతించవలసిన విషయం. కఠినమైన చట్టాలు చేయాలంటున్న వారి పిలుపును అందిపుచ్చుకోవాలి.

కడపలో ఓపిడిఆర్ రాష్ట్ర మహాసభ

స్వాతంత్ర్యం స్వేచ్ఛ సమానత్వ సౌభ్రాతృత్వ విలువలు, ఆర్థిక సాంఘిక రాజకీయ న్యాయ విలువల పై బిజెపి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మద్దతుతో మనువాద శక్తుల దాడుల ప్రతిఘటన ఉద్యమాన్ని బలోపేతం చేయటం, రాయలసీమ హక్కుల సాధన ఉద్యమం కొనసాగింపు కర్తవ్యాల నిర్వహణ ప్రధాన విషయాలుగా కడప పట్టణం లో ఫిబ్రవరి 18 ఉదయం 11గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఓపిడిఆర్ ఆంధ్రప్రదేశ్ 17వ మహాసభ, సదస్సు జరుగుతాయి. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి బి.చంద్రకుమార్ ప్రారంభ ప్రసంగం చేస్తారు. ఉద్యమాల ఉపాధ్యాయుడు 'ఉసా', మనువాద శక్తుల ఉగ్రవాద చర్యలు, ఓపిడిఆర్ కేంద్ర కమిటీ అధ్యక్షుడు భాస్కర్ ఆర్థిక ఉగ్రవాదంపై, రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి (సీనియర్ అడ్వకేట్) రామకుమార్ రాయలసీమ హక్కుల హననం రాజ్యం పాత్ర పై ప్రసంగిస్తారు. పగలు జరుగుతున్న సదస్సు కు అందరూ ఆహ్వానితులే. సాయంత్రం 5 గంటల నుంచి జరుగు సభకు ప్రతినిధుల కు మాత్రమే ప్రవేశం. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ 1975 లో, ఎమర్జెన్సీ ప్రకటనకు నెలరోజుల ముందు ఏర్పడింది. 1973 డిసెంబర్ 23 న గుంటూరు లో జరిగిన 'పౌర ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంఘం' బహిరంగ సభ వేదిక నుండి,భారత కమ్యూనిస్టు ఉద్యమ మహా నాయకుడు అమరుడు తరిమెల నాగిరెడ్డి హక్కుల ఉద్యమం కోసం ప్రతిపాదించిన దిశలో సృజనాత్మకంగా కృషి చేస్తూ ప్రస్తుతం 10 రాష్ట్రాల లో హక్కుల ఉద్యమం నిర్మిస్తున్నాం. 1975 ఏప్రిల్ లో ప్రారంభించిన రాజ్యహింస నిరోధక ఉద్యమాన్ని నిరంతరం గా ఓపిడిఆర్ కొనసాగిస్తున్నది.

—యం. శ్రీనివాసులు,
అధ్యక్షుడు, ఓపిడిఆర్

సంక్షేమ తపస్వి

■ రామచంద్ర గుహ



గతానుగతం

రాంచి నగర పౌరులలో అత్యంత ప్రముఖుడు ఒక వికెట్ కీపర్–బ్యాట్స్‌మ్యాన్. ఆయన మూలాలు వాస్తవంగా ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఉన్నాయి. జార్ఖండ్ రాజధానిలో స్థిరపడిన మరో వలసకారుడు కూడా తన వృత్తిలో అమిత గౌరవాదరాలను పొందుతున్న వ్యక్తి. ప్రస్తావిత క్రికెటర్ అసంఖ్యాక భారతీయులకు నిక్కమైన క్రీడానందం సమకూరుస్తుండగా రాంచీ నగర మరో ప్రముఖుడు సంఖ్యానేక భారతీయులకు జీవనాధార భద్రతను పెంపొందించి, లక్షలాది మందిని దారిద్ర్యపు కోరలనుంచి రక్షిస్తున్నాడు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రూపకల్పనలో ప్రముఖ పాత్ర వహించిన ఆర్థిక నిపుణుడు; గ్రామీణ ఉపాధి హామీ చట్టం ముసాయిదా రూపకల్పనకు తోడ్పడంతో పాటు ఆ చట్టం అమలును నిరంతరం పరిశీలిస్తున్న పేదల బాంధవుడు. సమాచార హక్కు, ఆహారభద్రతా హక్కు చట్టాల నిర్మాణానికి కూడా ఆయన విశేషంగా దోహదం చేశారు.

ఈ ఫిబ్రవరి తొలిరోజులలో నేను రాంచీలో ఉన్నాను. ఎమ్ఎస్ ధోనీ నగరంలో ఉన్నదీ లేనిదీ నాకు తెలియదు. అయితే నేను ప్రస్తావించిన మరో ప్రముఖ రాంచీవాసిని కలుసుకోవాలని నేను అభిలషించాను. ఆయనతో సమావేశానికి ముందుగానే అనుమతి తీసుకున్నాను. నేను రాంచీలో ఉన్నప్పుడు ఆయన కూడా రాంచీలో ఉండేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నాను. ఎందుకంటే ఆయన తన కంటే మరింత ప్రముఖుడైన సహ నగర వాసిలా తరచూ, విమానాలలో కాకపోయినా రైళ్ళు, బస్సులలో ప్రయాణిస్తుంటారు. రాత్రి పూట నక్షత్ర హోటళ్ళలో కాకుండా గ్రామీణ గృహాలలో బస చేస్తుంటారు.

నేను గతంలో జాc ద్రెజ్‌ను చాలాసార్లు కలుసుకున్నాను. 1990 వ దశకం తొలినాళ్ళలో ద్రెజ్ లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ఆచార్యుడుగా ఉండి, ఒక కార్మికవాడ లో నివశిస్తుండేవారు. ఆయనతో నా తొలి సమావేశం ఆ రోజుల్లోనే జరిగింది. అదే దశాబ్దం తుది సంవత్సరాలలో ఆయన ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ లో బోధిస్తూ తిమార్పూర్ లోని ఒక మురికివాడలో నివశిస్తుండేవారు. ద్రెజ్‌తో నా ద్వితీయ సమావేశం ఢిల్లీలో జరిగింది. ఈ శతాబ్ది తొలి సంవత్సరాలలో ద్రెజ్‌తో నా మూడో సమావేశం జరిగింది.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రూపకల్పనలో ప్రముఖ పాత్ర వహించిన ఆర్థిక వేత్త జాc ద్రెజ్. పేదల బాంధవుడు. ఆయన, నేనూ ఇంచుమించు సమవయస్కులం. ఇరువురమూ భారతదేశం గురించి పుస్తకాలూ, వ్యాసాలూ రాస్తున్నాం. ద్రెజ్‌కు సమకాలికుడయినందుకు నేను గర్విస్తున్నాను.

మా ఇరువురి మధ్య చాలా సంవత్సరాలుగా ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతున్నాయి. ఆయన పుస్తకాలపై నా అభిప్రాయాలు, నా పుస్తకాలపై ఆయన అభిప్రాయాలు తెలియజేసుకునేవాళ్ళం. కొన్ని సందర్భాలలో మా వ్యాఖ్యలు విమర్శనాత్మకంగా ఉండేవి. మార్కెట్ వల్ల ప్రజలకు జరగని మేలును రాజ్య వ్యవస్థ సమకూర్చాలని మేమిరువురమూ భావిస్తున్నాము .ప్రజలకు సంక్షేమం సమకూర్చడంలో రాజ్యం నిర్వహించాల్సిన పాత్ర మరింత కీలకంగా ఉండాలని నా కంటే ఆయన ఎక్కువగా విశ్వసిస్తారు.

జాc ద్రెజ్ నా కంటే ఒక సంవత్సరం చిన్న వాడు. ఆయన, నేను భారత్‌లోనే పిహెచ్ డి పట్టాలను పొందాము. మేమిరువురమూ చాలవరకు భారత్‌లోనే భారత్ గురించే పని చేస్తున్నాము. అయితే ఇతరత్రా మా వ్యక్తిగత చరిత్రలు చాలా భిన్నమైనవి. ఆయన జీవితకథ గురించి మరింతగా తెలుసుకోవడం కోసమే నేను రాంచీలో ఆయనను సందర్శించాను. రాంచి విశ్వవిద్యాలయం ఆర్థశాస్త్ర విభాగం లోని ఆయన కార్యాలయంలో మేము సమావేశమయ్యాం. ఆ తరువాత ఆయన మోటార్ సైకిల్ పై రాంచి–హజారీబాగ్ హై వేలో అరగంట సేపు ప్రయాణించి ఒక కాలిబాటలోకి ప్రవేశించాము. కొంతసేపు ఆ గతుకుల రోడ్డు మీద ప్రయాణించిన తరువాత ఒక రావి చెట్టు నీడలో ఆగాము . అక్కడ నుంచి చాలా దూరం నడిచి ఒక కొండ పైకి చేరాము . కొండ క్రింద ఉన్న పల్లె ప్రాంతాలను చూస్తూ చాలా సేపు మాట్లాడుకున్నాం.

జాcద్రెజ్ 1959లో పురాతన పట్టణమైన ల్యూవెన్ లో జన్మించారు. తండ్రి జాక్వెస్ ద్రెజ్ ప్రపంచ ప్రముఖ ఆర్థికవేత్తలలో ఒకరు. గొప్ప ఉపాధ్యాయుడు కూడా. జాక్వెస్ ద్రెజ్, ఆయన భార్య ఇరువురూ సమాజ సేవా స్ఫూర్తి ఉన్నవారు. విద్వత్తు , సేవాభావం పరిపూర్ణంగా ఉన్న వాతావరణంలో జాc ద్రెజ్ పెరిగారు. ఎస్సెక్స్ విశ్వవిద్యాలయంలో ద్రెజ్ విద్యాభ్యాసం చేశారు. అభివృద్ధి ఆర్థిక శాస్త్రం లో శ్రద్ధాసక్తులు ఆయన్ని న్యూఢిల్లీలోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌కు తీసుకు వచ్చాయి. ఐ ఎస్ ఐ లో చదువుతుండగా ఆయనకు అమర్త్యసేన్‌తో పరిచయమయింది. తదనంతర కాలంలో ఆయనతో కలసి ద్రెజ్ అనేక పుస్తకాలు రాశారు. ఈ రచనా కృషి చాలవరకు ద్రెజ్‌తో అయినప్పటికీ, ఆ పుస్తకాలకు వచ్చిన పేరులో చాలవరకు తనకే దక్కిందని అమర్త్య సేన్ చెప్పడం నేను విన్నాను. నిజానికి ఆ మేధో కృషిలో ఇరువురూ సమపాత్ర వహించివుంటారని ఖాయంగా చెప్పవచ్చు. ఒకరి సహకారం లేకుండా మరొకరి కృషి సాధ్యమయివుండేది కాదు . పాఠకులు ఇరువురుకీ సదా కృతజ్ఞులై వుంటారని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

అమర్త్యసేన్ హార్వార్డ్ విశ్వవిద్యాలయంలో ఆచార్యుడు. భారత్‌లో నివశించాలని నిర్ణయించుకున్న దృష్ట్యా ద్రెజ్ ఆర్థిక శాస్త్ర పరిశోధనారంగంలో ఉత్కృష్ట కేంద్రమైన ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో తొలుత అధ్యాపకుడుగా ఉన్నారు. ఆ తరువాత అలహాబాద్ విశ్వవిద్యాలయంలో బోధించారు. పిదప రాంచీ విశ్వవిద్యాలయంలో చేరారు. పేద, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు బోధిస్తూ , దేశంలోని వెనుకబడ్డ ప్రాంతాలలో పనిచేస్తూ అభివృద్ధి ఆర్థికవేత్తగా ద్రెజ్ తన విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తిస్తున్నారు. ఆయన తన స్వభావానికి అనుగుణంగా జీవిస్తున్నారు, కృషి చేస్తున్నారు. ఒక తపస్వి స్వభావం, వ్యక్తిత్వమాయనది. వేతన భత్యాలను ఆయన తీసుకోరు. ఆయన అవసరాలు చాలా పరిమితమైనవి. పుస్తకాలపై వచ్చే ఆదాయంతోను, దినపత్రికలకు రాసే వ్యాసాలకు లభించే పారితోషికంతోను ఆయన జీవిస్తున్నారు. సంవత్సరాల తరబడి చేసిన క్షేత్ర పరిశోధనల మూలంగా హిందీ భాషలో ఆయన కు పరిపూర్ణ ప్రావీణ్యం సమకూరింది.


సరే, అలా ఆ కొండ ప్రాంతాలలో చాలాసేపు గడిపిన తరువాత తిరిగి ద్రెజ్ బైకు వద్దకు వచ్చాం. తిరుగుప్రయాణంలో ఒక ధాబా లో లంచ్ చేశాము. నా అభ్యర్థన మేరకు ఆయన నన్ను తన ఇంటికి తీసుకువెళ్ళారు. ఒక గిరిజన గ్రామంలోని ఒక గుడిసె వెనుక భాగాన ఉన్న ఒక చిన్నగది అది . రాంచి నగర శివారులో ఉన్నది. నగర విస్తరణలో అది త్వరలోనే మాయమై పోవచ్చు . ఆ ఇంటికి ఒక వైపు వెదురు పొదలు ఉన్నాయి; ఎదురుగా ఒక చింతచెట్టు ఉన్నది. ద్రెజ్ స్వయంగా తేనీరు తయారు చేసి ఇచ్చారు. ముదురు ఎరుపురంగులో ఉండే ఉక్కుముఖి పక్షి పాటను వింటూ మేము మరి కొంతసేపు మాట్లాడుకున్నాం. తాను త్వరలో ఒక హిందీ దినపత్రికలో ఒక కాలమ్ రాసే అవకాశమున్నదని ద్రెజ్ చెప్పారు ఇయన ఇప్పటికే ఇంగ్లీషు దినపత్రికలలో చాలా వ్యాసాలు రాశారు. వాటిలో కొన్ని ఇటీవల ' సెన్స్ అండ్ సాలిడారిటీ' అనే శీర్షికతో వెలువడ్డాయి. ఝోలావాలా ఎకనామిక్స్ ఫర్ ఎవ్విరివన్ అనేది ఆ పుస్తక ఉపశీర్షిక. ఆహార భద్రత, బాలల హక్కులు, అణు యుద్ధ ప్రమాదం మొదలైన అంశాలపై రాసిన వ్యాసాలవి. ఆయన భావవ్యక్తీకరణ సూటిగా స్పష్టంగా ఉంటుంది . మన ప్రజాస్వామ్య భవిష్యత్తు , అభివృద్ధి తీరుతెన్నులపై ఆసక్తివున్న వారందరూ తక్షణమే కొని చదవవలసిన గ్రంథమది.

జాc ద్రెజ్, నేనూ ఇంచుమించు సమవయస్కులం. ఇరువురమూ భారతదేశం గురించి పుస్తకాలూ, వ్యాసాలూ రాస్తున్నాం. ద్రెజ్ సమకాలికుడయినందుకు నేను గర్విస్తున్నాను. వృత్తిపరంగా ఆయన సహచరుడయినందుకు నేను మరింతగా గర్విస్తున్నాను. ఆయన తోటి పౌరుడినయినందుకు ఎంతగానో ఉప్పొంగిపోతున్నాను.

అభివృద్ధి సాధకులకే ఆంధ్రుల మద్దతు

ఉత్తరాది మహామహుల గుప్పెట్లో వుంటూ వస్తున్న భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ తెలుగువారికి ఆనాటినుండి అంటే భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు నుంచి నిన్నమొన్నటి వరకు ద్రోహం చేస్తూనే వచ్చినది. ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుంచిరు విడబడి ఆంధ్రరాష్ట్రం ఏర్పడటానికి 50 సంవత్సరాలు పైగా ఆంధ్రులు ఉద్యమాలు చేయవలసి వచ్చింది. మద్రాస్‌తో సహ ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రము కావాలని పొట్టిశ్రీరాములు ఆమరణ నిరాహారదీక్ష చేసి అమరులైనదాకా ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం ఇవ్వటానికి ఆనాటి ప్రధాని జవహర్‌లాల్‌కు మనసొప్పలేదు. శ్రీరాములు నిరాహారదీక్షను, ఆయన దివంగతులవటానికి నాలుగు రోజుల ముందు కూడా పార్లమెంట్‌లో గేలిచేసి మాట్లాడారు నెహ్రూ. అంతేగాకుండా రాజగోపాలాచారి నిర్దేశించినట్లుగా మద్రాస్ నగరాన్ని మినహాయించి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు చేశారు. ఈలోగా శ్రీబాగ్ ఒడంబడికలు, ఆ తరువాత పెద్దమనుషుల ఒప్పందాలులాంటివి చేయించి, తెలంగాణ ప్రజలకు ఇష్టం లేకపోయినప్పటికి హైదరాబాద్‌ను రాజధానిగా చేసి ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటు చేశారు. శ్రీబాగ్ ఒడంబడిక కావాలని ఎవరైతే యాగీ చేశారో వారే పెద్దమనుషుల ఒప్పందాన్ని ఉల్లంఘించడం మొదలుపెట్టారు. దీంతో తెలంగాణలో అసంతృప్తులు పెరిగి 'జై తెలంగాణ' ఉద్యమం, ఆ తరువాత 'జై ఆంధ్ర' ఉద్యమాలు తెలుగునాట నడిచాయి. ఆ వేర్పాటు ఉద్యమాల్ని ఎవరైతే ఉక్కుపాదాల్తో అణచివేశారో వారే మరలా 'జై తెలంగాణా' ఉద్యమాన్ని ప్రారంభించిన కె.సి.ఆర్‌తో పొత్తు పెట్టుకుని విభజన వాదానికి మద్దతునిచ్చారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారం పొంది కూడా సరైన సమయంలో సరైన నిర్ణయాలు చేసి అమలు చేయకపోవటంతో వందల వేలాది ప్రాణాల బలిదానాలు, సకలజనుల సమ్మెలు, విగ్రహాల కూల్చివేతలు, తెలుగువాళ్ల ఆర్థికపురోగతి తిరోగమనాలు, ప్రతిష్టంభనలు జరిగినాయి. ఏదిఏమయినా, ఎవరు అవునన్నా, కాదన్నా చివరకు కాంగ్రెస్ పార్టీ వలన తెలుగు వారికి జరిగిన ఒకే ఒక్క మేలు ఏమిటంటే పెద్దమ్మ సోనియమ్మ నాయకత్వంలో, చిన్నమ్మ సుష్మమ్మ (బిజెపి) తోడ్పాటుతో ఆంధ్రప్రదేశ్‌ను రెండు రాష్ట్రాలుగా చేయటం. అయితే ఆ విభజన, 'తాంబూలం ఇచ్చాం తన్నుకు చావండి(!) ' అన్న రీతిలో చేయటం వలన, తాంబూలం (హైదరాబాద్) తెలంగాణ వారికి, ఆర్థికంగా గిలగిల తన్నుకుని చచ్చే స్థితి ఆంధ్రులకు ఏర్పడటంతో వెంటనే ఆంధ్రులు పెద్దమ్మ పార్టీకి కఠిన శిక్ష విధించారు. ఇక చిన్నమ్మ పార్టీలోని జైట్లీ, మోదీలు తెరవెనుక వుండి రాజ్యసభలో వెంకయ్యనాయుడి చేత ఆయన విశ్వరూపం ప్రదర్శించేటట్లు చేసి విభజన చట్టంలో 106 సెక్షన్లు, 13 షెడ్యూళ్ల లాంటివి పొందుపరచేలా చేశారు. అంతేకాదు ఆ పార్టీ నాయకులు ఎన్నికల ముందు ఆంధ్రులకు అనేక వాగ్దానాల వర్షం కురిపించారు.

ఇక 2014లో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో దేశప్రజలందరితో పాటు ఆంధ్రులు కూడా మోదీని ధనవ్యామోహంలేని మనిషిగా, 3 సార్లు సి.ఎమ్‌గా గెలిచిన దృఢసంకల్పంగల పరిపాలనాదక్షునిగా భావించి ప్రధానమంత్రి పీఠాన్ని అధిరోహించేలా తోడ్పడ్డారు. ఈయన పరిపాలనా విధాన ఫలితాలు ఇప్పటివరకు ప్రజలకు కనపడలేదు అనేక రంగాలు ఆర్థికంగా కుదేలైనాయి. దేశవ్యాప్తంగా రైతాంగ ఆత్మహత్యలు కొనసాగుతూనేవున్నాయి. ఇక రాష్ట్ర విభజన వలన నష్టపోయిన ఆంధ్రులకు నాలుగు మంచి పనులు చేసి నాలుగుకాలాల పాటు వారి మనసులో వెలగకుండా, తన రాష్ట్రంలో మినహా మరెక్కడా తెలియని ఓ దళారి అమిత్‌షాను దేశం తెరపైకి తెచ్చి, ఆంధ్రులు రాజధానిగా ఏర్పరచుకుంటున్న అమరావతికి చవిటి మట్టి, కిలుంనీళ్లు స్వహస్తాలతో ఇచ్చి, నేడు తన వూరికి తప్ప పక్క ఊరికి కూడా కనీసం తెలియని సోము వీర్రాజులాంటి వారి చేత ఆంధ్రలో రాజకీయాలు నడుపుతూ, రాజనీతిజ్ఞుడుగా ఎదగవలసిన మోదీ ఓ సామాన్య రాజకీయ వేత్తగా మిగిలిపోతున్నారు! అసలు విభజన చట్టంలో హామీలిచ్చిన విధంగా ఆంధ్రుల అభివృద్ధికి మనస్ఫూర్తిగా సహకారం మోదీ ఎందుకు ఇవ్వటం లేదు? ఇప్పటికి కేటాయించిన ప్రాజెక్టుల అంచనా వ్యయం పదివేలకోట్లకు పైగా వుంటే ఇంతవరకు కేవలం 421 కోట్లు మాత్రమే కేటాయించటమేమిటి? 2018 నాటికల్లా దుగ్గరాజపట్నం నౌకాశ్రయాన్ని ఏర్పాటు చేస్తామన్న హామీని ఎందుకు అమలు చేయటం లేదు? గ్రీన్‌ఫీల్డ్ ముడి చమురు శుద్ధి కర్మాగారం, పెట్రోరసాయన సముదాయాన్ని, చెన్నై విశాఖ పారిశ్రామిక కారిడార్‌లు ఎందుకు నెలకొల్పలేదు? ఆరు నెలల్లోగా రైల్వేజోన్ ఏర్పాటు చేస్తామన్న హామీని ఎందుకు అమలు చేయలేదు? పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ బాధ్యత మొత్తం కేంద్రానిదేనని ఎంత కాలానికి ప్రకటించారు? ఆ తరువాత వేసిన కొర్రీలు ఏమిటి? ఎందుకు వేశారు? కేంద్రప్రభుత్వ నిధులకు లెక్కలు చెప్పాలట! ఓ.కె! మరితాను సి.ఎమ్‌గా వున్నప్పుడు మన్‌మోహన్‌సింగ్‌కు లెక్కలు చెప్పారా? బి.జె.పి పాలిత రాష్ట్రాల సి.ఎమ్‌లు లెక్కలు చెబుతున్నారా? వారిని అడుగుతున్నారా? గతంలో వాజపేయి చంద్రబాబును ఇలాంటి బురదజల్లుడు ప్రశ్నలు వేశారా? నిధులు విడుదల చేయకుండా ప్రజల దృష్టి మరల్చే ప్రశ్నలు వేయడమేమిటి? ఇదో సరికొత్త రాజకీయం! అసలు రాష్ట్రపతి అభ్యర్థి ఎవరో రాష్ట్ర బి.జె.పి వారికి తెలియదు. మిత్రపక్షమైన టి.డి.పి వారికి అంతకన్నా తెలియదు. వైసిపి వారికి మాత్రం తెలిసిపోయి బొకేలు అందించి ఫోటోలు దిగి వచ్చారు. మిత్రధర్మం పాటించవలసిన అవసరం మోదీ, షా, జైట్లీలకు లేదా? వాజపేయి ఇలానే చేశారా? అసలిది రాజకీయ వ్యభిచారం కాదా? ఎన్ని సూట్‌కేసులు చేతులు మారాయి. అమిత్‌షా రంగంలోకి వచ్చినాక? ఎన్టీఆర్‌కు బాబు ద్రోహం చేశాడంటూ చోటా మోటా



నాయకుల చేత పాత ఆరోపణలను సరికొత్తగా చేయించటం. మరి ఎల్.కె.అద్వాని, మురళీ మనోహర్ జోషిలకు తాము చేసిన సత్కారమేమిటి? హిందూసాంప్రదాయాల్ని గురించి గొప్పగా దంచికొట్టి మాట్లాడే వారు తమ పార్టీలోని పెద్దలకు ఇచ్చే గౌరవం ఇదేనా? ఓ రాష్ట్ర ముఖ్యమంత్రికి 28 సార్లు ఢిల్లీ వచ్చినా ప్రధానమంత్రి దగ్గర అపాయింట్‌మెంట్ దక్కలేదంటే ఏమని చెప్పాలి? ఒక దేశ ప్రధాని నడపవలసిన పరిపాలనా విధానం, రాజకీయ విధానాలు ఇవేనా? ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా లక్షల కోట్లు ఇచ్చామని అమిత్‌షా చేత, రెండెకరాల ఆసామి కోట్లు ఎలా సంపాదించాడని మరొకరి చేత అరిగిపోయిన రికార్డులను మోదీ వినిపించటమేమిటి? వినాశకాలే విపరీత బుద్ధి అంటారు ఇదే కాబోలు!

ఏది ఏమయినా ఈనాడు ఆంధ్రులకు కావాల్సింది వట్టి హామీలు కాదు. చంద్రబాబుపై ఆరోపణలు కాదు. గత మూడు దశాబ్దాలకు పైగా ఇవి ప్రజలు వింటూనే వున్నారు. ఏ ఒక్కరూ రుజువు చేయలేకపోయారు. ఉమ్మడి ఏ.పి లో జరిగిన ఎన్నికలలో వైసిపి గెలిచిన అనేక స్థానాలతో సహా తిరిగి తెలుగుదేశంను గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిగా ప్రజలు చేశారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో కనివిని ఎరుగని విధంగా ఎవరి మద్దతు లేకుండానే టి.డి.పికి బ్రహ్మరథం పట్టారు. నిన్నగాక మొన్న నంద్యాల, కాకినాడలలో భారీ మెజారిటీతో తెలుగుదేశంను గెలిపించారు. మరలా అదే జరగటం ఖాయం. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌ను శిక్షించిన విధంగానే ఉత్తరాది వాళ్ల గుప్పెట్లో ఉన్న బి.జె.పిని కూడా శిక్షించే కాలం తెలుగు వారికి సమీప కాలంలోనే దక్కబోతోంది. మొదట కర్ణాటకలోని తెలుగువారికి, తరువాత తెలంగాణలోని ఆంధ్రులకు ఆ అవకాశంతో పాటు మొత్తం తెలుగునాట వున్న 42 ఎమ్.పి సీట్లలో బి.జె.పి ని దానికి అంటకాగబోయే అవినీతి పార్టీకి మరిచిపోలేని విధంగా బుద్ధి చెప్పబోతున్నారు. ఈ విషయాలు చెప్పటానికి ఓ పెద్ద లోతైన రాజకీయ పరిజ్ఞానం అవసరం లేదు! కాలజ్ఞానం అవసరం అంతకన్నా లేదు! గతంలో జరిగిన ఎన్నికలలో తెలుగువారు చూపిన రాజకీయ పరిణతిని బి.జె.పి వారు గమనించుకోవాలి. అధికారమదంతో తక్కువ అంచనా వేస్తే నష్టపోయేది బి.జె.పి వారే! ఆ కేసులున్నాయి, ఈ కేసులున్నాయి చంద్రబాబును జైలులో పెడతామంటే రుజువు చేసి పెట్టుకోవచ్చు. కుడితి పెట్టడం, పాలు తీయడం, రొట్టెలు కాల్చి పిల్లల ఆలనపాలన చేసుకోవటం మినహా మరొకటి తెలియని ఓ సాంప్రదాయ గృహిణి బీహార్‌లో ముఖ్యమంత్రి అయిన విధంగానే ఆంధ్రలో కూడా జరుగుతుంది. చరిత్ర ఆగదు. అమరావతి నిర్మాణం అంతకన్నా ఆగదు. ఆంధ్ర వైభవం అమరావతిలో అతి త్వరలోనే నింగికెగుస్తుంది. చంద్రబాబు కీర్తి ప్రతిష్టలు ఆచంద్రతారార్కం తెలుగు నాట వెలుగుతాయి! అసలు ధన ఆశలు చూపి ఎమ్.పి లను మచ్చిక చేసుకోవటం పి.వి నరసింహారావు కాలం నుండి ప్రారంభమయింది. కావున ఈ చిల్లర రాజకీయాల జోలికి మోదీ పోకుండా ఇకనైనా నిండు మనసుతో ఆంధ్రప్రదేశ్‌కు నిధులు కేటాయించి ఆయా ప్రాజెక్టులు అమలు జరిగేలా శ్రద్ధ వహించాలి. కేటాయించిన ప్రాజెక్టులలో ఒక్కటన్నా పూర్తి కాలేదంటే వాటి అమలు పట్ల మోదీ ఏమాత్రం బాధ్యత వహిస్తున్నారో ప్రజలకు అవగతమవుతూనే ఉంది. దేశ ప్రజలకు ఈనాడు కావాల్సింది పెద్ద పెద్ద ఛాతీతో గొప్ప గొప్ప ప్రసంగాలు కాదు. ఆంధ్రులు కూడా దేశపౌరులేనని పెద్ద మనసుతో నిధులు కేటాయించి, వాగ్దానాల నిబద్ధతను పాటించి రాజనీతిజ్ఞతను మోదీ పెంపొందించుకోవాలి. వెనుకబడిన జిల్లాలకు తోడ్పాటు, నదుల అనుసంధానానికి నిధులు, ఢిల్లీ తరహాలో ఆంధ్రులకు మంచి రాజధానిని నిర్మింపచేస్తానని తాను స్వయంగా ఇచ్చిన హామీని మోదీ గుర్తెరిగి ఆంధ్రనాట అభివృద్ధికి తోడ్పడాలి. 14వ ఆర్థిక సంఘం యొక్క తప్పుడు అంచనాలు సరిదిద్ది దక్షిణాది రాష్ట్రాలు వివక్షకు గురవుతున్న విషయాన్ని గమనించి సరిదిద్దాలి. ఉత్తర, దక్షిణ భారతాల మధ్య వ్యత్యాసాలు లేకుండా చేయటానికి అమరావతిలో రాబోతున్న జస్టిస్ సిటీలో సుప్రీమ్ కోర్టు బెంచ్ ను ఏర్పాటు చేయాలి. విభజన వలన నష్టపోయిన ఆంధ్రులకు మరింత మేలు చేసి, తమకు ఉత్తరాది పెత్తందారీతనం, సంకుచిత్వాలు లేవని రుజువు చేసుకోవాల్సిన సమయం ప్రధాని మోదీకి ఆసన్నమయింది.

ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా లక్షల కోట్లు ఇచ్చామని అమిత్‌షా చేత, రెండెకరాల ఆసామి కోట్లు ఎలా సంపాదించాడని మరొకరి చేత అరిగిపోయిన రికార్డులను వినిపించటమేమిటి? వినాశకాలే విపరీత బుద్ధి అంటారు ఇదే కాబోలు! నేడు ఆంధ్రులకు కావాల్సింది వట్టి హామీలు, చంద్రబాబుపై ఆరోపణలు కాదు.

■ జి.వి. రామ్‌ప్రసాద్


ఆధునిక యోగిని బిరుదురాజు రుక్మిణి

'భూమి నాదని అన్న భూమి ఫక్కున నవ్వు/దానహీను జూసి ధనము నవ్వు'. శాశ్వతంగాని ప్రపంచంలో.. అశాశ్వతమైన ఉనికితో మానవజాతి నేటి వరకు సంపాదించుకున్నదంతా అపఖ్యాతే. ఎందుకంటే ఖ్యాతి అనేది చెడుతోనైనా వస్తుంది, మంచితోనైనా వస్తుంది. కాలం పిలుపు రాగానే ఎక్కడిదక్కడ వొదిలిపెట్టి వెనకకు తిరిగి చూడకుండా వెళ్ళిపోవాల్సిందేనన్న స్పృహ కోల్పోయి జీవిస్తున్న మానవలోకంలో అరుదైన వ్యక్తిత్వం, జీవనవిధానం ఉన్న వాళ్ళు కొందరే జన్మిస్తారు. కాలమే వాళ్ళకు జన్మనిస్తుంది. వాళ్ళను కారణజన్ములుగా రూపొందిస్తుంది. వాళ్ళవల్ల కావల్సిన పనులు నెరవేర్చుకొని తిరిగి తనలో లీనం చేసుకుంటుంది. అలాంటి కోవలోకి చెందిన వ్యక్తులు మనకు తారసపడితే, మనకూ తెలిసుంటే వారి నుండి మనం తెలుసుకునే జీవన సత్యాలు అబ్బురంగా ఉంటాయి. 1952 జనవరి 16న వరంగల్‌లో జన్మించిన రుక్మిణి జానపద వాఙ్మయ పరిశోధకుడైన ఆచార్య బిరుదురాజు రామరాజు కుమార్తె. రుక్మిణి జగమెరిగిన సాహితీవేత్త కాదు. ఆకుచాటు పువ్వులాంటిది. ఆమె కాకతీయ విశ్వవిద్యాలయంలో తెలుగు భాషావిభాగంలో బోధనా వృత్తిలో ఉండి కొన్ని ఆధ్యాత్మిక గ్రంథాలను రచించారు. తండ్రిగారైన రామరాజుతో కలిసికొన్ని గ్రంథాల అనువాదం, పరిష్కరణా, రచనలూ చేసారు.

సి. నారాయణరెడ్డి సూచన మేరకు నన్నయ భారతమండలి ఉపమాలంకార వైశిష్ట్యము గూర్చి పరిశోధన చేసిన రుక్మిణి 1978లో 'నన్నయ భారతములో ఉపమ' అనే పరిశోధనకు గాను డాక్టరేటు పట్టాపొందారు. 1983లో నన్నయ సంవత్సరంగా పాటించినప్పుడు తిరుమల తిరుపతి దేవస్థానము వారి సహాయముతో 'నన్నయ భారతములో ఉపమ' అనే శీర్షికన దానిని గ్రంథంగా ప్రచురించారు. నన్నయ భారత రచనానువాదం గురించి తన గ్రంథంలో 'పరంపరాగతమైన సంప్రదాయ సంస్కారముల ప్రభావము, తత్కాలీన దేశభాషల వాతావరణము, నవనవ్యోషశాలినిమైన స్వీయ ప్రతిభ ఇవియన్నియు కలిసి నన్నయ అపూర్వ వ్యక్తిత్వ నిర్మాణమునకు కారణములై తెలుగులో కావ్యత్వమును సంతరించుకొన్న స్వతంత్ర రచనయా ? అన్నంత ఉత్కృష్టముగా భారతము ఆవిష్కృతమైనది' అని చెప్పారు. అంతేకాదు తెలుగు భారతము వాస్తవమైన పరిణామ దృష్టితో చూడాలని అంటూ 'తెలుగు భాషాస్వత్వము, తెలుగుజాతి ఆలోచనారూపము, సంస్కృత సాహిత్య ప్రభావము, తత్కాలీన పరిస్థితులు 1) సాంఘికములు 2) భాషాగతములు అన్నీ కలిసి కవి మనోదర్పణముపై ప్రతిబింబించునప్పుడు ప్రభూతమగు సృష్టి సంస్కృత భారతమునకు యథాతథముగా ఉండుటకు వీలు లేదు' అని స్పష్టం చేసారు. నన్నయ అర్థమతియైన కవి. ఆయనలోని కవి రూపమును ప్రకాశింపజేయు అలంకారములలోనిదే ఉపమాలంకారము. ఇందులో 'ఉపమా శైలూషి' నాట్యవిన్యాసముతో పాటు అంతస్తత్వ పరిశీలనారూపమే తన సిద్ధాంత వ్యాసరచనగా వెలువడిందని ఆమె రాసుకున్నారు.

2004లో 27 మంది ఆంధ్రయోగినుల గురించి ' ఆంధ్రయోగినులు' అనే గ్రంథాన్ని రుక్మిణి వెలువరించారు. వేదభూమీ కర్మభూమీ అని కీర్తింపబడుతూ ఆధ్యాత్మికంగా శిఖరాయమానమైన భారతదేశం నేల ఎందరో మహనీయుల సంస్కారముల చేత పావనం అయ్యింది. అయితే చరిత్రలో నమోదయిన ఆ మహనీయులంతా పురుషులే కావడం అనేది స్త్రీల పావన చరిత్రలను విస్మృతిలోకి నెట్టివేసిన సత్యాన్ని ఎత్తిచూపుతున్నది.

ఆంధ్రమహాభారతంలోని అరణ్యపర్వం పంచమాశ్వాసంలో ధర్మవ్యాధోపాఖ్యానంలో ఉన్న కౌశికుని ప్రస్తావన గురించి చెప్తూ తపస్సంపన్నుడైన అతనిలోని క్రోధగుణం దానివల్ల అతని తపశ్శక్తి వృధా పోతుండటం గురించి మాట్లాడుతూ ఒకరోజు కౌశికుడు దినచర్యలో భాగంగా భిక్షకోసం ఒక ఇంటి ముందు ఆగినపుడు ఆ ఇంటి ఇల్లాలు అతనికి తన క్రోధమువల్ల నష్టాన్ని గురించి వివరంగా చెప్పి జ్ఞానోదయానికై సద్గుణ సంపన్నుడూ కిరాతుడైన ధర్మవ్యాధుని వద్దకు పొమ్మని ఉపదేశిస్తుంది. కౌశికుడు మిథిలకు చేరి ధర్మవ్యాధుని కలుసుకోబోగానే ఆయన ఆ పతివ్రతామ తల్లి పంపినదా అని ఆదరముగా ఆహ్వానిస్తాడు. అటు ఆ ఇల్లాలి ధర్మజ్ఞానము ఇటు ధర్మవ్యాధుని ఎరుకా రెండూ కౌశికుని విస్మయపరుస్తాయి. ఈ కథలో ఆ ఇద్దరు తపోజ్ఞానులకూ పేరున్నది కానీ ఆ ఇల్లాలు మాత్రం అనామకమే. ఆమె కథను పూర్తిగా తెలుసుకొని చెప్పితే అదొక యోగిని చరిత్రగా రూపొంది ఉండేదన్న ఆలోచనతో 1995 నుండీ తెలంగాణ, రాయలసీమ, కృష్ణాగోదావరి జిల్లాలు పర్యటించి 50కిపైగా యోగినుల చరిత్ర సమాచారాన్ని సేకరించారు రుక్మిణి. ఆ యోగినుల సామాన్య జీవన విధానం నుండి యోగ పథం వైపు మరలిన తీరు, వారు ప్రజలకు ఉపయోగపడిన తీరు, వారి చిత్తవృత్తి, వారికి లభించిన సిద్దులూ, గురువులూ, వారి ప్రబోధాలు లభించినంత మేరకు 'ఆంధ్ర యోగినులు' గ్రంథంలో చేర్చారు. వారిలో కందిమల్లయ్యపల్లె ఈశ్వరమ్మ మొదలుకొని. తరిగొండ వెంకమ్మ, దొంతులమ్మ, తిక్క లక్ష్మమ్మ, గయాబాయి, తాడ్వాయి శబరి మాత, శృంగవృక్షం శివబాలయోగేశ్వరీదేవితో కలిపి 27 మంది యోగినుల వృత్తాంతాలు గ్రంథస్తం చేయబడ్డాయి. భారతీయ సంస్కృతి మూలాలు అపరిమితమైన విషయ సంపద కలవి కనుక ఆ విషయాలను స్థూలంగా పరిచయం చేయటం తన 'వ్యాస పారిజాతం' ఉద్దేశం అని చెప్పుకున్నారు ఈ గ్రంథంలో. ఇందులోని కథలు కొన్ని ఉపనిషద్విషయమునకు సంబంధించినవి. ఇవి సనాతన సారథి మాసపత్రికలో 1988, 89ల్లో ప్రచురితమైనవి. మానవుడు జననమరణాల మధ్యన జీవిస్తాడు. ఉత్తమ దశకు చేరుకునేందుకు కర్మమార్గాన పయనిస్తాడు. మతాలు అనేవి నైతిక విలువల పరిరక్షణకే ఏర్పడ్డాయి. వాటన్నింటి పరమార్థము సత్యం, ధర్మం, శాంతి ప్రేమాహింసల తత్త్వాన్ని తెలియజెప్పటమే. అయితే మానవునిలోని స్వార్థం, దురాశలు, అసహనాలు, దౌర్జన్యాలు వీటి స్వరూపాలను మార్చివేస్తుంది. 'వ్యాస పారిజాతం'లో ఉపనిషత్కథలు అధ్యాయంలో 11 కథలనూ, రామాయణం అనే ఆధ్యాయంలో 5 కథలనూ ఆంధ్ర మహాభారతం అనే అధ్యాయంలో 4 కథలనూ తీసుకొని పరిచయం చేసారు. విలక్షణ మానవీయ వ్యక్తిత్వంతో, నిత్యం జీవనోత్సాహం తొణికలాడుతూ 'సానుభూతి చూపే పెదవులకన్నా సహాయం చేసే చేతులే మిన్న' అన్న మానవతా సూత్రాన్ని ప్రచార ఆర్భాటం లేకుండా ఆచరించి చూపిన అపూర్వ వ్యక్తిత్వం డాక్టర్ రుక్మిణిది. నిరాడంబర జీవనశైలితో ఆధునిక యోగినిగా ఆమె తన జీవిత మార్గాన్ని మహామాన్వితం చేసుకున్నారు. ఎందరో అవసరార్థులను ఆర్థికంగా ఆదుకున్నారు. డబ్బూ సంపదలూ కూడబెట్టుకునే వ్యసనాన్ని నిరసిస్తూ అందుకు వ్యతిరేకంగా తన మంచితనాన్నీ, డబ్బునూ చేతికి ఎముకల్లేనట్లుగా మనసుకు మచ్చునేది లేకుండా పంచి ఇచ్చారు. తాను నిర్మోహంగా జీవించారు. ఆమెది ప్రవాహశీలమైన జీవన యానం. ఇంటికొచ్చేవారిని తమ ఇంటి పాటకుల దగ్గర చూడగానే ఎదురొచ్చి లోపలికి తీసుకెళ్ళి ఆదరించేవారు. సూదంటూ రాయిలాంటి మాటలతో ఎదుటివారిని ప్రభావితం చేసేవారు. ఎందరో బాధితులకు అండగా ఉండి సహాయ సానుభూతులే కాదు ధైర్యాన్నీ స్థైర్యాన్నీ ఇచ్చారు. శిఖరోన్నతమైన వ్యక్తిత్వంతో ఎదిగిన ఆమె ఆకుచాటు పూల గుత్తివలె ఉండి ఈ డాంబికపు లోకం డొల్లతనాలకు దూరంగా ఉన్నారు. గత ఏడాది ఫిబ్రవరిలో ఈ భౌతికలోకంలో తన ముద్రను విడిచిపెట్టి వెళ్ళిపోయారు. ఆమెది ఆచరణాత్మకమైన అమూల్యమైన మానవతా సందేశం, ప్రేమ జీవనమార్గం. ఆ మహోన్నతమైన చైతన్యమూర్తికి మన నీరాజనాలు!



విలక్షణ మానవీయ వ్యక్తిత్వంతో, నిత్యం జీవనోత్సాహం తొణికలాడుతూ ప్రచార ఆర్భాటం లేకుండా మానవతను ఆచరించి చూపిన అపూర్వ విదుషీమణి, ఆధ్యాత్మికవేత్త డాక్టర్ రుక్మిణి. నిరాడంబర జీవనశైలితో ఆధునిక యోగినిగా ఆమె తన జీవిత మార్గాన్ని మహామాన్వితం చేసుకున్నారు.

■ అనిశెట్టి రజిత
(రేపు రుక్మిణి ప్రథమ వర్ధంతి)



చెన్నంపల్లి కోటలో పురాతన విగ్రహాలు

కర్నూలు జిల్లాలోని చెన్నంపల్లి కోటలో శుక్రవారం పురాతన సీతారామలక్ష్మణ విగ్రహాలతోపాటు పూజా సామగ్రి లభ్యమయ్యాయి. ఇవి 15వ శతాబ్దానికి చెందినవై ఉంటాయని అధికారులు భావిస్తున్నారు. చెన్నంపల్లిలో విలువైన నిధి నిక్షేపాల కోసం గత ఏడాది డిసెంబరు 13 నుంచి ప్రభుత్వం తవ్వకాలు చేస్తోంది. ఈ కోటలో ఇప్పటికే రాతి ఫిరంగి గుండ్లు, మలచిన శిలలు లభ్యమయ్యాయి. - పత్తికొండ



భక్త జన సంద్రం.. వంశధార

వంశధార భక్త జన సంద్రమైంది. ఉత్తరాంధ్ర, ఒడిసాల నుంచి తరలివచ్చిన భక్తులతో నదీ తీరం కిటకిటలాడింది. శ్రీముఖలింగేశ్వరుడి చక్రతీర్థ స్నానాన్ని కనులారా వీక్షించేందుకు గురువారం అర్ధరాత్రి నుంచే భక్తులు తరలివచ్చారు. శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం శ్రీముఖలింగేశ్వరునికి ఏటా శివరాత్రి తర్వాత మూడో రోజున చక్రతీర్థ స్నానాలు నిర్వహిస్తారు. దీనిని లక్షలాది భక్తులు వీక్షించారు. - జలుమూరు

ఆర్టీజీపై రిలయన్స్ ఆసక్తి

- అంబానీ ఆదేశాలతో రాక
- మంత్రి లోకేశ్‌తో భేటీ

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): సచివాలయానికి వచ్చిన రిలయన్స్ ప్రతినిధులతో మంత్రి నారా లోకేశ్ ఆర్టీజీ సెంటర్‌లో శుక్రవారం సమావేశమయ్యారు. రియల్‌టైమ్ గవర్నెన్స్ గురించి వారికి వివరించారు. దీనిద్వారా కాగిత రహిత పరిపాలన తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామన్నారు. దక్షిణాదిలోని మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో తలసరి ఆదాయం తక్కువగా ఉన్నా సమస్యలను అధిగమించి 15శాతం వృద్ధిరేటును లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రాష్ట్రంలో ఏడు మిషన్లు, ఐదు గ్రిడ్లు ఏర్పాటుచేసి అందుకు అనుగుణంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇంటర్నెట్ సదుపాయాన్ని ప్రాథమిక హక్కుగా మార్చేందుకు ఫైబర్‌గ్రిడ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. కాగా, ఏపీలో అమలుచేస్తున్న ఆర్టీజీ విధానం తమ అధినేత ముఖేశ్ అంబానీని ఎంతగానో ఆకట్టుకుందని రిలయన్స్ ప్రతినిధులు మంత్రికి తెలిపారు. దీనిద్వారా నేర్చుకోవాల్సింది ఎంతో ఉందనే, తమను ఇక్కడకు పంపించారని చెప్పారు. రిలయన్స్ బృందంలో టావి కొట్కా, జియా షాకిబ్, అనిశ్ షా, రాజన్ లుత్రా, సౌరభ్ సంచేటి, కిరణ్ థామస్, మాధవరావు, వి.సదాబాబు, మహేష్‌కుమార్, డి.నిరంజన్ తదితరులు ఉన్నారు.

బీసీ యువతకు క్యాబ్‌లు

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బీసీ యువతకు స్వయం ఉపాధి కల్పించడంలో భాగంగా క్యాబ్‌లు పంపిణీ చేయనున్నారు. కాపు కార్పొరేషన్ ద్వారా ఇప్పటికే కాపు యువతకు క్యాబ్‌లు పంపిణీ చేసిన బీసీ సంక్షేమశాఖ ఇప్పుడు పలు ఫెడరేషన్ల ద్వారా ఆయా కులాలకు చెందిన యువతకు వీటిని అందించాలని నిర్ణయించింది. ఒక్కో ఫెడరేషన్ ద్వారా ఏటా 100 వాహనాలు మంజూరు చేయాలని భావిస్తోంది. అత్యంత వెనుకబడిన తరగతుల కార్పొరేషన్(ఎంబీసీ)తో పాటు రజక, సగర ఉప్పర, వాల్మీకి బోయల ఫెడరేషన్ల ద్వారా ఈ క్యాబ్‌లు పంపిణీ చేయనుంది. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా వీటికి ఓలా, ఓబెర్‌లో రిజిస్ట్రేషన్ కూడా కల్పించనున్నారు. దీనిలో భాగంగా ఒక్కొక్కరికి రూ.లక్ష సబ్సిడీగా అందిస్తారు. లబ్ధిదారుడు తన వాటాగా మరో రూ.లక్ష చెల్లిస్తే మిగిలిన మొత్తాన్ని బ్యాంకు రుణంగా ఇచ్చే ఏర్పాటు చేస్తారు. లారీ ఓనర్స్ అసోషియేషన్ తరపున బీసీ యువతకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నారు.

ఇంధనశాఖకు 4 వేల కోట్ల లబ్ధి

- ఆర్ఎన్ఎల్‌జీ వినియోగంపై సుప్రీంతీర్పుతో ఈ ప్రయోజనం

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో చెల్లింపులపై ఇంధనశాఖ చేసిన పోరాటానికి ఫలితం దక్కింది. గ్యాస్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తి సంస్థల్లో సహజ వాయువు(నేచురల్ గ్యాస్)కు... రీఫైన్డ్ నేచురల్ లిక్విడ్ గ్యాస్(ఆర్ఎన్ఎల్‌జీ) ప్రత్యామ్నాయం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీంతో, ఇంధనశాఖకు భారీ ఊరట కలిగింది. జీఎంఆర్ కోరుతున్న రూ.1200 కోట్లు, కోనసీమ, జీవీకే రెండో దశ, జీవీకే గౌతమి చెల్లించాలంటున్న రూ.2800 కోట్లను చెల్లించాల్సిన అవసరం లేకుండా పోయింది! అంతిమంగా ఇది వినియోగదారులకే మేలు చేస్తుందని అధికారులు అంటున్నారు.

ఈ నాలుగు విద్యుదుత్పత్తి సంస్థలు మొత్తంగా 1500 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లను ఏర్పాటు చేస్తామంటూ సమగ్ర ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేయగా... 2003లో డిస్కమ్‌లు ఒప్పందం చేసుకున్నాయి. ఈ ప్లాంట్ల నిర్మాణ పనులు 2009లో పూర్తయ్యాయి. 2013 దాకా కేంద్రం వీటికి కేంద్రం సహజ వాయువును సరఫరా చేసి... తర్వాత ఆపేసింది. డిస్కమ్‌లతో ఈ పరిశ్రమలు చేసుకున్న ఒప్పందం మేరకు... సహజ వాయువుతోనే విద్యుత్‌ను ఉత్పత్తి చేయాల్సి ఉంది. కానీ, అందుకు ఐదురెట్లు ఖరీదైన ఆర్ఎన్ఎల్‌జీతో ఈ సంస్థలు ఉత్పత్తి ప్రారంభించాయి. ఈ భారాన్ని డిస్కమ్‌ల ద్వారా రాబట్టుకోవాలని చూశాయి. దీంతో, ఇలాంటి విద్యుత్‌ను కొనుగోలు చేస్తే భారీగా చెల్లించుకోవాల్సి వస్తుందని, పైగా టారిఫ్‌ను కూడా పెంచాల్సి వస్తుందని డిస్కమ్‌లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. వీటి వాదనలతో ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి అజయ్ జైన్, ట్రాన్స్‌కో సీఎండీ కె.విజయానంద్, ట్రాన్స్‌కో జేఎండీ దినేశ్ పరుచూరి ఏకీభవించారు. సహజ వాయువుకు ఆర్ఎన్ఎల్‌జీ ఏమాత్రమూ ప్రత్యామ్నాయం కాదని ట్రాన్స్‌కో, ఆంధ్రప్రదేశ్ పవర్ కోఆర్డినేషన్ కమిటీ (ఏపీపీసీసీ) కూడా వాదిస్తూ వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్సీ)లో డిస్కమ్‌ల తరపున ఏపీపీసీసీ కేసు దాఖలు చేసింది. సహజ వాయువుకు ఆర్ఎన్ఎల్‌జీ ఎంత మాత్రమూ ప్రత్యామ్నాయం కాదని ఈఆర్సీ తేల్చి చెప్పింది. వ్యత్యాసం భారీగా ఉంటే ఆర్ఎన్ఎల్‌జీ వినియోగించి ఉత్పత్తి చేసే విద్యుత్‌ను కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తూ తీర్పు చెప్పింది. ఈ తీర్పును గ్యాస్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తి సంస్థలు, ముఖ్యంగా జీఎంఆర్ వ్యతిరేకిస్తూ... రాష్ట్ర అప్పిలేట్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించాయి. సహజ వాయువుకు ఆర్ఎన్ఎల్‌జీని ప్రత్యామ్నాయంగా పేర్కొన్న ట్రైబ్యునల్... ఉత్పత్తి సంస్థలకు చెల్లించాల్సిన నిధులు ఇచ్చేయాలని ఆదేశించింది. అప్పిలేట్ ట్రైబ్యునల్ తీర్పుతో విభేదించిన ఏపీ ట్రాన్స్‌కో... సుప్రీం కోర్టును ఆశ్రయించి విజయం సాధించింది.

నవ్యాంధ్రకు నవ బడ్జెట్

- మార్చి 5న గవర్నర్ ప్రసంగం.. 8న బడ్జెట్
- ప్రభుత్వ లక్ష్యాలను బట్టి అంచనాలు
- మంత్రులు, కార్యదర్శులు, శాఖాధిపతుల సమావేశంలో ముఖ్యమంత్రి దిశానిర్దేశం

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మూస ధోరణి విడనాడి... బడ్జెట్ ప్రతిపాదనల రూపకల్పనలో కొత్త పద్ధతులు అవలంబించాలని అన్ని శాఖలకు సీఎం చంద్రబాబు సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అంచనాలు రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ శాఖల పని తీరుపై కొన్ని ఏజెన్సీలు ర్యాంకులు ఇస్తున్నాయని, కొన్ని శాఖల్లో ఆశించిన పురోగతి కనిపించడం లేదని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా శాఖలు మరింతగా దృష్టిపెట్టి పనితీరును మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రభుత్వ శాఖాధిపతులు, కార్యదర్శులు, మంత్రులతో శుక్రవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు బడ్జెట్ సన్నాహక సదస్సు నిర్వహించారు. అభివృద్ధి, సుస్థిర ఆర్థికవృద్ధి, ప్రజల సంతృప్తి లక్ష్యాలుగా పనిచేయాలని అధికారులకు సూచించారు. ప్రాధాన్యక్రమంలో ప్రభుత్వ లక్ష్యాలను నిర్దేశించుకున్నామని, దానివల్ల ఫలితాలు బాగా వస్తున్నాయన్నారు. పంచాయతీ రాజ్, జలవనరులు, విద్యుత్ రంగాలతోపాటు ఓడీఎఫ్(బహిరంగ మలవిసర్జన రహిత), ఉపాధి పథకంలో అవసరమైన పనులకు నిధుల మళ్లింపు వంటి విషయాల్లో సానుకూల ఫలితాలు వచ్చాయని సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. మూడేళ్ల సరాసరి వృద్ధిరేటు తీసుకుంటే 11 నుంచి 12 శాతం మధ్యన ఉందని చెప్పారు. ప్రభుత్వ లక్ష్యం 15 శాతమని, అన్ని జిల్లాలు వృద్ధిలో ముందుకెళ్లాలని సూచించారు. రాష్ట్ర విభజన చట్టంలో కేంద్రం ఇచ్చిన హామీల మేరకు రావాల్సినవేవీ సక్రమంగా రాలేదన్నారు. అయినా, సంక్షేమంలో అర్హులకు ప్రయోజనాలు సమర్థంగా అందించగలుగుతున్నామని సీఎం ప్రకటించారు. మార్చి తొలివారంలో బడ్జెట్ సమావేశాలు ప్రారంభిస్తామన్నారు. 5వ తేదీన గవర్నర్ ప్రసంగం ఉంటుందని, 8వ తేదీన బడ్జెట్ ప్రవేశపెడతామని చెప్పారు. అన్ని శాఖల్లో సంస్కరణలు తీసుకొస్తున్నామని, లక్ష్యాలకు అనుగుణంగా ఎన్ని నిధులు అవసరమో అంచనాలు సిద్ధం చేయాలన్నారు.



మంత్రులు, శాఖాధిపతులు, కార్యదర్శులతో సచివాలయంలో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

ఓడీఎఫ్ స్ఫూర్తితో...

ఓడీఎఫ్ తరహాలో రాష్ట్రంలో పీహెచ్ఎఫ్(పాట్ హోల్స్ ఫ్రీ - గుంతలు లేని రోడ్లు)కి వెళ్లాలని నిర్దేశించుకున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలోనే భారీస్థాయిలో రహదారుల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. సాంకేతికతను వినియోగించుకోవడంలో ఏపీ ముందంజలో ఉందన్నారు. విజ్ఞాన సముపార్జనతోనే వ్యక్తులు, సంస్థలు, సమాజాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఏపీని విజ్ఞాన గనిగా రూపొందించాలన్నదే లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఇంటర్నేషనల్ బెంచ్ మార్క్ చేరుకోవడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

చివరి త్రైమాసికంలోనే అదనపు బడ్జెట్

- అదనపు నిధుల కోసం వెంటపడొద్దు: యనమల

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఇక నుంచి ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలోనే అదనపు బడ్జెట్ ఇస్తామని, మొదటి త్రైమాసికం నుంచి అదనపు నిధుల కోసం వెంటపడొద్దని వివిధ శాఖలకు ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. సచివాలయంలో శుక్రవారం వివిధ శాఖల బడ్జెట్ ప్రతిపాదనలను మంత్రి సమీక్షించారు. ఆయా శాఖలకు కేటాయించిన నిధులను అవసరాన్ని బట్టి ఇతర పథకాలు, ప్రాజెక్టులకు వినియోగించుకునే వెసులుబాటు ఇచ్చామన్నారు. అయితే, స్థిరాస్తులకు కేటాయించిన నిధులను రెవెన్యూ ఖర్చులకు మళ్లించకూడదని ఆదేశించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో స్థిరాస్తి ఖర్చులు పెంచుతామని చెప్పారు. కేటాయించిన నిధులు ఖర్చు చేశాకే అదనపు నిధులు అడగాలని పేర్కొన్నారు. కాగా, పలుశాఖల మంత్రులు, ఉన్నతాధికారులు తమ శాఖలో సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ... లక్ష్యాలను వివరించారు.

ప్రశాంతినగర్‌లో సుధాకర్ నివాసం

నెల్లూరు బాబా దోపిడీ 40 కోట్లు!

- బాధితుల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యేలు, అదనపు ఎస్పీ
- ఆశ్రమం అడ్డాగా ఒక మహిళ వ్యభిచారం?
- రూరల్ పోలీసులకు బాధితుల ఫిర్యాదు

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 16: నెల్లూరులో స్వామీజీ అక్రమాల వ్యవహారం కలకలం రేపుతోంది. ఆంధ్రజ్యోతి గురువారంనాటి సంచికలో సుధాకర్‌బాబా దోపిడీ గురించి కథనం వచ్చిన తర్వాత బాధితుల సంఖ్య పెరిగింది. అతగాడు చేసిన మోసం రూ.3 కోట్ల నుంచి రూ.40 కోట్లకు చేరుకుంది. సుధాకర్ మహారాజ్‌గా అవతారం ఎత్తిన అతగాడి మాయలో అన్ని వర్గాల ప్రజలూ పడ్డారు. ఓ మాజీ మంత్రి, ఓ అదనపు ఎస్పీ, వైసీపీకి చెందిన ఎమ్మెల్యేలు, పలువురు వ్యాపారులు బాధితుల జాబితాలో ఉన్నట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెలుగుచూసినట్లు సమాచారం. ఒక మహిళ ద్వారా ఆశ్రమంలో వ్యభిచార సామ్రాజ్యం కూడా స్థాపించినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. సుధాకర్ సొంతూరు ఉదయగిరి మండలం ఆర్లపూడి. 1988లో ఒప్పంద ఉపాధ్యాయుడు. అప్పట్లో జీతం రూ. 349. ఉద్యోగం రెగ్యులరైజ్ అయిన తర్వాత నెల్లూరు వచ్చాడు. ఇంకా 4 ఏళ్ల సర్వీసు ఉండగానే మెడికల్ లీవు పెట్టి ఆధ్యాత్మికం వైపు అడుగులు వేశాడు. నెల్లూరు శివారు ప్రశాంతినగర్ వద్ద మకాం ఏర్పాటుచుకుని యాగాలు, ప్రత్యేక పూజలు చేస్తూ వస్తున్నాడు. మంత్ర పుస్తకాల వ్యాపారంలో మోసాలకు తెరతీశాడు. శివరాత్రి సందర్భంగా నిర్వహించే హోమాలకు పుస్తకాలు కొనుగోలు చేసిన వారికి బంగారం నాణేలు ఇస్తామని ప్రచారం చేయడంతో అమ్మకాలకు అంతే లేకుండా పోయింది. కాగా, బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు నెల్లూరు రూరల్ సీఐ శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. కొందరు బాధితులైతే వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నెల్లూరు-మైపాడు రహదారిపై కాసేపు వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు.

ఏడుగురిని బలిగొన్న.. సెప్టిక్ ట్యాంక్

- చిత్తూరుజిల్లా పలమనేరులో విషాదం
- 25 లక్షల సాయానికి కలెక్టర్ హామీ

పలమనేరు, ఫిబ్రవరి 16:చిత్తూరు జిల్లా పలమనేరు సమీపంలో సెప్టిక్‌ట్యాంకుని శుభ్రం చేయడానికి దిగిన ఆరుగురు కూలీలు ఊపిరి అందక ప్రాణాలు విడిచారు. వారిని రక్షించడానికి ప్రయత్నించిన సూపర్‌వైజర్ సైతం దుర్మరణం పాలయ్యాడు. కొన్నాళ్లుగా వాడుక లేక, ట్యాంకులో పేరుకొన్న విషరసాయనాలు వీరందరినీ బలిగొన్నాయి. ప్రాణాంతక విష వాయువులు తమను కబళించడానికి పొంచి ఉన్నాయనే విషయం తెలియక, ముందుగా ఒక కూలీ ట్యాంకులోకి దిగాడు. ఆ తరువాత కొద్దిసేపటికే ప్రాణాలు వదిలేశాడు. అది చూసిన మిగతా కూలీలూ 'ఏమయింది.. ఏమయింది' అంటూ ఒకరి వెంట ఒకరుగా ట్యాంకులోకి దిగడంతో పెను విషాదం చోటుచేసుకొంది.

ఏందిరా ఇంత గబ్బు..

పలమనేరు సమీపంలోని వెంకటేశ్వర హేచరీస్ ఆవరణలోని సెప్టిక్‌ట్యాంకు నిండింది. హేచరీస్‌లోని కోడిపెంటల నుంచి అన్నిరకాల వ్యర్థాలను ఈ ట్యాంక్‌లోకే వదులుతున్నారు. నిండిపోయిన ట్యాంకు నీళ్లను పంపులతో ఎప్పటికప్పుడు తోడి పోస్తుంటారు. ట్యాంక్ లోపల ఫుట్‌బాల్ బ్లాక్ కావడంతో కొద్దికాలంగా నీరు సరిగా పోవడం లేదు ఆ బ్లాక్‌ను తొలగించాలని యాజమాన్యం నిర్ణయించిం ది. దీని కోసం శుక్రవారం ఉదయం ఆరుగురు కూలీలు, ఇద్దరు సూపర్‌వైజర్లు ట్యాంక్ దగ్గరకు వచ్చారు. కొద్దికాలంగా నీరు నిల్వ ఉండటంతో ట్యాంకు అంతా విష రసాయనాలతో నిండిపోయింది. ఈ విష యం తెలియని ఒక కూలీ నిచ్చెన సాయంతో ట్యాంకు లోకి దిగాడు. నీళ్లలోకి దిగక ముందే, 'అబ్బా..ఇంత గబ్బు కొడుతోంది ఏందిరా' అని పైనున్న తోటి కూలీలతో అన్నాడు. 'కాసేపు భరించు అన్నా' అని వారు చెబుతుండగానే, ఆ కూలీ నీళ్లలోకి దిగాడు. ఒక్కసారిగా అతని మెదడు, ఊపిరితిత్తులు పనిచేయడం ఆగిపోయాయి.

ఒకరి వెంట ఒకరుగా..

తమ సహచరుడు చనిపోవడంతో తోటి కూలీలు, ఒకరి తరువాత ఒకరుగా ట్యాంకులోకి దిగారు. వ్యర్థ నీళ్లలో కనిపిస్తున్న అతని మృతదేహం వద్దకు చేరుకోడానికి ప్రయత్నించారు.ఆ తొందరలో తమను క్రమంగా కమ్మేస్తున్న మగత, మత్తుని పట్టించుకోలేదు. కొద్దిసేపటికే వారంతా మృత్యువాత పడ్డారు. ట్యాంక్ పైనుంచి చూస్తున్న సూపర్ వైజర్లలో ఒకరు..వీరికి ఏమైందోనని ట్యాంక్‌లోకి నిచ్చెన మీదుగా దిగి నీళ్లలో పడి చనిపోయాడు. అతని కోసం ట్యాంక్‌లోకి దిగబోయిన మరో సూపర్‌వైజర్ విష వాయువులను పీల్చి స్పృహ తప్పిపోయాడు. ఆ చుట్టుపక్కల వారు కేకలు పెట్టడంతో సిబ్బంది, అధికారులు అక్కడకు చేరుకొన్నారు. ట్యాంకులోని ఏడు మృతదేహాలను వెలికి తీశారు. స్పృహ తప్పిన సూపర్ వైజర్ శివకుమార్ రెడ్డిని పలమనేరు ఆస్పత్రికి తరలించారు. మృతిచెందిన కూలీలను పలమనేరులోని మొరం గ్రామానికి చెందిన రెడ్డెప్ప(45), రమేశ్(32), అయ్యంరెడ్డిపల్లెకు చెందిన కేశవ(20), కూర్మాయి గ్రామానికి చెందిన గోవింద స్వామి(45) శ్రీరంగ రాజపురం గ్రామానికి చెందిన రామచంద్రయ్య(23) చంద్రగిరి మండలం అరిగలవారిపల్లెకు చెందిన వెంకట రాజులు(23)గా గుర్తించారు. మృత్యువాతపడిన సూపర్ వైజర్‌ను కర్ణాటక ముళబాగల్ తాలూకా తిమ్మనాయనిపల్లెకు చెందిన బాబు(35)గా కనుగొన్నారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాసరావు, హోంమంత్రి చినరాజప్ప ఆదేశం మేరకుపోలీసు అధికారులు, వైద్యాధికారులు ఘటనాస్థలికి చేరుకొన్నారు. ప్రమాదం నుంచి బయటపడిన వ్యక్తిని తిరుపతి సిమ్స్‌కు తరలించి, మెరుగైన వైద్యం అందించాలని కామినేని ఆదేశించారు. విదేశీ పర్యటనలో ఉన్న మంత్రి అమరనాథరెడ్డి, అక్కడి నుంచే ప్రమాద కారణాలపై సమీక్ష జరిపారు. కలెక్టర్ ప్రద్యుమ్న ఆస్పత్రిలోని మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. తక్షణ ప్రభుత్వ సాయంగా రూ.10 వేలు అందించారు. రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా, హేచరీస్ యాజమాన్యం నుంచి రూ.15 లక్షల చొప్పున నష్ట పరిహారం అందేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాల విద్యార్థులను ప్రభుత్వమే చదివిస్తుందని, కూలీలకు చెల్లిస్తున్న వేతనంలో 90 శాతం పింఛనుగా ఇప్పిస్తామని భరోసా ఇచ్చారు.



ఏడుగురిని బలిగొన్న సెప్టిక్ ట్యాంకు ఇదే

కడప ఉక్కుకు ఓకే!

- సాధ్యాసాధ్యాలపై మెకాన్ ముసాయిదా నివేదిక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్న హామీ మేరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఉక్కు కర్మాగారాల ఏర్పాటుపై ముందడుగు పడింది. ఏపీలో కడప జిల్లాలో, తెలంగాణలో ఖమ్మం జిల్లాలో ఉక్కు పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి సాధ్యాసాధ్యాలపై ప్రభుత్వరంగ కన్సల్టెన్సీ సంస్థ అయిన మెకాన్.. ముసాయిదా నివేదికను సిద్ధం చేసింది. ఈ విషయాన్ని కేంద్ర ఉక్కుశాఖ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. గతంలో ఈ రెండు జిల్లాల్లో ఉక్కు ఫ్యాక్టరీల ఏర్పాటు అనువైనది కాదని తేలిన నేపథ్యంలో.. వాటిని నెలకొల్పడానికి ఉత్తమమైన మార్గాలను మెకాన్ ముసాయిదాలో పేర్కొందని కేంద్రం తెలిపింది. ఈ ముసాయిదాపై రెండు రాష్ట్రాల ప్రభుత్వాలతో చర్చిస్తామని పేర్కొంది. వాస్తవానికి రాష్ట్ర విభజన చట్టం అమల్లోకి వచ్చాక రెండు రాష్ట్రాల్లో ఉక్కు కర్మాగారాల ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయడానికి 2014లోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్), ఎండీఎంసీ సంస్థ ప్రతినిధులతో కేంద్ర ఉక్కుశాఖ ఓ కమిటీని నియమించింది. ఆ కమిటీ తమ అధ్యయనంలో కడప, ఖమ్మం జిల్లాల్లో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు ఆర్థికంగా లాభదాయకం కాదని తేల్చింది. ఖమ్మం జిల్లాలో లభ్యమయ్యే ముడిసరుకు నాణ్యమైనది కాదని, కడపలోనూ అనేక సమస్యలున్నాయని తన నివేదికలో పేర్కొంది. అయితే తమ రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పాల్సిందేనని ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు రెండూ పట్టుబట్టాయి. ఫ్యాక్టరీల ఏర్పాటును సాధ్యం చేయడానికి కొన్ని ప్రత్యామ్నాయాలను కూడా ప్రతిపాదించాయి. మరోసారి అధ్యయనం చేయించాలని ఒత్తిడి తీసుకొచ్చాయి.

రెండు రాష్ట్రాల ఒత్తిడితోనే..

రెండు రాష్ట్రాల ఒత్తిడితో కేంద్ర ప్రభుత్వం.. చివరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, సెయిల్ ప్రతినిధులతో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. తొలిసారి ఆ కమిటీ కేంద్ర ఉక్కు శాఖ మంత్రి చౌదరి బీరేంద్రసింగ్ నేతృత్వంలో 2017 నవంబరులో ఢిల్లీలో సమావేశమయింది. ఏపీ తరఫున కేంద్ర మంత్రి సుజనా చౌదరి, రాష్ట్ర మంత్రి సుజయకృష్ణ రంగారావు ఈ సమావేశంలో.. తిరిగి మెకాన్ సంస్థతో అధ్యయనం చేయించాలని నిర్ణయించారు. దానికి కొనసాగింపుగా అదే ఏడాది డిసెంబరులోనూ మరోసారి సమావేశం జరిగింది. మధ్యలో ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు జోక్యం చేసుకొని కేంద్ర మంత్రి బీరేంద్ర సింగ్, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. దీంతో ఫ్యాక్టరీల ఏర్పాటును సాధ్యం చేయడానికి నివేదికను రూపొందించడం కోసం మెకాన్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వాలు నివేదికను అందించాలన్న నిర్ణయం జరిగింది.

రాష్ట్రాల ప్రతిపాదనలు ఇవీ..

కడపలో ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడానికి కావాల్సిన భూమిని ఇవ్వడంతోపాటు రోడ్డు, విద్యుత్తు, నీటి సౌకర్యం ఏర్పాటు చేస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గతంలోనే ప్రతిపాదించింది. ఫ్యాక్టరీ ఏర్పాటుకు అక్కడ లభ్యమయ్యే ఐరన్ ఓర్ సరిపోదని తొలి కమిటి తేల్చిన నేపథ్యంలో అనంతపురం, ప్రకాశం జిల్లాల్లో సహజసిద్ధంగా ఉన్న ఐరన్ ఓర్ గనుల నుంచి ముడిసరుకును కడపకు తీసుకొచ్చే ఏర్పాటు చేయాలని సూచించింది. అక్కడ 150 మిలియన్ టన్నుల ముడిసరుకు అందుబాటులో ఉందని కేంద్రానికి సమాచారమిచ్చింది. అంతేకాకుండా, ప్రైవేటు సంస్థల సహకారంతో ఏర్పాటు చేయడానికి పరిశీలించాలని విజ్ఞప్తి చేసింది.

అభివృద్ధి పేరుతో మోసం

- బాబుపై జగన్ ధ్వజం.. ప్రకాశం జిల్లాలోకి పాదయాత్ర




లింగసముద్రంలో దివ్యాంగులతో మాట్లాడుతున్న జగన్

కందుకూరు, ఫిబ్రవరి 16:రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని, కేంద్రం నుంచి భారీగా నిధులు తెస్తానని రాష్ట్ర ప్రజలను నమ్మించిన సీఎం చంద్రబాబు అవేవీ చేయకుండా మోసం చేశారని, ఆయన మోసాన్ని ప్రజలందరికీ తెలిసేలా చెప్పాలని వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. జగన్ నిర్వహిస్తున్న ప్రజా సంకల్ప పాదయాత్ర శుక్రవారం ఉదయం నెల్లూరు జిల్లా నుంచి ప్రకాశం జిల్లా కందుకూరు నియోజకవర్గంలోకి ప్రవేశించింది. నెల్లూరు, ప్రకాశం జిల్లాల సరిహద్దులోని రాళ్లపాడు రిజర్వాయరు వద్ద ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గం వైసీపీ అధ్యక్షుడు బాలినేని శ్రీనివాసరెడ్డి, కందుకూరు నియోజకవర్గ ఇంచార్జ్ తూమాటి మాధవరావు, నెల్లూరు, ఒంగోలు ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి తదితరులు స్వాగతం పలికారు. రాళ్లపాడు రిజర్వాయరు, పెంట్రాల, జంపాలవారిపాలెం, వాకమళ్లవారిపాలెం, లింగసముద్రం, రామకృష్ణాపురం, వెంగళాపురం మీదుగా పాదయాత్ర సాగింది.

అసమగ్రంగా 'కాపు' బిల్లు : ముద్రగడ

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 16:కాపులను బీసీల్లో చేరుస్తూ తీర్మానించిన బిల్లుకు తగిన సమాచారం జోడించకుండా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపించడం వల్లే డీఓపీటీ తిరస్కరించిందని కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం ఆరోపించారు. తూర్పుగోదావరి జిల్లా ఉప్పలగుప్తంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంజునాథ్ కమిషన్ నివేదికలో సమగ్ర సమాచారాన్ని, ఇతర వివరాలను బిల్లుతోపాటు పంపించి ఉంటే డీఓపీటీ బిల్లును వెనక్కి పంపించేది కాదన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. కాపులను బీసీ జాబితాలో చేరుస్తూ ఆమోదించిన బిల్లుపై గవర్నర్ సంతకం పెట్టిన వెంటనే రాష్ట్ర సర్వీసుల్లో రిజర్వేషన్లు అమలు చేయవచ్చని, ఈ విషయంపై న్యాయ నిపుణులను కూడా సంప్రదించామని పేర్కొన్నారు.

'ఎప్సిలాన్‌పైతా' ఏఈడీగా ఈదర వెంకట్




అమరావతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని ఒహియో కేంద్రంగా నడుస్తోన్న 'ఎప్సిలాన్‌పైతా' సంస్థకు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఏఈడీ)గా డాక్టర్ ఈదర వెంకట్ నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ ఈడీ డాక్టర్ కెవిన్ ఆర్ హోవెల్ ఆదేశాలు జారీచేశారు. సాంకేతిక, మేనేజ్‌మెంట్ రంగాల్లో చేసిన కృషికి గుర్తింపుగా వెంకట్‌ను ఈ ఉన్నత పదవికి ఎంపిక చేసినట్లు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల బృందం పేర్కొంది. ప్రస్తుతం రాష్ట్ర ఉన్నత విద్యామండలి సలహాదారుగా వ్యవహరిస్తున్న వెంకట్... ఆ సంస్థలో ఏఈడీగా నియమితులైన తొలి భారతీయుడు కావడం గమనార్హం. అమెరికాలో 1929లో ఎప్సిలాన్‌పైతా ఆవిర్భవించింది. టెక్నాలజీకి విశేష ప్రాధాన్యం ఇస్తూ ఆ రంగాన్ని విశ్వవ్యాప్తం చేసి అన్ని దేశాలు సాంకేతికతను ఇచ్చిపుచ్చుకునేలా, విద్యార్థులకు ఆ ఫలితాలు దక్కేలా కృషి చేస్తోంది. సాంకేతిక, మేనేజ్‌మెంట్ రంగాల్లో విద్యార్థులకు చేయూత నిచ్చేందుకు, మారుతున్న సమాజ అవసరాలకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఈదర వెంకట్ స్పష్టం చేశారు.

హైదరాబాద్ ఆస్పత్రులు ఖాయిలా

30-40 % తగ్గిన 'వ్యాపారం'

నవ్యాంధ్ర నుంచే 800 కోట్లు లాస్



ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఆరు ఆస్పత్రులు.. అక్కడే బ్రాంచిలు తెరుస్తున్న కార్పొరేట్లు

ఏపీకే పరిమితమైన ఎన్టీఆర్ వైద్యసేవ.. తెలంగాణలో సర్కారు వైద్యం బలోపేతం

ఫలితం.. పలు ఆస్పత్రుల విస్తరణ నిలిపివేత.. ఖర్చుల్లో కోత.. సిబ్బంది సంఖ్య తగ్గింపు

(హైదరాబాద్/అమరావతి - ఆంధ్రజ్యోతి)

కిటకిటలాడే ఓపీ... ఖాళీ ఉండని ఆపరేషన్ థియేటర్... ఐసీయూ 'హౌస్ ఫుల్'... ఇన్‌పేషెంట్‌గా చేరేందుకు బెడ్ కోసం సిఫారసులు! ఇదంతా గతం.. రోగులతో కిక్కిరిసిన అవే ఆస్పత్రులు వెలవెలబోతున్నాయి. ఓపీలూ, ఐపీలూ తగ్గి నీరసిస్తున్నాయి. మనుగడకోసం, ఆదాయం కోసం ఇతర మార్గాలను అన్వేషిస్తున్నాయి. విస్తరణను నిలిపివేశాయి. మార్కెటింగ్ సిబ్బంది సమాచారం ప్రకారం.. హైదరాబాద్‌లోని బడా ఆస్పత్రుల్లో 30 నుంచి 40 శాతం ఇన్‌పేషెంట్ల సంఖ్య తగ్గిపోయింది. ఇందుకు అనేక కారణాలున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఆరు ఆస్పత్రులు రావడం.. దాంతో అక్కడి నుంచి రోగుల రాకపోవడం! తెలంగాణలో ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేస్తుండడం! కేసీఆర్ కిట్‌ను అమ లు చేస్తుండడం! సర్కారు దవాఖానల్లో ఐపీ, ఓపీలు రెట్టింపు పెరగడంతో ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో 30 శాతం వరకు ఆక్యుపెన్సీ తగ్గిపోయిందని అంచనా.

ఏపీ ఎఫెక్ట్...

రాష్ట్ర విభజన జరిగినా తొలి రోజుల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి రోగులంతా హైదరాబాద్‌కే వచ్చేవారు. హైదరాబాద్ ఆరోగ్య రాజధాని కావడం ఒక కారణమైతే, ఏపీలో పేరున్న ఆస్పత్రులు లేకపోవడం మరో కారణం. పెద్ద పెద్ద శస్త్ర చికిత్సలకు హైదరాబాదే పెద్ద దిక్కు. కానీ, రాష్ట్ర విభజన తర్వాత ఏపీలో కొత్తగా ఆరు ఆస్పత్రులు ఏర్పాటయ్యాయి. ఇప్పటికే 50 శాతం ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రులు అక్కడ తమ శాఖలు తెరిచాయి. మిగిలినవీ ఏపీవైపు చూస్తున్నాయి. గత ఏడాది నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి ఆస్పత్రిలో ఓపీ 30 శాతం పెరిగింది. ఇన్‌పేషెంట్లు ఏకంగా 80 శాతం పెరిగారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. దీనికి అనుగుణంగా... గతంలో ఏపీలో 400 ఉన్న ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఖ్య 600కు పెరిగింది. మరోవైపు... ఎన్టీఆర్ వైద్యసేవ పరిధిలోకి రాని రోగులనూ గతంలో ఏపీ నుంచి హైదరాబాద్‌లోని ఆస్పత్రులకు రిఫర్ చేసేవారు. తమ వద్దకు వచ్చిన వాటిలో 5 నుంచి 10 శాతం కేసులను హైదరాబాద్‌కు పంపేవారు. ఇప్పుడు అది కూడా దాదాపుగా ఆగిపోయింది. అలాగే, ఏపీకి చెందిన 13 జిల్లాల నుంచి హైదరాబాద్‌కు రోగుల రాక తగ్గింది. భాగ్యనగరంలోని కార్పొరేట్ ఆస్పత్రులకు ఎన్టీఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ) మహారాజ పోషకురాలిగా ఉండేది. కిడ్నీ, గుండె, కాలేయం, ఇంకా రకరకాల వ్యాధులకు చికిత్సల కోసం రోగులంతా 'చలో హైదరాబాద్' అనేవారు. అటు.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రభు త్వ ఉద్యోగులు కూడా హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రుల్లోనే చికిత్స చేయించుకునేవారు. గత ఏడాది నుంచి సీన్ మారింది. కేన్స ర్, చిన్నపిల్లలకు గుండె శస్త్ర చికిత్సలు సంబంధించిన వ్యాధులు మినహా.. మిగిలిన అన్ని వ్యాధులకు ఏపీ పరిధిలోని ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుంటేనే ఎన్టీఆర్ వైద్య సేవ వర్తించేలా నిబంధనలు విధించారు. ఉద్యోగులకూ ఇదే వర్తిస్తుందని తెలిపారు. దీంతో... హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రులకు 'ఎన్టీఆర్ వైద్య సేవ' అనే ప్రధాన ఆదాయ మార్గం మూసుకుపోయింది. దీని విలువ దాదాపు 800 కోట్లు! ఏపీ సర్కారు సుమారు వెయ్యి కోట్ల రూపాయలు ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు కేటాయిస్తోంది. ఈ ఏడాది ఉద్యోగుల హెల్త్ స్కీమ్, జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌తో కలిపి సుమారు రూ.1400 కోట్లను కేటాయించింది. గతంలో ఇందులో 60 శాతం నిధులు హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రులకే వెళ్లేవి. మరో ఇరవై శాతం చెన్నై, బెంగళూరులోని ఆస్పత్రులకు చెల్లించేవారు. నిబంధనలు మార్చిన తర్వాత... వైద్య సేవ కేటాయింపుల్లో 80 శాతం అచ్చంగా ఏపీలోని ఆస్పత్రులకే కేటాయిస్తున్నారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరుకు కలిపి 20 శాతం నిధులు మాత్రమే చెల్లిస్తున్నారు. గతంలో హైదరాబాద్‌లోని 42 ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవ చికిత్సలు అందేవి. ఇప్పుడు... ఆ సంఖ్య పదికి తగ్గింది. అందులోనూ... కేన్సర్, చిన్నపిల్లల గుండె ఆపరేషన్లకే ఈ పథకం వర్తిస్తుంది. ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు నిర్ణయం హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రులకు శరాఘాతంగా మారగా... ఏపీలో వైద్యరంగం విస్తరించడానికి దోహదపడింది.

లోకల్ ఎఫెక్ట్..

సొంత జిల్లాలో, స్థానికంగా నమ్మకమైన చికిత్స లభిస్తే... హైదరాబాద్‌కు వెళ్లడం ఎందుకు? ఇది జనం ప్రశ్న! రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆధునిక వైద్యం... నగరాల నుంచి ద్వితీయ శ్రేణి నగరాలకూ విస్తరిస్తోంది. తెలంగాణకు సంబంధించి కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో బడా ఆస్పత్రులు వెలిశాయి. హైదరాబాద్‌లోని కార్పొరేట్‌కు దీటుగా పరికరాలు, వసతులు సమకూర్చుకున్నాయి. పైగా... ఇవన్నీ ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చేవే. దీంతో... ఆ జిల్లాలతోపాటు, పక్కనున్న జిల్లాల రోగులూ స్థానికంగానే వైద్యం చేయించుకుంటున్నారు. హైదరాబాద్‌లోని ఆస్పత్రులపై దీని ప్రభావం కూడా పడుతోంది.

అప్రతిష్ఠ మూటగట్టుకున్నాయా?

నాణ్యమైన వైద్య సేవలు అందించే నగరంగా హైదరాబాద్‌కు పేరుంది. రోగుల జేబులు గుల్ల చేస్తారన్న అపవాదు కూడా ఉంది. కొద్దినెలలుగా వివిధ కార్పొరేట్ ఆస్పత్రుల్లో జరిగిన వరుస ఘటనలు వివాదాస్పదమయ్యాయి. కార్పొరేట్ వైద్యంతో ఆస్తులు అమ్ముకోవాల్సిందనే భయాలూ పెరిగాయి. పైగా హైదరాబాద్‌లో వైద్యంతోపాటు రోగికి సహాయకులుగా వచ్చేవారు ఉండాలన్నా ఖర్చుతో కూడుకున్న వ్యవహారమే. వీటన్నింటి నేపథ్యంలో... భాగ్యనగరం దాకా రాకుండా, స్థానికంగానే చికిత్సలకు మొగ్గు చూపుతున్నారు. రోగుల రాక తగ్గడంతో కార్పొరేట్ ఆస్పత్రులు కొత్త మార్గం పట్టాయి. తమ దృష్టిని జిల్లాలవైపు సారించాయి. అన్నిజిల్లాల్లో ఉన్న ఆస్పత్రులతో రిఫరల్ బిజినెస్‌ను పెట్టుకుంటున్నాయి. ప్రస్తుతం కొన్ని కార్పొరేట్ ఆస్పత్రులకు 80 శాతం బిజినెస్ జిల్లాల నుంచే వస్తోంది. దీనికోసం కార్పొరేట్ ఆస్పత్రుల మధ్య విపరీతమైన పోటీ నెలకొంది. మరి కొన్ని ఆస్పత్రుల యాజమాన్యాలు ఖర్చు తగ్గించుకునే పనిలో పడ్డాయి. ఇటీవలే ఓ ప్రముఖ ఆస్పత్రి దాదాపు 300 మంది ఉద్యోగులను తొలగించింది. గతంలోలాగా ఊపిరి సలపనంత పని లేకపోవడంతో... కొందరు వైద్యులు అప్పుడప్పుడు 'వెకేషన్' మీద విహారాలకు వెళ్తున్నారు. కొంతమంది వైద్యులు సొంత క్లినిక్స్ ఏర్పాటు చేసుకుంటున్నారు.

ఇది సీజన్ కాదట...

'నవంబరు నుంచి జనవరి వరకు పండగల సీజన్, చలికాలంతోపాటు, ఫ్లూ ప్రభావం ఎక్కువ. ఎక్కువగా సర్జరీలు చేయరు. ఈ కాలాన్ని 'సీజనల్ బిజినెస్ డౌన్'గా పిలుస్తాం. ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు మా ఆస్పత్రిలో నెలకు రూ.13 నుంచి 15 కోట్ల బిజినెస్ ఉంటుంది. శీతాకాలంలో నెలకు కేవలం రూ.7-9 కోట్లు మాత్రమే అవుతుంది. మళ్లీ మార్చి నుంచి బిజినెస్ పికప్ అవుతుంది" అని వివరాలు బయటపెట్టేందుకు ఇష్టపడని ఓ ఆస్పత్రి మార్కెటింగ్ హెడ్ తెలిపారు.

చిన్నారుల ఆరోగ్యంతో చెలగాటం

▸▸ అంగన్‌వాడీ కేంద్రాల్లో కాలంచెల్లిన వంట నూనె



కొండల అగ్రహారం అంగన్‌వాడీకి అందిన కాలంచెల్లిన నూనె ప్యాకెట్లు

విశాఖపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు కాలంచెల్లిన వంటనూనె ప్యాకెట్లు పంపిణీ అయ్యాయి. సాధారణంగా వీటిని ప్యాకింగ్ చేసిన తరువాత ఆరు నెలల లోపు మాత్రమే వినియోగించాల్సి ఉంది. అయితే పౌరసరఫరాల శాఖ అధికారులు అధికారులు మాత్రం గతేడాది జూలైలో తయారైన ప్యాకెట్లను జిల్లాలోని 4,952 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని 2,26,605 మందికి పౌష్టికాహారం తయారీ నిమిత్తం సరఫరా చేశారు. చిన్నారులు, గర్భిణులకు ఇదే నూనెతో ఆహారం వండి పెడుతున్నా స్త్రీ,శిశు సంక్షేమశాఖ పీవోలు, సూపర్‌వైజర్ల దృష్టికి రాలేదు. ఈ వ్యవహారంపై ఆ శాఖ పీడీ చిన్మయిదేవి వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా ఆమె స్పందించారు. కాలం చెల్లిన వంటనూనె పంపిణీ జరిగి ఉంటే వినియోగించొద్దని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని సీడీపీవోలకు ఆదేశాలు జారీ చేస్తామని ఆమె పేర్కొన్నారు.

▸▸ ఎరియర్స్‌పై జీవో జారీ... జూ.వైద్యుల హర్షం

అమరావతి, ఫిబ్రవరి 16: తమకు బకాయిపడిన ఎరియర్స్‌ను ఇచ్చేందుకు ప్రభుత్వం జీవో నం.9ని జారీ చేయడంపై జూనియర్ వైద్యుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. దీనిపై శుక్రవారం సంఘం నేతలు మంత్రి కామినేని శ్రీనివాస్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. 2018 ఎరియర్స్ కోసం నియమించిన కమిటీ నివేదికను వీలైనంత త్వరగా తెప్పించాలని కోరారు. మిగతా రాష్ట్రాల్లో ఇస్తున్న విధంగానే తమకూ ఉపకార వేతనాలు అమలు చేయాలని, ప్రతినెలా క్రమం తప్పకుండా ఇవ్వాలని విన్నవించారు. మంత్రిని కలిసిన వారిలో జూనియర్ వైద్యుల సంఘం ఉపాధ్యక్షుడు బి.రవి, సెక్రటరీ కె.స్వామి, జూయింట్ సెక్రటరీ వికాస్ ఉన్నారు.

▸▸ 2018 తెలుగు భాషా వికాస సంవత్సరం

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాదిని తెలుగు భాషా వికాస సంవత్సరంగా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పర్యాటక, భాషా, సాంస్కృతిక శాఖ కార్యదర్శి ముఖేశ్‌కుమార్ మీనా శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. జనవరిలో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన పుస్తక మహోత్సవ ప్రారంభకార్యక్రమంలో 2018ని తెలుగుభాషా వికాస సంవత్సరంగా ప్రకటిస్తామని చెప్పారు. తెలుగు పరిరక్షణకు, అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను రూపొందించి అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్న సీఎం ఆదేశాల మేరకు ఈ ప్రకటన చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఏడాది మొత్తం తెలుగు భాషాభివృద్ధికి, పరిరక్షణకు అవసరమైన కార్యక్రమాలు రూపొందించి అమలు చేయాల్సిన బాధ్యతను సృజనాత్మకత, సాంస్కృతిక శాఖ సీఈవోకు అప్పగించారు.



సద్ధర్మ ఉపోస్త క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అఖిల ప్రియ తదితరులు

బౌద్ధ విహారానికి కృషి: మంత్రి అఖిల ప్రియ

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): అమరావతిలో బౌద్ధ విహారం ఏర్పాటుకు పర్యాటక శాఖ కృషి చేస్తుందని మంత్రి అఖిల ప్రియ హామీ ఇచ్చారు. బౌద్ధ గురువు ధమ్మధజ భంతేజీ, విజయవాడ బుద్ధ విహార ప్రతినిధి గోళ్ల నారాయణరావు మంత్రి అఖిల ప్రియను శుక్రవారం వెలగపూడి సచివాలయంలో కలిసిన సందర్భంగా ఆమె పైవిధంగా స్పందించారు. సద్ధర్మ ఉపోస్త క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు.

తెలంగాణ టూరిజం కాంక్లేవ్-18కు ఆహ్వానం

హైదరాబాద్‌లో జూన్ 28 నుంచి 30 వరకు నిర్వహించే టూరిజం కాంక్లేవ్-2018కు ముఖ్య అతిథిగా హాజరవ్వాలని ఏపీ పర్యాటక శాఖ మంత్రి అఖిల పిృయకు ఆహ్వానం అందింది. తెలంగాణ ఫ్యాప్సీ డైరెక్టర్ పి.వైదేహి, టూరిజం కాంక్లేవ్-2018 చైర్మన్ వాల్మీకి హరికృష్ణ మంత్రిని ఆహ్వానించారు.

ఔట్‌సోర్సింగ్ వేతనాలకు లెక్కేది?

- ▸▸ ఇష్టారాజ్యంగా చెల్లింపులు
- ▸▸ పెరిగిపోతున్న చెల్లింపుల పద్దు
- ▸▸ గత ఏడాదికి.. ఇప్పటికీ లక్షల్లో తేడా
- ▸▸ లేని పోస్టులకూ వేతనాల బిల్లులు
- ▸▸ ఆర్థిక శాఖ అధికారుల విస్మయం
- ▸▸ మళ్లీ.. ఖజానా నియంత్రణకు అవకాశం

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల చెల్లింపులకు లెక్కా జమా ఉండడం లేదు. ఫలితంగా ఏటా ఈ ఖర్చు పెరిగిపోతోంది. నిజానికి ఔట్‌సోర్సింగ్‌లో ఎన్ని పోస్టులున్నాయి? ఎంతమంది ఉద్యోగులున్నారు? వంటి కనీస లెక్కలు కూడా అందుబాటులో లేకపోవడంతోపాటు, వేతనాల చెల్లింపు రెండు మూడింతలు పెరగడం విస్మయానికి గురి చేస్తోంది. ఇటీవల జరిగిన శాఖలవారీ బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశం చర్చకు వచ్చింది. ఔట్‌సోర్సింగ్ వేతనాల చెల్లింపు పద్దులో అసాధారణ పెరుగుదల తగదని, ఉంటే వాటికి తగిన కారణాలు చూపాలని ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు వివిధ శాఖలకు స్పష్టం చేశారు. ఔట్‌సోర్సింగ్ వేతనాల అవకతవకలను నివారించాలంటే తిరిగి ఆ వేతనాలను ఖజానా నియంత్రణ పరిధిలోకి తీసుకురావాలని ఆర్థిక శాఖ భావిస్తోంది. ఈమేరకు రాబోయే బడ్జెట్‌లో మార్పులు జరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్ర విభజనకు ముందు ఈ వేతనాల చెల్లింపుపై ఖజానా నియంత్రణ ఉండేది. అయితే, విభజన తర్వాత సచివాలయం తరలింపు సమయంలో వెసులుబాటు కోసం ఔట్‌సోర్సింగ్ వేతనాలపై ఈ నియంత్రణను ఎత్తేశారు. ఈ వెసులుబాటే పెద్ద సమస్యగా మారింది. కాంట్రాక్టు ఉద్యోగుల మాదిరిగా ఈ ఏడాది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలను పెంచలేదు. కానీ, గత ఏడాది ఔట్‌సోర్సింగ్ వేతనాల ఖర్చుకూ, ఈ ఏడాది ఆయా శాఖలు పంపిన ఔట్‌సోర్సింగ్ వేతనాల ఖర్చు ప్రతిపాదనలకు భారీ వ్యత్యాసం ఉందని ఆర్థిక శాఖ అధికారులు గుర్తించారు. ఒక శాఖలో గత ఏడాది ఔట్‌సోర్సింగ్ వేతనాల ఖర్చు రూ.29 లక్షలుగా చూపించారు. ఈ ఏడాది దాన్ని రూ.73 లక్షలుగా పేర్కొన్నారు. ఈ రెండు గణాంకాలకు భారీ వ్యత్యాసం ఉండడంతో ఆర్థిక శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. మరో శాఖలో గత ఏడాది రూ.66 లక్షలుగా ఉన్న ఖర్చు ఈ ఏడాది రూ.70 లక్షలు చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అధికంగా ఉన్న ప్రతి శాఖ నుంచి ఇలాంటి గణాంకాలే వచ్చాయని ఆర్థిక శాఖ అధికారులు తెలిపారు. దీంతో వచ్చే బడ్జెట్‌లో ఔట్‌సోర్సింగ్ వేతనాల ఖర్చు పద్దును ఎలాంటి అవకతవకలు లేకుండా జాగ్రత్తగా నిర్వహించాలని నిర్ణయించారు. నియామకాలు భారీగా జరిగితేనే వేతనాల ఖర్చులు పెరుగుతాయి. కానీ, ఈ మధ్యకాలంలో రిక్రూట్‌మెంట్లు జరిగిన దాఖలాలు లేవని అధికారులు పేర్కొన్నారు. ఔట్‌సోర్సింగ్ వేతనాల చెల్లింపులపై ఖజానా నియంత్రణ లేకపోవడం పెద్ద సమస్యగా మారిందని వివరించారు. ఔట్‌సోర్సింగ్ వేతనాలను ట్రెజరీలు ఒక ఏజెన్సీకి చెల్లిస్తాయి. కాబట్టి, వాటిపై కచ్చితంగా నియంత్రణ ఉండాలని అభిప్రాయపడ్డారు. లేని ఉద్యోగాలను కూడా ఉన్నట్టుగా చూపించి ఏజెన్సీలు ఎక్కువ మొత్తాన్ని ట్రెజరీ నుంచి డ్రా చేసే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. అలాగే, పోస్టుల్లో ఉద్యోగులు ఉన్నా లేకపోయినా.. ఆ పోస్టుల సంఖ్య చూపి వివిధ శాఖలు వేతన బిల్లులు పంపుతున్నాయని భావిస్తున్నారు. నియంత్రణ ఉంటే మోసాలకు చెక్ పెట్టే అవకాశం ఉంటుందని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో తిరిగి ఔట్‌సోర్సింగ్ వేతనాలను ఖజానా నియంత్రణ పరిధిలోకి తీసుకురావాలని ఆర్థిక శాఖ అధికారులు భావిస్తున్నారు. దీనిపై బడ్జెట్‌లో ఓ ప్రకటన చేసే అవకాశం ఉంది.

రిటైరయ్యాక క్రమశిక్షణ 'కొరడా'!

▸▸ సర్వీస్ ముగిసిన ఆర్అండ్‌బీ ఈఎన్‌సీపై 5 నెలల తర్వాత కేసు తిరగదోడిన శాఖ

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మూలనపడేసిన ఓ పాతకేసును తిరగతోడి దానికి బాధ్యుడంటూ ఓ రిటైర్డ్ ఇంజనీరింగ్ చీఫ్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని రోడ్లు, భవనాల శాఖ నిర్ణయించింది. రిటైర్ అయిన ఐదు నెలల తర్వాత.... ఆయనపై ఓ కేసుందని, చర్యలు తీసుకోవాలంటూ తాఖీదులు ఇచ్చింది. ఉన్నతాధికారుల వర్గపోరులో భాగంగానే ఓ అధికారి ఈ కేసును తెరమీదకు తీసుకొచ్చారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే... ఆర్అండ్‌బీ ఇన్‌చార్జి ఇంజనీరింగ్ చీఫ్‌గా పనిచేసిన జి.జగన్నాథరావు గత ఆగస్టు 31న రిటైరయ్యారు. ఐదు నెలల తర్వాత ఇప్పుడు ఓ పాతకేసును వెలుగులోకి తీసుకొచ్చారు. "దొనకొండ-కనిగిరి-దోర్నాల రోడ్డు విస్తరణ(18కి.మీ) పనుల్లో జగన్నాథరావు అవకతవకలకు పాల్పడ్డారని ప్రభుత్వం దృష్టికి వచ్చింది. కాబట్టి అతనిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి" అని ఆర్అండ్‌బీ ముఖ్యకార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ కేసులో విచారణ జరిగితే... ఈఎన్‌సీతోపాటు క్షేత్రస్థాయి అధికారులపై కూడా చర్యలు ఉంటాయని అధికారవర్గాలు చెబుతున్నాయి. ఈఎన్‌సీ హోదాలో ఓ అధికారి నేరుగా ఓ రోడ్డు విస్తరణ పనిలో వేలుపెట్టి తప్పులు చేస్తే... అందులో క్షేత్రస్థాయి వారు కూడా భాగస్వాములవుతారు. ఈ కేసులో విచారణ ప్రస్తావన లేకుండా, నేరుగా చర్యలకు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఉన్నతాధికారవర్గాల్లో ఉన్న వర్గ విభేదాలతోనే ఈ వ్యవహారాన్ని తెరపైకి తీసుకొచ్చారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జలసిరి బోర్ల కేటాయింపుల్లో మార్పులు

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జలసిరికి సంబంధించి ఆయా జిల్లాలకు కేటాయించిన లక్ష్యాల్లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మార్పులు చేసింది. 2017-18 ఏడాదికి సంబంధించి అనంతపురం జిల్లా మినహా 12 జిల్లాల్లో 35వేల బోర్లు తవ్వి సోలార్‌సెట్లు ఏర్పాటుచేయాలని ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. చిత్తూరు, తూర్పుగోదావరి, గుంటూరు, కృష్ణా, కర్నూలు, ప్రకాశం, నెల్లూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో గతంలో ఇచ్చిన కేటాయింపులను తగ్గించారు. కడప, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలకు అదనంగా బోరుబావులు కేటాయిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్యకార్యదర్శి జవహర్‌రెడ్డి ఉత్తర్వులిచ్చారు.

ఆశీస్సులుంటేనే 'ఫుల్ చార్జ్'!

▸▸ ఆరోగ్య శాఖలో ఎఫ్ఏసీల నియామకంలో ఇష్టారాజ్యం

▸▸ మెచ్చినవారికే కీలక పోస్టులు



అమరావతి, ఫిబ్రవరి 16: ఆ శాఖలో కీలక పదవుల్లో పోస్టింగులు కావాలంటే మంచి పనితనం ఉంటేనే సరిపోదు. అవసరమైతే నిబంధనలకు విరుద్ధంగా ఫైళ్లపై సంతకం చేయాలి.. అధికారులు ఏది చెప్పినా తలూపి, చేసుకుపోవాలి. అలాంటివారికే కీలక పోస్టులు, పదోన్నతులు! రాష్ట్ర ప్రజలకు అతి తక్కువ సమయంలో ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందించాలని నిరంతరం కృషి చేస్తున్న ఆరోగ్యశాఖలో కొందరు ఉన్నతాధికారుల ఇష్టారాజ్యం తీరు ఇది. వారికి నచ్చి, వారు మెచ్చినవారికే తొలి ప్రాధాన్యం ఉంటుంది. అవసరమైతే, సీనియారిటీ జాబితాలో అట్టడుగున ఉన్నవారిని పైకి తీసుకువస్తారు. చివరిదాకా పేర్లు బయటకు రానివ్వకుండా రహస్యంగా ఉంచుతారు. ఆరోగ్యశాఖలో ఏ కీలక పోస్టు చూసినా ఇదే తీరు! ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 13జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వోలలో సగానికిపైగా ఎఫ్ఏసీలో(ఫుల్ అడిషనల్ చార్జ్) ఉన్నవారే. నిబంధనల ప్రకారం సీఎస్ స్థాయి అధికారులు డీఎంహెచ్‌వోలుగా విధులు నిర్వహించాలి. కానీ డీసీఎస్‌లను తీసుకువచ్చి జిల్లాల్లో డీఎంహెచ్‌వోలుగా నియమిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 33 సీఎస్ పోస్టుల కొరత ఉంది. ఆ పదవులకు అర్హులైన వారికి పదోన్నతులు కల్పించకుండా డీసీఎస్‌లను తెరపైకి తీసుకువస్తున్నారు. దీనిపై ప్రశ్నించాల్సిన మంత్రి పేషీ కూడా ఉన్నతాధికారుల నిర్ణయాలకు వత్తాసు పలుకుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే, ఆ పదవులు, హోదాలు అనేవి ఉన్నతాధికారుల విశ్వాసం చూరగొన్నంతకాలమే నిలుస్తాయి. సదరు పోస్టులను చేపట్టినవారు.. ఎదురు తిరిగినా, ఎదురు సమాధానం చెప్పినా ఇంటికి పంపిస్తారు. గతంలో కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో కీలక పోస్టులో విధులు నిర్వహించిన అధికారి విషయంలో ఇదే జరిగింది. తమకు ఎదురు తిరిగారనే కారణంగా ఆయనను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. దానికోసం ఆయనపై 15 ఏళ్ల క్రితం నమోదైన కేసును బయటకు తీశారు. దానిపై తమ అనుకూరులతో విచారణ కమిటీ వేసి, అనుకూల నివేదిక తెప్పించుకొని.. వేటువేశారు.

అక్కడా ఇదే తంతు...

ఏపీఎస్ఎంఐడీసీ అంటే ఆరోగ్యశాఖకు ఎంతో కీలకమైన విభాగం. మందుల కొనుగోలు దగ్గర నుంచి భవన నిర్మాణాలు, టెండర్ల భర్తీ మొత్తం ఈ విభాగం చేతుల్లోనే ఉంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఆరోగ్యశాఖ ఖర్చుచేసే ప్రతి పైసా ఈ విభాగం ద్వారానే బయటకు వెళ్తుందన్నమాట. ఇలాంటి విభాగాల్లో కీలక పదవుల్లో నియమితులైతే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇక ఈ విభాగానికి జిల్లాస్థాయి అధికారులుగా నియమితులయితే మొత్తంగా చక్రం తిప్పవచ్చు. దీంతో ఈ విభాగంలో పోస్టుల కోసం ఇతర శాఖల ఇంజనీర్లు పోటీ పడుతుంటారు. ఇప్పటికే ఈ విభాగంలోకి డిప్యుటేషన్‌పై వచ్చి ఏళ్ల తరబడి కొనసాగుతున్నవారు ఉన్నారు. గుంటూరు జిల్లా ఇన్‌చార్జి ఈఈగా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి, ఎనిమిదేళ్ల నుంచి ఒకేచోట విధులు నిర్వహిస్తున్నారు. తొమ్మిదోసారి కూడా అతనినే ఇన్‌చార్జి ఈఈగా కొనసాగించేందుకు ఉన్నతాధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికి మంత్రి పేషీలోని కీలక అధికారులు అండదండలు అందిస్తున్నట్లు సమాచారం.

పర్యాటక కేంద్రంగా భవానీద్వీపం

▸▸ టూరిజం బోర్డు మీటింగ్‌లో సీఎం ఆదేశాలు

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): భవానీ ఐల్యాండ్‌ను అద్భుత పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. శుక్రవారం టూరిజం ఆథారిటీ, సాంస్కృతిక, వారసత్వ బోర్డు అధికారులతో ఆయన సమీక్షించారు. భారత చరిత్ర, సంస్కృతిని అధ్యయనం చేసి స్థానిక అంశాలను ఇతివృత్తాలుగా తీసుకుని ద్వీపాన్ని అభివృద్ధి చేయాలన్నారు. పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించి ఉద్యోగాల కల్పనలో స్థానికులకే ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. మధురవాడ కొండలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. విశాఖ అభివృద్ధికి తగినట్లుగా వచ్చే ఐదేళ్లలో 25,000 హోటల్ గదులు అవసరమని, ప్రస్తుతం 2,500 కూడా లేవని సీఎం అన్నారు. మధురవాడలో ప్రఖ్యాత రాడిసన్ హోటల్, రిసార్ట్ ఏర్పాటు కానుందని అధికారులు తెలిపారు. రూ.200కోట్ల పెట్టుబడితో 250గదులు అందుబాటులోకి రానున్నాయన్నారు. ఇందుకు అవసరమైన ప్రక్రియ పూర్తి చేయాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. తొట్లకొండలో 5స్టార్ హోటల్, రిసార్ట్ నిర్మాణానికి వైశాలి హైడ్రో ప్రాజెక్టుకు అనుమతిస్తూ బోర్డు నిర్ణయం తీసుకుంది. ఇక్కడ రూ.105కోట్ల పెట్టుబడితో 225 గదులు అందుబాటులోకి రానున్నాయని అధికారులు పేర్కొన్నారు. నేవీ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా రూ.20కోట్లతో సబ్‌మెరైన్ మ్యూజియం ఏర్పాటుకు సిద్ధమని నేవీ అధికారులు సీఎంకు తెలిపారు.

ఎస్టోనియాతో ఏపీ దోస్తీ

ఏపీలో నాలుగో వంతు భూభాగం ఉన్న ఎస్టోనియా దేశం, డిజిటల్ వేదికపై సాధించిన విజయం నవ్యాంధ్రకు స్ఫూర్తిగా తీసుకుంటామని చంద్రబాబు చెప్పారు. సీఎంను కలవడానికి వచ్చిన ఎస్టోనియా ప్రభుత్వ ప్రతినిధులు శుక్రవారం జరిగిన బడ్జెట్ సన్నాహక సమావేశంలోనూ పాల్గొన్నారు. సాంకేతిక అంశాల్లో ఏపీకి సహకరించేందుకు ఈ దేశం ముందుకొచ్చిందని చెప్పారు. పాలనా వ్యవహారాలలో వారక్కడ అమలు చేస్తున్న అభ్యాసాలను నవ్యాంధ్రకు అందించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రిలయన్స్ జియో, ఎస్టోనియా, ఏపీ కలిసి త్వరలో ఒక అవగాహన ఒప్పందం చేసుకోబోతున్నట్లు ప్రకటించారు.

శరవేగంగా గోదాముల నిర్మాణం

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గోదాముల నిర్మాణం శరవేగంగా పూర్తి చేస్తున్నామని ఏపీ గిడ్డంగుల సంస్థ చైర్మన్ ఎల్‌వీఎస్ఆర్‌కే ప్రసాద్ తెలిపారు. ఒక్క ఏడాదిలోనే 55,400మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాముల నిర్మాణం పూర్తి చేశామన్నారు. ఏపీ స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ 193వ బోర్డు డైరెక్టర్ల సమావేశం శుక్రవారం విజయవాడలో జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రసాద్ మాట్లాడుతూ 3.5లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

▸▸ 26నుంచి టీసీసీ పరీక్షలు

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్(టీసీసీ) పరీక్షలు 26నుంచి మార్చి 1 వరకు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ వి.ఎస్.భార్గవ తెలిపారు. డ్రాయింగ్, హ్యాండ్లూమ్ వీవింగ్ అండ్ టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్ గ్రేడ్‌లలో ఈ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను www.bse.ap.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

▸▸ చిన్నారి శస్త్రచికిత్సకు సీఎం 10లక్షల సాయం

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి):బోన్‌మారో వ్యాధితో బాధపడుతున్న నాలుగేళ్ల చిన్నారి బాధ చూసిన సీఎం చంద్రబాబు చలించారు. పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి మండలం ఉరదాల్లపాలెం గ్రామానికి చెందిన దాసం పవన్ కార్తీక్ బోన్ వ్యాధితో బాధపడుతున్నాడు. శుక్రవారం బాలుడి తల్లిదండ్రులు వెలగపూడి సచివాలయంలో సీఎంను కలిశారు. ఆయన వెంటనే స్పందించి శస్త్రచికిత్సకు రూ.10లక్షలు మంజూరు చేశారు.

▸▸ కోచ్‌లపై రిజర్వేషన్ చార్ట్‌లకు స్వస్తి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి):కాగితరహిత పరిపాలనలో భాగంగా.. ఇకపై కోచ్‌లకు రిజర్వేషన్ చార్ట్‌లను అంటించబోమని రైల్వే శాఖ పేర్కొంది. పైలట్ ప్రాజెక్టులో భాగంగా పలు స్టేషన్లలో దీన్ని అమలు చేయనుంది. మార్చి 1 నుంచి ఆరు నెలలు ఈ విధానాన్ని పరిశీలించనుంది. తెలుగు రాష్ట్రాల్లోని సికింద్రాబాద్, విజయవాడ సహా 34 స్టేషన్లు ఈ జాబితాలో ఉన్నాయి.

▸▸ 10 గంటల తర్వాతే సిజేరియన్‌కు వెళ్లండి!

హైదరాబాద్, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): సురక్షిత ప్రసవానికి అవసరమైన మార్గదర్శకాలను ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) శుక్రవారం విడుదల చేసింది. సహజ ప్రసవం కోసం తొలి కాన్పుకు కనీసం 12గంటలు, రెండో కాన్పు అయితే కనీసం 10 గంటల ఆగాలని, అప్పటికీ కాన్పు కాకపోతేనే సిజేరియన్‌కు వెళ్లాలని డబ్ల్యూహెచ్‌వో గతంలోనే తన మార్గదర్శకాల్లో వెల్లడించింది. అయితే, పురిటి నొప్పులు మొదలైన తర్వాత ప్రతి గంటకు గర్భంలోనున్న శిశువు ఒక సెంటీమీటర్ బైటకు రావడమనేది తప్పనిసరి అంశంగా భావించనవసరం లేదని కొత్తగా విడుదల చేసిన మార్గదర్శకాల్లో వెల్లడించింది. అలా శిశువు బైటకు రావడం లేదనే కారణంతోనే చాలామంది వైద్యులు ప్రసవ నొప్పులు ప్రారంభం కాగానే సిజేరియన్ చేస్తున్నారు. కనీస సమయం కూడా వేచి చూడటం లేదంది. తాజాగా 26 మార్గదర్శకాలను జారీ చేసింది. నొప్పులు మొదలుకొని కాన్పు జరిగే వరకు మూడు దశలో తీసుకునే జాగ్రత్తలు, శిశుజననం వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాలింత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ మార్గదర్శకాలున్నాయి.

ఆంధ్రజ్యోతి
నవ్య
7
కుటుంబ కదంబం
శనివారం • 17 ఫిబ్రవరి 2018



మానసికఒత్తిడి, వేగవంతమైన జీవనశైలి, లైంగికపరమైన సమస్యల వల్ల యువతలో శృంగార జీవితం పట్ల ఆసక్తి తగ్గుతోంది. ఇందు కోసం 'షెల్ఫ్ మందుల'ను చాలామంది వాడుతుంటారు. అయితే సహజసిద్ధమైన 'లవ్ ఫుడ్' ప్రత్యామ్నాయాలు ఎన్నో మనం తినే ఆహారంలోనే ఉన్నాయంటున్నారు ఆహార నిపుణులు. అవి ప్రేమ ఉత్ప్రేరకాలుగా పనిచేస్తాయిట. వాటిలో నట్స్, దోసగింజలు, బార్లీ, చాకొలేట్, వెల్లుల్లి, తేనె, పుచ్చకాయ, అవకెడో, చిల్లీ, అత్తిపళ్ల వంటివి కేవలం కొన్ని మాత్రమే. అందుకే 'నవ్య' ఈసారి వెరైటీ 'లవ్'లీ ఫుడ్స్‌ను అందిస్తోంది.

లవ్‌లీ ఫుడ్

అవకెడో చాట్

కావలసిన పదార్థాలు: అవకెడోలు- రెండు, టొమాటోలు- మూడు (విత్తులు తీసి సన్నగా తరగాలి), ఉల్లిపాయముక్కలు- రెండు టేబుల్‌స్పూన్లు, వెల్లుల్లి- ఒక టీస్పూను (సన్నగా తరిగి), కొత్తిమీర తరుగు- ఒక టేబుల్‌స్పూను, పచ్చిమిర్చి- ఒక టీస్పూను, ఉప్పు, నిమ్మ రసం- తగినంత.

తయారీ: అవకెడోను సగానికి కోయాలి. అందులోని గింజలు తీసి మధ్యభాగంలో బాగా తొలిచి తీసిన గుజ్జును గిన్నెలో వేసి మాషర్‌తో మెత్తగా చేయాలి. ఉప్పు, నిమ్మరసంతోపాటు మిగతా పదార్థాలను కూడా ఇందులో వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కాసేపు ఫ్రిజ్‌లో ఉంచి తర్వాత తింటే ఎంతో రుచిగా ఉంటుంది.



స్వీట్... స్పైసీ నట్స్

కావలసినవి: మిక్స్ నట్స్- రెండు కప్పులు, చక్కెర- ఒకటిన్నర టేబుల్‌స్పూన్, బ్రౌన్ షుగర్- రెండు టేబుల్‌స్పూన్లు, ఉప్పు- ఒక టీస్పూను, నూరిన మిరియాలపొడి- అర టీస్పూను, నూరిన జీలకర్ర- పావు టేబుల్‌స్పూను, కూరపొడి- ఒక టీస్పూను, లవంగ పొడి- చిటికెడు, దాల్చిన చెక్క పొడి- ఒక టీస్పూను.

తయారీ:
- ఒవెన్‌ని ముందుగా 300 డిగ్రీల దగ్గర వేడిచేయాలి.
- బేకింగ్ పాన్‌లో నట్స్ వేసి పన్నెండు నిమిషాలు బేక్ చేయాలి.
- నట్స్ మాడిపోకుండా చూడాలి.
- ఒవెన్‌లోంచి నట్స్‌ను తీసి చల్లారనివ్వాలి.
- చిన్న గిన్నెలో వైట్, బ్రౌన్ షుగర్, ఉప్పు, మిరియాలు, లవంగాలు, దాల్చినచెక్క పొడి అన్నింటినీ వేసి బాగా కలపాలి.
- సన్నని మంటపై పెద్ద సాస్ పాన్‌ను పెట్టి నట్స్, సగం చక్కెర వేయాలి. ఆ మిశ్రమం పాకంలా అవుతున్న దశలో మిగిలిన మిశ్రమంలో దాన్ని కలపాలి.
- అన్ని నట్స్‌కు చక్కెర పట్టేదాకా పాన్‌ను ఐదు నిమిషాల పాటు అటు ఇటు బాగా కదపాలి.
- ఒకదానితో మరొకటి అతుక్కున్న నట్స్‌ను చెంచాతో విడదీయాలి.
- పొయ్యి మీద నుంచి పాన్ తీసి వాక్స్ పేపర్ లేదా గ్రీస్డ్ బేకింగ్ షీట్ మీద నట్స్‌ను పోసి చల్లారనివ్వాలి.
- నట్స్ ఒకదానితో ఒకటి అంటుకోకుండా గమనించాలి. ఈ నట్స్ స్పైసీగా బాగుంటాయి.



మిక్స్డ్ చాట్

కావలసిన పదార్థాలు:
పల్లీలు- యాభై గ్రాములు, దోస గింజలు - ఒక టేబుల్‌స్పూను, టొమాటో- ఒక టేబుల్ స్పూను (సన్నగా తరిగి), ఉల్లిపాయ- ఒకటి (సన్నగా తరిగి), కారం- అర టీస్పూను, కొత్తిమీర- కొద్దిగా (సన్నగా తరిగి), పచ్చిమిర్చి- పావు టీస్పూను (సన్నగా తరిగి), ఉప్పు, నిమ్మరసం- తగినంత.

తయారీ:
- పల్లీలు, దోసగింజలు, టొమాటో, ఉల్లిపాయముక్కలు, కారం, పచ్చిమిర్చి ముక్కలు, తరిగిన కొత్తిమీరలను బౌల్‌లో వేసి, అందులో ఉప్పు వేసి బాగా కలపాలి. ఆ తర్వాత తగినంత నిమ్మరసం దానిపై పిండాలి. ఈ మిక్స్ చాట్ టేస్టీగా ఉంటుంది.



బార్లీ రోటీ

కావలసినవి: బార్లీపిండి-వంద గ్రాములు, నీరు- వంద ఎంఎల్, చిల్లీ పేస్టు- అర టీస్పూను, కొత్తిమీర- అర కప్పు (సన్నగా తరిగి), ఉప్పు- తగినంత.

తయారీ:
- గిన్నెలో సగానికి నీరు తీసుకుని సన్నని మంటపై వేడి చేయాలి.
- అందులో బార్లీ పిండి, చిల్లీ పేస్టు, కొత్తిమీర వేసి మూడు నిమిషాలు అలానే ఉంచాలి. ఆ మిశ్రమాన్ని కలపొద్దు.
- తర్వాత దించి, చెక్క కర్రతో పిండిని కలియబెట్టాలి. ఇలా చేస్తే పిండి ఉండ కట్టదు.
- బాగా కలిపిన తర్వాత ఐదు నిమిషాలపాటు చల్లారనిచ్చి దాన్ని వెడల్పాటి ప్లేటులోకి మార్చాలి.
- దాన్ని మెత్తటి పిండిలా చేయాలి. ఆ తర్వాత చిన్న ఉండలు చేసి రోటీల్లా ఒత్తాలి.
- పెనం మీద ఒక్కొక్క రోటీని పావు టీస్పూను నెయ్యి వేసి కాల్చాలి. వీటిని వేడివేడిగా తింటే రుచిగా ఉంటాయి.

రోస్టెడ్ గార్లిక్

కావలసిన పదార్థాలు:
వెల్లుల్లి- ఒకటి
ఆలివ్ ఆయిల్- రెండు టేబుల్‌స్పూన్లు
ఉప్పు- తగినంత

తయారీ:
- ఒవెన్‌ని ముందుగా 200 డిగ్రీలు వేడిచేయాలి. వెల్లుల్లి పైన బొప్పిగా ఉండే భాగాన్ని తీసేసి వాటిని చిన్న ఫాయిల్‌లో పెట్టి, దానిపై ఆలివ్ ఆయిల్ బాగా చల్లాలి. ఫాయిల్‌తో గట్టిగా చుట్టి బేకింగ్ ట్రేలో పెట్టాలి. అది మెత్తగా, సువాసనలు వెదజల్లే వరకూ 35 నిమిషాల పాటు ఉంచాలి. ఆతర్వాత ఓవెన్ నుంచి తీసి చల్లారబెట్టాలి. పొట్టు పోయేలా ఒక్కొక్క వెల్లుల్లి పాయను బయటకు మృదువుగా నొక్కుతూ తీయాలి. అలా తీసిన వెల్లుల్లి పాయల మీద ఉప్పు చల్లుకుని తింటే రుచిగా ఉంటాయి.




చాకొలెట్ బనానా స్మూదీ

కావలసినవి: అరటిపండు- ఒకటి, చాక్లెట్ సిరప్- ఒక టేబుల్ స్పూను, పాలు- ఒక కప్పు, ఐస్‌ముక్కలు- ఒక కప్పు.

తయారీ:
- బ్లెండర్‌లో అరటిపండుముక్కలు, చాక్లెట్ సిరప్, పాలు, ఐస్‌ముక్కలు వేసి చిక్కగా అయ్యేవరకూ గిలక్కొట్టాలి (కావాలనుకుంటే పైన కొద్దిగా చాక్లెట్ పౌడర్ కూడా వేసుకోవచ్చు). ఈ స్మూదీ రుచిగా ఎంతో బాగుంటుంది.






ఆహారం - ఆరోగ్యం

నా వయసు నలభై అయిదేళ్ళు. ఒకప్పుడు నా బరువు తొంభై కిలోలు. అక్కడ నుంచి డెభ్భై ఎనిమిది కిలోలకు కష్టపడి తగ్గాను. కానీ, పొట్ట దగ్గర ఉన్న ఫ్యాట్ పోవడం లేదు. దయచేసి దాన్ని తగ్గించే చిట్కా చెప్పండి.

పొట్ట దగ్గర కొవ్వు తగ్గాలంటే...?



బరువు తగ్గడానికి ఏ పద్ధతి పాటించినా, బరువు ఓవరాల్‌గా తగ్గుతుంది. కానీ భారతీయులకు పొట్ట భాగంలో ఎక్కువ కొవ్వు పేరుకుపోతుంది. దీనినే 'సెంట్రల్ ఒబేసిటీ' అంటారు. పొట్ట భాగం మామూలుగానే అధికంగా ఉండటం వల్ల, మొత్తం బాడీ తగ్గినా... ఇంకా పొట్ట భాగం తగ్గనట్టే ఉంటుంది. పొట్ట ఆకారం మనం చేసే పనిని బట్టి మారుతూ ఉంటుంది. ఎక్కువసేపు కూర్చొని ఉండేవారికి పొట్ట భాగం అధికంగా ఉంటుంది. అలాగే ప్రతి రోజూ మద్యం, చిరుతిళ్ళు తీసుకొని, ఆ తరవాత భోజనం చేసేవారికి కూడా ఎక్కువ పొట్ట తయారవుతుంది.

పొట్ట భాగంలో కొవ్వు తగ్గడానికి మూడు సూత్రాలను తప్పక పాటించాలి. అవేమిటంటే...

1. జీర్ణవ్యవస్థను శుభ్రంగా ఉంచాలి. అంటే మలబద్ధకం లేకుండా చూసుకోవాలి. ప్రతి రోజూ నిద్రకుపక్రమించే ముందు ఇసబ్‌గోల్, ఫైబర్ సోంపు, ఉసిరి కలిసిన మిశ్రమాన్ని నీటిలో కలుపుకొని తీసుకుంటే, జీర్ణకోశం శుభ్రంగా ఉంటుంది. పొట్ట తేలిక పడుతుంది.

2. మద్యం తాగడం, చిరుతిళ్ళు తినడం తగ్గించాలి. లేదంటే మానేయాలి. స్వీట్స్ ప్రతిరోజూ తినేవారు ఆ అలవాటు మార్చుకోవాలి. నెలకు ఒక్కసారి మాత్రమే స్వీట్స్ తీసుకోవాలి.

3. రాత్రి భోజనానికి బదులుగా తాజా కొబ్బరి సలాడ్ తినాలి.

తాజా కొబ్బరి సలాడ్ తయారీ విధానం ఏమిటంటే...

ఒక కప్పు కొబ్బరి ముక్కలు, ఒక మిర్చి (సన్నగా తరిగింది), చిటికెడు మిరియాల పొడి, ఒక స్పూను నిమ్మరసం, చిటికెడు జీలకర్ర పొడి, ఒక వెల్లుల్లి (సన్నగా తరిగింది), ఒక టీ స్పూన్ కొబ్బరి నూనె, తగినంత ఉప్పు. వీటన్నిటినీ కలుపుకొని భోజనానికి బదులుగా తీసుకోండి.



డాక్టర్ జానకి
న్యూట్రిషనిస్ట్
drjanakibadugu@gmail.com

కిచెన్ వేర్

ఫ్రిజ్‌లో అందంగా అదనపు స్టోరేజీ కోసం..!

ఫ్రిజ్‌లో పళ్లు, కూరగాయలు, గుడ్లు, ఇతర పదార్థాలు అడ్డదిడ్డంగా పెట్టకుండా, వాటిని ఒక క్రమపద్ధతిలో అమర్చాలంటే 'మల్టీఫంక్షన్ కిచెన్ రిఫ్రిజిరేటర్ స్టోరేజ్ ర్యాక్ షెల్ఫ్ ఆర్గనైజర్ ట్రే'లు బాగా ఉపయోగపడతాయి. ప్లాస్టిక్‌తో తయారయ్యే వీటి కెపాసిటీ లీటర్ కన్నా తక్కువ. ఆహారపదార్థాలు, డ్రింక్స్, పళ్లు, గుడ్లు వంటివి పెట్టుకోవడానికి ఈ స్టోరేజ్ ర్యాక్ ఎంతో అనువుగా ఉంటుంది. స్మార్ట్ స్లైడ్ డిజైన్ కూడా ఇందులో చూడొచ్చు. స్పేస్ సేవింగ్‌తో పాటు తేలిగ్గా ఫుడ్ కంటైనర్‌లను కూడా పెట్టొచ్చు. శుభ్రం చేయడం కూడా చాలా తేలిక. తడి వేగంగా ఆరిపోతుంది. వీటి కింద భాగంలో రంధ్రాలుండి వెంటిలేటింగ్ కూడా బాగా ఉంటుంది. ఈ స్టోరేజ్ ర్యాక్ ఖరీదు- 210 రూపాయలు.



గుడ్ ఫుడ్

'బ్లాక్‌బెర్రీస్'లో బోలెడు పోషకాలున్నాయి. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు దాగున్నాయి. వీటిలో యాంటాక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఆరోగ్యానికి అద్భుతమైన పండుగా చెప్పుకునే బ్లాక్‌బెర్రీస్ తింటే ఎన్నో సమస్యలకు దూరంగా ఉండొచ్చు.

'బ్లాక్‌బెర్రీస్'తో బాగు బాగు...!

- వీటిల్లో యాంటాక్సిడెంట్లు పుష్కలంగా ఉండడంతో క్యాన్సర్‌ను అడ్డుకుంటాయి. పోలిఫెనాల్స్ యాంటాక్సిడెంటు క్యాన్సర్ మీద పోరాడతాయి.
- క్యాన్సర్‌కు కారణమయ్యే కొన్ని కణాల మార్పును ఈ పళ్లు మొదటిదశలోనే అడ్డుకుంటాయి.
- వీటిని తినడం వల్ల మెదడు చురుగ్గా పనిచేస్తుంది. జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది.
- ఈ పళ్లల్లో మాంగనీసు పుష్కలంగా ఉంటుంది. మాంగనీసు లోటు వుంటే మూర్ఛలాంటి సమస్యలు తలెత్తుతాయి.
- రకరకాల జబ్బుల కారణంగా తలెత్తే క్రానిక్ ఇన్ఫ్లమేషన్, ఒత్తిళ్లు తలెత్తకుండా నిత్యం డైట్‌లో వీటిని తీసుకోవచ్చు.
- ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. రకరకాల ఇన్ఫెక్షన్లపై పోరాటం చేస్తాయి. ముఖ్యంగా ఉదర సమస్యలు, అల్సర్ల నుంచి రక్షిస్తాయి.
- ఇవి యాంటిబాక్టీరియల్‌గా కూడా పనిచేస్తాయి. శరీరం జబ్బుల బారిన పడకుండా కాపాడతాయి.
- ఓరల్ ఇన్ఫెక్షన్లను తగ్గిస్తాయి. రుతుక్రమాన్ని క్రమబద్ధం చేస్తాయి. అందుకే మహిళలు నిత్యం డైట్‌లో ఇవి ఉండేలా చూసుకోవాలి.
- ఈ పళ్లల్లోని విటమిన్-కె హార్మోన్ల పనితీరును క్రమబద్ధీకరిస్తుంది. కడుపునొప్పి తగ్గిస్తుంది.




- ఈ పళ్లల్లో విటమిన్- కె పుష్కలంగా ఉంటుంది. ఇది గుండె వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. విటమిన్-కె రక్తపోటును క్రమబద్ధీకరిస్తుంది. వీటిలో ఉన్న యాంథోసియానిన్స్ గుండెకు బలాన్నిస్తుంది.
- వీటిని క్రమం తప్పకుండా తినడం వల్ల చర్మం ఆరోగ్యంగా తయారవుతుంది.



న్యూ ఇయర్ మాకు ఇప్పుడే !

పిల్లలూ.. హ్యాపీ న్యూ ఇయర్! అదేంటి? ఇప్పుడు న్యూ ఇయర్ ఏంటి? అనుకుంటున్నారా. మనకు కొత్త సంవత్సరం జనవరి 1న ప్రారంభమయింది. కానీ చైనా, టిబెట్ దేశాల్లో ఫిబ్రవరి 16న మొదలయింది. బౌద్ధమత ప్రభావం ఉండే లడఖ్, సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లోనూ న్యూ ఇయర్ వేడుకలు ఇప్పుడే మొదలయ్యాయి.

- ప్రపంచమంతా జనవరి1న కొత్త సంవత్సరం సెలబ్రేట్ చేసుకుంటే చైనీయులకు మాత్రం ఫిబ్రవరి 16న న్యూ ఇయర్ మొదలయింది.
- చైనీస్ ల్యూనార్ క్యాలెండర్ ఆధారంగా ఈ తేదీని నిర్ణయిస్తారు. జనవరి 21 నుంచి ఫిబ్రవరి 20 మధ్యలోనే న్యూ ఇయర్ వస్తుంది. అయితే న్యూ ఇయర్ జరుపుకునే తేదీ మాత్రం ప్రతి ఏటా మారుతుంది.
- చైనీయులు కొత్త సంవత్సరం పండుగను పదహారు రోజుల పాటు జరుపుకుంటారు. స్ప్రింగ్ ఫెస్టివల్‌తో జరుపుకునే ఈ వేడుకలు అట్టహాసంగా ఉంటాయి.
- ఒక్కో ఏడాది చైనీస్ రాశిచక్రం ఆధారంగా ఒక్కో జంతువు గుర్తు వస్తుంటుంది. ఈ ఏడాది కుక్క గుర్తు వచ్చింది. ఈ ఏడాది '2018 ఇయర్ ఆఫ్ ద డాగ్' పేరుతో పిలుస్తారు.
- స్ప్రింగ్ ఫెస్టివల్ రోజున సెలవు దినంగా పాటిస్తారు. చైనాతో పాటు హాంకాంగ్, తైవాన్, సింగపూర్, దక్షిణ కొరియా లాంటి చైనా పొరుగు దేశాల్లో కూడా సెలవు దినంగా పాటిస్తారు.
- టిబెటన్లు కూడా ఫిబ్రవరి 16-17 తేదీల్లో లోసర్ ఫెస్టివల్ పేరుతో కొత్త సంవత్సరం వేడుకలు జరుపుకుంటారు. బౌద్ధమతాన్ని ఆచరించే వాళ్లకు ఇప్పుడే న్యూ ఇయర్ ప్రారంభమవుతుంది. టిబెటన్లకు ఇది ప్రధాన పండుగ. లోసర్ అంటే టిబెటన్ భాషలో న్యూ ఇయర్ అని అర్థం. టిబెట్‌లో ఈ ఫెస్టివల్‌ను 15 రోజుల పాటు జరుపుకుంటారు. ఇండియాలో మాత్రం మూడు రోజుల పాటే నిర్వహించుకోవాలని నిబంధనలున్నాయి.
- లడఖ్, సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లోనూ లోసర్ ఫెస్టివల్ జరుపుకుంటారు. ఇళ్లను విద్యుద్దీపాలతో అలంకరించుకుంటారు. స్నేహితులు, బంధువులతో ఉత్సాహంగా గడుపుతారు. సాయంత్రం వేళ స్త్రీలు ఆభరణాలతో అలంకరించుకుంటారు.
- ఐబెక్స్(కొండమేక) బొమ్మను కిచెన్‌లో, డోర్ల దగ్గర వేలాడదీస్తారు. ఇలా చేయడం వల్ల అదృష్టం కలిసొస్తుందని నమ్మకం.
- సాయంత్రం వేళ 'మెతో' పేరుతో అగ్ని వేడుకను నిర్వహిస్తారు. గ్రామస్తులందరూ కలిసి ఊరేగింపుగా టార్చ్‌లు పట్టుకుని నినాదాలు చేస్తూ తిరుగుతారు. ఆత్మలు, ఇతర శక్తులను తరిమేసేందుకు ఇలా చేస్తారు. ఆ తరువాత కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలుకుతారు.




పేపర్ కళ

డక్... డక్.. బెక్...బెక్




స్టెప్ 1: కాగితాన్ని డైమండ్ ఆకారంలోకి వచ్చేలా మార్చండి



స్టెప్ 2: కాగితాన్ని మధ్యలోకి ఫోల్డ్ చేయండి



స్టెప్ 3: కాగితాన్ని బొమ్మలో చూపించిన విధంగా ఫోల్డ్ చేయండి



స్టెప్ 4: కాగితాన్ని వెనుక వైపునకు తిప్పి సూదిగా ఉన్న కొసవైపు నుంచి ఫోల్డ్ చేయండి



స్టెప్ 5: పైన చూపించిన విధంగా మడవండి



స్టెప్ 6: ఎడమవైపు భాగం వెనక్కి వెళ్లేలా సగానికి మడవండి. దీన్నే 'మౌంటెయిన్ ఫోల్డింగ్' అంటారు




స్టెప్ 7: కాగితాన్ని మళ్లీ వేరే వైపునకు తిప్పండి



స్టెప్ 8: బాతు తల ఆకారం వచ్చేలా కాగితాన్ని సరిచేయండి. అంతే బాతు రెడీ!

ఇది విన్నారా?



బాల్టిక్ సముద్రం!

అట్లాంటిక్ మహాసముద్రంలో బాల్టిక్ సముద్రం ఓ చిన్న భాగం. దీని లోతు గరిష్టంగా 459 మీటర్లు. సముద్రతీరం పొడవు 1600 కి.మీ. ఇది ఫిన్‌లాండ్, ఎస్టోనియా, లాట్వియా, లిథుయానియా, రష్యా, పోలండ్, జర్మనీ, డెన్మార్క్ దేశాల మధ్యన ఉంది. కియల్, వైట్‌సీ కాలువల ద్వారా బాల్టిక్ సముద్రాన్ని వైట్‌సీతో అనుసంధానించారు. పూర్వం డెన్మార్క్ ఈ సముద్రంలోకి ప్రవేశించే నౌకల నుంచి సుంకం వసూలు చేసేది. రెండో ప్రపంచ యుద్ధంలో సోవియట్ యూనియన్, అమెరికా, బ్రిటన్ దేశాల నైకాదళాలు, యుద్ధవిమానాలు ఈ సముద్రంమీద తలపడ్డాయి.

లోభికి మూడందాల నష్టం



ఒక గ్రామంలో ఒక నేతి వర్తకుడు ఉండేవాడు. అతను లోభగుణం కలవాడు అవటం కావటాన తాను అమ్మే నేతిలో చౌకనూనె కలిపి అమ్మేవాడు. ఆ నెయ్యి కంపు కొట్టేది. చివరకు ఆ నేతి వర్తకుణ్ణి అధికారులు పట్టుకున్నారు. న్యాయాధికారి అతనికి మూడు రకాల శిక్షలు చెప్పి, అందులో ఏదో ఒకటి కోరుకోమన్నాడు. అవేమంటే, తక్కెడు కంపునెయ్యి తాగటం లేదా, నూరు కొరడా దెబ్బలు తినటం, లేదా నూరు రూపాయలు జరిమానా చెల్లించుకోవటం. డబ్బు పోగొట్టుకోవటమూ, శరీరాన్ని బాధపెట్టుకోవటమూ ఇష్టంలేక వర్తకుడు తక్కెడు కంపునెయ్యి తాగటానికి ఒప్పుకున్నాడు. కాని చటాకు నెయ్యి తాగేసరికి అతనికి వాంతి వచ్చింది. అందుచేత కొరడా దెబ్బలు తినటానికి సిద్ధపడ్డాడు. కానీ నాలుగు కొరడా దెబ్బలకే అతనికి ప్రాణం పోయినంత పని అయింది. అందుకని ఆ నేతి వర్తకుడు నూరు రూపాయలు జరిమానా ఇచ్చుకొని, మూడు రకాల శిక్షా అనుభవించాడు.


- బుస్సారి మహేందర్‌జీ

ఆణిముత్యం

కష్టాల్లోనే మనిషి శక్తియుక్తులు బయటపడతాయి. అద్భుతాలను సాధించడానికి మూలం దృఢమైన నమ్మకం!


- స్వామి వివేకానంద

గుర్తించండి?



చదవండి

బోలెడు కథలు... అన్నీ మీకోసమే!



రస్కిన్ బాండ్ గురించి తెలుసా? తెలియకపోతే తెలుసుకోండి. ఎందుకంటే ఆయన రచనలన్నీ పిల్లల కోసమే. రకరకాల కథలు, వాటిలోని మనుషుల మనస్తత్వాలు వెరసి ఆయన కథావస్తువులు పిల్లల్నే కాదు పెద్దలనూ అలరిస్తాయి. మనసును తాకే రచనా శైలి ఆయన సొంతం. రచయితగా 67 ఏళ్ల అనుభవమున్న రస్కిన్ బాల్యమంతా కష్టాలతో గడిచింది. అందుకే ఆయనకు పిల్లలంటే చాలా ఇష్టం 1934లో పుట్టిన రస్కిన్ బాండ్, 17 ఏళ్ల వయసులోనే తొలిసారిగా 'రూమ్ ఆన్ ద రూఫ్' అనే నవల రాశారు. అప్పటి నుంచి ఆయన వెనుదిరిగి చూసుకోలేదు. ఇప్పటివరకూ 500 కథలకు పైగా రాశారు. పద్మశ్రీ, పద్మవిభూషణ్ వంటి ఎన్నో పురస్కారాలు ఎన్నో వరించాయి. రస్కిన్ రచనలు ఇప్పటికీ హాట్‌కేకుల్లా అమ్ముడు పోతూ ఉంటాయి. ఆయన చాన్నాళ్ల క్రితం నుంచి రాసిన కథలన్నీ తాజాగా ఓ పుస్తక రూపంలోకి వచ్చాయి. ఆ పుస్తకం పేరు 'రస్కిన్ బాండ్ - ఓమ్నిబస్'. మీరు తప్పక చదవాల్సిన పుస్తకమిది!

కిడ్ సైంటిస్ట్!

బుడగల ధార!



కావలసినవి

- వెడల్పాటి మూతిగల ప్లాస్టిక్ డబ్బా
- స్ప్రేయర్ ట్యూబ్
- బుడగల ద్రావణం
- వేడి నీరు
- డ్రైఐస్
- చేతి తొడుగులు

ప్రయోగం చేసే విధానం

ప్లాస్టిక్ డబ్బాకు రంధ్రం చేసి స్ప్రేయర్ ట్యూబ్‌ను తొడగాలి. డబ్బాలో పావు వంతు భాగం వేడి నీటితో నింపాలి. అందులో కొన్ని డ్రై ఐస్ ముక్కలు వేసి వదులుగా మూత పెట్టాలి. డ్రై ఐస్ కరిగి స్ప్రేయర్ ట్యూబ్ ద్వారా పొగమంచులా వస్తుంది. చిన్నపాత్రలో బుడగల ద్రావణం తీసుకోవాలి. అందులో స్ప్రేయర్ ట్యూబ్ మూతిని ఉంచి బయటకు తీస్తే వందలాది బుడగలు ధారలా బయటకు వస్తాయి.



శిలా శాసనాలు

చరిత్రను కళ్లకు కట్టినట్టు తెలియజేసేవి శిలా శాసనాలు. అలాంటి కొన్ని ముఖ్యమైన శిలా శాసనాల గురించి ఈ వారం తెలుసుకుందాం.

హాథీగుంఫా శిలా శాసనం : కలింగ ఖారవేలుని విజయాల గురించి చెబుతున్న ఏకైక శిలా శాసనం ఇది.
నాసిక్ శాసనం : గౌతమీ పుత్ర శాతకర్ణి విజయాలను తెలియజేసే శాసనం ఇది. ఈ శాసనాన్ని శాతకర్ణి తల్లి గౌతమీ బాలశ్రీ వేయించింది.
ఐహోల్ శాసనం : బాదామి చాళుక్య పాలకుడైన రెండో పులకేశి సైనిక విజయాలను వివరిస్తుంది.
సారనాథ్ స్తంభ శాసనం : ఆశోకుడు వేయించాడు. దీనిపై ఉన్న నాలుగు సింహాల గుర్తును భారత ప్రభుత్వం జాతీయ చిహ్నంగా తీసుకుంది.
చేజర్ల శిలాశాసనం : ఇది ఆనంద గోత్రజుల చరిత్రను తెలియజేస్తుంది.
నాగార్జున కొండ, జగ్గయ్యపేట శాసనాలు : ఇక్ష్వాకుల చరిత్రకు ఆధారాలు
మైదవోలు శాసనం : పల్లవరాజు శివస్కందవర్మ వేయించాడు.
నానాఘాట్ శాసనం : మొదటి శాతకర్ణి సైనిక విజయాలను తెలియజేస్తుంది. దీన్ని అతని భార్య నాగనిక వేయించింది.

క్విజ్

వ్యక్తులు, వాళ్లు రచించిన పుస్తకాలను జత చేయండి

1) మై ట్రూత్
2) ది గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్
3) ది ఇన్‌సైడర్
4) లజ్జ
5) బ్రోకెన్ వింగ్స్

ఎ) అరుంధతీ రాయ్
బి) తస్లిమా నస్రీన్
సి) ఇందిరాగాంధీ
డి) పి.వి. నరసింహారావు
ఇ) సరోజినీ నాయుడు

జవాబులు

నవ్య సకల

కౌన్సెలింగ్

పాపకు గొంతు నొప్పి తగ్గదేమిటి?

మా పాపకు 12 ఏళ్లు. నాలుగు నెలలుగా ఆమెకు గొంతు నొప్పి, మూత్ర విసర్జన సమయంలో నొప్పి ఉంటున్నాయి. నేరుగా మేమే మెడికల్ షాప్‌కి వెళ్లి తెచ్చిన యాంటీ బయాటిక్ మందులు వేస్తూ వచ్చాం. వీటివల్ల తగ్గినట్లే తగ్గి, మళ్లీ వస్తోంది. సమస్య నాలుగు నెలలుగా అలా కొనసాగుతూ ఉండడంతో మాకు భయంగా ఉంది. అసలు సమస్య ఏమై ఉంటుంది? దీనికి పరిష్కారమేమిటి?



కొన్ని రకాల బ్యాక్టీరియాల కారణంగా మీ పాపకు గొంతు నొప్పి, జననాంగంలో నొప్పి వస్తున్నట్లు స్పష్టమవుతోంది. థ్రోట్ స్వాబ్ పరీక్ష చేయిస్తే ఆ కారణాలేవో బయటపడతాయి. దీనికి తోడు రక్త, మూత్రపరీక్షలు కూడా చేయించాలి. ఒక వేళ మూత్రంలో గానీ, రక్తంలో గానీ చీము ఉన్నట్లు బయటపడితే అప్పుడు అల్ట్రాసౌండ్ పరీక్షలు కూడా చేయించాలి. ఇప్పటికే మీరు చాలా ఆలస్యం చేశారు. ఇంకా మరికొన్ని రోజులు నిర్లక్ష్యంగా ఉండిపోతే, గొంతులోని ఇన్‌ఫెక్షన్లు కిడ్నీల దాకా వెళ్లి అవి ఉబ్బిపోయే హైడ్రోనెఫ్రోసిస్ అనే సమస్య తలెత్తే ప్రమాదం ఉంది. అసలు సమస్యేమిటో తెలుసుకోకుండా, అదే పనిగా యాంటీ బయాటిక్స్ ఇస్తూ పోతే, చివరికి అవేవీ పనిచేయని, యాంటీ బయాటిక్ రెసిస్టెన్స్ వచ్చే ప్రమాదం ఉంది. ఆ స్థితిలో హాస్పిటల్‌లో అడ్మిట్ చేసి ఇంజెక్షన్ ద్వారా యాంటీ బయాటిక్స్ ఇవ్వాల్సి ఉంటుంది. సమస్య ఒక స్థాయిలో ఉన్నంత వరకు ఫరవాలేదు. అలా కాకుండా సమస్య మరికాస్త విషమిస్తే, తిరిగి కోలుకోలేని నష్టం జరిగిపోతుంది. అందుకే వెంటనే బ్లడ్ యూరియా, సీరం క్రియాటినిన్, సీరమ్ ఎలక్ట్రోలైట్ పరీక్షలు చేయించాలి. కిడ్నీలలో రాళ్లు ఉండడం వల్ల కూడా కొంత మందికి ఈ సమస్యలు తలెత్తుతాయి. ఆ విషయాన్ని పరీక్షల ద్వారా తెలుసుకోవాలి. కొంత మంది పిల్లలు స్కూళ్లో ఎక్కువ సార్లు యూరిన్‌కు వెళ్లనివ్వరని నీళ్లు చాలా తక్కువ తాగుతారు. యూరినల్స్‌కు వెళ్లవలసి ఉన్నా ఆపుకుంటారు. ఇది కూడా ఈ తరహా సమస్యలకు కారణం కావచ్చు. ఇకనైనా ఏ మాత్రం ఆలస్యం చేయకుండా, శిశువైద్య నిపుణుడ్ని సంప్రదించి మీ పాపకు అవసరమైన వైద్య చికిత్సలు ఇప్పించండి.

డాక్టర్ పి.వి. సాయిప్రసాదరావు
కన్సల్టెంట్ పీడియాట్రిషియన్, శ్రీకృష్ణా చిల్డ్రన్స్ క్లినిక్, హైదరాబాద్

పేరెంటచ్

కొత్తవాళ్ల పరిచయాలూ ముఖ్యమే...!

మొట్టమొదటి సారిగా ఇంటికొచ్చిన బంధువుల్నో, అతిథుల్నో, స్నేహితుల్నో పిల్లలకు పరిచయం చేస్తుంటాం. కొంత మంది పిల్లలకు కొత్తవారితో కలవడం ఎంత మాత్రం ఇష్టం ఉండదు. వాళ్లు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పడం గానీ, వాళ్లు ప్రేమతో ఏదైనా ఇస్తే తీసుకోవడం గానీ నచ్చదు. చివరికి వాళ్లు తమను తాకడాన్ని కూడా భరించలేరు. వాళ్లు దగ్గరకు తీసుకోవాలని ఒంటిమీద చేయి వేస్తే ఏదో జెర్రులు పాకుతున్నట్లు కంపరానికి లోనవుతూ ఉంటారు. మిగతా అందరితోనూ బాగానే ఉండే పిల్లల్లో కూడా కొందరు ఇలా బిగుసుకుపోతూ ఉంటారు. దీనికంతా కారణం వాళ్లెవరో తెలియకపోవడమే. ముందే తెలియని వాళ్లను భయంభయంగా చూడటం పిల్లల్లో ఉండే ఒక సాధారణ లక్షణం. కొత్తవాళ్లు మంచి వాళ్లు కాకపోవచ్చుననే భావనే చాలా మంది పిల్లల్లో ఉంటుంది. దీనికి వారి ఆహార్యం, వారి హావభావాలు, వారి చూపులు నచ్చకపోవడం, భయాన్ని కలిగించడం కూడా ఒక కారణమే.



ఎప్పటినుంచో తెలిసిన వాళ్లల్లో కూడా కొంత మంచితో పాటు కొంత చెడు కూడా ఉండడాన్ని పిల్లలు గమనించకుండా ఏమీ ఉండరు. కానీ, కొత్తవాళ్లల్లో మాత్రం మొత్తానికి మొత్తం చెడే ఉంటుందన్నట్లు వాళ్లు చూస్తారు. దానికి కారణం అక్కడో ఇక్కడో ఎవరో బాగా విసిగించిన చేదు అనుభవం ఏదైనా కారణం కావచ్చు. నిజంగానే అలాంటి అనుభవం తాలూకు అభిప్రాయం ఏదైనా ఉంటే వాళ్ల మనసులోంచి దాన్ని తీసివేసే ప్రయత్నం చేయాలి. కొత్తవాళ్లు అన్న కారణంగా వారికి దూరంగా ఉంటే వాళ్లు మనకు తెలిసే అవకాశం ఉండదు. ఈ అర్థం బోధపడేలా పిల్లలకు అప్పుడప్పుడు చెబుతూ ఉండాలి. ఇవన్నీ అవగాహనకు వచ్చినప్పుడే కొత్త పరిచయాల పట్ల పిల్లలు ఆసక్తి చూపుతారు, అప్పుడే కొత్త కొత్త వాళ్లతో ఏర్పడ్డ పరిచయాలతో వాళ్ల జీవితం కొత్త పుంతలు తొక్కుతుంది.

ఎప్పుడూ మనము... మన కుటుంబమే కాదు... అప్పుడప్పుడూ మన సమాజం గురించి కూడా ఆలోచించాలి. ఆపన్నులకు చేతైనైనంత చేయూతనివ్వాలి. అప్పుడే జీవితానికి ఓ అర్థం... పరమార్థం. అదే చేస్తున్నాడు విశాఖపట్టణానికి చెందిన హెయిర్ స్టయిలిస్ట్ చరణ్‌కుమార్. మానసిక వికలాంగులు, దివ్యాంగులతో దోస్తీ చేసి... వారి మనసు తరచి... హృదయాలను గెలిచాడు. వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచి... జనజీవన స్రవంతిలో మేమూ నిలిచి అదరగొట్టగలమని చెప్పేలా ఈ నెల 20న ప్రత్యేక ఫ్యాషన్ షో నిర్వహిస్తున్నాడు. ఎందుకీ దారిలో వెళుతున్నారని అడిగితే... అందుకు చరణ్ ఇచ్చిన సమాధానం ఇది...

చైతన్యం



మనసు తెలిసిన మనిషి

దాదాపు పన్నెండేళ్లుగా దివ్యాంగులు, మానసిక వికలాంగులతో అనుబంధం ఉంది నాకు. వృత్తిరీత్యా హెయిర్ స్టైలిస్ట్‌ని. ఒక మనిషిగా మన చుట్టూ ఉన్న మరో మనిషి బాధలు, అవసరాలు తెలుసుకుని స్పందించకపోతే ఆ జన్మకు అర్థం ఉండదనే అనుకుంటాను. అందుకే సామాజిక బాధ్యతగా నేను చేయగలిగిందేంటని ఆలోచించాను. అదే తడవుగా అనాథ ఆశ్రమాలు, వృద్ధ ఆశ్రమాలు, అంధుల పాఠశాలలకు వెళ్లి... వారికి ఉచితంగా హెయిర్ కటింగ్ చేయడం ప్రారంభించాను. ఆ కార్యక్రమం ఇప్పటికీ కొనసాగుతోంది. నేను చేస్తున్న ఈ సేవకు మరికొంతమంది మిత్రులు, శ్రేయోభిలాషులు అండగా ఉన్నారు. ముఖ్యంగా... మానసిక వికలాంగులకు కటింగ్ చేయడం చాలా కష్టం. వారికి గాయాలు కాకుండా కాళ్లు, చేతులు కట్టేసి కటింగ్ చేసిన దృశ్యాలు గతంలో చూశాను. ఆ దృశ్యాలు నన్ను ఎంతగానో బాధించాయి. అందుకే వారికి కేవలం కటింగ్ చేయడమే కాకుండా... ఓ కేర్ టేకర్‌లా వ్యవహరించేవాడిని. స్నేహం చేసి... వారికి నా సంజ్ఞలు అర్థమయ్యేలా చేరువయ్యాను. దీంతో వారితో నాకు మంచి అనుబంధం ఏర్పడింది.



వాళ్ల కళ్లల్లో ఆనందం కోసం...

ఆటలు ఆడుతున్నప్పుడు, పాటలు పాడుతున్నప్పుడు వారి కళ్లల్లో ఆనందం గమనించేవాడిని. సాధారణ వ్యక్తులు చేసేవి, గతంలో వారు చేయని పనులు చేస్తున్నప్పుడు ప్రత్యేక అనుభూతికి లోనయ్యేవారు. అదే స్ఫూర్తితో వారి కోసం మేకప్ వేయాలని నిర్ణయించుకున్నా. ర్యాంప్ వాక్ చేయించాలని భావించాను. నేను చదువుకున్నది చాలా తక్కువే అయినా... వృత్తిపంగా ఎంతో నైపుణ్యం సాధించాను. మేకప్, హెయిర్ డ్రెస్సింగ్, ఆర్టిస్ట్రీ మేకప్ కోర్సుల్లో డిప్లమోలు చేశాను.

పది రోజులుగా శ్రమిస్తున్నాం...



మానసిక వికలాంగులు, దివ్యాంగులు... మొత్తం 25 మంది పిల్లలు ఈ నెల 20న జరగబోయే ఫ్యాషన్ షోలో పాల్గొంటున్నారు. గంటన్నర పాటు సాగే ఈ ప్రదర్శనలో ర్యాంప్‌పై హొయలు ఒలికించనున్నారు. ఇది వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతుందని ఆశిస్తున్నాను. ఫ్యాషన్ షో అంటే కొన్ని తరగతులకే పరిమితం కాదు. ఇలాంటి వారు కూడా క్యాట్ వాక్‌లతో కేక పుట్టించగలరని చెప్పేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాను. మంచి మనస్సుతో చూసే వాళ్లకి ఈ షో కూడా ఎంతో కలర్‌ఫుల్‌గా కనిపిస్తుంది. పది రోజులుగా ఆ పిల్లలతో ర్యాంప్ వాక్‌పై కసరత్తులు చేయిస్తున్నాం. ఇచా ఫౌండేషన్, పాపాహోమ్, నేత్ర విద్యాలయం, ప్రజ్వల వాణి సంస్థల నుంచి చిన్నారులు షోకు హాజరవుతారు. అలాగే నగరంలోని అన్ని ఆశ్రమాలకు ఆహ్వానం పంపాం. పూర్తి ఉచితంగా నిర్వహిస్తున్న ఈ షోకు అన్నీ అదేవిధంగా సమకూరుతుండడం ఆనందంగా ఉంది. ఓ మంచి కార్యాన్ని తలపెడితే వెంట నడిచే వారెందరో ఉంటారని మరోమారు రుజువైంది.

రామ్‌చరణ్ హెయిర్ స్టయిల్ కావాలన్నాడు...

ఇలాంటి విభిన్నమైన పిల్లల ఫ్యాషన్ షోకు అనువైన దుస్తులు సిద్ధం చేస్తున్నాం. ప్రత్యేక మేకప్, యాక్సరీస్ ఉపయోగిస్తున్నాం. జిల్లా కలెక్టర్ కూడా మా కార్యక్రమానికి ప్రోత్సాహమందిస్తున్నారు. ఓసారి హరికృష్ణా అనే అంధ బాలుడు తనకు రామ్‌చరణ్ హెయిర్ స్టయిల్ కావాలని అడిగాడు. ఆ హీరో ఎలా ఉంటాడో, అతడి హెయిర్ స్టయిల్ ఎలా ఉంటుందో అతనికి తెలియదు. కానీ... అతని మదిలో ఆ కోరిక ఉంది. ఆ రోజే అర్థమైంది... ఎన్నెన్నో భావాలూ, అభిరుచులూ వారికీ ఉటాయని! వాటిని సంతృప్తి పరిచి, వారి కోర్కెలు తీర్చడానికి నేను చేయగలిగింది చేయాలని నిశ్చయించు కున్నాను. ఇలాంటి వాటినెన్నింటినో బేరీజు వేసి, పరిశీలించి వచ్చిన నిర్ణయమే ఫ్యాషన్ షో. ఇన్నాళ్లకు నా కల నెరవేరబోతోంది. దీన్ని ఒక సవాలుగా తీసుకుని చేస్తున్నాం. నన్ను ప్రోత్సహించిన వారు కూడా ఏదీ ఆశించకుండా సహకరిస్తున్నారు.

వృద్ధులు... అనాథల కోసం...

ఫ్యాషన్ షో తరువాత వృద్ధాశ్రమాలకు చెందిన వాళ్లతో ప్రత్యేక కార్యక్రమం ఉంటుంది. వృద్ధులు, అనాథలను ఒక కుటుంబంగా చేసే వేడుక అది. అంతా కలిసి రాత్రి భోజనం చేసేందుకు ఏర్పాట్లు చేశాం. నా అన్నవాళ్లు లేక ఒంటరితనాన్ని అనుభవిస్తున్న వారికి తమకూ ఒక కుటుంబం ఉందని భరోసా కల్పించే కార్యక్రమం ఇది. నేను కోరేది ఒక్కటే... దివ్యాంగులు, మానసిక వికలాంగులను చూసి జాలి పడవద్దు... ఎవరికి చేతనైన సాయం వారు చెయ్యాలని. ఆర్థిక స్వావలంబన కన్నా... మానసిక బలం వారికి సంతృప్తినిస్తుంది. ఎప్పుడో అప్పుడు వాళ్లతో కొంత సమయం గడిపేందుకు ప్రయత్నిస్తే... వారిలో కొత్త ఉత్సాహాన్నిస్తుంది.

వాసు, విశాఖపట్నం

బ్రెయిన్ సుడోకు - 109

				5			4	
			3			1		6
	6				7		3	8
5	9		1	2	3		6	
	3		8	7	6		5	1
8	5		9				1	
7		6			5			
	1			6				

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.
నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.
ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 108 సమాధానం

[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]

మీకు మీరే డాక్టర్

కాళ్ల మంటలు మటుమాయం




- 2 గ్రాముల మిరియాలను 1 తులం ఆవు నెయ్యిలో వేసి కాచి, ఆ నెయ్యితో మర్దన చేస్తే అరికాళ్ల మంటలు తగ్గుతాయి.
- మిరియాలు, బెల్లం పెరుగులో కలిపి సేవిస్తే జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది.
- మిరియాల చూర్ణం, చక్కెర, నెయ్యి తేనె కలిపి 2 గ్రాముల ఈ విశ్రమానికి సమానంగా కలకండ కలిపి తీసుకుంటే ఉబ్బసం తగ్గుతుంది.
- పావు స్పూను (1/4) మిరియాల పొడిని ఆవు నెయ్యితో కలిపి తీసుకుంటూ, నెయ్యిని పై పూతగా రాస్తే దద్దుర్లు తగ్గిపోతాయి.
- మిరియాలు కాల్చి చేసిన బూడిదను తేనెతో సేవిస్తే, విరిగిన ఎముకలు త్వరగా అతకడానికి తోడ్పడుతుంది.
- పావు స్పూను మిరియాల పొడిని, సగం ముక్క నిమ్మరసంతో కలిపి భోజనం తర్వాత తీసుకుంటూ ఉంటే కడుపు ఉబ్బరం, అజీర్తి, ఆకలి లేకపోవడం తొలగిపోతాయి.
- రెండు గ్రాముల మిరియాలు, 4 నేరేడు ఆకులు, 4 జామ ఆకులు, కొన్ని గసగసాలు కలిపి నూరి ఆ ముద్దతో పండ్లు తోముకుంటే, పండ్ల తీపులు తగ్గుతాయి.







పల్లెటూరి పడతి, ప్రకృతి...


'రంగస్థలం'లో రామ్‌చరణ్

"సౌండ్, మ్యూజిక్ డామినేషన్‌తో సాహిత్యం రెండో స్థానంలోకి చేరుతున్న తరుణంలో సాహిత్యానికి ప్రాధాన్యతనిస్తూ వినసొంపుగా ఉండేలా పాటల్ని కంపోజ్ చేశారు. దేవిశ్రీ ప్రసాద్ క్రెడిట్ అది" అని చిరంజీవి తెలిపారు. ఇటీవల విడుదలైన 'రంగస్థలం'లోని 'ఎంత సక్కగున్నావే లచ్చిమి' పాటపై ఆయన స్పందించారు. "పల్లెటూరులో ఓ అందమైన అమ్మాయిని చూసి, మొదటి చూపులోనే ప్రేమలో పడిపోయిన కుర్రాడు తన మనోగతాన్ని ఎలా బయటపెట్టాడు' అనేది ఓ పాట రూపంలో చక్కగా తీర్చిదిద్దారు. పల్లె ప్రకృతి, పడతికి సంబంధించిన ఈ పాటను చంద్రబోస్ అద్భుతంగా, అర్థవంతంగా రచించారు. సుకుమార్ ప్రతి విషయంలో శ్రద్ధ తీసుకున్నారు. అందుకే 'ఎంత సక్కగున్నావే లచ్చిమి' పాట ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. పూర్తిగా నేటివిటీ పాట కావడం, పాటలో ప్రతి పదం వినసొంపుగా ఉండటంతో సంగీత ప్రియులు పదేపదే వింటున్నారు. ఈ పాటే కాదు సినిమాలో అన్ని పాటలు మళ్లీమళ్లీ పాడుకునేలా ఉంటాయి. పల్లెటూరికి సంబంధించి అన్ని కోణాల్లో చక్కగా చూపించారు దర్శకుడు" అని అన్నారు. రామ్‌చరణ్, సమంత జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి సుకుమార్ దర్శకుడు. మైత్రీ మూవీస్ సంస్థ నిర్మిస్తోంది. మార్చిలో సినిమాను విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారు.

నాగబాబుకి గొప్ప గిఫ్ట్ ఇది

వరుణ్‌తేజ్, చిరంజీవి



"నాగబాబుకి ప్రైడ్ మూమెంట్ ఇది. అతని జీవితంలో నటుడిగా ఏదన్నా లోటు ఉందనుకుంటే ఆ లోటుని వరుణ్‌తేజ్ ఈ సక్సెస్‌తో తీర్చినట్లే. తండ్రికి వరుణ్ ఇచ్చిన గొప్ప గిఫ్ట్ ఇది. 'తొలిప్రేమ'లో వరుణ్ నటన చూసి మా కుటుంబం గర్విస్తోంది" అని చిరంజీవి అన్నారు. వరుణ్‌తేజ్, రాశీఖన్నా జంటగా నటించిన చిత్రం 'తొలిప్రేమ'. వెంకీ అట్లూరి దర్శకత్వంలో బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్ నిర్మించారు. గతవారం ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం విజయవంతంగా ఆడుతోంది. ఇటీవల సినిమా చూసిన చిరంజీవి చిత్ర యూనిట్‌ను తన స్వగృహంలో శాలువాతో సత్కరించి అభినందించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ""తమ్ముడు కల్యాణ్ సూపర్‌హిట్ సినిమా 'తొలిప్రేమ' టైటిల్ ఈ చిత్రానికి పెట్టడంతో కథలో ఏముందో అన్న క్యూరియాసిటీ నాలో పెరిగింది. సినిమా ఆలస్యంగా చూశాను. ఇదొక కాంటెంపరరీ లవ్‌స్టోరీ. కథగా చెప్పడానికి ఏమీ ఉండదు. సన్నివేశానికి తగ్గట్టు అల్లుకుని దర్శకుడు అద్భుతంగా నడిపించాడు. సినిమా చూసిన ప్రతి ఒక్కరూ ఫ్రెష్‌గా ఫీలవుతున్నారంటే దర్శకుడు కొత్తగా ఆలోచించడమే కారణం. అతనికి సవాల్‌తో కూడిన సినిమా ఇది. ఇలాంటి ఇన్‌పుట్స్, ఇన్‌ఫ్యూజ్ కావడం వల్ల పక్క సినీ పరిశ్రమలవాళ్లు మన దగ్గర మంచి కథలున్నాయని మాట్లాడుకుంటున్నారు. వరుణ్ తేజ్ చాలా మెచ్యూర్డ్‌గా నటించాడు. తెరపై అతన్ని చూస్తున్నంత సేపు ఎవరో యంగ్‌బాయ్ నటిస్తున్నట్లు అనిపించింది. వరుణ్ ఫైట్‌తో డాన్స్‌కి ఎంతవరకూ న్యాయం చెయ్యగలడో అన్న అనుమానం లోలోపల నాకూ ఉండేది. కానీ ప్రతీ స్టెప్‌ను బాగా అడాప్ట్ చేసుకుని చేశాడు. బీవీఎస్ఎన్ ప్రసాద్ మా అభిమాన నిర్మాత. 65 రోజుల్లో సినిమా పూర్తి చెయ్యడం గొప్ప విషయం. ఖర్చు పెట్టే నిర్మాత ఉన్నాడు కదా పని దినాలు పెంచేసి షూటింగ్ చెయ్యడం కరెక్ట్ కాదు. అందరూ గమనించాల్సిన విషయమిది. స్క్రిప్ట్‌ను పక్కాగా లాక్ చేసుకుంటే ఏ సినిమా అయినా అనుకున్న టైమ్‌లో పూర్తవుతుంది" అని అన్నారు. "స్టువర్ట్‌పురం పోలీస్‌స్టేషన్' టైమ్‌లో చిరంజీగారిని మొదటిసారి చూశా. ఇన్నాళ్లకు ఆయన్ను కలవగలిగా. ఈ అనుభూతిని ఎప్పటికీ మర్చిపోలేను. సినిమా చూసి.. మమ్మల్ని పిలిచి అభినందించడం గర్వంగా ఉంది. ఈ ఆనందాన్ని మాటల్లో చెప్పలేకపోతున్నా" అని దర్శకుడు చెప్పారు. "33 ఏళ్ల క్రితం పసుపులేటి రామారావు గారి సహకారంతో చిరంజీవిగారితో కలిశా. ఆయనతో సినిమా చెయ్యాలనుకున్నా. కుదరలేదు. పవన్ కల్యాణ్, రామ్ చరణ్, బన్నీ, వరుణ్‌తో సినిమా చేసే అవకాశం దక్కింది. మెగా ఫ్యామిలీతో నేను తీసిన సినిమాలన్నీ హిట్టే" అని బీవీఎస్ఎన్ ప్రసాద్ తెలిపారు. "యాక్టర్ కావాలన్న ఆలోచన చిరంజీవి గారిని చూసే వచ్చింది. ఈ రోజు డాడీ (చిరంజీవి) వచ్చి నా సినిమా గురించి మాట్లాడుతుంటే ఆనందంగా ఉంది. కల్యాణ్ బాబాయ్ ఇంకా సినిమా చూడలేదు" అని వరుణ్‌తేజ్ అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో తమన్, బాపినీడు పాల్గొన్నారు.





నాగార్జున... కొత్త నటుడు!

చిత్రసీమలో నటుడిగా మూడు దశాబ్దాల ప్రయాణం... దశాబ్దానికి ముప్పై చిత్రాల చొప్పున సుమారు తొంబై చిత్రాల్లో నటించిన అనుభవం... నాగార్జునను ఎవరైనా కొత్త నటుడు అంటారా? అనుభవంతో ఎన్నో సన్నివేశాలను మరో మెట్టు ఎక్కించిన నటుడు ఆయన! ఎవరికైనా నాగార్జున కొత్త నటుడిగా కనిపిస్తారా? ఒక్కరికి కనిపిస్తారు! కాదు... కాదు... ఒక్కరు నాగార్జునలో కొత్త నటుణ్ణి చూశారు! ఆయనే దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ. 'శివ', 'అంతం', 'గోవిందా గోవింద' చిత్రాల తర్వాత సుమారు పాతికేళ్ళ విరామం అనంతరం నాగార్జున హీరోగా వర్మ దర్శకత్వంలో ఒక చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇందులో ఇంతకు మునుపెన్నడూ చూడనటువంటి చాలా రియలిస్టిక్ యాక్షన్ హీరోగా నాగార్జున కనిపిస్తారని వర్మ చెబుతున్నారు. అంతే కాదు... పాతికేళ్ళు వెతికిన తర్వాత నాగార్జున అనే కొత్త నటుడు నాకు దొరికాడని ఆయన పేర్కొన్నారు. "నా తొలి చిత్రం 'శివ' చిత్రీకరణ ఫిబ్రవరి 16న మొదలైంది. ఈ సందర్భంగా మై బ్రాండ్ న్యూ హీరో ఫొటో ఇదిగో" అని శుక్రవారం కొత్త చిత్రంలోని స్టిల్ ట్విట్టర్‌లో విడుదల చేశారు. "29 ఏళ్ళ క్రితం ఇదే రోజున (ఫిబ్రవరి 16న) కల్ట్ ఫిల్మ్ 'శివ' స్టార్ట్ చేశా. టైమ్ టు రాక్ ఎగైన్" అని నాగార్జున ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఈ ముంబయ్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు.



నాగశౌర్య, ఉష, శంకర్‌ప్రసాద్, వెంకీ, బుజ్జి, గౌతమ్

నాగశౌర్య, రష్మిక జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో శంకర్‌ప్రసాద్, ఉష నిర్మించిన 'చలో' చిత్రం ఘనవిజయం సాధించిన సందర్భంగా గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిర్మాతలు దర్శకుడు వెంకీకు కారు బహుమతిగా ఇచ్చారు. అలాగే చిత్ర విజయానికి కృషి చేసిన యూనిట్ సభ్యుల్ని సత్కరించారు. చిత్రవిజయం సాధిస్తే యూనిట్‌లో ప్రతి ఒక్కరినీ సత్కరించుకోవాలనుకొన్నామనీ, అందుకే తమ కలని నిజం చేసిన ప్రతి ఒక్కరికీ ఈవిధంగా ఈ చిరు సత్కారం చేశామనీ నిర్మాతలు చెప్పారు. దర్శకునిగా తనకు తొలి అవకాశం ఇవ్వడమే కాకుండా కారుని బహూకరించిన నిర్మాతలకు దర్శకుడు వెంకీ కృతజ్ఞతలు తెలిపారు.

ముందు నేను... వెనుక 50 మంది!



శృంగారతార సన్నీ లియోన్‌కి గుర్రపు స్వారీ, కత్తియుద్ధం, కర్రసాము వచ్చు. హిందీలో నటించిన చారిత్రక చిత్రం 'ఏక్ పహేలీ లీలా' కోసం ఆమె నేర్చుకున్నారు. ఇప్పుడామె తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతోన్న చారిత్రక చిత్రం 'వీరమహా దేవి' కోసం గుర్రపు స్వారీలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. మళ్ళీ ఎందుకు? అని సన్నీ లియోన్‌ని అడిగితే... "నాకు గుర్రపుస్వారీ వచ్చు. అయితే... అది విదేశీయులు గుర్రాన్ని స్వారీ చేసే తరహాలో ఉంటుంది. దేశీ స్టైల్ వేరుగా ఉంటుంది. అందులోనూ... 'వీరమహా దేవి'లో నేను గుర్రపు స్వారీ చేస్తుంటే, నా వెనుక మరో యాభై మంది గుర్రాలతో వస్తుంటారు. అటువంటి సన్నివేశాల్లో గుర్రాన్ని స్వారీ చేయడం పెద్ద సవాల్. అందుకని, మళ్ళీ ప్రత్యేకంగా నేర్చుకున్నా" అన్నారు. వీసీ వడివుడయాన్ దర్శకత్వంలో స్టీవ్స్ కార్నర్ పతాకంపై స్టీఫెన్ నిర్మిస్తున్న ఈ చిత్రం కోసం సన్నీ లియోన్ చాలా కష్టపడుతున్నారు. ఈ ఏడాదిలో 150 రోజులను కేవలం ఈ చిత్రం కోసమే కేటాయించారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయాలని దర్శక నిర్మాతలు కృషి చేస్తున్నారు.

చిన్నోడి కామెడీ..!


నిక్కీ, ప్రకాశ్‌కుమార్, రక్షిత

జి.వి. ప్రకాశ్ కుమార్ హీరోగా నటిస్తూ సంగీతం అందించిన చిత్రం 'చెన్నై చిన్నోడు'. నిక్కీ గల్రాని, రక్షిత నాయికలు. ఎం.రాజేశ్ దర్శకుడు. శూలిని దుర్గా ప్రొడక్షన్స్ పతాకంపై వి.జయంత్‌కుమార్ తెలుగులో అందిస్తున్నారు. టి.ఎఫ్.సి.సి. ఛైర్మన్ ప్రతాని రామకృష్ణగౌడ్ సీడీలను ఆవిష్కరించారు. సినిమా పెద్ద హిట్ కావాలని, పాటలు బావున్నాయని ప్రతాని రామకృష్ణ గౌడ్, సాయి వెంకట్ అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'మా తాతల హయాం నుంచి మాకు సినిమా రంగంతో పరిచయం ఉంది. ఇప్పుడు ఈ సినిమాను అనువాదం చేశాం. ఆద్యంతం స్ట్రెయిట్ చిత్రంలా ఉంటుంది. పూర్ణాచారి మంచి సాహిత్యాన్నిచ్చారు. కడుపుబ్బా నవ్వించే కామెడీతో పాటు ప్రకాష్‌రాజ్ చేసిన పోలీస్ పాత్ర హైలైట్ అవుతుంది. ఇందులో హీరో జీవాగారు గెస్ట్ రోల్ చేశారు. సంగీతం, లొకేషన్లు సినిమాకు హైలైట్ అవుతాయి. త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తాం" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో 'గంగపుత్రులు' రామ్‌కీ, గీత రచయిత పూర్ణాచారి, సీనియర్ జర్నలిస్ట్ పసుపులేటి రామారావు, ఎగ్జిక్యూటివ్ నిర్మాత ఎన్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'కొత్తగా ఉన్నాడు'గా..


ఆకాశ్, ప్రియ

"లండన్ నేపథ్యంలో సాగే అందమైన కథతో 'కొత్తగా ఉన్నాడు' తెరకెక్కింది. ఆంధ్రా కుర్రాడిగా, తెలంగాణ కుర్రాడిగా కనిపిస్తాను. విక్రమ్ అపరిచితుడి తరహాలో కథ అలరిస్తుంది" అని ఆకాశ్ అన్నారు. ఆయన హీరోగా నటించిన చిత్రం 'కొత్తగా ఉన్నాడు'. రాజా మీడియా వరల్డ్ సమర్పణలో జై బాలాజీ మూవీ మేకర్స్ పతాకంపై ఎం.కె.రాజా నిర్మిస్తున్నారు. ప్రియ, సోనియా నాయికలు. ఎం.రాధా దర్శకుడు. యు.కె.మురళి సంగీతం అందించిన ఈ సినిమాలోని పాటలు ఇటీవల హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. ఈ చిత్రంతో నిర్మాణ రంగంలో అడుగుపెట్టడం ఆనందంగా ఉందని నిర్మాత రాజా అన్నారు. ట్రైలర్ కూడా ఇదే వేదికపై విడుదలైంది. నిర్మాతలు సురేశ్ కొండేటి, జైరామ్, దినేష్ మాడ్నే, బాల్‌రెడ్డి, బలవంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం	వెండి	రూపాయి డాలర్	ముడి చమురు
34010.76	10452.30	30915	38710	64.21	64.47
↓ 286.71	↓ 93.20	↑ 190	↑ 55	↓	↑

ముంబై - 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)

విమానాశ్రయాల విస్తరణకు రూ.15 వేల కోట్లు



వైజాగ్‌లో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణ ప్రతిపాదన.. వచ్చే ఆర్థిక సంవత్సరం పెట్టుబడుల ప్రణాళికపై ఎఎఐ

పనాజీ: ప్రస్తుత విమానాశ్రయాల్లోని టెర్మినళ్ల విస్తరణ, కొత్త వాటి నిర్మాణం కోసం వచ్చే ఆర్థిక సంవత్సరం(2018-19)లో రూ.15,000 కోట్లు పెట్టుబడిగా పెట్టనున్నట్లు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ) వెల్లడించింది. దేశంలోని అన్ని ఎయిర్‌పోర్టుల్లో అదనపు టెర్మినళ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఎఎఐ ఛైర్మన్ గురుప్రసాద్ మహాపాత్ర తెలిపారు. 2018-19లో 15 కొత్త టెర్మినల్ బిల్డింగ్స్‌ను నిర్మించనున్నామని డబోలిమ్ ఎయిర్‌పోర్టులో ఆపరేషన్స్ కంట్రోల్ సెంటర్ ప్రారంభం సందర్భంగా వెల్లడించారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని తేజు ఎయిర్‌పోర్టుతోపాటు రూ.650 కోట్లతో సిక్కింలోని పాక్యాంగ్‌లో కొత్త ఎయిర్‌పోర్టు నిర్మాణం కూడా పూర్తయిందని, త్వరలోనే ఈ రెండింటిలోనూ కార్యకలాపాలను ప్రారంభంకానున్నట్లు మహాపాత్ర చెప్పారు. కొత్త ఎయిర్‌పోర్టులకు సంబంధించి ఆయన వెల్లడించిన మరిన్ని వివరాలు..

- రూ.200 కోట్ల పెట్టుబడితో పశ్చిమ ఒడిశాలో చేపట్టిన ఝార్సుగూడ ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తయింది. ఏప్రిల్‌లో ప్రారంభమవుతుంది.
- నవీ ముంబై ఎయిర్‌పోర్టుకు త్వరలోనే శంకుస్థాపన
- గ్రేటర్ నోయిడాలోని జెవార్‌లో మరో విమానాశ్రయం ఏర్పాటు ప్రణాళికా స్థాయిలో ఉంది.
- గోవాలోని మోపాలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు పనులు కొనసాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్‌లోనూ ఇదే తరహా ఏర్పాటు చేయాలనుకుంటున్నాం.
- కోల్‌కతా, చెన్నైలో రెండో ఏర్పాటు నిర్మాణం కోసం ఆ రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చిస్తున్నాం.
- ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌లో ఉన్న ఎయిర్‌పోర్టును రూ.100 కోట్లతో భారీగా విస్తరిస్తున్నాం. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో అర్ధ కుంభమేళా ప్రారంభమయ్యేలోగా మొదటి దశను పూర్తి చేస్తాం.

ఆర్‌కామ్‌కు ఊరట

సంస్థపై మణిపాల్ దివాలా పిటిషన్ ఉపసంహరణ

న్యూఢిల్లీ: అనిల్ అంబానీకి చెందిన టెలికాం సంస్థ రిలయన్స్ కమ్యూనికేషన్స్(ఆర్‌కామ్)కు వ్యతిరేకంగా దాఖలు చేసిన దివాలా పిటిషన్‌ను మణిపాల్ టెక్నాలజీస్ లిమిటెడ్ ఉపసంహరించుకుంది. పిటిషన్‌ను వెనక్కి తీసుకోవాలని తమ క్లయింటు కోరిందని మణిపాల్ తరపున వాదిస్తున్న న్యాయవాదుల మండలి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి)కి సమాచారం అందించింది. 2016లో బయోమెట్రిక్ ఫింగర్‌ప్రింట్ స్కానర్లు సరఫరా చేసినందుకు గాను ఆర్‌కామ్ నుంచి రూ.2.74 కోట్ల బకాయిలను రాబట్టుకునేందుకు కర్ణాటకకు చెందిన మణిపాల్ టెక్నాలజీస్ గత ఏడాది సెప్టెంబర్ 25న ఎన్‌సిఎల్‌టిని ఆశ్రయించింది. సంస్థ అప్పీలును పరిగణనలోకి తీసుకున్న ట్రిబ్యునల్.. నవంబర్‌లో ఆర్‌కామ్‌కు నోటీసులు జారీ చేసింది.

ఆస్తుల అమ్మకానికి ఆర్‌కామ్ షేర్‌హోల్డర్లు ఓకే

రుణ సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు ఆస్తులను అమ్మేయాలనుకుంటున్నట్లు ఈమధ్య ఆర్‌కామ్ ప్రకటించిన భారీ ప్రణాళికకు షేర్‌హోల్డర్లు ఆమోదం తెలిపారు. ఇందులో పాల్గొన్నవారిలో 99.91 శాతం ప్రణాళికకు సమ్మతం తెలిపారని ఆర్‌కామ్ వెల్లడించింది. రూ.45 వేల కోట్ల అప్పులతో సతమతమవుతున్న ఆర్‌కామ్.. ఆస్తుల విక్రయంతో వచ్చే నిధులతో రూ.25వేల కోట్ల మేర బకాయిలు తీరుతాయని ఆశాభావంతో ఉంది.

జూమ్‌కార్‌లో మహీంద్రా పెట్టుబడి

రూ.176 కోట్లతో

16 శాతం వాటా కొనుగోలు

న్యూఢిల్లీ: కార్లు, సైకిళ్లను అద్దెకిస్తున్న జూమ్‌కార్‌లో రూ.176 కోట్ల పెట్టుబడి ద్వారా మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) 16 శాతం ఈక్విటీ వాటా చేజిక్కించుకుంది. జూమ్‌కార్ ఇండియాతోపాటు దాని అమెరికన్ హోల్డింగ్ పేరెంట్ కంపెనీ జూమ్‌కార్ ఇంక్‌లోకి ఈ పెట్టుబడులు వెళ్లనున్నాయి. సిరీస్ సి ఫండింగ్‌లో భాగంగా ఈ సంస్థ.. ఎం అండ్ ఎంతో పాటు మరింత మంది ఇన్వెస్టర్ల నుంచి మొత్తం 4 కోట్ల డాలర్లు (దాదాపు రూ.256 కోట్లు) సేకరించింది. సంస్థ సేవల పరిధి విస్తరణను మరింత వేగవతం చేయడంతోపాటు సాంకేతికంగా బలపడేందుకు ఇంకా ఇతర వాహన విభాగాల్లోకి ప్రవేశించేందుకు ఈ నిధులను ఉపయోగించుకోనున్నట్లు జూమ్‌కార్ సహ వ్యవస్థాపకులు, సిఇఒ గ్రెగ్ మోరాన్ తెలిపారు. తమ ప్లాట్‌ఫాంపైకి మరిన్ని ఎలక్ట్రిక్ వాహనాలను తీసుకొచ్చేందుకు సైతం ఈ నిధులను వినియోగించనున్నామని అన్నారు. అక్టోబర్ 2014 నుంచి జూలై 2015 మధ్యకాలంలో సికోయా కాపిటల్, ఎంపైర్ ఏంజిల్స్ నుంచి రెండు దఫాల్లో 2.1 కోట్ల డాలర్ల నిధులు సేకరించింది. ఆ తర్వాత ఫోర్డ్ స్మార్ట్ మొబిలిటీ నుంచి మరో 2.4 కోట్ల డాలర్లు సమీకరించగలిగింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో జూమ్‌కార్ ఇండియా ఆదాయం రూ.121 కోట్లుగా నమోదైంది.

ఆన్‌మొబైల్ నుంచి ఇన్ఫీ ఎగ్జిట్

రూ. 16 కోట్లకు వాటా విక్రయం

న్యూఢిల్లీ: దేశంలో రెండో అతిపెద్ద ఐటి సంస్థ ఇన్ఫోసిస్.. ఆన్‌మొబైల్ సిస్టమ్స్ ఇంక్‌లోని మొత్తం వాటాను 24.9 లక్షల డాలర్ల (రూ.16.18 కోట్లు)కు విక్రయించింది. ఆన్‌మొబైల్ సిస్టమ్స్ ఇంక్‌లో వాటాను ఉపసంహరించుకునేందుకు ఈ నెల 15న అగ్రిమెంట్ కుదుర్చుకున్నట్లు బిఎస్‌ఇకి ఇన్ఫోసిస్ సమాచారం అందించింది. ఇన్ఫోసిస్ వాటాను టెలీసిస్టమ్ కొనుగోలు చేసిందని ఆన్‌మొబైల్ గ్లోబల్ (ఒజిఎల్) స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు విడిగా ఫైలింగ్ సమర్పించింది. టెలీసిస్టమ్ కూడా తమ గ్రూప్ సంస్థేనని ఒజిఎల్ తెలిపింది.

బ్యాంకు షేర్లు ఢమాల్

పిఎన్‌బి దెబ్బకు విలవిల.. సెన్సెక్స్ 287 పాయింట్లు డౌన్



ముంబై : పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) దెబ్బకు దేశీ స్టాక్ మార్కెట్లో పలు బ్యాంకులు విలవిల్లాడిపోయాయి. ఫలితంగా స్టాక్ మార్కెట్ నష్టాల్లోకి జారుకుంది. పిఎన్‌బి కుంభకోణంలో పలు ప్రధాన బ్యాంకులు కూడా భారీగా సొమ్ము నష్టపోయాయంటున్నారు. పిఎన్‌బి జారీ చేసిన లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ ఆధారంగా కుంభకోణంలో పాత్రధారి నీరవ్ మోదీ యాజమాన్యంలోని సంస్థలకు 4,000 కోట్ల రూపాయల రుణాలందించినట్టు ప్రకటించడంతో ఎస్‌బిఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్లు 1.5 శాతం నుంచి 4 శాతం నష్టపోయాయి. అలహాబాద్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ కూడా ఆ సంస్థలకు రుణాలిచ్చాయని అంటున్నారు. మొత్తం మీద ఈ కల్లోలం కారణంగా పలు బ్యాంకుల షేర్లు 52 వారాల కనిష్ఠ స్థాయిలను తాకాయి.

నిఫ్టీ బ్యాంక్ 437 పాయింట్లు నష్టపోగా పిఎస్‌యు బ్యాంక్ ఇండెక్స్ 2.5 శాతం నష్టపోయింది. పిఎన్‌బి షేరు వరుసగా మూడో రోజు కూడా భారీ నష్టాలను చవి చూడడంతో బ్యాంక్ మార్కెట్ విలువ 8731.50 కోట్ల రూపాయల మేరకు తుడిచిపెట్టుకుపోయింది. ఇంట్రాడేలో పిఎన్‌బి షేరు 6.03 శాతం నష్టపోయి 52 వారాల కనిష్ఠ స్థాయి 120.60 రూపాయలను తాకింది. కాని ట్రేడింగ్ ముగిసే సమయానికి నికరంగా 2.10 శాతం నష్టంతో 125.65 వద్ద ముగిసింది. ఈ మూడు రోజుల్లో బ్యాంక్ నష్టపోయిన మార్కెట్ విలువ 2016-17 ఆర్థిక సంవత్సరంలో ఆర్జించిన లాభం 1324 కోట్ల రూపాయలకు మూడురెట్లుంది. పిఎన్‌బి వ్యవహారంలో తమ బ్యాంక్ కూడా 1,900 కోట్ల రూపాయల మేరకు నష్టపోయిందని ప్రకటించడంతో యూనియన్ బ్యాంక్ షేరు 1.50 శాతం నష్టపోయింది. 2.55 శాతం నష్టంతో ఎస్‌బిఐ అగ్రస్థానంలో నిలిచింది. బ్యాంక్ ఆఫ్ ఇండియా 1.84 శాతం, బ్యాంక్ ఆఫ్ బరోడా 3.55 శాతం, అలహాబాద్ బ్యాంక్ 0.36 శాతం, యాక్సిస్ బ్యాంక్ 1.10 శాతం నష్టపోయాయి.

గీతాంజలిదీ అదే బాట

పిఎన్‌బి కుంభకోణంలో గీతాంజలి జెమ్స్ పాత్రపై దర్యాప్తు చేపట్టారన్న వార్తలతో వరుసగా మూడో రోజు ఆ షేరు భారీగా నష్టపోయింది. తీవ్ర అమ్మకాల వత్తిడి కారణంగా 20 శాతం వరకు నష్టాలతో ముగిసింది. మూడు రోజుల్లో కంపెనీ 300 కోట్ల రూపాయల మార్కెట్ విలువను కోల్పోయింది. నష్టపోయిన ఇతర జువెలరీ కంపెనీల్లో త్రిభువన్ దాస్ భీమ్‌జీ జవేరి, తంగమలై జువెలరీ కూడా ఉన్నాయి. ఒక్క రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ షేరు మాత్రం స్వల్ప లాభంతో ముగిసింది.

మరింత దిగజారిన సెన్సెక్స్

బ్యాంకు షేర్ల కుదుపుతోపాటు ఆటో, మెటల్, పిఎస్‌యు, యంత్రపరికరాలు, రియల్టీ కౌంటర్లలో సాగిన అమ్మకాలతో శుక్రవారం వారంతపు సెషన్‌లో స్టాక్ ఇండెక్స్‌లు భారీగా నష్టపోయాయి. ఉదయం లాభాలతోనే ప్రారంభమైన మార్కెట్‌ను లాభాల స్వీకరణ లక్ష్యంగా సాగిన అమ్మకాలు కుంగదీశాయి. ఇంట్రాడేలో 33957.33 పాయింట్ల వరకు దిగజారిన సెన్సెక్స్ చివరికి 287 పాయింట్లు నష్టపోయి 34010.76 వద్ద ముగిసింది. నిఫ్టీ 93.20 పాయింట్ల నష్టంతో 10452.30 వద్ద క్లోజయింది. వారం మొత్తానికి కూడా ఇండెక్స్‌లు ఫ్లాట్‌గా ముగిశాయి. వారంలో సెన్సెక్స్ కేవలం 5 పాయింట్లు లాభపడగా నిఫ్టీ 2.65 పాయింట్లు నష్టపోయింది. ఎగుమతులు పెరిగినా వాణిజ్య లోటు పెరగడం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బ తీసిందని మార్కెట్ వర్గాలన్నాయి.

- నష్టపోయిన ఇతర షేర్లలో మారుతి సుజుకి, భారతి ఎయిర్‌టెల్, అదానీ పోర్ట్స్, ఎల్ అండ్ టి, ఇండస్ ఇండ్ బ్యాంక్, టాటా మోటార్స్, కోల్ ఇండియా, పవర్‌గ్రిడ్, ఆర్ఐఎల్, యాక్సిస్ బ్యాంక్, హీరో మోటోకార్ప్, బజాజ్ ఆటో, మహీంద్రా, ఒఎన్‌జిసి, ఐటిసి ఉన్నాయి.
- ట్రెండ్‌కు ఎదురీది టిసిఎస్, ఇన్ఫోసిస్ లాభాలతో ముగిశాయి.
- స్టాక్ ఎక్స్ఛేంజీ గణాంకాల ప్రకారం గురువారం ఎఫ్‌పిఐలు రూ.240.29 కోట్ల విలువైన షేర్లు విక్రయించగా దేశీయ సంస్థలు రూ.49.92 కోట్ల షేర్లు కొనుగోలు చేశాయి.

హెచ్‌జి ఇన్‌ఫ్రా ఇష్యూ ధర రూ.263-270

త్వరలో జారీ చేయనున్న పబ్లిక్ ఇష్యూలో షేరు ధరను కనిష్ఠంగా 263 రూపాయలు, గరిష్ఠంగా 270 రూపాయలుగా హెచ్‌జి ఇన్‌ఫ్రా ఇంజనీరింగ్ ప్రకటించింది. 462 కోట్ల రూపాయల సమీకరణ లక్ష్యంగా ఈ కంపెనీ మార్కెట్‌లోకి వస్తోంది. ఇష్యూ ప్రారంభ తేదీ ఈ నెల 26 కాగా ముగింపు తేదీ 28. ఇష్యూ ద్వారా సమీకరించే నిధులను యంత్ర పరికరాల కొనుగోలుకు, రుణాల చెల్లింపునకు ఉపయోగించుకోనున్నట్టు తెలిపింది.

30 పైసలు నష్టపోయిన రూపాయి

అంతర్జాతీయ విపణిలో క్రూడాయిల్ ధరల పెరుగుదల, దిగజారిన వాణిజ్య లోటు ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయిని కుంగదీశాయి. ఒక్క రోజులోనే అమెరికన్ డాలర్ మారకంలో రూపాయి 30 పైసలు నష్టపోయి 64.21 వద్ద ముగిసింది. ఫిబ్రవరి ఒకటో తేదీన 44 పైసల నష్టం తర్వాత ఏర్పడిన మరో పెద్ద నష్టం ఇదే.

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,670	31,500	31,780	31,400	30,870
క్రితం ముగింపు	31,610	31,500	31,590	31,300	30,710
22 క్యారెట్లు	29,330	29,150	29,230	29,070	29,400
క్రితం ముగింపు	29,270	29,250	29,060	29,000	29,250
వెండి (కిలో)	39,750	40,000	39,800	39,800	41,900
క్రితం ముగింపు	39,800	40,000	39,700	40,000	41,800

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	70.00	విజయవాడ	75.00
కరీంనగర్	71.00	గుంటూరు	75.00
వరంగల్	72.00	ఒంగోలు	77.00
మహబూబ్‌నగర్	70.00	చిత్తూరు	63.00
కర్నూలు	70.00	నెల్లూరు	72.00
విశాఖపట్నం	71.00	అనంతపురం	73.00
గోదావరి	74.00		

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.50 — నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	391.00	చిత్తూరు	408.00
వరంగల్	393.00	చెన్నై	415.00
విజయవాడ	395.00	నమక్కల్	395.00
గోదావరి	395.00	బెంగళూరు	400.00
విశాఖపట్నం	400.00	ముంబై	435.00

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	58.09	67.36
పౌండ్	81.98	95.10
యూరో	72.77	84.41
ఆస్ట్రేలియా డాలర్	46.17	53.44
బహ్రెయిన్ దినార్	157.32	180.28
కువైట్ దినార్	176.25	219.41
ఒమని రియాల్	154.05	176.25
సౌదీ రియాల్	15.44	18.31
సింగపూర్ డాలర్	44.42	52.61
యుఎఇ దిరమ్	15.44	18.31

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు BSE

ACI INFOCOM 4.84(4.84)250
ADITYA SPIN. 8.49(8.82)40
AGRO TECH FO 639.25(650.85)1279
AISHWARYA TE 7(7.16)3304
ALPHAGEO (I) 818.25(832.7)3687
ALU FLUORIDE 115.9(120)12157
AMAR RAJA BA 814.65(826.65)38167
ANDHRA BANK 46.7(47)228970
ANDHRA CEMEN 11.25(11.61)46195
ANDHRA PETRO 57.8(59)65634
ANJANI PORTL 195.8(202.6)710
ASTRA MICRO 104.85(106.5)60931
AUROB.PHARMA 589.1(593.45)200335
AVANTEL LTD 551.4(578.8)9785
AVANTI FEEDS 2344(2371.5)7286
B.N.RATHI SE 40.95(42.85)10487
BALAJI AMINE 649.75(654.2)8649
BAMBINO AGRO 248.55(261.6)5794
BARTRONICSIN 13.11(13.34)15485
BHAGIRA.CHEM 297.9(304.9)2640
BHAGYA INL 46.35(48.3)13572
BHARATFIN 1007.05(1017.4)24010
BNR UDYOG 31.95(30.85)5626
CAMBRIDGE 78.4(79.95)205
CCHHL 14.1(14.8)48849
CCL PRODUCTS 283.85(284.6)2005
CELESTIAL 17.65(17.95)14501
CIL SECURITS 31(32)1313
COROM INTER 526.4(528.4)15337
CUBEX TUBING 23(23.55)6242
CYBERMATE 3.36(3.52)242644
CYIENT 608.65(617.95)17687
DANLAW TECH. 71.1(74.8)4035
DECAN CEMENT 588.4(599)1317
DHAN ROTO SP 46.3(44.1)993
DIAMONPOWER 14.8(15.75)82366
DIVI'S LAB. 1048.65(1048)76251
DIVYA.GRANIT 102.65(108)1209
DQ ENT 15(15.75)21344
DR.REDDY'S 2212.75(2194.45)54369
EMPEE SUGARS 4.45(4.64)12733
EVEREST ORG. 146(146.7)119
FACOR ALLOYS 3.41(3.47)172550
FIRSTOBJ 15.15(15.85)3175
GATI LTD. 113.5(114.55)78581
GAYATRI BIO 10.5(10.6)200
GAYATRI PROJ 216.95(223.35)112629
GENNEX LAB 4.55(4.59)129354
GMR INFRASTR 18.3(18.7)9470592
GODAVARI DRU 35(34.9)100
GOLDST INFRA 192.6(197.25)43488
GOLDSTONE EN 14.45(15.2)5655
GRANULES (I) 117.6(117.65)123533
GVK POWERINF 17.85(18.75)1552435
HBL P SYS 56.75(57.55)109951
HERITGFOOD 684.35(689.85)1388
HINDUSTN BIO .7(.7)500
I.C.S.A. IND 3.72(3.8)13394
IKF TECHNO .79(.83)68460
INCAP LTD. 97.1(101.45)597
IPAPPM 319.8(331.55)12410
IVRCL LTD 4.71(4.77)83139
KAKATIYA CEM 298.05(300.4)5622
KALLAM SPG. 28.3(27.3)207025
KARAN WOO-SN 1.99(1.9)868
KAVERI SEED 459.25(472.45)14995
KCP LTD 128.65(131.7)33524
KERNEX MICRO 45.7(46)2520
KNR CONST 314.2(321.1)30998
KREBS BIOCHM 157(161.5)1407
LANCO INFRA 1.26(1.32)873488
LOKESH MACH 65.65(67.75)17855
LOTUS CHOC 46.5(48)2636
MADHUCON PRJ 28.5(28.55)23405
MOLD-TEK TEC 61.2(63)12158
MOSCHIP SEMI 34.5(34.5)45765
MSR INDIA 45.25(45.5)11509
N C L IND. 241.55(243.45)23328
NACLIND 44.3(47.1)27227
NATCO PHARM 797.65(787.05)66716
NCC 124.85(123.4)895109
NEHA INTER. 7.6(7.51)15633
NETTLINX LTD 87.85(88.4)19337
NEULAND LAB. 713.4(711.7)415
NIHAR INFO 14.85(14.89)500
NILE LTD. 868.65(876.85)2736
NTL 4.11(4.3)4350
OIL COUNTRY 43(43.9)3191
PADMALAYA TE 4.9(4.9)4284
PALRED 95.45(98.2)796
PANYAM CEMEN 50.1(51.2)64790
PENNAR STEEL 61.05(62.4)52496
PFL INFOTECH 9.76(9.67)8767
PHYTOCHEM I. 62.7(64.15)4852
PITTI LAMIN. 88.6(93)20361
POKARNA LTD 212.95(215.8)4087
PRAJAY ENGS. 13.45(14.15)46118
PREMIER EXPL 391.45(396.2)2415
PRISM CEMENT 123(125.5)128521
RAIN 364.25(376.75)391256
RAJ PACKAGIN 37.55(38.7)1141
REG.CERAMIC 5.8(5.53)3010
RESTILE CER. 7.62(7.99)1225
SAGAR CEM. 1005.35(993.55)4298
SAMKRG PIST. 307.85(307.35)4496
SAMPRE NUTRI 55.1(57.55)6099
SANGHI IND. 111.4(116.35)76753
SATVAH.ISPAT 21.95(23.5)7888
SAVEN TECHNO 20.55(22)1701
SMPL 1.36(1.43)47643
SMS PHARMACE 91.85(92.7)4910
SREE RAYALA 175.5(186)1579
STEEL EXCH 33.35(33.5)31775
SUJANA INDUS .98(.95)76397
SURANATP 5.54(5.31)21973
SURYACHAKRA 1.29(1.35)44112
SURYAVA SPIN 6.7(7.04)927
SURYLAK.COTT 79.55(81.35)19421
SUVEN LIFE S 196.1(197.3)42434
TAJ GVK HOTL 171.15(176.45)7101
TANLA 31.35(32.35)70993
TCI INDUS. 935.55(891)6
TRANSCORP IN 35.65(36.75)3545
TRANSGENE BI 2.14(2.22)17401
TRANSPORT CO 283.5(291.5)1779
USHER AGRO 6.65(7)17997
VICEROY HOTE 15.75(15.9)43411
VIJAY TEXTIL 52.5(53.65)447
VIMTA LABS 212.45(212.85)4817
VIRAT CRANE 53.2(50.7)11229
VIRINCHI 119.4(125.75)74953
VISAKA IND. 689.65(716.05)14652
VISTA PHARMA 41.7(42.9)18400
VIVIMED LABS 83.25(84.6)90155
VST INDUS. 3300(3295.85)187
WATERBASE 323.35(312.9)298325
XLENERGY 2.78(2.92)5587
YBRANTDIGI 5.58(5.59)1153550
ZEN TECH 119.8(122)44775
ZENOTECH 45(44.7)21216

పోటీ నిరోధక ధోరణులకు పాల్పడితే

రూ.50 లక్షలు జరిమానా

టెలికాం ఆపరేటర్లకు ట్రాయ్ హెచ్చరిక

న్యూఢిల్లీ : టెలికాం ఆపరేటర్లు ఇతర పోటీదారులను తొక్కివేసే లక్ష్యంతో భారీగా చార్జీలు తగ్గించినట్టయితే ఒక్కో ఆపరేటర్‌పై ఒక్కో టెలికాం సర్కిల్‌కు 50 లక్షల రూపాయల జరిమానా విధించనున్నట్టు టెలికాం రెగ్యులేటరీ సంస్థ ట్రాయ్ హెచ్చరించింది. దేశవ్యాప్తంగా 22 టెలికాం సర్కిళ్లున్నాయి. భారతి ఎయిర్‌టెల్, వొడాఫోన్, ఐడియా సెల్యులార్, రిలయన్స్ జియో సుమారుగా అన్ని సర్కిళ్లలోనూ సేవలందిస్తున్నాయి. ఈ సంస్థలన్నీ పోటీదారులను తొక్కేసే లక్ష్యంతో చార్జీలు గణనీయంగా తగ్గిస్తున్నాయని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ట్రాయ్ కొత్త నిబంధనలు రూపొందించింది. ఒక సర్కిల్‌లో ఒక ఆపరేటర్ 30 శాతం మార్కెట్ వాటా కలిగి ఉండి పోటీదారులను నిరోధించే లక్ష్యంతో సగటు వ్యయం కన్నా తక్కువ స్థాయిలో చార్జీలు నిర్ణయించినట్టయితే ఆ ధరను పోటీ నిరోధక ధరగా పరిగణించాలని ట్రాయ్ కొత్త నిర్వచనం చెబుతోంది. ఏ టెలికాం ఆపరేటర్ అయినా ఎలాంటి వివక్షకు తావు లేకుండా ఒకే శ్రేణికి చెందిన సబ్‌స్క్రయిబర్లందరికీ ఒకే టారిఫ్ ప్లాన్ వర్తింపచేయాలని ట్రాయ్ చెబుతోంది. భారతి ఎయిర్‌టెల్ ఒకే టారిఫ్ ప్లాన్‌లోని సబ్‌స్క్రయిబర్లకు వేర్వేరు ప్రయోజనాలందిస్తూ నిబంధనలు ఉల్లంఘిస్తున్నదని ఆర్‌జియో గత ఏప్రిల్‌లో ఫిర్యాదు చేసింది.

ఎల్‌ఐసి ప్రీమియం ఆదాయంలో వృద్ధి

ముంబై : భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్‌ఐసి) డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలల కాలానికి 2,23,854 కోట్ల రూపాయల ప్రీమియం ఆదాయాన్ని ప్రకటించింది. అంతకు క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే వృద్ధి 11.47 శాతంగా ఉంది. నూతన వ్యాపారం 19.47 శాతం వృద్ధి చెంది 99,783 కోట్ల రూపాయలకు చేరుకుందని ఎల్‌ఐసి ఛైర్మన్ వికె శర్మ తెలిపారు. డిసెంబరు త్రైమాసికం నాటికే 2018 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న సింగిల్ ప్రీమియం టార్గెట్‌ను చేరుకున్నట్టు ఆయన చెప్పారు. ఎల్‌ఐసి మొత్తం ఆస్తులు 16.75 శాతం పెరిగి 28,51,190 కోట్ల రూపాయలకు చేరుకున్నట్టు ఆయన తెలిపారు.

కార్గో హ్యాండ్లింగ్‌లో విశాఖ పోర్టుకు 4వ స్థానం


విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): సరకు రవాణాలో విశాఖపట్నం పోర్టు 2017-18 ఆర్థిక సంవత్సరంలో దేశంలో నాలుగో స్థానంలో నిలుస్తున్నదని ఛైర్మన్ ఎం.తిరుమల కృష్ణబాబు తెలిపారు. ఆయన విశాఖలో శుక్రవారం విలేఖరులతో మాట్లాడుతూ గత ఏడాది కంటే ఈ ఏడాది సరకు రవాణాలో మూడు శాతం అభివృద్ధి సాధించామన్నారు. జనవరి 31 నాటికి అంతకు ముందు ఏడాది కంటే 16 లక్షల టన్నులు ఎక్కువగా హ్యాండిల్ చేశామన్నారు. 2016-17లో విశాఖ పోర్టు 610 లక్షల టన్నుల కార్గోను రవాణా చేయగా, ఈ ఏడాది 640 లక్షల టన్నులు పూర్తిచేస్తుందన్నారు. సరకు రవాణాలో కాండ్లా పోర్టు 1,100 లక్షల టన్నులతో మొదటి స్థానంలో ఉండగా, పారదీప్ పోర్టు 1000 లక్షల టన్నులతో రెండో స్థానంలో ఉందన్నారు.

స్మార్ట్‌ఫోన్ల కొనుగోలుపై జియో క్యాష్‌బ్యాక్

న్యూఢిల్లీ : రిలయన్స్ జియో మరో క్యాష్‌బ్యాక్ ఆఫర్‌ను ప్రకటించింది. సామ్‌సంగ్, షామీ, నోకియా, ఇంటెక్స్, హువావే, బ్లాక్‌బెర్రీ, సెల్‌కాన్ సహా 22 కంపెనీల స్మార్ట్ ఫోన్లను కొనుగోలు చేసే జియో కొత్త, పాత కస్టమర్లకు 2,200 రూపాయల వరకు క్యాష్‌బ్యాక్ ఇవ్వనున్నట్టు కంపెనీ వర్గాలు తెలిపాయి. జియో ఫుట్‌బాల్ ఆఫర్ కింద తక్షణమే ఈ క్యాష్‌బ్యాక్‌ను పొందే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. కొనుగోలు చేసిన కొత్త ఫోన్లను ఉపయోగించి ఫిబ్రవరి 15 నుంచి మార్చి 31 వరకు మొదటి రీచార్జ్ చేసే వారికి ఈ ఆఫర్ వర్తించనుంది. మార్చి 31 వరకు జియో కస్టమర్ 198 రూపాయలు లేదా 299 రూపాయలు రీచార్జ్ చేసుకుంటే.. 50 రూపాయల చొప్పున 44 వోచర్లు కస్టమర్ మైజియో ఖాతాలో జమకానున్నాయి. తర్వాతి రీచార్జుల సమయాల్లో వీటిని వినియోగించుకోవచ్చు.

ఎయిర్‌ట్రాఫిక్‌లో 20 శాతం వృద్ధి

2018కి అందమైన ఆరంభం: అశోక్ గజపతిరాజు



న్యూఢిల్లీ: ఈ ఏడాది జనవరిలో దేశీయ విమానయాన ప్రయాణికుల రద్దీ 20 శాతం పెరిగింది. గతనెల విమాన సంస్థలు 1.14 కోట్లకు పైగా ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చాయి. 2018 సంవత్సరానికి ఇది అందమైన ఆరంభం(లవ్‌లీ స్టార్ట్) అని పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతి రాజు అభివర్ణించారు. ప్రపంచంలో శరవేగంగా వృద్ధి చెందుతున్న విమాన మార్కెట్ మనదేనని ఆయన ట్వీట్ చేశారు. గత ఏడాది జనవరిలో 95.79 లక్షల మంది విమానాల ద్వారా ప్రయాణం చేయగా.. ఈసారి అదే నెలకు సంఖ్య 19.69 శాతం పెరిగి కోటి పద్నాలుగు లక్షలకు చేరుకుందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) డేటా విడుదల చేసింది. విమానయాన సేవల్లో ఇండిగో మార్కెట్ షేరు అత్యధికంగా 39.7 శాతంగా నమోదైంది. ప్రభుత్వ రంగ విమాన సంస్థ ఎయిర్ ఇండియా మార్కెట్ వాటా 13.3 శాతంగా నమోదైంది. ఇక జెట్‌ఎయిర్‌వేస్ 14.3 శాతం, స్పైస్ జెట్ 12.6 శాతం, గోఎయిర్ 9.6 శాతంగా ఉంది. విమాన ప్రయాణాల్లో ఆలస్యం కారణంగా గతనెలలో 3.14 లక్షల మంది ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. రద్దు కారణంగా 17,425 మందిపై ప్రభావం పడింది.

రూ. 90 కోట్లు డిపాజిట్ చేయండి

న్యూఢిల్లీ: వచ్చే నెల 31కల్లా రూ.90 కోట్లు డిపాజిట్ చేయాలని యునిటెక్ భూమిని కొనుగోలు చేయాలనుకుంటున్న సంస్థను సుప్రీం కోర్టు ఆదేశించింది. ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోయిన రియల్టీ సంస్థ యునిటెక్‌కు చెన్నైలో ఉన్న రూ.400 కోట్ల విలువైన భూమి కొనుగోలుకు ఓంశక్తి ఏజెన్సీస్ (మద్రాస్) ప్రైవేట్ లిమిటెడ్ అగ్రిమెంట్ కుదుర్చుకుంది. యునిటెక్‌తో అగ్రిమెంట్ ప్రకారం.. వచ్చే ఏడాది జూన్ కల్లా రూ.400 కోట్లు చెల్లించాల్సి ఉందని, అందులో రూ.90 కోట్లు ఈ మార్చి 31కల్లా కట్టాల్సి ఉందని ఓంశక్తి ఏజెన్సీ తరపున ప్రతినిధి కోర్టుకు వెల్లడించారు. ఆ సొమ్మును కోర్టు వద్ద డిపాజిట్ చేయాలని ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా అధ్యక్షతన ఏర్పాటైన బెంచ్ ప్రతినిధిని ఆదేశించింది.

పెనుభూతంగా మారుతున్న స్కామ్..

పిఎన్‌బి స్కామ్‌లో అంకెలు శరవేగంగా మారుతున్నాయి. ఒక బ్యాంకు ద్వారా అనేక బ్యాంకులకు నీరవ్‌మోదీ ఆయన మేనమామ, గీతాంజలి జెమ్స్ అధినేత చోక్సి ఏకకాలంలో కన్నంవేసి కొల్లగొట్టిన మొత్తం తొలి అంచనాల కంటే మించి ఉంటుందని భావిస్తున్నారు. ఇతర బ్యాంకుల్లోనూ ఇలాంటి స్కామ్‌లకు ఆస్కారం ఉందనే అనుమానాల నేపథ్యంలో యావత్ బ్యాంకింగ్ రంగం గడగడలాడుతోంది. వజ్రాలు, ఆభరణాల వ్యాపారంలోని సంస్థలు బ్యాంకులతో జరిపిన లావాదేవీలపై ఆర్‌బిఐ దృష్టి సారించింది. లోతుల్లోకి వెళ్లిన కొద్దీ ఈ స్కామ్‌లో ఇంకా అనేక కొత్త కోణాలు బయటపడే అవకాశం ఉందని అంటున్నారు.



నాడు



నేడు

నిండా మునిగిన రెండో పెద్ద బ్యాంక్

లాహోర్‌లో పుట్టింది, న్యూఢిల్లీకి మారింది. సుమారు 120 సంవత్సరాల ఘనచరిత్ర ఉంది. ప్రపంచంలోని భారీ ప్రభుత్వ సంస్థల్లో ఒకటిగా ఫోర్బ్స్ జాబితాలో కూడా స్థానం సాధించింది. అయితేనేం... చరిత్రలోనే దారుణమైన కుంభకోణంలో చిక్కుకుని ఇప్పుడు అభాసుపాలైంది. భవిష్యత్తే ప్రశ్నార్థకం చేసుకుంది.

పంజాబ్ నేషనల్ బ్యాంకు (పిఎన్‌బి)కు 120 సంవత్సరాల ఘన చరిత్ర ఉంది. దేశవిభజనకు చాలాకాలం ముందే ప్రస్తుతం పాకిస్తాన్‌లోని అతి ముఖ్య పట్టణాల్లో ఒకటైన లాహోర్ కేంద్రంగా ఈ బ్యాంకు ఏర్పాటైంది. బ్యాంకు ఏర్పాటులో స్వాతంత్ర్య సమర యోధుడు లాలా లజపతి రాయ్ కీలక పాత్ర పోషించారు. పూర్తిగా భారతీయుల సొమ్ముతో భారతీయులే నడిపే ఒక ఆర్థిక సంస్థ ఏర్పాటు చేసే అంశం పరిశీలించాలని హిందూ పునరుజ్జీవ ఉద్యమ సంస్థ ఆర్య సమాజ్ చేసిన ప్రతిపాదనను అందుకుని ఆయనే స్వయంగా ఆ భావాన్ని వ్యాప్తి చేసేందుకు నడుం బిగించారు. అప్పటికి దేశీయ ప్రముఖులైన పంజాబ్‌కు చెందిన తొలితరం పారిశ్రామికవేత్త లాలా హరికిషన్ లాల్, ట్రిబ్యూన్ పత్రిక వ్యవస్థాపకుడు దయాళ్ సింగ్ మజితియావంటి వారు సభ్యులుగా 1894లో బ్యాంకు వ్యవస్థాపక బోర్డు ఏర్పాటయింది. ఆ తర్వాత ఏడాదికి బ్యాంకు తొలి బ్రాంచ్ ఏర్పాటైంది. రెండు లక్షల రూపాయల మూలధనం, 20 వేల రూపాయల వర్కింగ్ క్యాపిటల్‌తో బ్యాంకు పని ప్రారంభించింది. ఈ బ్యాంకు తొలి ఖాతాదారుల్లో రాయ్ కూడా ఒకరు. ఆ తర్వాత మన తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, స్వాతంత్రోద్యమ సారథి మహాత్మా గాంధీ కూడా తమ ఖాతాలు ప్రారంభించారు. బ్యాంకు ప్రారంభం నుంచి ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొని మనుగడ సాగించింది. 1929 ప్రపంచ అంతర్జాతీయ సంక్షోభం సమయంలో 40 శాతం డిపాజిట్లున్న 92 శాఖలను బ్యాంకు మూసివేసింది. దేశ విభజన జరగడానికి కొన్ని నెలల ముందే బ్యాంకు ప్రధాన రిజిస్టర్డ్ కార్యాలయాన్ని లాహోర్ నుంచి న్యూఢిల్లీకి మార్చారు. 1950-1960 దశకంలో భారత్ బ్యాంక్, ఇండో కమర్షియల్ బ్యాంకులను విలీనం చేసుకుని తన స్థానాన్ని భారతీయ బ్యాంకింగ్ రంగంలో సుస్థిరం చేసుకుంది. 1969లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ జాతీయం చేసిన 14 బ్యాంకుల్లో పిఎన్‌బి కూడా ఒకటి. ఆ తర్వాత అది దశదిశలుగా విస్తరించి ప్రపంచంలోని అతిపెద్ద ప్రభుత్వ కంపెనీల ఫోర్బ్స్ జాబితాలో స్థానం పొందే స్థాయికి ఎదిగింది. పిఎన్‌బి దేశవిదేశాల్లో ఏడు వేల బ్రాంచీలతో భారత్‌కు చెందిన రెండో పెద్ద బ్యాంకుగా ఉంది.

పదేళ్లుగా దిగజారుడు

పిఎన్‌బి గత పదేళ్లుగా అత్యంత నిరాశావహంగా ఉంది. గత కొన్నేళ్లుగా భారత బ్యాంకింగ్ రంగం అసమర్థత, వివక్షాపూరిత రుణవితరణ, అవినీతితో అల్లాడుతోంది. ఈ జాడ్యం పిఎన్‌బికి కూడా అంటింది. 2010-2015 మధ్య కాలంలో పిఎన్‌బి సహా భారతీయ బ్యాంకులన్నీ ఒత్తిడిలోని తమ రుణాలు బట్టబయలు కాకుండా కప్పెడుతూ వస్తున్నాయి. పిఎన్‌బి మొండి బకాయిలు 2016 నాటికి 55,800 కోట్ల రూపాయలకు చేరాయి.

ఆడిటర్ల పాత్రపై ఐసిఎఐ దుర్భిణీ

పిఎన్‌బిలో బట్టబయలైన కుంభకోణం వెనుక ఆడిటర్ల పాత్ర ఏమైనా ఉన్నదా అనే కోణంలో ఐసిఎఐ పరిశీలన చేపట్టింది. ఈ సంఘటనకు దారితీసిన వ్యవస్థాత్మకమైన లోటుపాట్లపై అధ్యయనం చేసేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ఇతర దర్యాప్తు సంస్థలను కూడా కుంభకోణం సమాచారం అందించాలని కోరింది. ఐసిఎఐ అధ్యక్షుడు నవీన్ ఎన్‌డి గుప్తా తనంత తానుగానే వాస్తవాల పరిశీలన నిర్ణయం తీసుకున్నారు. పిఎన్‌బి, గీతాంజలి వ్యవహారాలపై దర్యాప్తు చేపట్టాలని ఫైనాన్షియల్ రిపోర్టింగ్ రివ్యూ బోర్డును కోరినట్టు ఆయన ప్రకటించారు. బ్యాంకు ఐసిఎఐ నిబంధనలకు, ఆడిటింగ్ ప్రమాణాలకు ఎంతమేరకు కట్టుబడిందన్న విషయం ఆ బోర్డు పరిశీలిస్తుంది. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలను నివారించేందుకు తీసుకోవలసిన దిద్దుబాటు చర్యలను కూడా అధ్యయన బృందం సూచిస్తుందని గుప్తా చెప్పారు.

బ్యాంకుకు కన్నం మరీ ఇంత తేలికా?

కొత్త ప్రశ్నలకు ఆస్కారమిస్తున్న పిఎన్‌బి కథనం.. బ్యాంకుల్లో ప్రజల సొమ్ముకు భద్రతేదీ?





నవలా కాదు.. సినిమా అంతకన్నా కాదు. కళ్ల ముందు నీరవ్ మోదీ ఆవిష్కరించిన నిజం. స్కీమ్ వేస్తే ఎంత అలవోకగా ఒక బ్యాంకును కొల్లగొట్ట వచ్చో నీరవ్ మోదీ నిరూపించిన తీరు బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసుల రంగాన్ని దిగ్భ్రాంతిలో ముంచెత్తింది. ఈ స్కామ్‌తో తలపండిన చార్టర్డ్ అకౌంటెంట్లు, ఇంపెక్స్ వ్యాపారులు, ఫైనాన్షియల్ సర్వీసుల రంగం నిపుణులకు దిమ్మతిరిగిపోయింది. నీరవ్ మోదీ తమ సౌజన్యంతో పరదేశంలోని బ్యాంకుల నుంచి సొమ్ము దండుకుంటున్న విషయం పిఎన్‌బికి తెలియదు. పిఎన్‌బి ఆమోదం లేకుండా ఆ బ్యాంకు పద్దులో భారీ ఎత్తున విదేశీ మారక రుణాలను నీరవ్ మోదీ కంపెనీలకు ముట్టజెప్పుతున్న విషయం విదేశాల్లోని యాక్సిస్, అలహాబాద్, యూనియన్‌బ్యాంక్ శాఖలకు తెలియదు. దేశంలోని రెండో అతిపెద్ద బ్యాంకు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించే పిఎన్‌బిలోనే ఈ స్థాయి స్కామ్ జరిగితే ఇతర బ్యాంకుల సంగతేమిటన్న ఆందోళన వ్యక్తమవుతోంది. లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్ఒయు) అనే ఒక పాపులర్ బ్యాంకింగ్ సర్వీసును మోసకారి పద్ధతుల్లో ఉపయోగించుకొని నీరవ్ మోదీ ఆయన సన్నిహిత బంధువు గీతాంజలి జువెలర్ అధినేత చోక్సి 123 ఏళ్ల ఘనచరిత్ర ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంకుకు కన్నం వేసిన వైనంలో అనేక కొత్త ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ మొత్తం స్కామ్‌లో ఇద్దరు ఉద్యోగులు కీలక పాత్ర పోషించారని పిఎన్‌బి వెల్లడించింది. మోదీ కంపెనీల పేరిట ఎల్ఒయులను సృష్టించి బ్యాంకు రికార్డుల్లో నమోదు చేయకుండా స్విఫ్ట్ ద్వారా నేరుగా విదేశాల్లోని భారతీయ బ్యాంకు శాఖలకు వివరాలు పంపినట్టు పిఎన్‌బి చెబుతోంది. పిఎన్‌బి కథనం అనేక ప్రశ్నలకు ఆస్కారం ఇస్తోంది.

- ఈ స్కామ్ 2011 నుంచే సాగుతోందని పిఎన్‌బి వెల్లడించింది. ఈ ఏడేళ్లలో పిఎన్‌బి జారీ చేసిన ఎల్ఒయుల ఆధారంగా మోదీ కంపెనీలకు ఫారెక్స్ రుణాలను సమకూర్చిన బ్యాంకులు ఒక్కసారి కూడా తమ సొమ్ము కోసం పిఎన్‌బిని సంప్రదించలేదా?
- స్విఫ్ట్ లావాదేవీలు, కోర్ బ్యాంకింగ్ సిస్టమ్‌లో నమోదైన లావాదేవీల మధ్య తేడా ఉన్న విషయం ఈ ఆరేడు సంవత్సరాల్లో జరిగిన పిఎన్‌బి పద్దుల ఆడిటింగ్, వార్షిక బాలెన్స్‌షీట్ తయారీ సందర్భాల్లో ఒక్కసారి కూడా బయటపడలేదా? ఏటా ఆర్‌బిఐ కూడా బ్యాంకు పద్దులను క్షుణ్ణంగా ఆడిట్ చేస్తుంది. ఈ దెబ్బతో ఆర్‌బిఐ విశ్వసనీయతను కూడా సందేహించాలా?
- మోదీ కంపెనీల ప్రతినిధుల మళ్లీ వచ్చి గతంలో ఇచ్చినట్టుగానే ఎలాంటి గ్యారంటీలు లేకుండా ఎల్ఒయులను ఇవ్వాలని కోరడంతో ఈ స్కామ్ బయటకు వచ్చినట్టు పిఎన్‌బి చెబుతోంది. తమ పేరుతో గతంలో అక్రమంగా, అనధికారికంగా ఎల్ఒయులు జారీ చేసిన అధికారి రిటైర్ అయిన విషయం తెలిసి కూడా మోదీ కంపెనీల ప్రతినిధులు పిఎన్‌బి బ్యాంకు శాఖకే ఎందుకు వచ్చినట్టు?
- పిఎన్‌బి పద్దులను, బోగస్ ఎల్ఒయుల ఆధారంగా రుణాలిచ్చిన బ్యాంకుల పద్దులను, మోదీ కంపెనీలు, గీతాంజలి జువెలర్స్ పద్దులను ప్రతి ఏటా ఆడిటర్స్ తనిఖీ చేస్తూనే ఉంటారు. చాపకింద నీరులా ఇంత పెద్ద స్కామ్ సాగుతుంటే లెక్కల్లో కనిపిస్తున్న తేడాలను ఆడిటర్లు ఎందుకు గుర్తించలేకపోయారు? ఈ మొత్తం స్కామ్‌లో ఆడిటర్ల పాత్ర ఏమిటీ?
- మొదట ఒక జూనియర్ అధికారి ఈ స్కామ్‌లో కీలక పాత్రధారి అని చెప్పిన పిఎన్‌బి ఆ తర్వాత ఇద్దరు ఉద్యోగుల ప్రమేయం ఉందని ప్రకటించింది. తాజాగా 18 మందిని సస్పెండ్ చేసింది. ఈ స్కామ్ సైజు చూస్తుంటే ఇంకా ఎన్ని తలలపై వేటు పడుతుందో చూడాల్సి ఉంది. నిజంగానే ఈ స్కామ్ పిఎన్‌బి వివరిస్తున్నంత అమాయకంగా జరిగిపోయిందా, లేక పైనుంచి కింది వరకు పెద్ద తలకాయల ప్రమేయం ఉందా? చిన్నవారిని బలి చేసి పెద్ద వారు తప్పించుకునే అవకాశం ఉందా?
- బోగస్ ఎల్ఒయులపై రుణాలు మంజూరు చేసిన ఇతర బ్యాంకుల ఉద్యోగులకు కూడా ఈ స్కామ్‌లో ప్రమేయం ఉన్నట్టు పిఎన్‌బి చెబుతోంది. ఈ ఆరోపణలపై ఆర్‌బిఐ, ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇప్పటి వరకు ఎందుకు స్పందించలేదు. పిఎన్‌బి ఆరోపణలు నిజమైతే ఈ స్కామ్ బ్యాంకింగ్ రంగంలో లోతుగా విస్తరించి ఉన్నట్టు భావించాలి.
- ఈ స్కామ్ ప్రభుత్వం దృష్టికి ఎప్పుడు వచ్చింది? 2016లోనే ఉప్పందినట్టుగా చెబుతున్నారు. మరి ప్రభుత్వం, నిఘా సంస్థలు ఏం చేస్తున్నట్టు, నీరవ్ మోదీ ఆయన కుటుంబం దేశం విడిచి పోతుంటే చోద్యం చూస్తూ కూర్చోవడంలో మతలబు ఏమిటీ?
- ఈ స్కామ్‌లో కొల్లగొట్టిన ధనాన్ని నీరవ్‌మోదీ ఏం చేశారు? ఎక్కడికి మళ్లించారు? ఏ దేశ బ్యాంకుల్లో దాచారు? లేదా ఎక్కడ ఇన్వెస్ట్ చేశారు? ఈ నిధుల గురించిన ప్రాథమిక సమాచారమైనా ఉందా?
- మొత్తం ఎన్ని బ్యాంకులకు చెందిన శాఖలు బోగస్ ఎల్ఒయులపై రుణాలు మంజూరు చేశాయి? ఈ ఎల్ఒయులను ట్రేడింగ్‌లో ఏ బ్యాంకులు విక్రయించాయి? వాటిని కొనుగోలు చేసిన బ్యాంకుల పేరేమిటీ? ఈ ఎల్ఒయులపై ట్రేడింగ్ జరిగి ఉంటే ఈ స్కామ్ కారణంగా నష్టపోయే బ్యాంకుల సంఖ్య పెరిగే అవకాశం ఉందా?

అందుకే ముంబై బ్రాడీ హౌజ్ శాఖ

ఈ స్కామ్‌లో నిందితులు తెలివిగానే పిఎన్‌బి ముంబై బ్రాడీహౌజ్ శాఖను ఎంచుకున్నట్టుగా భావిస్తున్నారు. ఈ శాఖలోనే స్విఫ్ట్‌ను కోర్ బ్యాంకింగ్‌తో అనుసంధానం చేయలేదు. స్విఫ్ట్‌ను నిర్వహించే ఇద్దరు కీలక ఉద్యోగులను అవినీతితో ప్రలోభపెట్టి లొంగదీసుకొని ఉంటారు. ఈ ఎల్ఒయులకు 90 రోజుల రోల్ ఓవర్ పీరియడ్ ఉంటుంది. చార్జీలు తీసుకుంటూ వీటిని రోల్ ఓవర్ చేస్తూ వచ్చారు. డిజిఎంగా ఉన్న గోకుల్‌నాథ్ శెట్టి ఏకంగా 365 రోజులకు రోల్ ఓవర్ చేయడంతో దొరికిపోయే అవకాశం లేకుండా మోదీ అండ్ కో తమ స్కామ్‌ను కొనసాగించారు.



ఆభరణాల వ్యాపారంలో చీకటి కోణాలు

బోగస్ లావాదేవీలు, బ్యాలెన్స్ షీట్‌లో అడ్డగోలు లెక్కలు

బ్యాంకు రుణాల ఎగవేతలు షరామామూలే..

దేశంలోని అతిపెద్ద బ్యాంకు రుణ ఎగవేతదారుల్లో విన్సమ్ డైమండ్స్ గ్రూప్ ఒకటి. మూడు ప్రభుత్వ రంగ బ్యాంకులు... సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐడిబిఐ బ్యాంక్, విజయ బ్యాంక్‌ను దగాచేసి బ్యాంకుల నుంచి తీసుకున్న 1,530 కోట్ల రూపాయలను సొంత ఖాతాల్లోకి మళ్లించిన ఆరోపణలపై విన్సమ్ డైమండ్స్ గ్రూప్ ప్రమోటర్లపై గతేడాది సిబిఐ అరడజనుకు పైగా కేసులు నమోదు చేసింది. 2013లో సూరత్ కేంద్రంగా ఉన్న విన్సెంట్ డైమండ్స్ బ్యాంకులకు 4,500 కోట్ల రూపాయల రుణాలను ఎగవేసింది. ఈ సంస్థ ప్రమోటర్ జతిన్ మోహతా ఏకంగా భారత్ పౌరసత్వాన్ని వదులుకొని సెయింట్ కిట్స్‌లో సెటిలయ్యారు. 2010లో దిగ్గజ బ్యాంకు దేశంలోని అతిపెద్ద డైమండ్స్ వ్యాపార సంస్థల్లో ఒకటైన జెబి డైమండ్‌కు వ్యతిరేకంగా ఆర్‌బిఐని ఆశ్రయించింది. ఎస్‌బిఐ సారథ్యంలోని బ్యాంకు కన్సార్షియం నుంచి 800 కోట్ల రూపాయల రుణాలను నొక్కేసిన జెబి డైమండ్ ఈ సొమ్మును దారిమళ్లించినట్టు ఎస్‌బిఐ ఆరోపించింది.

మెరిసేదంతా బంగారం కాదన్నట్టుగానే డైమండ్స్, ఆభరణాల వ్యాపారం ప్రమోటర్లకు కోట్లు సంపాదించిపెట్టినా బ్యాంకులు, షేరు హోల్డర్లను ముంచిన ఉదంతాలు చాలా ఉన్నాయి. తాజాగా నీరవ్‌మోదీ ఆయన మేనమామ చోక్సిల స్కామ్ బయటకు రావడంతో ఇప్పుడు ఆభరణాలు, వజ్రాల వ్యాపారులకు బ్యాంకుల రుణాలు లభించడం కష్టమేనని పరిశ్రమవర్గాలు అంటున్నాయి. కొద్దికాలంపాటైనా బ్యాంకులు ఈ సంస్థలను దూరం పెట్టే అవకాశం ఉంది.

రౌండ్‌ట్రిప్పింగ్‌తో బ్యాలెన్స్‌షీట్‌కు హంగులు

ఆభరణాలు, వజ్రాల వ్యాపారంలోని కంపెనీలు చాలా తరుచుగా రౌండ్‌ట్రిప్పింగ్‌కు పాల్పడుతుంటాయి. అంటే డొల్ల కంపెనీలతో ఒకే కన్‌సైన్‌మెంట్‌పై అదేపనిగా లావాదేవీలు జరుపుతూ భారీ టర్నోవర్‌ను చూపిస్తాయి. టర్నోవర్‌ను లాభాలను కృత్రిమంగా పెంచిచూపడం ద్వారా బ్యాంకుల నుంచి మరింత పెద్ద మొత్తంలో రుణాలను రాబట్టే వెసులుబాటు లభిస్తుంది. తాజాగా నీరవ్ మోదీ కేసులోనూ ఆయనకూ ఆయన బంధువులకు కలిపి దాదాపు 150 షెల్ కంపెనీలు ఉన్నట్టు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఇలా మోసపూరితంగా బ్యాంకుల నుంచి రాబట్టిన రుణాలను కంపెనీల ఇతరేతర అవసరాలకు, వ్యాపారాలకు మళ్లిస్తుంటాయి. రెండు కారణాల వల్ల బ్యాంకుల నుంచి లోటు లేకుండా రుణాలు వజ్ర వ్యాపారులకు అందుతుంటాయి. ప్రస్తుతం మోదీ విషయంలోనూ ఆయనకున్న రాజకీయ సంబంధాలపై గుసగుసలు వినవస్తున్నాయి.

మోసగాళ్లను కఠినంగా శిక్షించాలి

అసోచామ్, ఫిక్కీ డిమాండ్

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను మోసగించిన కంపెనీలను కఠినంగా శిక్షించాలని భారత పరిశ్రమ డిమాండ్ చేసింది. ఒక్క శాఖ ద్వారా ఇంత భారీ స్థాయిలో మోసపూరిత లావాదేవీలు జరిగాయంటే.. బ్యాంకుల పరిస్థితి ఏవిధంగా ఉందో తెలుస్తోందని, ఇలాంటి పరిస్థితి ఆందోళనను కూడా కలిగిస్తోందని పరిశ్రమల సంఘం అసోచామ్ పేర్కొంది. డిప్యూటీ మేనేజర్ స్థాయి అధికారి ఇలాంటి లావాదేవీలను సులభంగా నిర్వహించగలిగారంటే.. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రిస్క్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ ఎంత లోపభూయిష్టంగా ఉందో అర్థం అవుతోందని అసోచామ్ సెక్రటరీ జనరల్ డిఎస్ రావత్ అన్నారు. తాజా పరిణామం బ్యాంకింగ్ రంగంలో ఉన్న లోపాలను ఎత్తి చూపుతోందని, ఇలాంటి సంఘటనతో కళ్లు తెరిచి అప్రమత్తం కావాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంత పెద్ద మోసాన్ని ఆర్‌బిఐ కూడా పసిగట్టలేకపోయిందన్నారు. బ్యాంకులు ఇప్పటికే మొండి పద్దులతో యుద్ధం చేసే పరిస్థితి నెలకొందని, ఇలాంటి తరుణంలో ఇంత భారీ మోసం బయటపడటం ఆందోళనను కలిగిస్తోందని చెప్పారు. పిఎన్‌బి సంఘటన నేపథ్యంలో డిపాజిట్ల విశ్వాసం ఎంత మాత్రం తగ్గకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పిఎన్‌బి మోసం కేసులో పాలు పంచుకున్న వారిని చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాల్సిందేనని ఫిక్కీ ప్రెసిడెంట్ రాశేష్ షా అన్నారు. వ్యాపార సంస్థలకు తప్పకుండా స్వేచ్ఛ ఉండాల్సిందేనని, అయితే తాము అక్రమ, అనైతిక వ్యాపార కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించేది లేదని ఆయన చెప్పారు.

ఉప్పందించినా పట్టించుకోలేదు..



ఈ భారీ స్కామ్ గురించి సమాచారం ఉన్నా ప్రభుత్వ నియంత్రణ, నిఘా సంస్థలు పట్టించుకోలేదా? నీరవ్ మోదీ స్కామ్ గురించి 2016 జూలైలోనే ప్రధాని కార్యాలయం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సిబిఐ, సెబి, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆర్ఒసిలకు ఉప్పందించినట్టు ఎస్‌వి హరిప్రసాద్ అనే వ్యక్తి వెల్లడించారు. మోదీ సన్నిహిత బంధువు, గీతాంజలి జెమ్స్ ఎండి మెహుల్ చోక్సీతో కలిసి 10 కోట్ల రూపాయల ఇన్వెస్ట్‌మెంట్‌తో ఫ్రాంఛైజీ స్టోర్ ప్రారంభించినట్టు ఆయన చెప్పారు. ఈ స్టోర్‌కు సంబంధించి చోక్సీ ఒప్పందాలను ఉల్లంఘించడంతో తాను కేసులు కూడా పెట్టానని ఆయన తెలిపారని ఎఎన్‌ఐ వెల్లడించింది. ఇదిలా ఉండగా... ఈ స్కామ్‌లో మరో పాత్రధారి గీతాంజలి జెమ్స్ అధినేత మెహుల్ చోక్సీ గురించి గతంలోనే తాను హెచ్చరించినట్టు అలహాబాద్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ దినేష్ దూబే వెల్లడించారు. 2013లో తాను అలహాబాద్ బ్యాంకులో పనిచేస్తున్న సమయంలో ప్రస్తుత పిఎన్‌బి సిఎండి సునీల్ మెహతా తమ జనరల్ మేనేజర్‌గా ఉండేవారని, అప్పట్లోనే గీతాంజలికి గతంలో ఇచ్చిన రుణాలను వసూలు చేయకుండా కొత్త రుణాలు ఇవ్వొద్దని తాను హెచ్చరించినా పట్టించుకోలేదని ఆయన ఇండియా టుడేకు తెలిపారు.

లైక్ ఎ డైమండ్ ఇన్ ది స్కామ్..

ఎవరీ నీరవ్ మోదీ? దేశంలో ఇప్పుడెక్కడ చూసినా ఈయన గురించే చర్చ. వేల కోట్ల రూపాయల బ్యాంకింగ్ మోసానికి పాల్పడిన ఈ వజ్రాల వ్యాపారి.. ఇప్పటివరకు సంపన్నులు, సెలబ్రిటీలే తప్ప సామాన్యులకు తెలియని వ్యక్తి. నిన్న మొన్నటి వరకు ధనిక వర్గానికీ వజ్రపు మెరుపులే తప్ప అతడి మరో పార్శ్వం తెలియదు. ఈ గుజరాతీ బ్యాక్‌గ్రౌండ్ ఎలా ఉందంటే..



నీరవ్ మోదీ పుట్టి పెరిగినదంతా వజ్రాల్లోనే. వజ్రాలే అతడి ప్రపంచం. ఆయన తాత ముత్తాల నుంచి ఇదే వ్యాపారం. నీరవ్ పుట్టింది భారత్‌లోనే అయినా పెరిగింది మాత్రం వజ్రాలకు ప్రపంచ రాజధాని అయిన బెల్జియంలోని ఆంట్‌వెర్ప్‌లో. పుట్టుక, బాల్యం, యవ్వనం నుంచి వ్యాపారం, పేరు ప్రతిష్ఠలు, అపకీర్తి వరకు మోదీ జీవితంలోని ప్రతి కీలక మైలురాయి వజ్రంతోనే ముడిపడి ఉంది.

పందొమ్మిదేళ్లకే అరంగేట్రం

యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలోని వార్టన్ స్కూల్‌లో చదువు మధ్యలో మానేసిన నీరవ్.. 19 ఏళ్ల వయసులో తన కుటుంబ వ్యాపారంలోకి అడుగు పెట్టాడు. ముంబైలోని తన మామ, గీతాంజలి జెమ్స్ చైర్మన్ మెహుల్ చోక్సీ వద్ద డైమండ్ వ్యాపారంపై మెళకువలు నేర్చుకున్నాడు. ఆ అనుభవమే తన సొంత వ్యాపారానికి పునాది వేసింది. 2000 సంవత్సరంలో ఫైర్ స్టార్ డైమండ్ ఇంటర్నేషనల్ అనే సంస్థను స్థాపించాడు. వజ్రాల కొనుగోలు, విక్రయం నిర్వహించేవాడు. 2002లో ఓ డైమండ్ కంపెనీ నుంచి జువెలరీ కాంట్రాక్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ ఆర్డరు లభించింది. 2005లో అమెరికాకు చెందిన ఫ్రెడ్రిక్ గోల్డ్‌మన్ కంపెనీ నుంచి జువెలరీ డిస్ట్రిబ్యూషన్ అండ్ మార్కెటింగ్ వ్యాపారాన్ని కొనుగోలు చేశాడు. అమెరికా మార్కెట్లో ఎదిగేందుకు ఈ డీల్ తనకు బాగా ఉపయోగపడింది. 2007లో అతి పురాతన బ్రైడల్ జువెలరీ మాన్యుఫ్యాక్చరర్ శాండ్‌బర్గ్ అండ్ సికోర్స్కీను టేకోవర్ చేశాడు.

ఫ్యాషన్ రాజధానుల్లో రిటైల్ స్టోర్లు

మార్చి 2014లో నీరవ్ మోదీ రిటైల్ స్టోర్ల విభాగంలోకి సైతం ప్రవేశించాడు. తొలి స్టోర్ న్యూఢిల్లీలోని డిఫెన్స్ కాలనీలో ఏర్పాటు చేశాడు. ఆ తర్వాత ముంబై, హాంకాంగ్, న్యూయార్క్, లండన్, లాస్‌వెగాస్, హోనొలులు, బీజింగ్, సింగపూర్ వంటి నగరాల్లో ఇప్పటివరకు మొత్తం 15 అవుట్‌లెట్లను ప్రారంభించాడు. 2025కల్లా 100 స్టోర్లను ప్రారంభించాలని, ప్రపంచంలో ఫ్యాషన్ అడ్డాలైన ప్రతి నగరానికి విస్తరించడం తన లక్ష్యమని గతంలో ఓ ఇంటర్వ్యూలో నీరవ్ తెలిపారు.


2009 నుంచి వేగంగా విస్తరణ

నీరవ్ 2009 నుంచి వ్యాపారాన్ని వేగంగా విస్తరించుకుంటూ వచ్చాడు. దుబాయ్, హాంకాంగ్‌లలో మార్కెటింగ్ కార్యాలయాలు.. ఆంట్‌వెర్ప్‌లో వజ్రాల సేకరణ కేంద్రం ఇంకా.. మాస్కో, జోహన్నెస్‌బర్గ్‌లో మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లను ఏర్పాటు చేసింది నీరవ్ సంస్థ. 2009లోనే లగ్జరీ ఫ్యాషన్ జువెలరీ విభాగంలోకి ప్రవేశించాడు. ఆ నిర్ణయం అతడికి అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టింది. ఓ స్నేహితురాలు కోరిక మేరకు చెవి కమ్మలు డిజైనింగ్ చేసివ్వగా, వాటి డిజైనింగ్ చూసి ఆమె తనను ఎంతగానో మెచ్చుకుందని, అప్పుడే తనకు అంతర్జాతీయంగా విక్రయించగలిగే దేశీ లగ్జరీ జువెలరీ బ్రాండ్‌ను క్రియేట్ చేయాలన్న ఆలోచన వచ్చిందని ఓ ఇంటర్వ్యూలో నీరవ్ మోదీ చెప్పాడు.



నటి నోమివాట్స్‌తో నీరవ్

సొంత పేరే అంతర్జాతీయ బ్రాండ్



డిసెంబరు 2010లో నీరవ్ తన సొంత పేరుతో డైమండ్ జువెలరీ బ్రాండ్‌ను ప్రారంభించాడు. నీరవ్ మోదీ బ్రాండ్‌కు ప్రముఖ బాలీవుడ్ నటీమణి ప్రియాంక చోప్రా ప్రచారకర్తగా వ్యవహరించింది. ఆయన బ్రాండ్‌నేమ్ జువెలరీ అంటే సంపన్నవర్గాలకు క్రేజ్. బాలీవుడ్ తారల నుంచి హాలీవుడ్ హీరోయిన్ల వరకు రెడ్‌కార్పెట్ సమయంలో ధరించాలని కోరుకునేది ఈయన బ్రాండ్ ఆభరాలే. ప్రముఖ హాలీవుడ్ నటీమణి కేట్‌విన్స్‌లెట్ 2016 ఆస్కార్ అవార్డుల ఫంక్షన్ కోసం నీరవ్ మోదీ నెక్లెస్‌ను ధరించింది. అంటే, గ్లోబల్ మార్కెట్లోనూ ఇతగాడికి ఎంత పేరుందో చెప్పొచ్చు.

ఫోర్బ్స్ జాబితాలో నీరవ్ మెరుపుల్..

ఫోర్బ్స్ మ్యాగజైన్ 2013 సంవత్సరానికి విడుదల చేసిన ప్రపంచ కుబేరుల జాబితాలో తొలిసారిగా నీరవ్ మోదీ పేరు దర్శనమిచ్చింది. 2017కు విడుదల చేసిన గ్లోబల్ లిస్టులో ఆయనకు 1,234వ స్థానం, ఇండియాలో 85వ స్థానం దక్కింది. ఫోర్బ్స్‌లో ఎంట్రీతో అందరితోపాటు దర్యాప్తు ఏజెన్సీల దృష్టి కూడా ఆయనపై పడింది. దిగుమతి చేసుకున్న, డ్యూటీ ఫ్రీ, కట్ అండ్ పాలిష్డ్ డైమండ్స్, ముత్యాలను దేశీయ మార్కెట్లోకి అక్రమంగా తరలించిన ఆరోపణలపై 2014లోనే నీరవ్‌ను డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ) ప్రశ్నించింది. పిఎన్‌బిని రూ.11వేల కోట్లకు పైగా మోసం చేసిన కేసుతో అతగాడి చీకటి కోణం బయటపడింది. ఇనాళ్ల వెలుగుజిలుగుల జీవితంపై కారు మబ్బులు కమ్ముకున్నాయి.

దేశీయ రియల్టీ రంగంలో పునరుజ్జీవం



రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా), వస్తుసేవల పన్ను (జిఎస్‌టి) వంటి నిర్మాణాత్మక సంస్కరణలను రియల్ ఎస్టేట్ రంగం క్రమంగా ఆకళింపు చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా రియల్టీలో సెంటిమెంట్ సానుకూలంగా మారుతోంది. ఫిక్కీ-నరెడ్కో-నైట్‌ఫ్రాంట్ ఇండియాలు ఆవిష్కరించిన 2017 నాలుగో త్రైమాసికం (అక్టోబరు-డిసెంబరు) రియల్ ఎస్టేట్ సెంటిమెంట్ సూచీ ఆధారంగా ఈ విషయం స్పష్టమవుతోంది. గత ఏడాది రెండు, మూడు త్రైమాసికాల్లో రియల్ ఎస్టేట్ రంగంలో సెంటిమెంట్ ప్రతికూలంగా ఉంది. కానీ చివరి త్రైమాసికంలో పరిస్థితి సానుకూలంగా మారిపోయింది. భవిష్యత్‌కు సంబంధించిన సెంటిమెంట్ కూడా పుంజుకుందని, పెద్ద నోట్ల రద్దుకు ముందు ఉన్న పరిస్థితులు కనిపిస్తున్నాయని ఈ సూచీ ద్వారా తెలుస్తోంది. డెవలపర్లు, ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్ల సెంటిమెంట్ కూడా సానుకూలంగా మారింది. అందుబాటు ధరల్లో గృహాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగానే విధానాలు రూపొందిస్తోంది. ఈ నేపథ్యంలో మధ్యతరహా, అందుబాటు ధరల్లో ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించేందుకు రియల్ ఎస్టేట్ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. అమ్మకాల్లోనూ ఆశావాదం పెరిగిపోతోంది. రానున్న ఆరు నెలల కాలంలో ఆఫీస్ మార్కెట్ మరింతగా మెరుగుపడే అవకాశం ఉందని నైట్‌ఫ్రాంక్ ఇండియా చీఫ్ ఎకనామిస్ట్, నేషనల్ డైరెక్టర్ (రీసెర్చ్) సమంతక్ దాస్ చెబుతున్నారు.

రియల్‌కు మేలు మలుపు 'రెరా'

ఆంధ్రప్రదేశ్ రెరా అథారిటీ డైరెక్టర్ సిహెచ్‌వి సాంబశివరావు

ఆంధ్రప్రదేశ్‌లో రెరా చట్టం అమల్లోకి వచ్చేసింది. ప్రభుత్వం అధికారికంగా వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభించడంతో రియల్ ఎస్టేట్ డెవలపర్లు, బ్రోకర్లు, ఇతర స్టేక్ హోల్డర్లు ఇక రిజిస్ట్రేషన్ లేకుండా రియల్ రంగంలో కార్యకలాపాలు చేపట్టడానికి అవకాశం లేదు. సుమారు 38 సంవత్సరాలపాటు విజిటిఎం ఉడా, ఎపిసిఆర్‌డిఎల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించి, ప్రస్తుతం ఎపి రెరా అథారిటీ డైరెక్టర్ (ప్లానింగ్)గా వ్యవహరిస్తున్న సిహెచ్ వి సాంబశివరావు రెరా అధికారిక వెబ్‌సైట్ (www.rera.ap.gov.in) ప్రారంభమైన సందర్భంగా 'ఆంధ్రజ్యోతి రియల్ ఎస్టేట్' ప్రతినిధితో ఎపి రెరా గురించి పలు వివరాలను పంచుకున్నారు.

ఉభయతారకం....

'ఎపి రెరా (ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ) కొందరు రియల్టర్లు అభిప్రాయపడుతున్నట్లు కేవలం కొనుగోలుదారులకు మాత్రమే లబ్ధి చేకూర్చే చట్టం కాదు. ఒక పక్క వారి ప్రయోజనాలను పరిరక్షిస్తూనే మరొకపక్క స్థిరాస్తి వ్యాపారులు, డెవలపర్లు, ప్రమోటర్ల శ్రేయస్సును సైతం కాంక్షిస్తూ ఇది రూపొందింది. స్థిరాస్తి రంగంలో ఇప్పటి మాదిరిగా గోప్యతకు, అస్తవ్యస్త విధానాలకు, అవకతవకలకు తావివ్వని వ్యవస్థను ఏర్పాటు చేయడమే ఈ చట్టం లక్ష్యం. ఈ చట్టం వల్ల స్థిరాస్తి లావాదేవీల్లో పారదర్శకత, రియాల్టీ ప్రాజెక్టులు సకాలంలో, నాణ్యంగా పూర్తయ్యేలా చూసేందుకు అవకాశం లభిస్తుంది. ఒప్పందాల ప్రకారం ప్రాజెక్టులు పూర్తికాకున్నా, కొనుగోలుదార్లకు ఏమైనా సమస్యలు తలెత్తినా రెరా అథార్టీ పరిష్కారానికి సహకరిస్తుంది.

ప్రమోటర్లు పాటించాల్సిన అంశాలు

- నిర్మాణంలో ఉన్న, ప్రతిపాదనలో ఉన్న అపార్ట్‌మెంట్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, అభివృద్ధి పరుస్తున్న లేఅవుట్లు ఇత్యాదివన్నీ అప్రూవ్డ్ ప్లాన్లు, ప్రాజెక్టు స్పెసిఫికేషన్లకు కట్టుబడి ఉండాలి.
- ఎపి రెరా వద్ద ఆయా ప్రాజెక్టులను రిజిస్ట్రేషన్ చేయించుకున్న తర్వాత మాత్రమే వాటికి సంబంధించిన ప్రకటనలుగానీ, ప్రాస్పెక్టస్‌ల పంపిణీగానీ చేపట్టాలి. అన్ని రకాల ప్రకటనల్లోనూ తప్పనిసరిగా 'రెరా' రిజిస్ట్రేషన్ నెంబర్ పేర్కొనాలి. ఈ నిబంధనను ఉల్లంఘించి, స్థిరాస్తి ప్రాజెక్టుల అమ్మకాలు చేపడితే నేరంగా పరిగణిస్తారు. వాటి నిర్మాణాన్ని ఆపివేసేందుకు, అపరాధ రుసుములు విధించేందుకు, ప్రమోటర్లను నిషేధించేందుకు, ఇతర చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు ఎపి రెరా పూనుకుంటుంది.
- కొనుగోలుదారుల నుంచి తీసుకున్న మొత్తంలో 70 శాతాన్ని ప్రత్యేక బ్యాంక్ ఖాతాలో ఉంచి, నిర్ణీత ప్రాజెక్టు పనులకు మాత్రమే వినియోగించాలి.
- ప్రతి ఫర్మ్‌కూ ఆర్కిటెక్ట్, స్ట్రక్చరల్ ఇంజినీర్, ఆడిటర్ తప్పనిసరిగా ఉండాలి. ప్రతి 3 నెలలకోసారి ఈ ముగ్గురూ ప్రాజెక్టును పరిశీలించి, పనుల పురోగతిపై సర్టిఫికెట్స్ ఇవ్వాలి. వాటిని ఎపి రెరా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాతే ప్రత్యేక ఖాతా నుంచి ప్రమోటర్లు చేపట్టబోయే పనులకు అవసరమైన నగదును విత్‌డ్రా చేయాలి. దీనిని ఉల్లంఘిస్తే జరిమానా విధించడమో లేదా సదరు సంస్థ పేరును బ్లాక్ లిస్ట్‌లో చేర్చడమో చేస్తారు.
- ప్రాజెక్టు పూర్తయిన ఐదేళ్ల వరకు నిర్మాణంలో ఏమైనా లోపాలు (స్ట్రక్చరల్ డిఫెక్ట్స్) తలెత్తితే వాటిని సరి చేసే బాధ్యత ప్రమోటర్లదే.
- ప్రాజెక్టులను అనుకున్న సమయంలో పూర్తి చేయలేకపోతే కొనుగోలుదారులకు వారు చెల్లించిన మొత్తాలనూ తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

వివాదాలు తలెత్తితే..

ఎప్పటికప్పుడు తన వెబ్‌సైట్‌లో ప్రమోటర్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్న ప్రాజెక్టుల పురోగతిని సమీక్షిస్తూ ఉన్నప్పటికీ ఎపి రెరా అథారిటీ, వాటిలో నేరుగా జోక్యం చేసుకోదు. ప్రమోటర్లు, కొనుగోలుదారులు కుదుర్చుకున్న ఒప్పందాల్లోని ఏమైనా అంశాలకు సంబంధించి వారి మధ్య విభేదాలు తలెత్తినప్పుడు మాత్రం రంగంలోకి దిగి, వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తుంది. సాధ్యమైనంత వరకూ ఇరువర్గాల మధ్య సామరస్యపూర్వక రాజీ కుదిర్చేందుకే కృషి చేస్తుంది. వీరిలో ఎవరన్నా ఉద్దేశ్యపూర్వకంగా నిబంధనల అతిక్రమణకు పాల్పడినట్లు నిర్ధారణ అయితే జరిమానాల విధింపు సహా అవసరమైన ఇతర చర్యలు తీసుకుంటుంది.

అప్పీల్‌కూ అవకాశముంది

స్థిరాస్తి వివాదాల్లో ఎపి రెరా అథారిటీ ఇచ్చే ఆదేశాలే తుది నిర్ణయం కాదు. వాటి వల్ల తమకు అన్యాయం జరిగిందని ఎవరన్నా భావిస్తే న్యాయస్థానాల్లో సవాల్ చేసుకునే అవకాశాన్నీ ప్రభుత్వం కల్పించింది.

'రెరా'లో ప్రాజెక్టుల నమోదు తప్పనిసరి

చట్టం ప్రకారం 500 చదరపు మీటర్లు లేదా 8 అపార్ట్‌మెంట్లను కలిగిన నివాస, వాణిజ్య నిర్మాణాలు, లేఅవుట్లనీ రెరా పరిధిలోకి వస్తాయి. అవి ఉన్న ప్రాంతాలకు సంబంధించిన పట్టణ స్థానిక సంస్థలు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు, డిటిసిపి నుంచి అవసరమైన అనుమతులను పొందిన తర్వాత వాటి ప్రమోటర్లు ఆయా ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలన్నింటినీ సమర్పిస్తూ, ఏపీ రెరా వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. ప్రమోటర్ల వివరాలు, లేఅవుట్ ప్లాన్, డెవలప్‌మెంట్ వర్క్స్‌కు సంబంధించిన ప్లాన్, సంబంధిత భూమి స్థితి, చట్టబద్ధంగా పొందాల్సిన అనుమతుల స్టేటస్, పార్కింగ్ వసతులు, ప్రాజెక్ట్ పూర్తికి నిర్దేశించుకున్న కాలవ్యవధి, కొనుగోలుదారులతో చేసుకునే అగ్రిమెంట్ల ప్రొఫార్మాలు, ఈ ప్రాజెక్టుతో సంబంధం కలిగిన ఏజెంట్లు, కాంట్రాక్టర్లు, ఆర్కిటెక్ట్, ఇంజినీర్ల పేర్లు, చిరునామాలు ఇత్యాది వివరాలన్నింటినీ వారు విధిగా సమర్పించాలి.



కొనుగోలుదారులకూ బాధ్యతలు

కేవలం ప్రమోటర్లకే కాదు.. స్థిరాస్తుల కొనుగోలుదారులకూ కొన్ని కీలక బాధ్యతలను ఎపి రెరా యాక్ట్ నిర్దేశిస్తోంది. వీటిలో ప్రధానమైనవి..

- ప్రమోటర్‌తో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం వారు సకాలంలో చెల్లింపులు జరపాలి. ఒకవేళ ఇందులో విఫలమైతే జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.
- రెరా చట్టం గురించి అవగాహన పెంపొందించుకుని, స్థిరాస్తులు కొనుగోలు చేసే ముందు అవి ఎపి రెరా వద్ద రిజిస్టర్ అయ్యాయో, లేదో తనిఖీ చేసుకోవాలి.
- ప్రాజెక్టుల పనులు జరుగుతున్నప్పుడు కూడా ఎపి రెరా వెబ్‌సైట్‌లో నమోదయ్యే వివరాల ఆధారంగా వాటి ప్రగతిని తెలుసుకోవాలి.
- నిర్మాణంలో అతిక్రమణలకుగానీ, ఇతర ఉల్లంఘనలకు గానీ ప్రమోటర్లు, బిల్డర్లు పాల్పడుతున్నట్లు గమనిస్తే వెంటనే ఎపి రెరా వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలి.
- ప్రమోటర్లతో వివాదాలు తలెత్తితే వాటి సత్వర పరిష్కారానికి రెరాను ఆశ్రయించి, తగు న్యాయం పొందాలి.

అవగాహన పెంపొందించే చర్యలు

ఎపి రెరా చట్టం గురించి తెలియజేయడంతోపాటు దాని అధికారిక వెబ్‌సైట్‌లో తమ ప్రాజెక్టులను నమోదు చేయించుకోవడమెలాగో ప్రజలు, ప్రమోటర్లకు అవగాహన కల్పించేందుకు రెరా అథారిటీ పలు చర్యలు తీసుకుంటోంది. పలువురు రియల్టర్లకు ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిగా కొత్త అయినందున నమూనా దరఖాస్తును సైతం రెరా వెబ్‌సైట్‌లో ఉంచారు. దానిని డౌన్‌లోడ్ చేసుకుంటే దాని ఆధారంగా తమ దరఖాస్తును ఎవరైనా సులభంగా నింపగలుగుతారు.

ప్రజలు, ప్రమోటర్లకు వచ్చే సందేహాల నివృత్తికి ప్రత్యేకంగా ఒక హెల్ప్ డెస్క్ (helpdeskrera@ap.gov.in) ఏర్పాటు చేసింది. తమ అనుమానాలు, సందేహాలను దీనికి మెయిల్ ద్వారా తెలిపితే వాటిని వెంటనే నివృత్తి చేస్తారు. ఒకవేళ హెల్ప్ డెస్క్ ద్వారా ఆశించిన సమాచారాన్ని పొందలేకపోయామని ఎవరన్నా భావిస్తే వారు ఎపి రెరా అథారిటీ ఐటి విభాగాన్ని (ఫోన్ నెంబర్-83677 70574)ను, లేదా డైరెక్టర్ (ప్లానింగ్) (ఫోన్ నెంబర్-99855 33388)ను సంప్రదించవచ్చు. లేదా నేరుగా విజయవాడలోని సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి, సంబంధిత అధికారులను కలుసుకోవచ్చు.

- ఆంధ్రజ్యోతి, అమరావతి



ఆర్థిక రంగానికి కొత్త కిక్కు

అఫర్డబుల్ హౌజింగ్

'రియల్ మంత్ర'

హౌజింగ్ ఫైనాన్స్ ప్రస్తుతం మన దేశంలో మూడో అతిపెద్ద పరిశ్రమ. ఆర్థిక వ్యవస్థలోనూ కీలక పాత్ర పోషిస్తోంది. జిడిపి, మూలధన కల్పనలో దాదాపు 5-6 శాతం ఈ రంగం నుంచే వస్తోంది. ఈ రంగం భవిష్యత్‌లో మరింతగా ఎదిగే అవకాశం ఉంది. బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బిఎఫ్‌సి)ల రుణ పోర్టుఫోలియోలో హౌజింగ్ ఫైనాన్స్ ప్రస్తుతం రెండో స్థానంలో ఉంది. ఈ రంగం ఉద్యోగాల కల్పనలోనూ కీలక పాత్ర పోషిస్తోంది. ఆర్థిక వ్యవస్థలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న ఈ రంగాన్ని మరింత ఆదుకునేందుకు ఆర్థిక మంత్రి జైట్లీ మొన్నటి కేంద్ర బడ్జెట్‌లో పలు చర్యలు ప్రకటించారు. ముఖ్యంగా అందుబాటు ధరల్లో (అఫర్డబుల్) నిర్మించే గృహ నిర్మాణ ప్రాజెక్టుల కోసం నేషనల్ హౌజింగ్ బ్యాంక్ (ఎన్‌హెచ్‌బి)లో ప్రత్యేక ఫండ్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో 2022నాటికి 'అందరికి ఇళ్లు' లక్ష్యానికి మరింత ఊతం లభించనుంది.

రియల్టీ రంగానికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే అనేక చర్యలు తీసుకుంది. రెరా, జిఎస్‌టితోపాటు ఈ రంగానికి మౌలిక పరిశ్రమ హోదా ప్రకటించింది. ఇవన్నీ పరిశ్రమను మరింత ముందుకు తీసుకుపోయేవే. ప్రభుత్వ చర్యలతో అఫర్డబుల్ హౌజింగ్ రంగం ముస్ముందు ఏటా 30 శాతం చొప్పున అభివృద్ధి చెందుతుందని అంచనా. ఇది మార్‌గేజ్ ఫైనాన్స్ మార్కెట్ అభివృద్ధికి దోహదం చేయనుంది.



- హర్షిల్ మెహతా
జెఎండి, సిఇఒ, డిహెచ్‌ఎఫ్ఎల్

సంస్థాగత మార్పులు

గత ఏడాది జనవరి నుంచి జూన్ వరకు దేశంలో కొత్తగా ప్రారంభమైన హౌజింగ్ ప్రాజెక్టుల్లో 71 శాతం అఫర్డబుల్ హౌజింగ్ ప్రాజెక్టులే. 2016లో ఇదేకాలంతో పోలిస్తే ఇది 52 శాతం ఎక్కువ. పన్ను రాయితీలతోపాటు బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకాలతో మరింత మంది బిల్డర్లు ఈ రంగంపై దృష్టి పెట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా రియల్టీ ధరలు స్థిరంగానే ఉన్నాయి. అదే సమయంలో గృహ రుణంపై వడ్డీ రేట్లు 8.5 శాతానికి దిగొచ్చాయి. దీంతో గ్లోబల్ హౌజింగ్ ప్రైస్ ఇండెక్స్‌లో మన దేశం 13వ స్థానం నుంచి తొమ్మిదవ స్థానానికి ఎదిగింది.

వృద్ధి అవకాశాలు

మరో ఐదేళ్లలో దేశంలో అందరికీ సొంతిల్లు కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. దీంతో వచ్చే ఏడేళ్లలో మన దేశ రియల్టీ రంగంలోకి 1.3 లక్షల కోట్ల డాలర్ల (ప్రస్తుత మారకం రేటు ప్రకారం రూ.84.5 లక్షల కోట్లు) పెట్టుబడులు వస్తాయని అంచనా. ఈ పెట్టుబడులు దేశ ఆర్థిక వృద్ధికి ప్రేరకంగా పని చేస్తాయని భావించవచ్చు. మన ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే పరుగులు పెడుతోంది. పెరిగే ఉద్యోగాలకు అనుగుణంగా ఉద్యోగాలు, గృహ వసతి, మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉంది. ఇందులో రియల్ ఎస్టేట్ రంగానిది కీలక పాత్ర.

పారిశ్రామిక అభివృద్ధిలో హౌజింగ్ ఫైనాన్స్ కంపెనీ (హెచ్‌ఎఫ్‌సి)లు ఇప్పటికే కీలక పాత్ర పోషిస్తున్నాయి. దేశ మార్‌గేజ్ మార్కెట్లోనూ ఈ కంపెనీలు ఇప్పటికే చెప్పుకోదగ్గ వాటా కలిగి ఉన్నాయి. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోనూ ఇటీవల గృహ రుణాలకు గిరాకీ పెరుగుతోంది. ఇప్పుడు అఫర్డబుల్ హౌజింగ్ ఫైనాన్స్ కూడా ఇందుకు తోడైంది. దీంతో వచ్చే ఐదేళ్లలో ఈ తరహా గృహ రుణ పంపిణీ ఏటా 17-18 శాతం చొప్పున పెరిగి 2020-21 నాటికి రూ.9 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా. అందరికి సొంతింటి కల సాకారం కావాలంటే పరిశ్రమకు సంబంధించిన అన్ని వర్గాలు ఒకే లక్ష్యంతో పని చేయాలి. ముఖ్యంగా కింది స్థాయి మధ్య తరగతి ఆదాయ (ఎల్‌ఎంఐ)వర్గాలకు అందుబాటులో ఉండే హౌజింగ్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలి. దీంతో గృహ రంగంలో ముడిపడి ఉన్న ఇతర పరిశ్రమలూ అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

సర్కిల్ రేటు కంటే తక్కువ ధరకు అమ్మితే..

లెక్క ప్రకారమే క్యాపిటల్ గెయిన్స్ పన్ను

ఒకే ప్రాంతమైనా స్థిరాస్తుల విలువ అన్ని చోట్లా ఒకేలా ఉండదు. ఒక్కో సర్కిల్‌లో ఒక్కోలా ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వాలే సర్కిళ్ల వారీగా ఆస్తుల విలువ నిర్ణయిస్తాయి. ఈ రేట్లనే సర్కిల్ రేటు, రెడీ రెకనర్ రేటు లేదా మార్గదర్శక విలువ (గైడెన్స్ వాల్యూ) అంటారు. సాధారణ పరిభాషలో చెప్పాలంటే దీన్నే స్టాంప్ డ్యూటీ వాల్యూ అంటారు. ఈ విలువ ఆధారంగానే ఆస్తుల లావాదేవీల్లో స్టాంప్ డ్యూటీ చెల్లించాల్సి ఉంటుంది.


ప్రాంతం, మౌలిక సదుపాయాలను బట్టి సర్కిల్ రేటు మారుతుంది. సాధారణంగా చాలా ఆస్తులను సర్కిల్ రేటు కంటే ఎక్కువకే అమ్ముతుంటారు. కొద్ది కేసుల విషయంలోనే ఈ అమ్మకం సర్కిల్ రేటు కంటే తక్కువగా ఉంటుంది. ఇలా తక్కువకు అమ్మినపుడు ఆదాయ పన్ను (ఐటి) చట్టం ప్రకారం అమ్మకందారులు, కొనుగోలుదారులపై పన్ను ప్రభావం ఎలా ఉంటుందో చూద్దాం.

సెక్షన్ 50సి కింద అమ్మకందారుపై..

- ఈ సెక్షన్ కింద ఏదైనా స్థిరాస్తిని సర్కిల్ రేటు కంటే తక్కువకు అమ్మినా, స్టాంప్ డ్యూటీ వాల్యుయేషన్ కోసం ఆ సర్కిల్ రేటునే పరిగణనలోకి తీసుకుంటారు. మూలధన లాభాల పన్ను కూడా సర్కిల్ రేటు ప్రకారమే లెక్కిస్తారు.
- ఆస్తుల అమ్మకం విలువ ఆ సర్కిల్‌లో ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటే తక్కువ ఉంటే ఆ విషయాన్ని అసెసింగ్ అధికారికి నివేదించాలి. అసెసింగ్ అధికారి అప్పుడు ఒక వాల్యుయేషన్ అధికారిని నియమించి ఆ ఆస్తి విలువను మదింపు చేయిస్తారు.
- ఆ సర్కిల్‌లో నిజంగానే ఆస్తి విలువ ప్రభుత్వం నిర్ణయించిన దానికంటే తక్కువగా ఉందని వాల్యుయేషన్ అధికారి నిర్ణయిస్తే, అతడు నిర్ణయించిన ఆస్తి విలువనే అమ్మకం ధరగా పరిగణిస్తారు.
- ఒకవేళ వాల్యుయేషన్ అధికారి నిర్ణయించిన ధర సర్కిల్ ధర కంటే ఎక్కువగా ఉందనుకుందాం. అపుడు ఆ సర్కిల్‌లోని ఆస్తులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరనే పరిగణనలోకి తీసుకుంటారు.
- దీన్నిబట్టి ఏదైనా ఆస్తి విలువ మదింపును వాల్యుయేషన్ అధికారికి అప్పగించినా, అతడి సిఫారసులతో మూల ధన లాభాల పన్ను తగ్గే అవకాశమే తప్ప పెరిగే అవకాశం లేదు.

2016 బడ్జెట్ సవరణ

ఆస్తి కొనుగోలు ఒప్పందం, రిజిస్ట్రేషన్ తేదీల మధ్య బాగా గడువు ఉంటే.. ఒప్పందం జరిగిన తేదీ నాటికి ఆ సర్కిల్‌లో ఉన్న స్థిరాస్తి విలువను మాత్రమే స్టాంప్ డ్యూటీ కోసం పరిగణనలోకి తీసుకుంటారు. కాకపోతే కొనుగోలు ఒప్పందం జరిగిన తేదీకల్లా ఆ మొత్తాన్ని అకౌంట్ పేయీ చెక్కు లేదా అకౌంట్ పేయీ బ్యాంక్ డ్రాఫ్ట్ లేదా ఆన్‌లైన్ పద్ధతిలో చెల్లించి ఉండాలి.



కొనుగోలుదారులపై పన్ను

ఒకవేళ సర్కిల్ రేటు, కొనుగోలు ధర మధ్య రూ.50,000 కంటే ఎక్కువ వ్యత్యాసం ఉందనుకుందాం. అప్పుడు ఈ మొత్తాన్ని కొనుగోలుదారుడి 'ఇతర ఆదాయం'గా పరిగణించి పన్ను విధిస్తారు. ఈ మేరకు 2013 బడ్జెట్‌లో సెక్షన్ 56 సబ్ సెక్షన్ (2) క్లాజ్ 7ను సవరించారు. ఈ సవరణ ఏప్రిల్ 1, 2014 నుంచి అమల్లోకి వచ్చింది.

ఒకవేళ ఒప్పందం తేదీనాటికి, రిజిస్ట్రేషన్ తేదీ నాటికి సర్కిల్ రేటులో తేడా ఉంటే ఒప్పందం తేదీ నాటికి ఉన్న సర్కిల్ రేటునే అమ్మకం ధరగా లెక్కలోకి తీసుకుంటారు. అయితే ఒప్పందం చేసుకున్న తేదీ నాటికి పూర్తిగా లేదా పాక్షికంగా ఆస్తుల విలువ చెల్లించినపుడే ఇది వర్తిస్తుంది.

ఒకవేళ సెక్షన్ 50సి కింద ఆ ఆస్తి వాస్తవ ధర సర్కిల్ రేటు కంటే తక్కువ ఉందని వాలుయేషన్ అధికారి నివేదిస్తే, దాన్నే పరిగణనలోకి తీసుకోవాలి.

సవరణల ప్రభావం

గతంలో ఏదైనా ఒక ఆస్తిని సర్కిల్ రేటు కంటే తక్కువ ధరకు అమ్మితే, పన్ను భారం కేవలం అమ్మకందారుడిపైనే పడేది. ఇప్పుడు సర్కిల్ ధర-అమ్మకం ధర మధ్య రూ.50,000 కంటే ఎక్కువ తేడా ఉంటే కొనుగోలుదారుడిపైనా పన్ను చెల్లింపు భారం పడుతోంది. అంటే ఆస్తుల కొనుగోలుదారుడు అధిక ధరకు ఆస్తిని కొనడంతో పాటు, కొనుగోలు ధర-సర్కిల్ ధర మధ్య వ్యత్యాసం రూ.50,000 కంటే అధికంగా ఉంటే 'ఇతర ఆదాయం' కింద పన్ను భారమూ చెల్లించాల్సి వస్తోంది. ఆస్తుల ధరల్ని సర్కిల్ ధర కంటే తక్కువగా నిర్ణయించి తక్కువ స్టాంప్ డ్యూటీతో తప్పించుకోవడాన్ని నిరోధించేందుకు ప్రభుత్వం ఈ సవరణలు తీసుకొచ్చింది.

2018 బడ్జెట్‌లో మార్పులు

ఆకృతి, లొకేషన్ వంటి అనేక అంశాల ఆధారంగా అంచనా విలువ-వాస్తవ విలువ మధ్య తేడాలుంటాయి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని 2018 బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి జైట్లీ కొన్ని మార్పులు ప్రకటించారు. ఈ సవరణల ప్రకారం ఆస్తుల సర్కిల్ రేటు, లావాదేవీల్లో పేర్కొన్న వాస్తవ ధర మధ్య ఐదు శాతానికి మించి వ్యత్యాసం లేకపోతే సెక్షన్ 50సి, సెక్షన్ 56 (2)7 వర్తించదని చట్టాన్ని సవరించారు. ఈ సవరణతో స్థిరాస్తుల కొనుగోలుదారులు, అమ్మకందారులపై అదనపు పన్ను భారం తగ్గింది. స్థిరాస్తుల్లో నిజమైన లావాదేవీలు జరిపే వారికి ఇది పెద్ద ఉరట.

అర్హతలు, కోర్సులు..

మాస్టర్ కోర్సులకు మూడు / నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీ, డాక్టోరల్ కోర్సులకు మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమానం ఉండాలి. ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టెస్టింగ్ సిస్టమ్ (ఐఈఎల్‌టీఎస్) స్కోర్ ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. స్కోర్ కనీసం 6.5 ఉండాలి. మేనేజ్‌మెంట్ కోర్సులకు జీమ్యాట్ స్కోర్ తప్పనిసరి. ఫ్రాన్స్‌లో చదవాలంటే ఫ్రెంచ్ భాష వచ్చి ఉండాలనే నిబంధన ఏమీ లేదు. కాకపోతే అక్కడి సమాజంతో మమేకం కావడానికి ఫ్రెంచ్ భాషపై అవగాహన ఉండటం ప్రయోజనకరం. ఆంగ్ల మాధ్యమంలోనే బోధన ఉంటుంది. ఇక్కడ మొత్తం 1300 కోర్సులను ఇంగ్లీష్ మాధ్యమంలో బోధిస్తారు. ఇక్కడ న్యూక్లియర్, స్పేస్, ఏవియేషన్, టీచింగ్, సోషియాలజీ, లింగ్విస్టిక్స్, ఎకనామిక్స్, ఫ్యాషన్, ఆర్ట్స్, సైన్స్, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, టూరిజం కోర్సులకు డిమాండ్ ఎక్కువ. మన విద్యార్థులు ఎక్కువగా ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ కోర్సులను ఎంపిక చేసుకుంటున్నారు.

ఉన్నత విద్యకు ఉత్తమ దేశం.. ఫ్రాన్స్

స్టడీ అబ్రాడ్

ఫ్రాన్స్... ఐరోపా ఖండంలోని అందమైన దేశం. అనుక్షణం ఫ్యాషన్ తళుకుళతో సంప్రదాయ, ఆధునిక సంస్కృతుల మేళవింపుతో, చారిత్రక వారసత్వ సంపదతో ఒక ఆహ్లాదకరమైన అనుభూతినిచ్చే దేశం. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మంది పర్యాటకులను ఆకర్షించే దేశాల్లో ఒకటైన ఫ్రాన్స్.. ప్రస్తుతం అంతర్జాతీయ విద్యార్థులకు సైతం ప్రముఖ గమ్యంగా నిలుస్తోంది. నాణ్యమైన విద్య, తారతమ్యాలు లేకుండా అందరికీ ఒకే రకమైన నియమాలు, ప్రభుత్వపరంగా ప్రోత్సాహకాలు... ఫలితంగా ఉన్నత విద్య కోసం ఫ్రాన్స్ వైపు చూస్తున్న విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఫ్రాన్స్‌లో ఉన్నత విద్యనభ్యసించడానికి ఉన్న అనుకూలతలు, ఇతర అంశాలపై విశ్లేషణ..



ఫ్రాన్స్ ప్రధాన భూభాగం మధ్యధరా సముద్రం నుంచి ఇంగ్లిష్ ఛానల్, ఉత్తర సముద్రం వరకు, రైన్ నుంచి అట్లాంటిక్ మహాసముద్రం వరకు విస్తరించి ఉంది. పర్యాటకంగా అత్యధికంగా సందర్శకులను ఆకర్షిస్తున్న దేశాల్లో ఒకటి. ఏటా దాదాపుగా 82 మిలియన్ల మంది పర్యాటకులు ఫ్రాన్స్‌ను సందర్శిస్తుంటారు.

ప్రపంచవ్యాప్త గుర్తింపు

ఫ్రాన్స్‌లోని ఉన్నత విద్యకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది. క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్ - 2018లో 39 ఫ్రెంచ్ యూనివర్సిటీలకు స్థానం లభించింది. ఇందులో 11 టాప్ - 300లో నిలిచాయి.

ఫ్రాన్స్ ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధానం ఇస్తుంది. విద్య, పరిశోధన కోసం ఏటా బడ్జెట్‌లో 20 శాతం కంటే ఎక్కువ నిధులను కేటాయిస్తుంది. ఆ దేశ జీడీపీలో 1.2 శాతాన్ని ఉన్నత విద్యపై ఖర్చు చేస్తుంది (అంటే ఏడాదికి 20 బిలియన్ యూరోలు).

అకర్షణలో ముందు

అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, ఆస్ట్రేలియా తరవాత అంతర్జాతీయ విద్యార్థులను ఎక్కువగా ఆకర్షిస్తున్న దేశం ఫ్రాన్స్. ప్రస్తుత అంచనాల మేరకు ఫ్రాన్స్‌లో 2,78,000 మంది అంతర్జాతీయ విద్యార్థులు ఉన్నారు. ఇందులో 25 వేల మంది డాక్టోరల్ కోర్సులను అభ్యసిస్తున్నారు. గత పదేళ్లలో ఫ్రాన్స్‌కు వచ్చే అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య 75 శాతం పెరిగింది. ఉన్నత విద్యలో నాణ్యత, అంతర్జాతీయ విద్యార్థులకు ఇచ్చే గౌరవ మర్యాదలు, ప్రాధాన్యం వంటివి కూడా అంతర్జాతీయ విద్యార్థులు ఫ్రాన్స్ వైపు మొగ్గు చూపడానికి కారణాలు.

అందరూ ఒకటే

ఫ్రాన్స్ విద్యా వ్యవస్థలోని ఒక విషయం అందరినీ అమితంగా ఆకర్షిస్తుంది. అదేమిటంటే జాతి, వర్గ, వర్ణ వంటి తారతమ్యాలు ఏమి లేకుండా స్వదేశీ, విదేశీ విద్యార్థులకు ఒకే రకమైన నియమాలు, నిబంధనలు, సౌకర్యాలను అమలు చేయడం. ఇందులో హెల్త్ కవరేజ్, హౌసింగ్ అసిస్టెన్స్, ట్యూషన్ ఫీజులు వంటివి విదేశీ విద్యార్థులకు ఫ్రెంచ్ విద్యార్థులతో సమానంగా ఉంటాయి. ఉన్నత విద్యలో ప్రతి విద్యార్థిపై కనీసం ఫ్రాన్స్ ప్రభుత్వం 10,800 యూరోలను ఖర్చు చేస్తుంది.

ఇష్టమైన దేశం

శాస్త్రవేత్తలు, మేనేజర్స్, ఇంజనీర్స్, రచయితలు ఇలా ఎంతో మంది మేధావులకు ఫ్రాన్స్ ఇష్టమైన దేశం. ఇక్కడి సాంస్కృతిక వైవిధ్యం, వారసత్వ సంపద చాలా మందిని ఆకర్షిస్తుంది. దాంతో చాలా మంది ఫ్రాన్స్‌లో స్థిరపడటానికి ఆసక్తి ప్రదర్శిస్తుంటారు. హస్తకళలు, ఫ్యాషన్, జ్యూయలరీ, గ్లాస్ మేకింగ్ వంటి కళాత్మక అంశాల్లో ఫ్రాన్స్ ప్రపంచంలోనే రారాజుగా గుర్తింపు పొందుతుంది. ఆయా కళలకు సంబంధించి ఆ దేశ వ్యాప్తంగా 40 వేల వర్క్‌షాప్స్ ఉన్నాయి.

ఆవిష్కరణలకు ప్రాధాన్యం

ప్రపంచంలో ఐదో పెద్ద ఆర్థిక వ్యవస్థ ఫ్రాన్స్‌ది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశం. ఆవిష్కరణ, పరిశోధన వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ ఆధునిక సాంకేతికతను ఆధారంగా చేసుకొని ఫ్రెంచ్ కంపెనీలు కార్యకలాపాలు సాగిస్తుంటాయి. అదే సమయంలో సంప్రదాయ విధానాలు, హస్తకళా నైపుణ్యం వంటివి కనిపించడం ఫ్రాన్స్ ప్రత్యేకత. ప్రపంచంలోని టాప్ - 500 కంపెనీల్లో 31 ఫ్రాన్స్‌కు చెందినవే కావడం గమనార్హం. ఇందులో ఎయిర్‌బస్, టోటల్, ఆరెంజ్ వంటివి ఉన్నాయి. అంతర్జాతీయంగా అత్యధికంగా పేటెంట్ కలిగిన దేశాల్లో ఫ్రాన్స్‌ది ఆరో స్థానం. సాహిత్యంలో 15, ఫిజిక్స్, ఎకనామిక్స్‌లో 13 నోబెల్ బహుమతులు ఫ్రాన్స్ దేశస్థులకు లభించాయి. మ్యాథమెటిక్స్‌లో ప్రతిష్ఠాత్మకమైన ఫీల్డ్ మెడల్స్ 13 మందికి దక్కాయి.

యూనివర్సిటీలు - ఫీజులు

ఫ్రాన్స్‌లో 3, 500పైగా పబ్లిక్, ప్రైవేట్ విద్యా సంస్థలు ఉన్నాయి. వీటిల్లో 72 పబ్లిక్ యూనివర్సిటీలు, 271 డాక్టోరల్ స్కూల్స్, 227 ఇంజనీరింగ్ స్కూల్స్, 220 బిజినెస్ మేనేజ్‌మెంట్ స్కూల్స్, 45 పోస్ట్ సెకండరీ పబ్లిక్ స్కూల్స్, 22 ఆర్కిటెక్చర్ స్కూల్స్, 3 వేల స్పెషలైజ్డ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఉన్నాయి. వీటి ద్వారా మూడు లక్షల మంది అంతర్జాతీయ విద్యార్థులు చదువుకునే అవకాశం ఉంది. ఇక్కడి స్పెషలైజ్డ్ బిజినెస్ స్కూల్స్‌కు అత్యంత ఆదరణ ఉంటుంది. పబ్లిక్ యూనివర్సిటీల్లో ఫీజులు ఏడాదికి బ్యాచిలర్ డిగ్రీకి 184 యూరోలు, మాస్టర్స్ కోర్సుకు 256 యూరోలు, ఇంజనీరింగ్ కోర్సులకు 610 యూరోలు, డాక్టరేట్ కోర్సులకు 391 యూరోలు చెల్లించాలి. ప్రైవేట్ వర్సిటీల్లో కోర్సును బట్టి 3 వేల నుంచి 10 వేల యూరోల వరకు ఫీజులు ఉంటాయి.

విద్యా సంవత్సరం

ఫ్రాన్స్‌లో విద్యా సంవత్సరం సెప్టెంబర్ / అక్టోబర్‌లో ప్రారంభమై మే / జూన్‌లో ముగుస్తుంది. క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా ఏడాది చివరలో రెండు వారాలపాటు సెలవులు ఉంటాయి. రెండో సెమిసర్ట్ ముగిసిన తరవాత మే / జూన్‌లలో వేసవి సెలవులు ఇస్తారు. సెమిస్టర్ విధానం అమల్లో ఉంది. ఏటా రెండు సెమిస్టర్లు ఉంటాయి. పూర్తి చేసిన సెమిస్టర్లు, సాధించిన క్రెడిట్ల ఆధారంగా డిగ్రీలను అందజేస్తారు.

పార్ట్ టైమ్

ఫ్రాన్స్‌లో చదువుకునే విద్యార్థులు వారానికి 20 గంటలు మించకుండా పార్ట్ టైమ్ ఉద్యోగం చేసుకోవచ్చు. సాధారణంగా యూనివర్సిటీల్లో రీసెర్చ్ ఫ్యాకల్టీ వద్ద రీసెర్చ్ అసిస్టెంట్‌గా చేరేందుకు అవకాశాలు ఎక్కువ. నాన్-సైన్స్, ఇంజనీరింగ్ విద్యార్థులకు సూపర్ మార్కెట్స్, హాస్పిటల్స్, టూరిజం ఏజెన్సీల్లో పని దొరుకుతుంది. వారానికి కనీసం 60 యూరోల ఆదాయం పొందొచ్చు.

వసతి

అధిక శాతం విద్యార్థులకు యూనివర్సిటీలోనే నివాస సౌకర్యం కల్పిస్తారు. ఇవికాకుండా ప్రైవేట్ స్టూడెంట్ బిల్డింగ్స్, అపార్ట్‌మెంట్స్, ప్రభుత్వం అందించే హౌజింగ్ సౌకర్యం కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అంతే కాకుండా వసతి ఖర్చులను అక్కడి ప్రభుత్వం రీయింబర్స్ చేస్తుంది. నివాస ఖర్చులు నెలకు 500 నుంచి 600 యూరోలు అవుతాయి. ఈ మొత్తంలోనే వసతి, రవాణా, ఇతర అవసరాలు తీర్చుకోవచ్చు. ద్వితీయ శ్రేణి నగరాల్లో వ్యయం 400 యూరోల నుంచి 500 యూరోల మధ్య ఖర్చవుతుంది.

చదువు పూర్తయిన తరవాత

2016 ఫిబ్రవరిలో టాలెంట్ పాస్‌పోర్ట్ అనే పథకాన్ని ప్రారంభించింది. దీని ప్రకారం మల్టీ ఇయర్ రెసిడెన్స్ పర్మిట్ లభిస్తుంది. తద్వారా నాలుగేళ్లు అక్కడ నివసించడానికి అవకాశం ఉంటుంది. శాస్త్రవేత్తలు, కళాకారులు తదితర నైపుణ్యం గల మానవ వనరుల సేవలను ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో ఈ పథకానికి రూపకల్పన చేశారు. ఇందుకు ఎంపికైన విదేశీ విద్యార్థులు చదువు తరవాత అక్కడే ఉండి ఉద్యోగం చేయవచ్చు. అంతేకాకుండా వారి భార్యలను కూడా ఈ పథకం కింద ఫ్రాన్స్‌లో నివసించడానికి అనుమతిస్తారు. వారు ఉద్యోగం చేసేందుకు కూడా ఈ కార్యక్రమం వీలు కల్పిస్తుంది. ఫ్రాన్స్‌లో గ్రాండ్ ఎకోల్స్‌గా పిలిచే ఎలైట్ యూనివర్సిటీల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు యూరోపియన్ యూనియన్‌లో 26 దేశాల్లో (ఫ్రాన్స్ సహా) ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం లభిస్తుంది. దీనికోసం ఎలాంటి ప్రత్యేక వీసాలు పొందక్కర్లేదు. ఉదాహరణకు ఫ్రాన్స్‌లోని ఒక ఇన్‌స్టిట్యూట్‌లో చేరిన విద్యార్థి.. జర్మనీలో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం లభిస్తుంది.

క్యాంపస్ ఫ్రాన్స్ ద్వారా

CAMPUS FRANCE campusfrance.org INDE

అడ్మిషన్ ప్రక్రియ, వీసా కోసం క్యాంపస్ ఫ్రాన్స్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ముందుగా క్యాంపస్ ఫ్రాన్స్ ద్వారా ఆన్‌లైన్‌లో పర్సనల్ అకౌంట్ క్రియేట్ చేసి.. సంబంధిత వివరాలను పూర్తి చేయాలి. ఈ విధానంలోనే యూనివర్సిటీలు దరఖాస్తులను పరిశీలిస్తాయి. అర్హులను ఎంపిక చేసి సంబంధిత సమాచారాన్ని విద్యార్థులకు అందిస్తాయి. రాయబార కార్యాలయం వీసా దరఖాస్తును పరిశీలించడంతోపాటు మంజూరు చేస్తుంది. ఇందుకు ప్రాంతీయ కార్యాలయాల్లో ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఫ్రాన్స్‌నే ఎంపిక చేసుకోవడానికి కారణాలను తెలుసుకునే విధంగా ఈ ఇంటర్వ్యూ ఉంటుంది.

భారతీయులకు ప్రత్యేకంగా

- 2016లో 4,200 మంది భారతీయ విద్యార్థులు ఉన్నత విద్య కోసం ఫ్రాన్స్‌ను ఎంచుకున్నారు. అయితే ఈ సంఖ్యను 2020 నాటికి 10 వేలకు పెంచే దిశగా ఆ దేశ ప్రభుత్వం పలు చర్యలు తీసుకొంటుంది. పలు ప్రోత్సాహకాలను అందజేయడంతోపాటు తమ రాయబార కార్యాలయాల ద్వారా ఫ్రాన్స్ ఎడ్యుకేషన్‌పై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుంది.
- ఫ్రాన్స్ ప్రభుత్వం ఏటా ప్రతిభావంతులైన 500 మంది భారతీయ విద్యార్థులకు 7.1 కోట్ల రూపాయల (1.1 మిలియన్ యూరోలు) విలువ గల స్కాలర్‌షిప్స్‌ను అందజేస్తుంది. భారత్‌లోని ఫ్రాన్స్ రాయబార కార్యాలయం ఈ పథకాన్ని అమలు చేస్తుంది. ఇందుకు బ్యాచిలర్ / మాస్టర్ కోర్సులకు చార్పాక్ ప్రోగ్రామ్, పీహెచ్‌డీ కోర్సులకు రామన్ చార్పాక్ (భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంతో కలిసి) ప్రోగ్రామ్ కింద స్కాలర్‌షిప్స్‌ను అందజేస్తుంది. గత ఐదేళ్ల కాలంలో భారతీయ విద్యార్థులకు ఆఫర్ చేసే స్కాలర్‌షిప్స్ సంఖ్య 17 శాతం మేర పెరిగింది.
- చదువు పూర్తయిన తరవాత భారతీయ విద్యార్థులు వర్క్ ఎక్స్‌పీరియెన్స్ కోసం వీసాను పొడిగించుకునే సౌకర్యం ఉంది. తద్వారా 24 నెలలపాటు (రెండేళ్లు) అక్కడే ఉండే అవకాశం లభిస్తుంది. 2015లో ప్రధాని నరేంద్ర మోదీ ఫ్రాన్స్ పర్యటన సందర్భంగా ఈ మేరకు ఇరు దేశాల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది.

స్కాలర్‌షిప్స్

ఫ్రాన్స్‌లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు అనేక రకాల స్కాలర్‌షిప్స్ అందుబాటులో ఉన్నాయి.

- చార్పాక్ స్కాలర్‌షిప్స్
- రామన్ చార్పాక్ స్కాలర్‌షిప్స్
- ఈఫిల్ స్కాలర్‌షిప్స్
- సైన్సెస్ పీఓ స్కాలర్‌షిప్స్
- ఎర్సమస్ మొబిలిటీ స్కాలర్‌షిప్స్
- కృష్ణ కృతి ఫౌండేషన్ స్కాలర్‌షిప్స్
- నీమ్రానా స్కాలర్‌షిప్స్
- వెబ్‌సైట్: www.campusfrance.org



కిరణ్ గల్లా
P2P Overseas

సమానత్వం కోసం ఉద్యమాలు

పోటీ పరీక్షల ప్రత్యేకం
హిస్టరీ

బ్రిటిష్ పాలనలో ప్రవేశపెట్టిన మార్పులు వర్గ వ్యవస్థ విచ్ఛిన్నానికి దారి తీశాయి. వీరు తీసుకొచ్చిన జనాభా లెక్కల కారణంగా తక్కువ జనాభా ఉన్న అగ్ర కులాలు, ఎక్కువ జనాభా ఉన్న నిమ్న కులాలపై ఆధిపత్యం చలాయిస్తున్నారనే విషయం అవగతమైంది. దీనికి వ్యతిరేకంగా సమానత్వం కోసం 19వ శతాబ్దంలో జరిగిన కుల ఉద్యమాలకు చాలా మంది నేతృత్వం వహించారు.

నారాయణ గురు (1854 - 1922)

- **ఎఝువ ఉద్యమం / అరవి పురం ఉద్యమం:** కేరళలో అగ్రవర్ణాలవారిని సవర్ణాలు అని, అణగారిన వారిని అవర్ణాలు అని పిలిచేవారు. ఇక్కడ ఎఝువ (ఇప్పుడు ఈడవ) అనేది ఒక అణగారిన కులం. అణగారిన వర్గాలవారి కోసం, వారి హక్కుల కోసం ఎఝువ కులానికి చెందిన నారాయణగురు తీవ్రస్థాయిలో ఉద్యమించారు. ఈ ఉద్యమం అరవి పురం నుంచి శివరాత్రి రోజున ప్రారంభమైంది. ఇది 1902 - 03 మధ్యలో శ్రీనారాయణ ధర్మ పరిపాలనా యోగం అనే సంస్థ ఆధ్వర్యంలో త్రివేండ్రం ప్రధాన కేంద్రంగా ప్రారంభమైంది. గుడుల కంటే బడులే మేలని ఈయన ప్రచారం చేశారు. పూజారులు లేని దేవాలయాలను నిర్మించాలన్నారు. ఒకే కులం, ఒకే మతం, ఒకే దేవుడు అని నినదించారు. 'నీ కులం చెప్పవద్దు, ఒకరి కులం అడగవద్దు, కులం గురించి ఆలోచించకు' అనే సూక్తిని ప్రచారం చేశాడు. 20వ శతాబ్దంలో ఈ అరవి పురం ఉద్యమానికి డా. పాలేపు కుమారన్ అసనే అనే వ్యక్తి కొత్త రూపు తీసుకువచ్చారు. డాక్టర్ పాలేపు.. ఎఝువుల్లో పాశ్చాత్య విద్య నభ్యసించిన మొదటి వ్యక్తి.
- కేరళలో దేవాలయ ప్రవేశ ఉద్యమాన్ని నారాయణ గురు, కుమార అసన్, టి.కె. మాధవన్ ప్రారంభించారు. 1956లో ప్రపంచంలోనే మొదటిసారిగా ప్రజల చేత ఎన్నికైన కమ్యూనిస్టు ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. 1917లో రష్యా, 1949లో చైనాలో కమ్యూనిస్టు ప్రభుత్వాలు విప్లవాల ద్వారా ఏర్పడ్డాయి.
- **వైకోం సత్యాగ్రహం (కేరళ):** ఈ ఉద్యమాన్ని 1924లో కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కె.పి. కేశవ వినన్, టికె. మాధవన్‌లు వైకోంలోని పార్వతీ పరమేశ్వర దేవాలయంలో ప్రారంభించారు. దేవాలయాల ప్రవేశం కోసం జరిగిన ఈ ఉద్యమం ట్రావెన్‌కోర్ దేవాలయం సమీపంలోని దారిపై అణగారిన వర్గాలు నడిచేందుకు దోహదం చేసింది.
- **నాయర్ ఉద్యమం (కేరళ):** 19వ శతాబ్దం చివర్లో కేరళలోని ట్రావెన్‌కోర్ ప్రాంతంలో ఈ ఉద్యమం ప్రారంభమైంది. ఇక్కడ మధ్య తరగతి కులాల వారినే నాయర్‌లు అంటారు. వీరు నంబూద్రి బ్రాహ్మణులకు, మళయాళేతర బ్రాహ్మణుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడారు. నాయర్ మహిళలు నంబూద్రి బ్రాహ్మణుల ఎదుట అనాచ్ఛాదితంగా సంచరించాలని విధించిన షరతు వీరికి ఆగ్రహాన్ని తెప్పించింది. నంబూద్రి బ్రాహ్మణుల సాంఘిక, రాజకీయ ఆధిపత్యంపై ఈ ఉద్యమం దాడి చేసింది. ఈ ప్రాంతంలో విడుదలైన మొదటి నవల 'ఇందులేఖ' నంబూద్రిల సాంఘిక ఆధిపత్యాన్ని ఖండించింది. సి.వి. రామన్ పిళ్ళై రచించిన మార్తాండ వర్మ అనే చారిత్రక నవల నాయర్‌ల ప్రాభవాన్ని పునరుద్ధరించింది. నాయర్ల ఉద్యమానికి కె. రామకృష్ణ పిళ్లై, ఎం పద్మనాభ పిళ్లైలు నాయకత్వం వహించారు. రామకృష్ణ పిళ్లై 'స్వదేశీ అభిమాని' అనే పత్రికను నడిపారు. పద్మ నాభ పిళ్లై 'నాయర్ సర్వీస్ సొసైటీ'ని స్థాపించారు. కేరళకు చెందిన ఎ.కె. గోపాలన్ అనే వ్యక్తి 500 కంటే ఎక్కువ సమావేశాల్లో నిమ్న కులాల హక్కులను తెలియజేస్తూ ప్రసంగించాడు. ప్రతి సమావేశంలో ఇతనిపై లాఠీ ఛార్జీ జరుగుతుండేది.


జస్టిస్ ఉద్యమం (1915 - 16)

మద్రాసు (1915 - 16)లో సి.ఎన్ మొదలియార్, టి.ఎం నాయర్, పి. త్యాగరాజు చెట్టి దీన్ని ప్రారంభించారు. బ్రాహ్మణులకు వ్యతిరేకంగా మధ్య కులాలు చేపట్టిన ఉద్యమమే జస్టిస్ ఉద్యమం. ఇది విద్య, ప్రభుత్వ, రాజకీయ రంగాల్లో బ్రాహ్మణాధిక్యతను వ్యతిరేకించింది. మధ్య స్థాయి కులాలైన బలిజ, రెడ్డి, కమ్మ, మొదలియార్స్, వెల్లాలు, చెట్టియార్‌లు మెరుగైన అవకాశాలకోసం ఉద్యమించారు.

- 1916లో మొదలియార్, టిఎం. నాయర్, త్యాగరాజ చెట్టిలు బ్రాహ్మణేతరుల అభివృద్ధికి దక్షిణ భారత ప్రజల సంఘాన్ని ప్రారంభించారు. 1917లో జస్టిస్ పార్టీ ఏర్పాటైంది. 'జస్టిస్' పేరుతో పత్రికను ప్రారంభించారు. 1920లో ఈ పార్టీ తరపున 63 సీట్లు సాధించిన సుబ్బరాయలు శెట్టియార్ మద్రాసు ముఖ్యమంత్రిగా నియమితులయ్యారు. ఈయన బ్రాహ్మణేతరులకు విద్య, ఉపాధి, రిజర్వేషన్లు, స్కాలర్‌షిప్‌లు కల్పించారు. 1924లో రామస్వామి నాయకర్ బ్రాహ్మణ ఆధిపత్యాన్ని సహించలేక జస్టిస్ పార్టీలోకి చేరారు. 1937లో పార్టీ అధ్యక్షుడయ్యాడు. 1944లో జస్టిస్ పార్టీని రద్దు చేసి దాని స్థానంలో 'ద్రవిడ కజగం' అనే పార్టీని స్థాపించారు.
- ఈ పార్టీ నుంచి అన్నాదురై బయటకి వచ్చి 'ద్రవిడ మున్నేట్ర కజగం' స్థాపించారు. ఇతనికి కరుణానిధి, ఎంజి. రామచంద్రన్ ప్రధాన అనుచరులు. ఇతని మరణం తరవాత డిఎంకెకు కరుణానిధి నాయకత్వం వహించారు. ఎంజి రామచంద్రన్ 1972లో డిఎంకె నుంచి బయటికి వచ్చి ఎఐఎడిఎంకె పార్టీని స్థాపించారు.

నాడార్ ఉద్యమం (తమిళనాడు):

- ఇరవయ్యో శతాబ్దం ప్రారంభంలో తమిళనాడులో నాడార్ ఉద్యమం ప్రారంభమైంది. ఇక్కడ తక్కువ కులానికి చెందిన కల్లు గీత కార్మికులనే నాడార్లుగా పరిగణించేవారు. వీరికి క్షత్రియ హోదా కల్పించడంతో పాటు దేవాలయాల్లోకి ప్రవేశించే హక్కు కోసం ఉద్యమం జరిగింది. 1910లో నాడార్ మహాజన సంఘాన్ని ప్రారంభించారు.
- **పల్లీ ఉద్యమం:** పందొమ్మిదో శతాబ్దం చివర్లో పల్లీ ఉద్యమం ప్రారంభమైంది. తమిళనాడులోని నిమ్న కులాల వారినే పల్లీలుగా పరిగణించేవారు. 1921 నుంచి వీరు క్షత్రియులుగా చెప్పుకుంటూ 'వన్నియ కుల క్షత్రీయులు'గా పేరు పొందారు. వీరు మహిళా పునర్వివాహం, విధవ పునర్వివాహాలను నిషేధించి, బ్రాహ్మణ సాంప్రదాయాలను అనుకరించడం మొదలు పెట్టారు.
- **ఆత్మ గౌరవ ఉద్యమం (మద్రాసు):** తమిళనాడులోని మద్రాసులో 1925లో ఆత్మగౌరవ ఉద్యమాన్ని ఇ.వి. రామస్వామి నాయకర్ (పెరియార్) ప్రారంభించారు. మద్రాసులో దళితుల ఆత్మ గౌరవం, హక్కుల కోసం మదురై నుంచి వైకోం వరకు ఈ ఉద్యమాన్ని జరిపారు. ఇది పూర్తిగా బ్రాహ్మణేతర ఉద్యమం. ఇందులో దేవాలయ ప్రవేశం, మనుస్మృతి & ధర్మ శాస్త్రాలను దహనం చేయడం, పురోహితులు లేకుండా పెళ్ళిళ్లు జరపడం, నీటి బావుల దగ్గర దళితుల ప్రవేశం వంటి కార్యక్రమాలను నిర్వహించారు.



రామస్వామి నాయకర్ 'కుడి అరసు', 'విధి తులై', 'ఎకు తరిపు' అనే పత్రికలను స్థాపించారు.

- **బెంగాల్ మహిళ్యా ఉద్యమం:** బెంగాల్, మిడ్నపూర్‌లోని కైవర్తాలో నిమ్న కులాలవారు ఆర్థికంగా బలపడ్డారు. నిమ్నకులస్తులు తమను మహిళ్యా (ఉన్నత కులం)గా పేర్కొనేవారు. 1897లో జాతి నిర్ధారిణి సభను, 1901లో మహిళ్యా సమితిని ప్రారంభించారు.
- **నంశూద్ర ఉద్యమం:** బెంగాల్ ఫరీదాపూర్‌లోని నిమ్నకులాలవారు 1901 తరవాత కొంతమంది విద్యావంతుల సహకారంతో చైతన్యవంతులయ్యారు.
- **కాయస్థ ఉద్యమం:** కాయస్థలు ఉత్తర, తూర్పు భారతదేశంలో బలమైన బ్రాహ్మణేతర వర్గం. 1919లో వీరు అలహాబాద్‌లో 'కాయస్థ సమాచారం' అనే పత్రికను, 'అఖిల భారత కాయస్థ సమాఖ్య'ను ఏర్పరచుకొన్నారు.



బి.వి. నారాయణరెడ్డి

జాబ్ కార్నర్

ఐఓసీఎల్‌లో అప్రెంటీస్‌లు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) తూర్పు విభాగం - ట్రేడ్ & టెక్నీషియన్ అప్రెంటీస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **175**
- కేటగిరీలవారీ ఖాళీలు: ట్రేడ్ అప్రెంటీస్‌లు 113, టెక్నీషియన్ అప్రెంటీస్‌లు 62
- వయసు: జనవరి 31 నాటికి 18 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
- అర్హత: టెక్నీషియన్ అప్రెంటీస్‌లకు సంబంధిత విభాగంలో రెండేళ్ల రెగ్యులర్ డిప్లొమా కోర్సు పూర్తిచేసి ఉండాలి. ట్రేడ్ అప్రెంటీస్‌లకు పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు సంబంధిత ట్రేడ్‌లో రెండేళ్ళ ఐటిఐ కోర్సు చేసి ఉండాలి. అకౌంటెంట్ విభాగానికి డిగ్రీ పూర్తిచేసి ఉండాలి.
- ట్రైనింగ్ వ్యవధి: ఏడాది
- ఎంపిక: రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- రాత పరీక్ష: మార్చి 11న
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 28
- వెబ్‌సైట్: www.iocl.com

ఐఆర్‌డీఏఐలో మేనేజర్లు

హైదరాబాద్ నానక్‌రామ్‌గూడలోని ఇన్స్యూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏఐ) - కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **18**
- పోస్టుల వారీ ఖాళీలు: గ్రేడ్ బి మేనేజర్లు 7, గ్రేడ్ సి అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు 8, గ్రేడ్ డి డిప్యూటీ జనరల్ మేనేజర్లు 2, గ్రేడ్ ఇ జనరల్ మేనేజర్ 1
- విభాగాలు: యాక్చేరియల్, ఎఫ్ & ఏ ఇన్వెస్ట్‌మెంట్స్, లైఫ్/ నాన్ లైఫ్, ఐటి, లీగల్
- వయసు: గ్రేడ్ - బికి 45, గ్రేడ్ - సికి 50, గ్రేడ్ - డి & ఇ పోస్టులకు 54 ఏళ్ల మించరాదు
- అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ / బిఇ / బిటెక్ / ఎల్ఎల్‌బి / ఏసీఏ / ఏఐసీడబ్ల్యుఏ / ఏసీఎస్ / సీఎంఏ / సీఎఫ్ఏ ఉత్తీర్ణులై ఉండాలి.
- ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
- ధరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 12
- వెబ్‌సైట్: www.irdai.gov.in



ఇచ్చి తీరాల్సిందే!

నాడు 'హోదా'తో సమానమన్నారు.. అలా ఇస్తామన్నందుకే ఒప్పుకొన్నాం.. ఆ ఒక్క పద్దుకిందే 16వేల కోట్లు రావాలి



- అది మా హక్కు... ఇవ్వకుంటే వదలం!
- కేంద్రం తీరు నియంతలా ఉంది
- మంత్రి గంటా, కుటుంబరావు ధ్వజం

అమరావతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్రం నవ్యాంధ్రకు ఎంత ఇవ్వాలి? ఇప్పటిదాకా ఎంత ఇచ్చింది? అనే అంశాలపై పూర్తి వివరాలతో శ్వేత ప్రతాలు విడుదల చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆయా అంశాలపై బీజేపీతో బహిరంగ చర్చకు కూడా సిద్ధమని స్పష్టం చేసింది. ప్రత్యేక సహాయం కింద ఇవ్వాల్సిన నిధులన్నీ ఇచ్చి తీరాల్సిందేనని తేల్చి చెప్పింది. "బీజేపీ ఇచ్చామంటోంది. మేం ఇవ్వలేదంటున్నాం. ఈ అయోమయం పోగొట్టడానికే అన్ని వివరాలతో రంగాల వారీగా నాలుగైదు శ్వేత పత్రాలు విడుదల చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు" అని మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన సచివాలయంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబ రావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన సాయంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు రెండోసారి విడుదల చేసిన జాబితా పాడిందే పాట మాదిరిగా ఉంది తప్ప కొత్త విషయాలేమీ లేవని వారు పెదవి విరిచారు. "రాష్ట్రానికి ఇచ్చిన విద్యా సంస్థల గురించి బీజేపీ పదేపదే చెబుతోంది. విభజన చట్టం ప్రకారం ఏడు కేంద్ర సంస్థలను నవ్యాంధ్రలో ఏర్పాటు చేయాలి. ఇందులో కేంద్రీయ విశ్వ విద్యాలయం, గిరిజన విశ్వ విద్యాలయం ఇంతవరకూ మంజూరు మొత్తం ఏడు విద్యాసంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల విలువైన 2401 ఎకరాల భూమి కేటాయించింది. ప్రహరీ గోడలు, ఇతర మౌలిక వసతులకు రూ. 607 కోట్ల నిధులు ఇచ్చింది. వీటికి కేంద్ర ప్రభుత్వం తన అంచనాల ప్రకారమే రూ.9వేల కోట్లు ఇవ్వాల్సి ఉంది. కానీ... ఈ నాలుగు బడ్జెట్లలో కలిపి రూ.777 కోట్లు కేటాయించింది. ఖర్చు చేసిన మొత్తం ఇంకా తక్కువే" అని మంత్రి గంటా తెలిపారు.

'లోటు' మాట మాయం!

"ప్రత్యేక హోదాతో సమానమైన సహాయం చేస్తామని జైట్లీ ప్రకటించారు. ఇప్పటికి దీని కింద రూ.400 కోట్లు మాత్రమే వచ్చాయి. హోదాతో సమానంగా ఇస్తామంటేనే మేం ఒప్పుకొన్నాం. ఆ ఒక్క పద్దు కిందే రూ.16వేల కోట్లు రావాలి. వాటిని ఎందుకు ఇవ్వరు? ఇచ్చి తీరాలి. అది మా హక్కు. మేం వదిలిపెట్టేది లేదు" అని కుటుంబరావు తేల్చి చెప్పారు. కొన్ని రోజుల క్రితం బీజేపీ విడుదల చేసిన జాబితాలో రెవెన్యూ లోటు గురించి ప్రస్తావించారని... శుక్రవారం ఈ విషయాన్ని పూర్తిగా ఎత్తివేశారని ఆయన తెలిపారు. "ఉద్యోగుల వేతన సవరణ, రుణ మాఫీ వంటివి చేర్చి రెవెన్యూ లోటు పెంచి చూపిస్తున్నామని ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో ఉద్యోగుల పే కమిషన్ను ఆమోదించింది. ఆ తర్వాత వచ్చిన బీజేపీ ప్రభుత్వం వచ్చి చెల్లించలేదా? రాష్ట్రంలో మేం వచ్చీ రాగానే రూ.8 వేల కోట్ల పెండింగ్ బిల్లులు మీద పడ్డాయి. వాటిని ఆపి రుణ మాఫీ అమలు చేశాం. పెండింగ్ బిల్లులు రెవెన్యూ లోటు కిందకే వస్తాయి. ఎలా చూసుకొన్నా లోటు కింద రాష్ట్రానికి రూ.9వేల కోట్లు రావాలి. కావాలంటే దీనిపై ఆర్బీఐ మాజీ గవర్నర్ వైవీ రెడ్డితో కమిటీ వేయాలని కోరాం. ఈ కమిటీతో అన్నీ తేలుతాయి" అని అన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పథకం కింద రాష్ట్రానికి ఈ ఏడాది రూ. 350 కోట్లు మంజూరు చేసి... వెనక్కు తీసుకున్నారన్నారు.

అన్నింటా అంతే...

"విజయవాడ విమానాశ్రయం విస్తరణకు భూ సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.700 కోట్లు ఖర్చు పెట్టింది. ఆ విమానాశ్రయ అభివృద్ధికి కేంద్రం రూ.300 కోట్లు ఇచ్చింది. విభజన జరిగిన సంవత్సరమే నవ్యాంధ్రకు దూరదర్శన్ కేంద్రం ఇచ్చినట్లు బీజేపీ ఘనంగా చెబుతోంది. కానీ... దానికి ఇచ్చిన మొత్తం రూ.8 కోట్లు" అని మంత్రి గంటా వివరించారు. బీజేపీ చెబుతున్న పాస్‌పోర్టు సేవా కేంద్రాలను పీపీపీ పద్ధతిలో ఇస్తున్నారన్నారు. "ఈ అంకెలపై మేం బహిరంగ చర్చకు సిద్ధం. రొటీన్‌గా వచ్చినవి రాష్ట్రానికి ప్రత్యేకంగా చేశామని చెప్పవద్దు.కుంటి సాకులతో విషయాన్ని పక్కదారి పట్టించవద్దు' అని బీజేపీ నేతలను కోరారు.

'నిజ నిర్ధారణ'కు నివేదిక!

- 116 పేజీలతో తయారు చేసిన ప్రభుత్వం
- నేడు హైదరాబాద్‌లో పవన్‌కు అందజేత

అమరావతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిందేంటి? వచ్చిందేంటి? హామీల అమలు ఎలా ఉంది? ఇలా అన్ని అంశాలతో రాష్ట్ర ప్రభుత్వం 116 పేజీల నివేదికను తయారు చేసింది. దీనిని జనసేన అధిపతి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలోని నిజ నిర్ధారణ కమిటీకి శనివారం అందించనుంది. "రాష్ట్రవిభజన నాటికి నవ్యాంధ్రలో రూ.22వేల కోట్ల పైచిలుకు ఆర్థిక లోటు ఉంటుందని 14వ ఆర్థిక సంఘం చెప్పింది. కానీ, 16,079 కోట్లనే లోటుగా నిర్ధారించారు. కేంద్రం మాత్రం 3979 కోట్లనే ఇచ్చింది. హోదాకు సమానమైన ప్యాకేజీ ఇస్తామని కేంద్రం మాటిచ్చింది. ఈమేరకు ఈఏపీల కింద 15వేల కోట్లు రావాలి. అవేవీ రాలేదు. విదేశీ బ్యాంకులు, సంస్థల నుంచి రుణాలు రావడం ఆలస్యమవుతున్నందున నాబార్డు, హడ్కోలనుంచి ఇవ్వాలని చాన్నాళ్లుగా కోరుతున్నాం. రైల్వే జోన్ ఇవ్వలేదు. పోలవరం ప్రాజెక్టు పునరావాస వ్యయంపై కేంద్రం స్పష్టమైన ప్రకటన చేయాల్సి ఉంది. అమరావతి నిర్మాణానికి రూ.10వేల కోట్లను బడ్జెట్‌లో కేటాయించాలని అడుగుతున్నా ఫలితంలేదు" అని ఆ నివేదికలో పేర్కొన్నారు.

రాష్ట్రానికి మోదీ!

(మొదటి పేజీ తరువాయి)

రేకెత్తిస్తోంది! రాష్ట్ర ప్రజల్లో, ప్రభుత్వంలో నెలకొన్న అసంతృప్తి అగ్నిని చల్లార్చేలా... తగిన 'ప్రతిపాదనల'తో వస్తారా? పర్యటన సందర్భంగా వాటి గురించి ప్రకటిస్తారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు బడ్జెట్ సన్నాహక సమావేశంలో ఉండగా ఢిల్లీ నుంచి అందిన సమాచారాన్ని అధికారులు తెలియచేశారు. ఒకవేళ ప్రధానమంత్రి వస్తే పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు తిరిగి ప్రారంభమయ్యే (మార్చి 5)లోపు ముందు వస్తారా? తర్వాత వస్తారా? అన్నది తేలాల్సి ఉంది. అయితే... 5వ తేదీలోపే ప్రధాని వచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

ఏమిస్తారో తెలిస్తేనే: ప్రధాని పర్యటన ప్రతిపాదనపై రాష్ట్రం ఆచి తూచి వ్యవహరిస్తోంది. గతంలో అమరావతి రాజధాని శంకుస్థాపన కార్యక్రమానికి వచ్చిన ప్రధాని... 'మట్టి-నీళ్లు' ఇచ్చి వెళ్లిపోయిన సంగతి గుర్తు చేసుకుంటోంది. "అప్పుడు ప్రధాని నవ్యాంధ్రకు వరాలు ప్రకటిస్తారని అంతా ఆశించారు. ఆశగా ఎదురు చూశారు. కానీ... ఆయన మొండిచేయి చూపించారు. అప్పుడే దీనిపై ప్రజల్లో తీవ్ర నిరసన వ్యక్తమైంది. ఇప్పుడు... ప్రజల్లో మరోసారి ఆగ్రహం రగులుతున్న సమయంలో రాష్ట్రానికి వస్తామంటున్నారు. ఆయన అలా వచ్చి ఇలా వెళ్లిపోతే ఫలితం ఉండదు. పైగా... రాష్ట్ర ప్రభుత్వమే కేంద్రంతో కలిసి ఇదంతా చేసిందనే సంకేతాలు వెళతాయి" అని ప్రభుత్వం భావిస్తోంది. అందువల్ల... రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ఎలా సరిదిద్దుతారు? ఎంత సహాయం చేస్తారు? ఎలా, ఎప్పుడు చేస్తారు? అనే అంశాలపై ముందే స్పష్టత తీసుకోవాలని... ఆ తర్వాతే, ఆయనకు అధికారికంగా ఆహ్వానం పంపించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసింది. ఏదిఏమైనా మోదీ పర్యటన జరిగితే... ఆయన ఏం చెబుతారు, ఏం ఇస్తారు అనే దానినిబట్టి రాష్ట్ర రాజకీయ పరిణామాలు మలుపు తిరిగే అవకాశముంది.

21న కీలక భేటీ:

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన కీలక అంశాలపై ప్రధానమంత్రి కార్యాలయంలో (పీఎంవో) ఈ నెల 21న సమావేశం జరగబోతుంది. ఈ భేటీకి అన్ని వివరాలతో హాజరుకావాలని రాష్ట్ర ఆర్థిక శాఖ, పరిశ్రమల శాఖ అధికారులను పీఎంవో అధికారులు ఆహ్వానించినట్లు తెలిసింది. అలాగే, 21వ తేదీన రాష్ట్ర విభజన చట్టం అమలుపై షీలా బిడే కమిటీతో చర్చలు జరపడానికి ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు ఇప్పటికే కేంద్ర హోం శాఖ ఆహ్వానం పంపింది. ఎలాగూ ఏపీ సీఎస్ ఢిల్లీలోనే ఉంటారు కాబట్టి ఆయనను కూడా సమావేశంలో పాల్గొనాలని పీఎంవో అధికారులు ఆహ్వానించారు. కాగా, ప్రత్యేక ప్యాకేజీలో భాగంగా ఈఏపీల ద్వారా రావాల్సిన నిధులు, రెవెన్యూ లోటు భర్తీ, పారిశ్రామిక రాయితీలు, రాష్ట్ర విభజన హామీలపై పీఎంవో అధికారులు చర్చలు జరిపే అవకాశముంది. ఈఏపీలపై రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చించి త్వరలో స్పష్టత ఇస్తామని ఇటీవల పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. అలాగే, రెవెన్యూ లోటు కింద రాష్ట్ర ప్రభుత్వం అదనంగా నిధులు కోరుతున్న అంశంపైనా అధికారులతో చర్చిస్తామన్నారు. ఈ నేపథ్యంలో పీఎంవో అధికారులతో జరిగే సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. ఇదే సమావేశంలో మిగిలిన హామీలు, షెడ్యూల్ 9,10 సంస్థల విభజన, షెడ్యూల్ 13లోని ప్రాజెక్టులపై చర్చించే సూచనలు కనిపిస్తున్నాయి.

చట్టంలో లేనివీ చేస్తున్నాం



- ఇస్తే హక్కు.. ఇవ్వకపోతే పాపమా?
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఏపీ విభజన చట్టంలో పేర్కొన్న హామీలు, అంశాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని, అవేకాకుండా చట్టంలో లేని పలు ప్రాజెక్టులను కూడా మంజూరు చేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ కంభంపాటి హరిబాబు స్పష్టం చేశారు. శుక్రవారం ఢిల్లీలో బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి బీజేపీ ఏం చేసిందో వివరిస్తూ 18 పేజీల నోట్‌ను విడుదల చేశారు. చట్టంలో ఇచ్చిన హామీలను పదేళ్లలో పూర్తి చేయాలని పేర్కొన్నా, కేంద్రం ఇప్పటికే అమలు చేస్తోందని తెలిపారు. రెవెన్యూ లోటు భర్తీ విషయంలో రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 2015 మార్చి 31 వరకు ఎంత లోటు ఉందో.. లెక్కించి తుది నిర్ణయం తీసుకుంటారని అన్నారు. 'రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత దూరదర్శన్ కేంద్రం ఏర్పాటు చేయరా? అని ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి.. చత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు 2000 సంవత్సరంలో ఏర్పడితే వెంకయ్య కేంద్ర మంత్రి అయ్యాక 2017లో ఆ రాష్ట్రాల్లో దూరదర్శన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఏపీ 2014 జూన్‌లో ఏర్పడితే.. డీడీ సప్తగిరిని 2014 నవంబరు నాటికి మంజూరు చేశారు' అని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రానికీ ఇవ్వనన్ని ఇళ్లు ఇచ్చినా ఇంకా మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రానికి సహకారం వస్తే తమ హక్కుగా వచ్చిందని, ఇవ్వకపోతే కేంద్రం, నరేంద్ర మోదీ పాపమని ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

నోట్‌లో పేర్కొన్న ముఖ్యాంశాలు

- వైజాగ్-చెన్నై పారిశ్రామిక కారిడార్‌కు కేంద్రం సానుకూలం. రూ.2500 కోట్లు విడుదలయ్యాయి.
- విశాఖ, విజయవాడ, తిరుపతి విమానాశ్రయాల్లో అంతర్జాతీయ ప్రమాణాలు.
- అనంతపురం-అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవేకి 20,000 కోట్ల మంజూరు.
- అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి రూ.19,700 కోట్ల మంజూరు.
- విజయవాడ-గుంటూరు వయా అమరావతి కొత్త రైల్వే లైన్ కోసం రూ.2679.59 కోట్ల మంజూరు.
- నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఎక్సైజ్ అండ్ నార్కోటిక్స్‌కు రూ.600 కోట్లు
- సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీకి రూ.50.73 కోట్లు
- ఓషన్ రిసెర్చ్ ఫెసిలిటీకి రూ.250 కోట్లు
- రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్‌కి 500 కోట్లు
- రూ.1.40 లక్షల కోట్లతో మేజర్ పెట్రోకెమికల్ హబ్
- 38500 కోట్లతో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ విస్తరణ
- 7 వేల కోట్లతో బకింహమ్ కెనాల్ పునరుద్ధరణ, -రూ.278 కోట్లతో లెదర్ కాంప్లెక్స్ నిర్మాణం

కేంద్రమే అన్నీ చేయదు

- హోదా పేరుతో మభ్యపెడుతున్నారు
- రాజధానిలో మయసభ నిర్మిస్తున్నారా?: జీవీఎల్

కేంద్రం ఇచ్చే ప్రత్యేక హోదా, ప్రత్యేక ఆర్థిక సహకారాలు రాష్ట్రాల అభివృద్ధికి సంజీవని కాబోవని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు అన్నారు. కేంద్రం ఒక్కటే సాయం చేస్తే రాష్ట్రాలు అభివృద్ధి చెందలేవని చెప్పారు. కొన్ని రాజకీయ పార్టీలు ప్రత్యేక హోదాను ఎండమావిలా చూపిస్తూ, ప్రజలను మభ్యపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఏపీని పాలించిన కాంగ్రెస్, టీడీపీలు హైదరాబాద్ కేంద్రంగా అభివృద్ధి చేశాయని, రాష్ట్రం మొత్తం అభివృద్ధి చేసి ఉంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదన్నారు. కాబట్టి ఈ రెండు పార్టీలు ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. 'రాజధానికి నిధులు ఇవ్వడం లేదంటున్నారు. రాజధానిలో ప్రభుత్వ భవనాలు నిర్మించడానికి కేంద్రం నిధులు ఇస్తోంది. మరి అక్కడ భవనాలు నిర్మిస్తున్నారా? లేక మయసభ నిర్మిస్తున్నారా?' అని దుయ్యబట్టారు.

పాలకుల తప్పులకు ప్రజలకా శిక్ష!

- మాట ఇచ్చినప్పుడు తప్పకూడదు
- జేఎఫ్‌సీ తొలి భేటీలో పవన్ డిమాండ్
- నేడు కూడా కొనసాగనున్న సమావేశం



హైదరాబాద్‌లో జరిగిన జేఎఫ్‌సీ సమావేశంలో పాల్గొన్న పవన్, జేపీ, ఉండవల్లి, కొణతాల, నాగేశ్వర్, గౌతమ్ రామకృష్ణ, గిడుగు, మధు తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి):'ఆంధ్రప్రదేశ్ సమస్యను జాతీయ అత్యవసర పరిస్థితిగా కేంద్రం గుర్తించాలి. కేంద్రం పట్టించుకోకుంటే దేశం ముక్కలవుతుంది. రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగిపోతోంది. ప్రజల్లో అసహనం పెరిగిపోతోంది. అశాంతితో కూడిన పరిస్థితులు బలంగా ఏర్పడుతున్నాయి. నాయకుల చిత్తశుద్ధిలో లోపం ఉంటే విపత్కర పరిస్థితులు ఏర్పడతాయని భయమేస్తోంది' అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని దసపల్లా హోటల్‌లో..లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ అధ్యక్షతన సంయుక్త నిజనిర్ధారణ కమిటీ (జేఎఫ్‌సీ) తొలి సమావేశం జరిగింది. కేంద్రం రూ.లక్షల కోట్లు ఇచ్చానంటుండగా..వచ్చినవి పిసరంతేనని రాష్ట్ర ప్రభుత్వం తేల్చిచెబుతున్న నేపథ్యంలో జేఎఫ్‌సీ భేటీలో రాష్ట్ర సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. పునర్విభజన చట్టం, రాజ్యసభలో నాటి ప్రధాని మన్మోహన్ చేసిన ప్రకటనలు, ఏపీకి ఇచ్చిన హామీలకి సంబంధించి ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) నుంచి సేకరించిన సమాచారం, హామీలపై టీడీపీ చెబుతున్న అంశాలు, ప్రస్తుత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కేంద్ర మంత్రిగా ఉండగా ప్రత్యేక హోదాపై చేసిన ప్రకటనలు, అమరావతి శంకుస్థాపన సందర్భంగా ప్రధాని మోదీ ఇచ్చిన హామీలు, కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పార్లమెంటులో చేసిన ప్రకటనలపైనా చర్చ జరిగింది. 'నరేంద్ర మోదీ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసినపుడు పార్లమెంటు గుమ్మం వద్ద ముద్దు పెట్టారు. పార్లమెంటుపై ఆయనకున్న గౌరవం అది. పార్లమెంటులో చేసిన చట్టాలను అమలు చేయకుండా ఆయన వెనక్కి తగ్గడంతో వైరుధ్యం కనిపిస్తోంది. చట్టాలను గౌరవించనపుడు ప్రజల్లో తిరుగుబాటు వస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమస్యలను పట్టించుకోకపోతే దేశభద్రతకు ముప్పు గా పరిణమిస్తుంది. ప్రస్తుత పరిస్థితుల ప్రభావం వచ్చే తరంపై పడుతుంది. వాళ్లంతా తిరుగుబాటు చేయాలనుకుంటే అది ఎటువైపు వెళ్తుందో! ఇచ్చిన హామీలను నెరవేర్చని పక్షంలో తమను ద్వితీయ శ్రేణి పౌరుల్లా చూస్తున్నారనే అభిప్రాయానికి ప్రజలు వస్తారు. ఉత్తర, దక్షిణ భారతంగా దేశాన్ని విడగొట్టాలనే వేర్పాటు వాదంవైపు బలమైన దారులు పడతాయి' అని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. సమాజం కోసం పని చేసే వాళ్లు, పట్టించుకునే వాళ్లు కొందరు బతికున్నారనే నమ్మకాన్ని ఏపీ ప్రజల్లో కల్పించేందుకే జేఎఫ్‌సీని ఏర్పాటు చేశామన్నారు. అనుకున్న పని జరగకపోతే తిట్టించుకోవడానికైనా సిద్ధంగా ఉన్నామని చెప్పారు. లేకపోతే ప్రజల్లో నమ్మకం చచ్చిపోతుందన్నారు. 'నాకు సరైన అనుభం లేదు. రాష్ట్ర విభజనలో జరిగిన అన్యాయమే జనసేన ఏర్పాటుకు కారణం. తెలంగాణ ఇచ్చినప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇస్తామన్నారు. మాట ఇచ్చిన తర్వాత తప్పకూడదు. ప్రతి ఒక్కరూ రాజకీయ లబ్ధి కోసమే మాట్లాడుతున్నారు. రాష్ట్రానికిచ్చిన హామీలు నెరవేరుస్తారో లేదో కేంద్రం నిజాయితీగా చెప్పాలి. పద్ధతీపాడూ లేకుండా రాష్ట్రాన్ని విభజించి, వాళ్ల ఇష్టానికి వెళ్లిపోండన్నారు. పాలకుల తప్పులకు ప్రజలను శిక్షిస్తారా' అని ఆవేదన వ్యక్తంచేశారు. కొన్నేళ్ల క్రితం తెలంగాణకు వచ్చి స్థిరపడిన కుటుంబంలో ఒకరు చనిపోతే అంత్యక్రియలు చేయనివ్వలేదని చెప్పారు. తూర్పు ఆంధ్ర నుంచి వచ్చి టీచర్లుగా పనిచేస్తున్న వాళ్లను తిరిగి అక్కడికే వెళ్లిపోవాలంటున్నారని వాపోయారు. ఎంతసేపూ అధికారం, వ్యక్తిగత లాభం కోసమే నాయకులు ఆలోచిస్తుంటే ప్రజలు తమ అసహనాన్ని ఎవరికి చెబుతారని ప్రశ్నించారు. మత్స్యకారులను ఎస్టీల్లో చేర్చుతామని హామీ ఇచ్చి పట్టించుకోవడం లేదన్నారు.

అందరినీ పిలిచాం

ఏపీ శ్రేయస్సు కోసం అందరినీ కలుపుకొని సమష్టిగా పోరాడుతున్నామని పవన్ అన్నారు. జేఎఫ్‌సీ భేటీకి ముందు విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తెలుగుదేశం, వైసీపీలకు కూడా ఆహ్వానం పంపామని, ఎవరూ రాలేదని చెప్పారు. అంశాల వారీగా సబ్ కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. చర్చలకు ముందు లోయర్ ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పవన్ నివాళులర్పించారు.

11 ప్రాధాన్యాంశాలు.. ముగ్గురితో కమిటీ

తమకు లభించిన సమాచారంపై చర్చించేందుకు ప్రాధాన్యం ప్రకారం 11 అంశాలుగా విభజించామని జేపీ వెల్లడించారు. రెవెన్యూ లోటు, వెనుకబడిన ప్రాంతాలు, పోలవరం, పన్నుల రాయితీలు, ఏపీలో కేంద్ర ప్రభుత్వం సంస్థల ఏర్పాటు, మౌలిక సదుపాయాలు, నౌకాశ్రయాల ఏర్పాటు, రైల్వే జోన్, ప్రత్యేక ప్యాకేజీ కింద ఇచ్చిన నిధులు, రాజధాని నిర్మాణం వంటివి ఇందులో ఉన్నాయన్నారు. సుదీర్ఘ అనుభవం కలిగిన విశ్రాంత అధికారులు పద్మనాభయ్య, ఐవైఆర్ కృష్ణారావు, చంద్రశేఖర్‌తో సబ్‌కమిటీని ఏర్పాటు చేశామని.. సమాచారాన్నంతా ఆ కమిటీకి అందిస్తామని.. శనివారం నాటి సమావేశంలో దానిపై చర్చిస్తామని జేపీ తెలిపారు.

విభజన హామీలపై ఆర్టీఐ

విభజన చట్టంలో ఇచ్చిన హామీల అమలు పరిస్థితులపై సమాచారం అందించాలని.. జేఎఫ్‌సీ సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద కేంద్ర హోంశాఖకు గురువారం దరఖాస్తు చేసింది. షెడ్యూల్ 13లో ఇచ్చిన హామీలు, 2014 ఫిబ్రవరి 20న రాజ్యసభలో అప్పటి ప్రధాని ఇచ్చిన హామీల సమాచారాన్ని అందించాలని అందులో కోరింది. పవన్, జేపీ, ఉండవల్లి దీనిపై సంతకాలు చేశారు.

నిధులేం చేశారని అంటారా: జేపీ

తమ నుంచి అద్భుతాలు ఆశించవద్దని జయప్రకాశ్ నారాయణ అన్నారు. ఆవేశం అనర్థాలకు దారి తీస్తుందని, తమను ఆకాశానికెత్తి కింద పడేయొద్దని కోరారు. ఇప్పటి వరకు కేంద్రం ఇచ్చిన నిధులు ఏం చేశారనే రీతిలో మాట్లాడడాన్ని జేఎఫ్‌సీ తప్పుపడుతోందన్నారు. ప్రజలు చెల్లించే పన్నులనే నిధుల రూపంలో వివిధ పథకాల కింద రాష్ట్రాలకు కేంద్రం పంపిణీ చేస్తోందన్నారు. మామూలుగా రాష్ట్రాలకు వచ్చేవాటిని కూడా కలిపి చాలా ఇచ్చామని చెప్పడం సరికాదని తెలిపారు. విభజన హామీల అమలు, కేంద్రం ఇచ్చిన నిధులపై తన నివేదికను జనసేన కార్యాలయానికి పంపిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. కేంద్రం నుంచి కూడా అడిగితే బీజేపీ నేతల ద్వారా పంపుతామన్నారని తెలిపారు.

చట్టాన్ని ఎందుకు సవరించరు?

'మాకు అన్యాయం జరిగిందనే భావన ఆంధ్ర ప్రజల్లో ఉంది. ఏం అన్యాయం జరిగిందో చాలామందికి అర్థం కావడం లేదు. ఈ అన్యాయంపై అకడమిక్‌గా స్టడీ చేయాలి. అదేవిధంగా రాజకీయంగా పోరాడాల్సిన బాధ్యత ఉంది. ఇవి రెండూ కలిపే చేయాలి. హోదాపై ప్రధాని చేసిన ప్రకటన విభజన చట్టంలో లేదు. చట్టంలో పెట్టించుకోవాలని నేనెప్పుడో చెప్పాను. ఎవరూ పట్టించుకోలేదు. పోలవరం ముంపు మండలాలను ఏపీలో విలీనం చేసి చట్టాన్ని సవరించినప్పుడు.. ప్రత్యేక హోదాను కూడా చట్టంలో చేస్తూ ఎందుకు సవరణ చేయకూడదు? రామ్‌విలాస్ పాశ్వాన్ రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు హాజీపూర్ రైల్వేజోన్ ఇచ్చుకున్నప్పుడు విశాఖ రైల్వే జోన్‌కు అడ్డంకేంటి?

- ప్రొఫెసర్ నాగేశ్వర్

పార్లమెంటు సమావేశాల్లోపు పరిష్కరించాలి

'పరిస్థితులు చేయిదాటి పోతున్నాయి. ప్రజల్లో తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది. ప్రత్యేక హోదా హామీని, విభజన హామీలన్నిటినీ నెరవేర్చాలి. 5న మొదలయ్యే పార్లమెంటు సమావేశాల్లోగా సమస్యలన్నీ పరిష్కరించాలి.'

- పి.మధు, సీపీఎం కార్యదర్శి

హామీలు నెరవేర్చేదాకా..

'ఆంధ్ర రాష్ట్రానికి విభజన సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే వరకు ముందుకు వెళ్తాం. బడ్జెట్‌లో కూడా మోసం చేశారు. అందుకు ప్రజలు రోడ్డెక్కి నిరసన తెలియజేశారు. సమస్యల పరిష్కారానికి అందరూ ఒక తాటిపైకి వస్తున్నారు.'

- కె.రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

కాంగ్రెస్ నష్టం చేయలేదు

'విభజనతో కాంగ్రెస్ పాపం చేసినట్లు, అది అంటరాని పార్టీ అని అధికార పార్టీ వారు మాట్లాడుతున్నారు. విభజనకు మద్దతుగా చంద్రబాబు రెండుసార్లు లేఖలు ఇచ్చారు. విభజనవల్ల కాంగ్రెసే నష్టపోయింది. ప్రజలకు నష్టం చేయలేదు.'

- జంగా గౌతమ్, కాంగ్రెస్

ఎక్కడా ఇలాంటి సమస్య లేదు

'రాజకీయంగా కాకుండా ఇదో కొత్తరకం సమస్య. దేశంలో ఇలాంటి సమస్య ఎక్కడా లేదు. వంద రూపాయలిచ్చి చిల్లర ఇవ్వరా బాబూ అని అడుక్కుంటున్నట్లుగా ఉంది. చట్టం చేశాక దానిని అమలు చేయాల్సిన బాధ్యత చేసిన వారిపై ఉంది. కానీ మన ఖర్మ ఇలా కాలింది. ఏంచేయాలో తెలియక పవన్ మేధావులతో సమావేశం ఏర్పాటు చేశారు. అందరం కలిసి చర్చించి ఏం చేయాలా అని ఆలోచిస్తున్నాం. పవన్‌కు దైవబలం ఉంది. మంచి జరగాలని ఆశిస్తున్నాం.'

- ఉండవల్లి అరుణ్‌కుమార్, మాజీ ఎంపీ



ఆంధ్రుల చెవుల్లో ప్రధాని మోదీ పూలు పెట్టారంటూ శుక్రవారం తిరుపతిలో జరిగిన నిరసన కార్యక్రమంలో కమలం పువ్వులు చెవుల్లో పెట్టుకున్న టీడీపీ ఎంపీ శివప్రసాద్

పేరేదైనా హోదా ప్రయోజనాలు రావాలి

- అవి ఇస్తామంటేనే ప్యాకేజీకి ఒప్పుకొన్నాం
- వదిలిపెట్టం..వచ్చేవరకూ పోరాడతాం : మంత్రులు

అమరావతి, సోంపేట, తిరుపతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రత్యేకహోదా వల్ల రాష్ట్రానికి రావాల్సిన ప్రయోజనాలను వదిలిపెట్టే సమస్యే లేదని, పేరేదైనా వాటిని సాధించడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలుగుదేశం పార్టీ ప్రకటించింది. శుక్రవారం ఇక్కడ సచివాలయంలో మంత్రులు కాల్వ శ్రీనివాసులు, నక్కా ఆనందబాబు విలేకరులతో మాట్లాడారు. '14వ ఆర్థిక సంఘం సిఫారసులు, ఇతర కారణాల వల్ల ప్రత్యేకహోదాను ఇవ్వలేకపోతున్నామని, అవే ప్రయోజనాలను ప్రత్యేక ప్యాకేజీ కింద ఇస్తామని కేంద్రం చెప్పింది. పేరు ముఖ్యం కాదు. ఆ ప్రయోజనాలు రాబట్టడం మాకు ముఖ్యం. అందుకే అంగీకరించాం' అని కాల్వ శ్రీనివాసులు పేర్కొన్నారు. హక్కుగా ఏపీకి రావాల్సిన వాటిని వదులుకొనేది లేదని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు చెప్పారు. రాష్ట్రానికి అన్యాయం జరిగిపోయిందని ఇప్పుడు ఆవేదన వ్యక్తంచేస్తున్న పార్టీలు గతంలో పార్లమెంటు తలుపులుమూసి అడ్డగోలు విభజన చేసినరోజు ఎందుకు నోరు తెరిచి మాట్లాడలేదని ప్రశ్నించారు.

పవన్ చొరవ హర్షణీయం!

రాష్ట్రానికి ఏదైనా సాధించాలని జనసేన పార్టీ వ్యవస్థాపకుడు పవన్ కల్యాణ్ చేస్తున్న ప్రయత్నాన్ని స్వాగతిస్తున్నామని మంత్రి కాల్వ అన్నారు. 'ఎవరికి ఏ సమాచారం కావాలన్నా సమాచార మంత్రిగా నన్ను సంప్రదించండి. నేను ఇస్తాను. విభజన చట్టంలో ఏపీకి ఇచ్చిన వాగ్దానాలు, నాటి ప్రధాని పార్లమెంటు వేదికగా ఇచ్చిన హామీలు ఏ దశలో ఉన్నాయో సమగ్ర సమాచారం పవన్ కల్యాణ్‌కు పంపాం. ఇంకా ఏవైనా కావాలన్నా ఇస్తాం' అని ఆయన చెప్పారు. పవన్ కల్యాణ్ నిర్వహించిన సమావేశానికి తమ పార్టీకి ఆహ్వానం అందలేదన్నారు. కేంద్రంపై పోరాటానికి టీడీపీ కలిసి రావాలని వైసీపీ అధ్యక్షుడు జగన్ ఇచ్చిన పిలుపుపై ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు. 'ఒక ఆర్థిక నేరగాడు తనతో కలిసి రావాలని పిలిస్తే మేం వెళ్లాలా? జగన్ మాటల్లో, చేతల్లో నిజాయితీ లేదు. మేం రాష్ట్రం కోసం చూస్తుంటే వాళ్లు రాజకీయం కోసం చూస్తున్నారు' అని ఆయన విమర్శించారు.

రాష్ట్రానికి కేంద్రం ప్రకటించిన సాయం అందజేయకుంటే కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సిద్ధంగా ఉన్నారని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. జగన్ ఢిల్లీలో కేంద్రానికి పిల్లిలా దండం పెడుతూ.. రాష్ట్రంలో ప్రతాపం చూపాలనుకుంటున్నారని వ్యవసాయ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విరుచుకుపడ్డారు. కేంద్ర బడ్జెట్ ది బెస్ట్ అంటూ కితాబిచ్చి.. జనంలో వ్యతిరేకత రావడంతో జగన్ నాలుక కరుచుకుంటున్నారని మంత్రి సోమిరెడ్డి తిరుపతిలో ఎద్దేవా చేశారు. వాక్ విత్ జగన్ అనే వైసీపీ నినాదాన్ని ప్రస్తావిస్తూ.. జగన్‌తో జైలుకు వెళ్లాలా.. కోర్టు బోను దాకా నడవాలా.. లేదా తల దించుకుని నడవాలా అని వ్యంగ్యంగా అన్నారు. జగన్ దెబ్బకు జనం చెంపలు వాచిపోతున్నాయని, జుట్టు చెదిరిపోతోందని, జనానికి ఓ దువ్వెనైనా ఇవ్వండని హితవు పలికారు.

బ్యాంకు లూటీ





నీరవ్ మోదీ దెబ్బకు కుదేలైన దేశంలో రెండో పెద్ద బ్యాంకు

అమ్మకానికి పీఎన్‌బీ ఆస్తులు!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: నీరవ్ మోదీ కుంభకోణం దెబ్బకు కుదేలైన పంజాబ్ నేషనల్ బ్యాంకు ఆస్తులు అమ్ముకోవాలని భావిస్తోంది. సరైన ధర వస్తే మార్చి ఆఖరు నాటికి విక్రయ ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయించింది. దేశంలో రెండో పెద్ద బ్యాంకు అయిన పీఎన్‌బీ అమ్మకానికి పెట్టనున్న ఆస్తుల్లో కొన్ని కార్యాలయ భవనాలు కూడా ఉన్నాయి. బిలియనీర్ అయిన వజ్రాల వ్యాపారి నీరవ్ బోగస్ లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్‌తో బ్యాంకుకు రూ.11,400 కోట్ల మేర ముంచేసిన సంగతి తెలిసిందే. నీరవ్ దోపిడీతో దిమ్మ తిరిగిన బ్యాంకుకు స్థిరాస్తులు అమ్మి సొమ్ము చేసుకోవడం ఉపశమనానికి ఓ మార్గంగా కనిపిస్తోంది. ఢిల్లీలోని సువిశాల కార్యాలయాన్ని కూడా అమ్మకానికి పెట్టాలని నిర్ణయానికొచ్చినట్లు సమాచారం. ఈ ఆర్థిక సంవత్సరంలో పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్‌లో 5.9 శాతం వాటాను రూ.1,321 కోట్లకు అమ్మేసింది. ఆస్తుల నిర్వహణ వ్యాపారం పీఎన్‌బీ ప్రిన్సిపల్ నుంచి బయటికొచ్చి రూ.125 కోట్లు సమకూర్చుకుంది. పీఎన్‌బీ బయటపడాలంటే రూ.8000 కోట్ల అదనపు పెట్టుబడి అవసరమని మోర్గాన్ స్టాన్లీ అంచనా వేసింది.

రిజర్వు బ్యాంకు బాధ్యత వహించాలి

- పీఎన్‌బీలో వ్యవస్థల వైఫల్యం.. ఏడేళ్లుగా బ్యాంకులో అక్రమాలు
- అప్పటి నుంచి ఎన్నో తనిఖీలు.. అయినా వేల కోట్ల కుంభకోణం
- బ్యాంకు యూనియన్ల ధ్వజం

ముంబై, ఫిబ్రవరి 16: పదకొండు వేల కోట్ల కుంభకోణానికి కారణం- పీఎన్‌బీలో వ్యవస్థల దారుణ వైఫల్యం... దీనికి రిజర్వు బ్యాంకే బాధ్యత వహించాలని బ్యాంకు యూనియన్లు డిమాండ్ చేశాయి. పీఎన్‌బీలో అక్రమాలు 2011 నుంచీ జరుగుతున్నాయని, అప్పటి నుంచి ఎన్నో తనిఖీలు, ఆడిట్‌లు జరిగాయని ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి దేవీదాస్ తుల్జాపుర్కర్ గుర్తు చేశారు. ఈ తనిఖీల పరంపరలో ఆర్‌బీఐ వార్షిక ఆర్థిక తనిఖీ కూడా ఒకటని, అయినా భారీ కుంభకోణాన్ని గుర్తించలేకపోయారని విమర్శించారు. వ్యవస్థల వైఫల్యం నగదు ఇచ్చిన బ్యాంకుల్లోను, తీసుకున్న బ్యాంకుల్లోనూ జరిగిందని ఆయన చెప్పారు. బ్యాంకులను రీక్యాపిటలైజ్ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంపైనా బ్యాంకు యూనియన్లు పెదవి విరిచాయి. ఇది తాత్కాలిక ఉపశమనమేనని, అసలు సమస్య... నిరర్థక ఆస్తులేనని పేర్కొన్నాయి. ఉద్దేశపూర్వకంగా రుణాలను తిరిగి చెల్లించకపోవడమే ప్రధాన జాడ్యమని తెలిపాయి. "బ్యాంకుల లాభాలను నిరర్థక ఆస్తులు మింగేస్తున్నాయి. డిపాజిటర్ల సొమ్మును అక్రమాలు తన్నుకుపోతున్నాయి" అని దేవీదాస్ వ్యాఖ్యానించారు.



ఢిల్లీలో నీరవ్ మోదీకి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న యువజన కాంగ్రెస్ కార్యకర్తలు

మహా మోసం

(మొదటి పేజీ తరువాయి)

అధినేత మెహుల్ ఛోక్సీకి చెందిన సంస్థల గణాంకాలు నిశితంగా పరిశీలించి చూసిన ఐటీ శాఖకు 4,900 కోట్ల రూపాయల లెక్కతేలని మొత్తం కనబడింది. ఐటీ అధికారులు చెబుతున్నదాని ప్రకారం.. పన్ను ఎగవేసే క్రమంలో వీలైన అన్ని అడ్డదార్లనూ నీరవ్ తొక్కాడు. దాదాపు 150 డబ్బా (షెల్) కంపెనీల ద్వారా వేల కోట్ల రూపాయల అక్రమాలకు పాల్పడ్డాడు. అసలు తన ఆదాయమెంతో ఏ దశలోనూ బయటపెట్టనే లేదు. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను మోసం చేశాక.. నీరవ్ మహా మాయా సామ్రాజ్యంపై ప్రభుత్వంలోని అన్ని విభాగాలూ దృష్టిపెట్టాయి. నీరవ్‌కు, ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులకు చెందినవిగా పేర్కొన్న షెల్ కంపెనీలు కార్పొరేట్ వ్యవహారాల శాఖ పరిశీలనలో బయటపడ్డాయి. 2017 జనవరిలో నీరవ్‌కు చెందిన 50 కార్యాలయాలు, ఢిల్లీ, ముంబై, జైపూర్‌ల్లోని షాపులు, ఎస్ఈజెడ్ యూనిట్‌లోని వర్క్‌షాపులలపై ఐటీ శాఖ దాదాపు పదిరోజుల పాటు దాడులు జరిపింది. ఆ సోదాల్లో విలువైన వజ్రాభరణాలు, నగదు, కీలక పత్రాలు, నకిలీ అకౌంట్ పుస్తకాలు స్వాధీనం చేసుకుంది. అప్పటి నుంచి నీరవ్‌కు చెందిన ఫైర్‌స్టార్ డైమండ్, ఫైర్‌స్టార్ ఇంటర్నేషనల్, స్టెల్లార్ డైమండ్, గీతాంజలి గ్రూప్ మొదలైనవాటిపై నిఘా పెట్టింది. నీరవ్‌కు చెందిన సంస్థలు- అనేక డబ్బా (షెల్) కంపెనీల నుంచి ఆర్‌టీజీఎస్ ద్వారా నిధులను అందుకుంటున్నట్లు అకౌంట్ పుస్తకాలలో ఉందనీ, నిజానికి ఆ పేర్లున్న కంపెనీలు కాగితాలమీదే తప్ప నిజంగా ఎక్కడా లేవనీ ఐటీ శాఖ వివరించింది. నీరవ్ మామకు చెందిన గీతాంజలి గ్రూప్‌కు కూడా ఇదే తరహాలో డబ్బా కంపెనీల నుంచి మనీ ట్రాన్స్‌ఫర్ జరిగిందని తేల్చింది. నీరవ్ అక్రమార్జనకు అంతే లేదని, ఆయన సంస్థలపై సమగ్ర దర్యాప్తు అవసరమనీ అప్పట్లోనే కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు నివేదించింది. అయితే ఆర్థికశాఖ అధికారులు దీనిపై నిమ్మకు నీరెత్తినట్టు ఉండిపోయారు తప్ప ఎలాంటి దర్యాప్తూ చేపట్టలేదు.



ఐటీ శాఖ నివేదికలో అంశాలివీ..

వినియోగదారులకు నగదు చెల్లింపు మీదే వజ్రాలు, ఇతర వజ్రాభరణాల అమ్మకం సాగించిన నీరవ్ కంపెనీ.. వాటి విక్రయించిన ధర కాకుండా అంతకు రెండు రెట్లు ధరలతో విడిగా ఖాతా పుస్తకాల్లో నమోదు చేసేది. ఈ మొత్తం వ్యవహారం నీరవ్ గ్రూపులోని కొద్దిమంది వ్యక్తులు మాత్రమే చూసేవారు

- విదేశీ కొనుగోళ్లయితే నీరవ్ రెండు రకాల లావా దేవీలు నడిపేవాడు. మొదటిది..ఆయనకు చెందిన సైప్రస్, మారిషస్ కంపెనీల నుంచి షేర్ కేపిటల్ రూపేణా చెల్లింపు జరిగినట్లు చూపేవాడు. ఈ నిధులెక్కడి నుంచి వచ్చేవో, సైప్రస్, మారిషస్ లకు చెందిన కంపెనీల స్థాయేంటో నీరవ్ ప్రభుత్వానికి (ఐటీ శాఖకు) వెల్లడించలేదు.
- రెండోది...సింగపూర్‌కు చెందిన తన సోదరి (పూర్వీ మెహతా)కి చెందిన ఇస్లింగ్టన్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా జరిపేవాడు. పూర్వీ మెహతా ఆస్తులు, అప్పులు, రుణ మంజూరు తాహతు గురించిన వివరాలను కూడా నీరవ్ ఆదాయపు పన్ను విభాగానికి చెప్పలేదు.
- నీరవ్ సంస్థకు సూరత్‌లోని ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఈజెడ్)లో కొన్ని యూనిట్లు ఉన్నాయి. గత ఆరేళ్లుగా అక్కడి నుంచి వందల కోట్ల లావాదేవీలు జరిపినట్లు వెల్లడయ్యింది. వీటికి లెక్కా పత్రం లేదు. అక్కడున్న ఒక యూనిట్ ద్వారా ఒక్క 2017లోనే సుమారు 1216 కోట్ల రూపాయల వజ్రాల దిగుమతి, దేశీయ మార్కెట్‌కు కొనుగోలు జరిపినట్లు తేలింది.. వీటికి కూడా సరైన లెక్క లేదు.
- నీరవ్ అనేక బోగస్ కొనుగోళ్లు జరిపాడు. ముంబై జెమ్స్ అండ్ డైమండ్స్, శ్రీజీ మల్టీట్రేడ్, జైన్ డైమండ్స్ నుంచి వందల కోట్ల రూపాయల మేర వజ్రాల కొనుగోళ్లు జరిపినట్లు అకౌంట్ పుస్తకాల్లో ఉంది. నిజానికి ఇవి జరగనే లేదు. అనేక అనుబంధ కంపెనీలతో నీరవ్ అంతర్జాతీయ లావాదేవీలు జరిపాడు. వీటిని ప్రభుత్వానికి తెలియపరచలేదు. చట్ట ప్రకారం ఇది నేరం.
- గీతాంజలి గ్రూప్‌లో జరిగినట్లు నమోదైన లావాదేవీల్లో 90 శాతం బోగస్ కొనుగోళ్లే.

నాలుగేళ్ల ముందే హెచ్చరిక

ఆర్థిక శాఖ, ఆర్బీఐలకు విజిల్ బ్లోయర్ లేఖల మీద లేఖలు

- అలహాబాద్ బ్యాంకునూ ముంచిన మోదీ అండ్ కో
- 1500 కోట్ల బకాయి చెల్లించకుండా మరో 50 కోట్ల రుణం
- ఎంతోమంది అధికారుల పాత్ర: దూబే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)నే కాకుండా ఇతర బ్యాంకులను కూడా నీరవ్ మోదీ అండ్ కో ముంచారా!? బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోవడమే కానీ, తిరిగి చెల్లించడం అనేది వారి జమానాలోనే లేదా!? మోదీ అండ్ కో కుంభకోణాన్ని అప్పటి యూపీఏ ప్రభుత్వం అడ్డుకుని ఉండేదా!? మునిగిపోకుండా బ్యాంకులను కాపాడి ఉండేదా!? ఈ ప్రశ్నలకు 'ఔను' అనే అంటున్నారు అలహాబాద్ బ్యాంకు బోర్డులో అప్పటి ప్రభుత్వ నామినీ దినేశ్ దూబే! మోదీ అండ్ కో కుంభకోణం చేసే అవకాశం ఉందని ఆయన నాలుగేళ్ల కిందటే హెచ్చరించారు. స్కాం జరగకుండా అడ్డుకోండని కోరుతూ కేంద్ర ఆర్థిక శాఖ నుంచి ఆర్బీఐ వరకూ ఆయన ఎక్కని గుమ్మం లేదు. దిగని గుమ్మం లేదు. కుంభకోణాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించిన ఆయనను వేధించిన వాళ్లే కానీ.. స్కాంను అడ్డుకున్నవాళ్లు లేరు. నీరవ్ కుటుంబ సభ్యులకు అక్రమంగా రుణాలు మంజూరు విషయంలో యూపీఏ సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. అప్పటి పరిణామాలను ఆయన కూలంకషంగా వివరించారు. "న్యూఢిల్లీలోని ఓ ఫైవ్‌స్టార్ హోటల్లో 2013 సెప్టెంబరు 13న అలహాబాద్ బ్యాంక్ బోర్డు మీటింగ్ జరిగింది. అజెండాలో నాలుగో అంశం నీరవ్ మోదీ మేనమామ మెహుల్ ఛోక్సీకి చెందిన గీతాంజలి జెమ్స్‌కు రూ.50 కోట్ల రుణం మంజూరు చేయడం గురించి. ఈ ప్రతిపాదనకు నేను అభ్యంతరం చెప్పాను. డిసెంట్ నోట్ కూడా సమర్పించాను. గీతాంజలి జెమ్స్ ఇప్పటికే రూ.1500 కోట్ల రుణం తీసుకుందని, ఆ బకాయి తీర్చేసిన తర్వాతే కొత్త రుణం ఇవ్వాలని స్పష్టం చేశాను. అందుకు బోర్డు మీటింగులో మౌనమే సమాధానమైంది. దానిని వదిలేసి, తదుపరి అంశంపై చర్చ చేపట్టారు. ఆ తర్వాత నేను ఆ సమావేశ మినిట్స్‌ను తీసుకున్నాను. అందులో గీతాంజలి జెమ్స్‌కు రుణం మంజూరు చేసి ఉంది" అని ఆయన వివరించారు. దీనిపై తాను ఆగ్రహం వ్యక్తం చేశానని తెలిపారు. గీతాంజలికి రుణ మంజూరుకు సంబంధించి బ్యాంకు అధికారులు తనను ఒప్పించడానికి ప్రయత్నించారని, చివరికి బెదిరించారని తెలిపారు. భవిష్యత్తులో భారీ స్కాం జరగబోతోందని హెచ్చరిస్తూ ఆర్బీఐకి, అప్పటి ఆర్థిక శాఖలోని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శికి లేఖ కూడా రాశానని చెప్పారు. బకాయిలు చెల్లించకుండా ఛోక్సీ అండ్ కో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటున్నారని, గీతాంజలి, దాని అనుబంధ కంపెనీలపై నిఘా పెట్టాలని, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని లేఖలో కోరినట్లు దూబే తెలిపారు. ఈ మేరకు ఆయన అప్పటి ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ కేసీ చక్రవర్తికి కూడా లేఖ రాశారు. ఇప్పటికే రూ.1500 కోట్ల బకాయి ఉండగా మరో రూ.50 కోట్లు ఇచ్చేందుకు అలహాబాద్ బ్యాంకు బోర్డు మీటింగులో ప్రతిపాదన వచ్చిందని, దానిని తాను వ్యతిరేకించానని అందులో పేర్కొన్నారు. అయినా గీతాంజలికి రుణం ఇచ్చారని, దీనిపై తగిన చర్య తీసుకోవాలని ఆయన కోరారు. అలహాబాద్ బ్యాంక్ హాంకాంగ్ బ్రాంచ్ కూడా నీరవ్‌కు రుణాలు ఇచ్చిందని తెలిపారు. జర్నలిస్టు కూడా అయిన దూబేను యూపీఏ ప్రభుత్వం 2012 ఆగస్టులో అలహాబాద్ బ్యాంక్ బోర్డులో డైరెక్టర్‌గా నియమించింది. కానీ, డిసెంట్ నోట్ తర్వాత ఆయనకు కష్టాలు మొదలయ్యాయి. "నా పదవికి రాజీనామా చేయాలంటూ ఆర్థిక శాఖ, అలహాబాద్ బ్యాంకులోని ఉన్నతాధికారులు ఒత్తిడి తెచ్చారు. చివరికి 2014 ఫిబ్రవరిలో రాజీనామా చేశాను" అని ఆయన వివరించారు. ఏదో ఒక రోజు ఛోక్సీ, ఆయన కంపెనీ గీతాంజలి పెద్ద స్కాం చేస్తుందని అప్పట్లో బోర్డు మీటింగులోనే చెప్పానని, అప్పట్లో తన మాట విని ఉంటే, ఇప్పుడు ఈ కుంభకోణం జరిగి ఉండేది కాదని చెప్పారు. "ఇప్పుడు పీఎన్‌బీ మేనేజింగ్ డైరెక్టరుగా ఉన్న వ్యక్తే అప్పట్లో అలహాబాద్ బ్యాంకు జనరల్ మేనేజరుగా ఉన్నారు" అని దూబే వివరించారు. నీరవ్ మోదీ అండ్ కో పాల్పడిన స్కాముల్లో ఎంతోమంది అధికారులకు భాగస్వామ్యం ఉందని, ప్రభుత్వంలోని ఉన్నతాధికారుల హస్తం కూడా ఉందని తెలిపారు. అంతేనా, ఈ స్కాం యూపీఏ హయాంలో మొదలైందని, ఎన్డీయే హయాంలో విశ్వరూపం దాల్చిందని, 10-50 రెట్లు భారీగా రూపుదాల్చిందని తెలిపారు.



ముందే చెప్పిన వ్యాపారి

బెంగళూరుకు చెందిన ఎస్వీ హరిప్రసాద్ అనే నగల వ్యాపారవేత్త.. నీరవ్ మోదీ మోసాల గురించి 2016 జూలైలోనే తాను అధికారులను అప్రమత్తం చేసినట్లు చెబుతున్నారు.. నీరవ్ మోదీ అతిపెద్ద కుంభకోణానికి పాల్పడుతున్నాడని, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐ, సెబీని హెచ్చరించినా వారు పట్టించుకోలేదని ఆయన పేర్కొన్నారు. '2016లో ప్రధాని కార్యాలయానికి లేఖ రాశాను. కుంభకోణంపై పూర్తి దర్యాప్తు చేయాలని కోరినా ఈడీ, సీబీఐ, సెబీ నుంచి నాకు ఎలాంటి స్పందన రాలేదు. కొన్ని రోజులకు ఆ కేసు మూసివేసినట్లు రిజిస్టర్ ఆఫ్ కంపెనీస్ (ఆర్‌వోసీ) నుంచి మెయిల్ వచ్చింది.' అని హరిప్రసాద్ చెప్పారు. తాను చోక్సీతో కలిసి రూ.10కోట్ల పెట్టుబడితో ఒక ఫ్రాంచైజీని తెరిచానని, తమ ఒప్పందం ప్రకారం అతడు రూ.10కోట్ల విలువైన బంగారం ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.5కోట్ల బంగారం మాత్రమే ఇచ్చాడని ఆరోపించారు. ఆ తర్వాత చోక్సీపై రెండు కేసులు వేశానని హరిప్రసాద్ చెప్పారు.

నీరవ్ వజ్రాలకు ప్రియాంక గుడ్‌బై!

- బ్రాండ్ అంబాసిడర్ కాంట్రాక్టు రద్దుకు నిర్ణయం
- నీరవ్‌పై దావా వేయలేదని వివరణ



ముంబై, ఫిబ్రవరి 16: నీరవ్ మోదీ వజ్రాలకు గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న నటి ప్రియాంక చోప్రా ఆ సంస్థకు గుడ్‌బై చెప్పాలని నిర్ణయించుకున్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంకులో వేల కోట్ల కుంభకోణంలో నీరవ్ సూత్రధారి అని తేలడంతో 'బ్రాండ్ అంబాసిడర్ కాంట్రాక్ట్'ను రద్దు చేసుకోవడానికి ఆమె న్యాయ నిపుణులను సంప్రదిస్తున్నారు. తనకు అడ్వాన్స్ మాత్రమే ఇచ్చి మిగతా సొమ్ము ఇవ్వబోమంటూ నీరవ్ మోసగించారని ప్రియాంక గురువారం నాడు ఆరోపించడం తెలిసిందే. ఆమె నీరవ్‌పై కోర్టును ఆశ్రయించారని కూడా వార్తలు వచ్చాయి. అయితే ఈ వార్తల్లో నిజం లేదని, దావా వేయడం లేదని ఆమె ప్రతినిధి శుక్రవారం తెలిపారు. కాంట్రాక్టు రద్దు కోసం న్యాయ సలహా తీసుకుంటున్నామని చెప్పారు.

రూ. 3500 కోట్ల వజ్రాలు స్వాధీనం!

జూబ్లీ హిల్స్, బేగంపేటలోనూ తనిఖీలు

హైదరాబాద్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు రూ.11,400 కోట్ల మేర కుచ్చుటోపీ పెట్టిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ హైదరాబాద్‌లోనూ పెట్టుబడులు పెట్టినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గుర్తించింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిరాలలో నీరవ్ మామ మెహుల్ ఛోక్సీకి చెందిన హైదరాబాద్ జెమ్స్ లిమిటెడ్ (గీతాంజలి గ్రూపు డైమండ్, జ్యువెల్లరీ యూనిట్) సహా జూబ్లీ హిల్స్‌లోని గీతాంజలి జెమ్స్ లిమిటెడ్ ప్రధాన కార్యాలయం, బేగంపేటలోని ఒక జువెల్లరీ దుకాణంలో గురు, శుక్రవారాల్లో తనిఖీలు చేసింది. దేశంలో 20 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు చేసిన ఈడీ.. హైదరాబాద్‌లో కీలక డాక్యుమెంట్లు, రికార్డులు, కంప్యూటర్లను స్వాధీనం చేసుకుంది. రూ.3,500 కోట్ల విలువైన ఆస్తులను సీజ్ చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. వాటిలో వజ్రాలు, విలువైన రాళ్లు ఉన్నాయి. గీతాంజలి గ్రూప్ ఛైర్మన్ అయిన ఛోక్సీ.. హైదరాబాద్ జెమ్స్ లిమిటెడ్‌కు యాజమానిగా ఉన్నారు. ముంబై ప్రధాన కార్యాలయం నుంచే హైదరాబాద్‌లో వజ్రాల వ్యాపారాన్ని నడిపిస్తున్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను మోసగించిన కేసు ఎఫ్ఐఆర్‌లో సీబీఐ ఛోక్సీ పేరునూ నమోదు చేసింది. హైదరాబాద్ జెమ్స్ లిమిటెడ్ వజ్రాలు, రాళ్లను కట్ చేసే ఒక పెద్ద కంపెనీ. దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి వజ్రాలు, రాళ్లను దిగుమతి చేసుకుని... వాటికి షేప్ కటింగ్, డిజైన్ చేసి హైదరాబాద్‌లోని వివిధ జువెల్లరీ సంస్థలకు పంపడంతో పాటు ఎగుమతి చేసేవారు. 2005లో రాజీవ్ జెమ్స్ పార్క్‌ను అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. 200 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ సెజ్‌లో గీతాంజలి గ్రూప్ ఛైర్మన్ ఛోక్సీ రూ.500 కోట్ల పెట్టుబడి పెట్టారు. 2007 నుంచి ఆయన కంపెనీ కార్యకలాపాలు కొనసాగిస్తోంది. రాజీవ్ జెమ్స్ పార్క్ పేరును హైదరాబాద్ జెమ్స్ సెజ్ లిమిటెడ్‌గా ఛోక్సీ మార్చారు. వ్యాపార లావాదేవీలను చూడటానికి జూబ్లీహిల్స్‌లో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. నీరవ్ నేరుగా హైదరాబాద్‌లో వ్యాపారం చేయలేదని, ఛోక్సీ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టినట్లు ఈడీ గుర్తించింది. ఛోక్సీ మొదట హైదర్‌గూడ, పలుచోట్ల జువెల్లరీ దుకాణాలను ప్రారంభించారు. భారీగా నష్టాలు రావడంతో మూసేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో కొన్ని మాల్స్‌లో మాత్రమే గీతాంజలి జెమ్స్ దుకాణాలు ఉన్నాయి. కొన్నిచోట్ల నష్టాల్లో నడుస్తున్నట్లు తేలింది. నీరవ్, ఛోక్సీ నిర్వాకంతో వజ్రాభరణాల యూనిట్‌లో పని చేస్తున్న 900మంది ఉపాధి ప్రశ్నార్థకంగా మారింది.



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిరాలలో ఈడీ అధికారులు సీజ్ చేసిన రాజీవ్ జెమ్స్ పార్కు. ఇక్కడే నీరవ్ మోదీ మామ మెహుల్ ఛోక్సీ 2007 నుంచి వజ్రాల కటింగ్ యూనిట్‌ను నిర్వహిస్తున్నారు.

నీరవ్‌పై ముప్పేట దాడి

- గీతాంజలి దుకాణాల్లో సీబీఐ సోదాలు.. ఐటీ, ఈడీ శాఖల కేసులు
- 29 ఆస్తులు, 105 బ్యాంకు ఖాతాలు జప్తు
- మోదీ ఆచూకీ కోసం ఇంటర్ పోల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: చేతులు కాలాక ఆకులు పట్టుకున్న రీతిలో ప్రభుత్వ సంస్థలన్నీ నీరవ్ మోదీ వెళ్లిపోయాక ముప్పుట దాడులు మొదలు పెట్టాయి. పంజాబ్ నేషనల్ బ్యాంకును నిలువునా ముంచేసిన నీరవ్ మోదీపై ఐటీ, సెబీ, ఈడీ, సీబీఐ, ఆర్బీఐ, చార్టర్డ్ ఎకౌంటెంట్స్ అసోసియేషన్, ఆర్థిక శాఖ, విదేశాంగ శాఖలు ఒకేసారి చర్యలకు ఉపక్రమించాయి. నీరవ్ మోదీ, అతని కుటుంబ సభ్యులు, కంపెనీలకు చెందిన 29 ఆస్తులను, 105 బ్యాంకు ఖాతాలను ఆదాయ పన్ను శాఖ జప్తు చేసింది. విదేశాల్లో అక్రమంగా ఆస్తులు కొన్నందుకు నల్లధనం నిరోధక చట్టం కింద నీరవ్ మోదీపై కేసు నమోదు చేసింది. నీరవ్‌కు సింగపూర్‌లో ఆస్తులు ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. ఈ నేరం రుజువైతే ఆస్తిని సొంతం చేసుకోవడమే కాకుండా 120 శాతం అదనంగా పన్ను విధిస్తారు. పదేళ్ల జైలుశిక్ష దీనికి అదనం. ఆదాయపన్ను చట్టంలోని పలు నిబంధనల కింద నీరవ్ మోదీపై కేసు పెట్టారు. ముంబై, ఢిల్లీ, సూరత్, జైపూర్‌లలోని ఆస్తులన్నీ జప్తు చేశారు. ఆదాయ పన్ను కేసులన్నింటిపైనా అదనంగా ఈడీ మనీలాండరింగ్ కేసులు నమోదు చేసింది. నీరవ్ మోదీ బృందాన్ని తన ముందు విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. 549 కోట్ల రూపాయల విలువైన వజ్రాలను ఈడీ తాజాగా స్వాధీనం చేసుకుంది. ఇప్పటి వరకు 5649 కోట్ల రూపాయల విలువైన వజ్రాలు ఈడీ స్వాధీనం చేసుకున్నట్లు తేలింది. పంజాబ్ నేషనల్ బ్యాంకు ఫిర్యాదుపై జనవరి 31న నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను విస్తృతం చేస్తూ సీబీఐ గీతాంజలి గ్రూప్ మీద ఎఫ్ఐఆర్‌లో చేర్చింది. హైదరాబాద్ సహా దేశంలోని 20 నగరాల్లో ఉన్న గీతాంజలి నగల దుకాణాలపై దాడిచేసి, సోదాలు జరిపింది. న్యూయార్క్, లండన్, బీజింగ్, మకావూ, తదితర విదేశీ నగరాల్లో ఉన్న గీతాంజలి దుకాణాలను తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు వ్యాపారం చేయరాదని సీబీఐ ఆర్థిక శాఖ ద్వారా ఆదేశించింది. పంజాబ్ నేషనల్ బ్యాంకు 11400 కోట్లకు 293 లెటరాఫ్ అండర్‌స్టాండింగ్‌లను జారీ చేసిన వ్యవహారంలో సీబీఐ తాజాగా ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. గీతాంజలి గ్రూప్ ప్రమోటర్ మెహుల్ చోక్సీ(నీరవ్ మోదీ మామ)ని అందులో నిందితుడిగా పేర్కొంది. పంజాబ్ నేషనల్ బ్యాంకు రిటైర్డ్ డీజీఎం గోకుల్‌నాథ్ షెట్టి, మరో బ్యాంకు అధికారి మనోజ్ కారత్ నిందితుల్లో ఉన్నారు. విదేశాంగ శాఖ నీరవ్ మోదీ, చోక్సీల పాస్‌పోర్టులను సస్పెండ్ చేసింది. నీరవ్, ఆయన భార్య, వ్యాపార భాగస్వాములు అందరూ జనవరిలోనే అమెరికాకు చెక్కేశారు. పీఎన్‌బీ కేవలం రూ.280 కోట్ల కుంభకోణం జరిగినట్లు తొలి ఫిర్యాదులో పేర్కొంది. తర్వాత దాన్ని 11,400 కోట్లుగా తేల్చింది. బ్యాంకు అధికారుల పాత్రపై ప్రధానంగా విచారణ జరుగుతోంది. నీరవ్ మోదీ అతని కుటుంబ సభ్యుల ఆచూకీ కోసం సీబీఐ ఇంటర్ పోల్‌ను ఆశ్రయించింది.



దేశం విడిచిన మాయగాళ్లు



బ్యాంకు లూటీ





ఆర్థిక అక్రమాలకు పాల్పడటం.. అవి బయటపడే సమయానికి దేశం విడిచి పరారవడం.. ఆర్థిక నేరగాళ్ల మోడస్ ఆపరెండీగా మారిపోయింది. నేటి నీరవ్ మోదీ.. నిన్నటి విజయ్ మాల్యా.. మొన్నటి సంజయ్ భండారీలాంటి వారంతా ఈ కోవలోనివారే. వారి వివరాలు సంక్షిప్తంగా..

మాల్యా మాయ



బ్యాంకులకు 9000 కోట్ల రూపాయల మేర ఎగ్గొట్టిన ఈ లిక్కర్ కింగ్.. తన పాపం పండే సమయానికి బ్రిటన్‌కు పారిపోయి అక్కడ తలదాచుకుంటున్నాడు. గ్లామర్ మోడళ్లు.. ఖరీదైన యాట్‌లలో కాస్ట్‌లీ పార్టీలు.. ఆ పార్టీల్లో పారే మందు గురించి అప్పట్లో కథనాలు ప్రచురించని పేపర్లు లేవు. ప్రసారం చేయని చానళ్లు లేవు.

భండారీ బండారం

ఆయుధాల వ్యాపారి సంజయ్ భండారీ.. రూ.150 కోట్ల విలువైన ఆస్తులకు సంబంధించి పన్ను ఎగ్గొట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆఫ్‌సెట్ ఇండియా సొల్యూషన్స్ అనే సంస్థ ద్వారా అనేక అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఢిల్లీ కోర్టు అతడిని నేరగాడిగా కూడా ప్రకటించింది. కేసులు బిగుస్తున్న సమయంలో నేపాల్ మీదుగా దేశం విడిచి పారిపోయాడు.



తల్వార్ సలహా దెబ్బ

రూ. వెయ్యి కోట్లకుపైగా ఆస్తుల వివరాలు వెల్లడించకుండా పన్నులు ఎగ్గొట్టిన వ్యక్తి దీపక్ తల్వార్. ఇతను కార్పొరేట్ కంపెనీలకు సలహాదారు. యూపీయే హయాంలో విమానయాన సం స్థలకు 'ప్రయోజనాలు' చేకూర్చిపెట్టడం లో కీలకపాత్ర పోషించాడు. రాజకీయాల్లో పలుకుబడి ఉన్న నేతలు, అధికారులు, పా త్రికేయులతో సంబంధాలున్నాయి. ఐటీ అధికారులు 5 కేసులు పెట్టి లెక్కలు అడిగేసరికి యూఏఈ పారిపోయాడు. భారత్ ప్రయత్నం ఫలితంగా యూఏఈ నుంచి ఏ దేశానికీ వెళ్లలేని పరిస్థితి నెలకొంది.



అక్రమాల బౌన్సర్

ఐపీఎల్ ద్వారా ఎనలేని గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తి లలిత్ మోదీ. 2010లో కొచ్చి టీమ్ హక్కుల విషయంలో ఆరోపణలు వచ్చాయి. ఫెమా నిబంధనల ఉల్లంఘనపై ఆరోపణలు రావడంతో దర్యాప్తు సంస్థలు నోటీసులు ఇచ్చాయి. అదే సమయంలో ఐపీఎల్ చైర్మన్ పదవి ఊడింది. ఈడీ మేలుకొనేలోపే కుటుంబంతో కలిసి బ్రిటన్ చెక్కేశాడు. ఇతనిపై ఇంటర్‌పోల్ బ్లూ కార్నర్ నోటీసు జారీ అయ్యింది. ఈడీ చర్యలను లండన్ కోర్టులో సవాల్ చేశాడు. బీజేపీ నాయకులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలున్నాయి. వసుంధరా రాజేతో ఉన్న సంబంధాల నేపథ్యంలో.. ఒకానొక సమయంలో లలిత్ మోదీని రాజస్థాన్ సూపర్ సీఎంగా కూడా పేర్కొనేవారు.

ప్రియాంకా చోప్రాతోనో లీసా హెడెన్‌తోనో బ్రేక్‌ఫాస్ట్.. రష్యన్, చైనీస్ మోడల్‌తోనో లంచ్.. అగ్రస్థాయి వ్యాపారవేత్తలతో డిన్నర్ చేయగలిగే స్థాయి.. బెంట్లీ కార్లలో షికార్లు.. ఇటాలియన్ సూట్లు.. ఖరీదైన చిత్రాలు.. మిషెలిన్ స్టార్ షెఫ్‌లు వండివడ్డించే 7 కోర్స్ మీల్స్‌తో సెలబ్రిటీలకు, తోటి వ్యాపారవేత్తలకు పార్టీలు. ఇది నీరవ్ మోదీ విలాస జీవితం!!


విలాసాల నీరవ్

10 దేశాల్లో 26 కంపెనీలు.. 100కు పైగా రీటైల్ స్టోర్లు.. ఇది నీరవ్ వజ్రాల సామ్రాజ్యం!

విజయ్ మాల్యాలా జీవితాన్ని కసితీరా అనుభవించకపోవచ్చుగానీ.. ఖరీదైన జీవనశైలికి నీరవ్ మోదీ కూడా కేరాఫ్ అడ్రస్సే!! కష్టపడి సంపాదిస్తే డబ్బు విలువ తెలుస్తుంది. అప్పనంగా వచ్చిపడే సొమ్ము ఆడంబరాలకు కారణమవుతుంది. మాల్యా, నీరవ్ మోదీ వంటి విలాసపురుషులే ఇందుకు ఉదాహరణ. ప్రపంచంలోని పలు ప్రఖ్యాత నగరాల్లో సెలబ్రిటీలకు, మోడల్స్‌కు, వ్యాపారవేత్తలకు కళ్లుచెదిరే పార్టీ లు ఇవ్వడం ద్వారా నీరవ్ మోదీ విస్తృత ప్రచా రం పొందారు. ఫోర్బ్స్ సహా పలు పత్రికల గ్లా సీ కవర్‌పేజీలపై మెరిసేవారు. ప్రియాంక చో ప్రా, రోజీ హంటింగ్టన్, దీపికా పదుకోన్ లాంటి ఏ లిస్టర్ మోడల్స్‌ను, నటీమణులను బ్రాండ్ అంబాసిడర్లుగా ఎంచుకునేవారు. జనవరిలో దేశం విడిచి పారిపోయిన నీరవ్.. గత ఏడాది నవంబరులో ముంబైలోని ఫోర్‌సీజన్స్‌లో భారీ పార్టీ ఇచ్చారు. బాలీవుడ్ హీరోయిన్ సోనమ్‌కపూర్ సహా పలువురు సెలబ్రిటీలు ఆ పార్టీకి ప్రత్యేక అతిథులుగా వచ్చారు. వారికి వండిపెట్టడానికి ఇటలీ నుంచి త్రీస్టార్ మిషెలిన్ షెఫ్ మాసిమో బొట్టురాను రప్పించారు. మిషెలిన్ షెఫ్‌లంటే.. అమెరికాకు చెందిన మిషెలిన్ సంస్థ గుర్తింపు పొందిన రెస్టారెంట్లలోని బావర్చీలు(అనగా వంటవాళ్లు)! ఆ గుర్తింపు పొందడం ఈజీ కాదు. ప్రపంచంలో ఏ స్టార్ హోటల్ అయినా తమకు మిషెలిన్ రేటింగ్ ఉందని చెప్పుకోవడానికి గర్వపడతాయి. అలాంటి రెస్టారెంట్ల వంటవాళ్లను నీరవ్ తన సొంతానికి నియమించుకునేవాడంటే డబ్బును ఎలా ఖర్చుపెట్టేవాడో అర్థం చేసుకోవచ్చు. ఇక ఆ పార్టీలో నీరవ్ 7-కోర్స్ మీల్స్ ఏర్పాటు చేశాడు. అచ్చతెలుగులో చెప్పుకోవాలంటే.. షడ్రసోపేతమైన విందు. 7 కోర్స్ మీల్స్ కాబట్టి.. ఇంకో రసం ఎక్కువేనన్నమాట!!



రోజి హంటింగ్టన్, లీసా హైడన్‌తో నీరవ్ మోదీ



ఆఫీసు కాదు.. ఇంద్రభవనం..

ముంబై నగరం నడిబొడ్డున నీరవ్ కార్యాలయం ఉంటుంది. ఆయన ఆఫీసులో ఎటు చూసినా.. ఎంఎఫ్ హుస్సేన్, ఎస్‌హెచ్ రజా, ఎఫ్‌ఎన్ సౌజాలాంటి దిగ్గజ చిత్రకారులు గీసిన ఖరీదైన పెయింటింగ్‌లు కనపడతాయి. ఆ చిత్రాలతో, కళకళలాడే విద్యుద్దీపాలతో ఇంద్రభవనంలా ఉండే ఆ ఆఫీసు విస్తీర్ణం.. అక్షరాలా 28,000 చదరపుటడుగులు. ఈ సంపదంతా బ్యాంకులను మోసం చేసి సంపాదించిందే. ఎలా సంపాదిస్తే ఏం? 2013లో ఫోర్బ్స్ మ్యాగజైన్ ఆయన్ను ప్రపంచ కుబేరుల జాబితాలో చేర్చింది. తన 42వ ఏట మోదీ దేశంలోని కోటీశ్వరుల్లో 52వ స్థానంలో.. ప్రపంచ కుబేరుల జాబితాలో 1342వ స్థానంలో నిలిచాడు. 2017 ఫోర్బ్స్ ప్రకటించిన జాబితాలో.. దేశంలో 85వ స్థానంలో, అంతర్జాతీయ జాబితాలో 1234వ స్థానంలో నిలిచాడు.

నీరవ్‌కు ద్వంద్వ పౌరసత్వం!

- బెల్జియం పాస్‌పోర్టుతో రాకపోకలు
- నీరవ్, ఛోక్సీ పాస్‌పోర్టుల సస్పెన్షన్
- ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించిన సీబీఐ

న్యూఢిల్లీ/ముంబై, ఫిబ్రవరి 16: పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి వేల కోట్లు కొల్లగొట్టిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ అక్రమంగా బెల్జియం పౌరసత్వమూ సంపాదించాడు. నీరవ్ అతని సోదరుడు నిషాల్ మోదీ మాదిరిగా చాలాకాలం బెల్జియంలోని యాంట్‌వెర్ప్ నగరంలోనే ఉన్నాడు. అక్కడ నుంచే చాలామటుకు వజ్రాల వ్యాపారం చేశాడు. నిశాల్‌కు బెల్జియం పౌరసత్వం లభించగానే... ఇండియన్ పాస్‌పోర్టును సరెండర్ చేశాడు. నీరవ్ మాత్రం భారత పౌరుడిగానే చెబుతూవచ్చాడు. పలన్‌పురి జైనుల వర్గంలో అత్యంత సన్నిహితులైన కొందరికి మాత్రమే నీరవ్‌కు ద్వంద్వ పౌరసత్వం ఉందన్న విషయం తెలుసు. ఈ వర్గమే భారత వజ్రాల పరిశ్రమలో ఆధిపత్యం చెలాయిస్తోంది. నీరవ్ బెల్జియం పాస్‌పోర్టుపై ప్రయాణించడం తమకు తెలుసని సన్నిహితుల కథనం. వజ్రాల వ్యాపారంలో నీరవ్ సోదరులు వారి వంశంలో మూడో తరం వారు. నీరవ్ భార్య అమీ అమెరికా పౌరురాలు. నిషాల్ భార్య ఇషిత గనుల యజమాని దత్తరాజ్ సల్గోకర్ కుమార్తె. దివంగత ధీరూభాయ్ అంబానీ మనవరాలు అవుతుంది. నీరవ్, ఆయన మామ, వ్యాపార భాగస్వామి మెహుల్ ఛోక్సీ పాస్‌పోర్టులను విదేశీ వ్యవహారాల శాఖ నాలుగు వారాల పాటు సస్పెండ్ చేసింది. నీరవ్ ఎక్కడున్నాడో తెలియదని పేర్కొన్న ఆ శాఖ... వారికి వారం గడువు ఇచ్చింది. ఈలోగా స్పందించాలని, వారి పాస్‌పోర్టులు ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని పేర్కొంది. మరోవైపు నీరవ్, భార్య అమీ, సోదరుడు నిశాల్ మోదీ, ఛోక్సీల ఆచూకీ కోసం సీబీఐ శుక్రవారం ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించింది. డిఫ్యూజన్ నోటీసు జారీ చేయాలని కోరింది. తరచూ భారత్ వచ్చే ఆయన గత రెండేళ్లుగా రావడం బాగా తగ్గించేశారని చెబుతున్నారు. నీరవ్ చివరిసారిగా స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు (జనవరి 23-26)లో కనిపించాడు. నీరవ్ నుంచి సాధ్యమైనంత రికవరీ చేసే చర్యల్లో పాస్‌పోర్టు సస్పెన్షన్‌ను మొదటి అడుగుగా చెబుతున్నారు. ఈడీ సూచన మేరకు నీరవ్, ఛోక్సీ పాస్‌పోర్టులను సస్పెండ్ చేశామని విదేశాంగ శాఖ ప్రతినిధి రవీశ్ కుమార్ తెలిపారు. "దావోస్‌కు వెళ్లిన ప్రధాని మోదీ ప్రతినిధి బృందంలో నీరవ్ లేరు. వ్యాపారవేత్తలతో ప్రధాని దిగిన గ్రూపు ఫొటోలో నీరవ్ ఉండటం అనుకోకుండా జరిగిందేన"ని రవీశ్ పేర్కొన్నారు. పీఎన్‌బీ ఫిర్యాదుతో సీబీఐ శుక్రవారం తాజాగా ఛోక్సీపై, గీతాంజలి గ్రూపుపై కేసు నమోదు చేసింది. ఈ కుంభకోణంలో ప్రమేయం ఉందన్న ఆరోపణలపై జనరల్ మేనేజర్ స్థాయి అధికారి సహా మరో ఎనిమిది మంది అధికారులను పీఎన్‌బీ సస్పెండ్ చేసింది.

అమెరికాలో నీరవ్!

న్యూయార్క్ హోటల్లోని విలాసవంతమైన సూట్‌లో మకాం

- సీబీఐకి ఫిర్యాదు చేయాలని డిసెంబరులో పీఎన్‌బీ నిర్ణయం
- విషయం ఉప్పందడంతో జనవరి 1న ఉడాయించిన మోదీ
- మూడ్రోజులకు మేనమామ.. మరో రెండ్రోజులకు భార్య

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: పంజాబ్ నేషనల్ బ్యాంకును ముంచిన మోసగాడు నీరవ్ మోదీ ఇప్పుడు ఎక్కడ ఉన్నాడు!? ఈ ప్రశ్నకు జవాబు.. అమెరికాలోని న్యూయార్క్ హోటల్! హోటల్లోని విలాసవంతమైన సూట్‌లో తన భార్య అమీతో కలిసి నీరవ్ ఉంటున్నాడు! విశ్వసనీయ వర్గాలు ఈ విషయం వెల్లడించాయి. ఆ గదిలోంచి చూస్తే ప్రఖ్యాత, సుందర సెంట్రల్ పార్క్ సుస్పష్టంగా కనిపిస్తుంది. ఇప్పుడు అక్కడి నుంచే నీరవ్ తన కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. నిజానికి, నీరవ్ ఏడాది కిందటే దేశం విడిచి వెళ్లిపోవాలని నిర్ణయించాడు. కానీ, పెద్ద నోట్ల రద్దు అతని పరారీని అడ్డుకుంది. "నీరవ్ మోదీ సోదరుడు నీషాల్ వివాహం 2016 డిసెంబరులో జరిగింది. ఆ పెళ్లి అయిపోయిన తర్వాత దేశం విడిచి వెళ్లిపోవాలని నీరవ్ భావించాడు. కానీ, దానికి కొద్ది రోజుల ముందే మోదీ సర్కారు పెద్ద నోట్ల రద్దును ప్రకటించింది. దాంతో, దేశం నుంచి పారిపోవాలన్న ప్లాన్‌ను వాయిదా వేసుకున్నాడు" అని సీబీఐ అధికార వర్గాలు తెలిపాయి. అయితే, సరిగ్గా ఏడాది తర్వాత గత ఏడాది డిసెంబరులో పీఎన్‌బీ ఉన్నతాధికారులంతా సమావేశమయ్యారు. నీరవ్ మోదీపై సీబీఐకి ఫిర్యాదు చేయాలని అందులో నిర్ణయించారు. ఇదే విషయాన్ని కొంతమంది పీఎన్‌బీ అధికారులే నీరవ్‌కు ఉప్పందించారు. దాంతో, ఈ ఏడాది జనవరి ఒకటో తేదీన నీరవ్ దేశం విడిచి పారిపోయాడు. నిజానికి, ఒక్కడే దేశం నుంచి పారిపోయేందుకు తొలుత భయపడ్డాడు. అందుకే, బెల్జియం పౌరుడు కూడా అయిన తన తమ్ముడు నీషాల్‌తో ఉడాయించాడు. ఎవరికీ ఎటువంటి అనుమానం రాకుండా విజయవంతంగా తాము దేశం దాటడంతో ఊపిరి పీల్చుకున్నాడు. 'నువ్వా వచ్చేయ్' అని మేనమామ మేహుల్ ఛోక్సీకి చెప్పాడు. నీరవ్ దాటేసిన మూడో రోజే ఆయన కూడా విమానం ఎక్కి చెక్కేశాడు. కానీ, నీరవ్ భార్య అమీ మోదీ మాత్రం ముంబైలోనే ఉంది. ఆమె అమెరికన్ పౌరురాలు. దాంతో, రెండు రోజులపాటు పీఎన్‌బీలో ఏం జరుగుతోంది? మీడియాలో ఏం వస్తోంది? అనే వివరాలపై కన్నేసింది. ఎక్కడా ఎటువంటి అలికిడి లేదని నిర్ధరించుకున్న తర్వాత, బిడ్డతో కలిసి అమెరికా చెక్కేసింది. పీఎన్‌బీ స్కాంలో వీళ్లు నలుగురూ నిందితులు. వీరంతా వారం రోజుల్లోనే భారత్ నుంచి దర్జాగా ఉడాయించారు.

నిధుల సాధనకు ఎన్నో దారులు

కొత్త కొత్త నగల దుకాణాలు తెరిచేందుకు మీకు నిధులు ఎక్కడి నుంచి వస్తాయన్న ప్రశ్నకు "అన్ని దారులూ తెరిచే ఉంటాయి' అని ఓ పెద్ద గుహలా ఉండే తన ఆఫీసులో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో నీరవ్ మోదీ వ్యాఖ్యానించాడు. "మేం అంతర్గత ఆదాయాన్ని ఉపయోగిస్తాం. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటాం. మేం బహిరంగ మార్కెట్‌కు వెళతాం" అని నీరవ్ వ్యాఖ్యానించాడు. అయితే, అక్రమంగా సంపాదించిన సొమ్మును వివిధ దశల్లో దాచిన మోదీ.. దాని విలువను భారీగా పెంచేసి లావాదేవీలు జరిపాడు. ఆ తర్వాత ఆ నిధులను మకావు, బీజింగ్, హాంకాంగ్ వంటి దేశాలకు తరలించాడు.

లలిత్, నీరవ్.. మోదీతో.. భాగో!

- నీరవ్ స్కాంపై రాహుల్ ట్వీట్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: పంజాబ్ నేషనల్ బ్యాంకుకు నీరవ్ మోదీ వేల కోట్ల మేర కుచ్చుటోపీ పెట్టిన కుంభకోణంపై కాంగ్రెస్, బీజేపీ నడుమ విమర్శలు కొనసాగుతున్నాయి. పరస్పరం దుమ్మెత్తిపోసుకుంటున్నాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఈ వ్యవహారానికి సంబంధించి ఏకంగా ప్రధాని మోదీపై తీవ్ర స్థాయి ఆరోపణలకు దిగారు. 'లలిత్ మోదీ ప్లస్ నీరవ్ మోదీ.. నరేంద్ర మోదీతో.. భాగో' అని శుక్రవారం ట్వీట్ చేశారు. కింద 'మోదీ భారత్‌ను దోచుకుంటున్నారు' అని ఉపశీర్షిక పెట్టారు. దేశంలోనే అతిపెద్ద బ్యాంకు లూటీ స్కాం విలువ తాజాగా రూ.30 వేల కోట్లకు చేరిందని కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి రణదీప్ సూర్జెవాలా ఆరోపించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన విమానయాన పథకం 'ఉడాన్'ను ప్రస్తావిస్తూ.. కుంభకోణాలకు పాల్పడిన ప్రతి ఒక్కరూ ఎలాంటి తనిఖీలు, సోదాలు లేకుండా పరారవుతున్నారని ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ విమర్శలపై బీజేపీ విరుచుకుపడింది. పీఎన్‌బీ స్కాం పుట్టింది 2011లో యూపీఏ హయాంలోనేనని కేంద్ర మంత్రి ప్రకాశ్ జావదేకర్ అన్నారు. ఎన్‌డీఏ అప్రమత్తత వల్లే ఈ కుంభకోణం బయటపడిందని చెప్పారు.

61,260 కోట్ల ఎగనామం


- మొత్తం రుణ ఎగవేత కేసులు 8670
- పంజాబ్ నేషనల్ బ్యాంకులోనే కాదు
- చాలా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఇంతే!
- రుణమంజూరు మోసాల్లో టాప్ పీఎన్‌బీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: పంజాబ్ నేషనల్ బ్యాంకులో దగాపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో.. మిగతా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పరిస్థితి ఎలా ఉందన్నదానిపై అందరి దృష్టి పడింది. ఈ మేరకు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రుణ మంజూరు, రికవరీ ఎలా ఉందో చెప్పాలంటూ ఒక జర్నలిస్టు ఆర్టీఐ ద్వారా రిజర్వ్ బ్యాంకును (ఆర్బీఐ) ప్రశ్నించగా నివ్వెరపోయే నిజాలు వెలుగు చూశాయి. ఆ గణాంకాలను పరిశీలిస్తే.. బ్యాంకులను మోసం చేస్తున్న నీరవ్, మాల్యా లాంటి ఆర్థిక నేరగాళ్ల వందల సంఖ్యలో ఉన్నట్టు తేలుతోంది. ఆర్టీఐ ద్వారా అడిగిన ప్రశ్నకు ఆర్బీఐ ఇచ్చిన సమాచారం ప్రకారం..

- గడచిన ఐదేళ్లలో దేశంలోని 21 ప్రభుత్వ రంగ బ్యాంకులకు గాను 15 బ్యాంకులు ఇచ్చిన పెద్ద రుణాల్లో 8670 కేసుల్లో మోసం జరిగిందని వెల్లడయ్యింది. ఈ 8670 కేసుల ద్వారా జరిగిన ఫ్రాడ్ విలువ రూ. 61,260 కోట్లు. ఇవి కేవలం పెద్ద పెద్ద రుణాల మంజూరుకు సంబంధించినవి మాత్రమే. చిన్న చిన్న రుణాలనూ కలుపుకొంటే ఈ సంఖ్య మరో పదివేల కోట్లు దాటుతుందని అంచనా. మిగిలిన ఆరు బ్యాంకులనూ కలిపితే ఇంకా ఎక్కువ. పటిష్ఠమైన నిబంధనలున్నప్పటికీ మోసాలు జరుగుతూనే ఉన్నాయని, పర్యవేక్షణ కూడా కొరవడుతోందని రిజర్వ్‌బ్యాంకు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ కారణాల వల్లే నిరర్థక ఆస్తుల విలువ రూ.9.59లక్షల కోట్లకు పెరిగిందనిపేర్కొంది.
- 2012-13 ఆర్థిక సంవత్సరంలో రూ.6357 కోట్ల మేర రుణ ఎగవేతలుండగా.. 2016-17 నాటికి ఆ మొత్తం రూ.17657 కోట్లకు చేరినట్లు వివరించింది. ఇందులో పంజాబ్ నేషనల్ బ్యాంకు ఫ్రాడ్‌ను కలపలేదు.
- రుణమంజూరు మోసాల్లో అగ్రగామి పంజాబ్ నేషనల్ బ్యాంకే. అక్కడ మొత్తం 389 కేసుల్లో రూ.6562 కోట్ల మేర ఎగవేతలు నమోదయ్యాయి. తరువాతి స్థానం బ్యాంక్ ఆఫ్ బరోడాది. అక్కడ కూడా 389 కేసులే అయినా ఎగవేత మొత్తం మాత్రం రూ.4473 కోట్లు. మూడో స్థానంలో ఉన్న బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఎగవేత కేసులు 231 కాగా.. ఎగవేత సొమ్ము రూ.4005 కోట్లు.
- దేశంలోనే అతి పెద్దదైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 1069 లోన్ ఫ్రాడ్ కేసులు నమోదయ్యాయి. వాటి వల్ల ఎస్‌బీఐ ఎంత నష్టపోయిందనే విషయాన్ని మాత్రం రిజర్వ్‌బ్యాంకు పేర్కొనలేదు. "ఆర్థిక రంగంలో లోన్ ఫ్రాడ్ అన్నది ఏటేటా పెరిగిపోతున్న ఓ పెద్ద జాడ్యమనీ, ఇది వ్యవస్థకే ఒక పెద్ద రిస్క్‌లా మారిందని రిజర్వ్‌బ్యాంక్ వ్యాఖ్యానించింది. దీన్ని నివారించడానికి సంస్కరణలు తేవాలని సూచిస్తోంది.

చిన్నబ్యాంకులకూ పాకుతోంది!

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోని మొత్తం అడ్వాన్సుల్లో 12 శాతం నిరర్థక ఆస్తులేనని, ఇది ప్రయివేటు బ్యాంకుల కన్నా ఎక్కువని 2016లో ప్రపంచ బ్యాంకు ఓ నివేదికలో పేర్కొంది. "50 కంటే తక్కువ మంది బడాబాబులు, సంస్థల జేబుల్లోకి ఈ డబ్బు వెళ్లింది. కానీ బ్యాంకులు వారిపై చర్యలు తీసుకోవడంలో నత్తనడకన సాగడం ఆందోళన కలిగిస్తోంది. ఇంకా ఆందోళన కలిగించే విషయమేంటంటే ఈ జాడ్యం చిన్న కంపెనీలకూ పాకుతోంది. 40 శాతం కార్పొరేట్ సంస్థలు.. తీసుకున్న అప్పు తిరిగి చెల్లించే స్థాయిలో ఆదాయం సాధించలేకపోతున్నాయి" అని ప్రపంచ బ్యాంకు 'సిస్టమేటిక్ కంట్రీ డయగ్నొసిస్' పేరిట విడుదల చేసిన నివేదికలో వివరించింది.



బ్యాంకుల కీచులాట

- నష్టం ఎవరు భరించాలన్న దానిపై రచ్చ
- బ్యాంకులు రూల్స్ పాటించలేదన్న పీఎన్‌బీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: పంజాబ్ నేషనల్ బ్యాంకులో జరిగిన రూ 11535 కోట్ల మోసాన్ని ఎలా పూడ్చాలి? ఈ నష్టం ఎవరు భరిస్తారు? ఈ పాపం తమ ఒక్కరిదే కాదని, తాము ఎల్‌ఓయూలు (లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్) ఇచ్చినప్పటికీ- వివిధ భారతీయ బ్యాంకుల విదేశీ బ్రాంచ్‌లు చెల్లింపు నిబంధనలను సరిగా పాటించలేదని, అంచేత ఆ బ్యాంకులు కూడా కొంత భరించాలని పీఎన్‌బీ వాదిస్తోంది. కానీ మిగిలిన బ్యాంకులు మాత్రం అందుకు ససేమిరా అంటున్నాయి. ఎల్‌ఓయూలు జారీ చేసింది పీఎన్‌బీయే కాబట్టి తమ సొమ్ము తమకు చెల్లించాలని కోరుతున్నాయి. అటు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఎల్‌ఓయూ ఇచ్చిన పీఎన్‌బీయే మొత్తం భారం మొయ్యాలని తేల్చిచెప్పింది. ఆర్‌బీఐ మాత్రం ఇంకా ఈ అంశంపై తన నిర్ణయాన్ని వెల్లడించలేదు. నీరవ్ మోదీకి చెందిన 3 కంపెనీలకు చెల్లింపులు చేయాల్సిందిగా పీఎన్‌బీ విదేశాల్లోని భారతీయ బ్యాంకుల బ్రాంచ్‌లకు ఎల్‌ఓయూలు పంపింది. దీంతో బ్యాం కులు చెల్లింపులు చేశాయి. హాం కాంగ్‌లోని భారతీయ బ్యాంకుల శాఖల ద్వారా ఇవి జరిగాయి. పీఎన్‌బీ వాదన ప్రకారం- మిగతా బ్యాంకుల విదేశీ శాఖలు ఎల్‌ఓయూలను అనుమతించే విషయంలో రిజర్వ్‌బ్యాంకు మార్గదర్శకాలను పాటించలేదు. "మేం 30 బ్యాంకులకు లేఖలు పంపాం. నీరవ్ మోదీ కంపెనీల నుంచి మేం గతంలో ఎదుర్కొన్న ఇబ్బందులూ అందులో ఉన్నాయి. అయినా బుర్ర లేకుండా వాటిని అనుమతించేశారు. ఇందులో మా బాధ్యత ఏముంటుంది... ఒక్క ఎల్‌ఓయూ మా నుంచి వెళ్లిందన్న ఒక్క కారణం తప్ప..?" అని పీఎన్‌బీకి చెందిన సీనియర్ అధికారి ఒకరు ప్రశ్నించారు. ఎవరికి చెల్లిస్తున్నాం, వారి కంపెనీల దక్షత ఎంత, వారు తిరిగి చెల్లించగలరా లేదా అన్నది పరిశీలించాకే సదరు కంపెనీలకు నగదు చెల్లించాలి.. అవి మిగతా బ్యాంకులు చెయ్యలేదు. ఇక- వజ్రాలు, ఆభరణాలకు సంబంధించిన ఎల్‌ఓయూ గడువు 90 రోజులుండగా- 365 రోజులకు అనుమతించేశారు. దిగుమతి లైసెన్సు ఉన్న వారికే రుణాలు ఇవ్వాలన్నది మరో నిబంధన. విదేశాల్లోని మన బ్యాంకులు ఇది పట్టించుకోలేదు.. ఇవే కాక, స్విఫ్ట్ నిబంధనలనూ విస్మరించారు" అని పీఎన్‌బీ అధికారులు పేర్కొన్నారు.

"పీఎన్‌బీ గ్యారంటీ ఇచ్చింది కాబట్టే మేమూ లోన్లు ఇచ్చాం. అదీ కాక పీఎన్‌బీ తాలూకు నో స్ట్రో అకౌంట్ (అంటే ఏ దేశంలో ఉంటే ఆ దేశ కరెన్సీ అకౌంట్)కే సొమ్ము క్రెడిట్ చేశాం తప్ప నేరుగా క్లయంట్‌కి (నీరవ్ సంస్థలకి) చెల్లించలేదు.. పీఎన్‌బీ ఏదో సాకులు చెప్పి, రూల్స్ మాట్లాడి తప్పించుకోజూస్తోంది" అని రెండు బ్యాంకులు పేర్కొన్నాయి.

పీఎన్‌బీ ఎల్‌ఓయూల మేరకు వివిధ బ్యాంకులు చేసిన చెల్లింపులు

బ్యాంకు	రూ.కోట్లలో
స్టేట్ బ్యాంకు	1360
ఏక్సిస్ బ్యాంకు	2200
అలహాబాద్ బ్యాంకు	2000
యూనియన్ బ్యాంకు	2300
బ్యాంక్ ఆఫ్ ఇండియా	1000
కెనరా బ్యాంకు	1000

త్వరలో తగిన చర్యలు: ఆర్‌బీఐ

పీఎన్‌బీలో జరిగిన ఘరానా మోసంపై త్వరలోనే తగిన పర్యవేక్షక చర్యలు తీసుకుంటామని రిజర్వ్ బ్యాంకు తెలిపింది. 'పీఎన్‌బీలో కిందిస్థాయి ఉద్యోగి లేదా ఉద్యోగుల నిర్లక్ష్య వైఖరి వల్ల ఆ నేరం జరిగింది. అంతర్గత నియంత్రణ, పర్యవేక్షణ కొరవడడం దీనికి కారణం. ఇది ఓ రకంగా ఆపరేషనల్ రిస్క్‌లలో ఒకటిగా చెప్పవచ్చు. ఈ వ్యవహారంపై ఆర్‌బీఐ ఇప్పటికే దృష్టి పెట్టింది. అక్కడి వ్యవస్థల సమీక్షణ మొదలెట్టింది. త్వరలోనే తగు చర్యలు తీసుకుంటాం" అని ఆర్‌బీఐ ఓ ప్రకటనలో పేర్కొంది.

ఆంధ్రజ్యోతి

స్పోర్ట్స్

18

విజయవాడ • శనివారం 17 ఫిబ్రవరి 2018

అదిరింది.. ఆఖరి దెబ్బ!

విదేశాల్లో తడబడే భారత బ్యాట్స్‌మెన్.. దక్షిణాఫ్రికాలాంటి క్లిష్టమైన వేదికల్లో కెరీర్‌లో ఒక్క సెంచరీ కొడితేనే ఎంతోకాలం గుర్తుంచుకుంటాం..! అలాంటిది ఒక్క సిరీస్‌లో ఒకే ఒక్కడు మూడు శతకాలు బాదేస్తాడని ఊహించగలమా! పరుగుల యంత్రుడు కోహ్లీ అలాంటి ఊహాతీత ఆటతో మరోసారి క్రికెట్ ప్రపంచాన్ని విస్మయ పరిచాడు..! సౌతాఫ్రికాతో వన్డే సిరీస్‌లో మూడో సెంచరీ కొట్టేశాడు..! అదీ 205 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనలో..! 96 బంతుల్లో ఏకంగా 19 ఫోర్లు, 2 సిక్సర్లతో ఒక్కడే అజేయంగా 129 పరుగులు పిండుకున్నాడు..!

సెంచూరియన్ వన్డేలో టీ-20 ఆటతో చెలరేగిన కోహ్లీ.. సింగిల్ తీసినంత సులువుగా బౌండ్రీలు కొట్టి 82 బంతుల్లో సెంచరీ మార్కు దాటేశాడు..! బౌండ్రీల రూపంలోనే అతను 88 పరుగులు రాబట్టాడు..! టైమింగ్, టెక్నిక్‌తో తన మార్కు కళాత్మక బ్యాటింగ్‌తో.. ముచ్చటగొలిపే షాట్లు ఆడుతూ అభిమానులను ఆనందడోలికల్లో ముంచెత్తాడు..! అంతకుముందు యువ పేసర్ శార్దూల్ ఠాకూర్ (4/52) అద్భుత బౌలింగ్‌తో ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే కట్టడి చేశాడు..! కోహ్లీ కళాత్మక విధ్వంసంతో లక్ష్యాన్ని అలవోకగా ఛేదించిన భారత్ సిరీస్‌కు గొప్ప ముగింపునిచ్చింది..!





558

ఈ సిరీస్‌లో కోహ్లీ చేసిన పరుగులు. తద్వారా ఆరు వన్డేల సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్‌గా అతను రికార్డు నెలకొల్పాడు. 2013లో ఆసీస్‌పై 491 రన్స్ చేసిన రోహిత్‌ను దాటాడు.

కోహ్లీ (129 నాటౌట్)

- విరాట్ మెరుపు శతకం
- చెలరేగిన శార్దూల్ ఠాకూర్
- ఆఖరి వన్డేలో భారత్ ఘన విజయం
- 5-1తో సిరీస్ కైవసం

సెంచూరియన్: సిరీస్ సొంతమైనా.. ప్రయోగాలు చేసినా తమ తీవ్రత తగ్గదని.. గెలుపే లక్ష్యమన్న విరాట్ కోహ్లీ చెప్పింది చేసి చూపించాడు. శార్దూల్ ఠాకూర్‌తో పాటు బౌలర్లు ప్రత్యర్థిని తక్కువ స్కోరుకు కట్టడి చేయగా.. తర్వాత కోహ్లీ (129 నాటౌట్) మెరుపు సెంచరీతో రెచ్చిపోవడంతో చివరి, ఆరో వన్డేలో భారత్ 8 వికెట్ల తేడాతో సఫారీలను చిత్తుగా ఓడించింది. ఆరు వన్డేల సిరీస్‌ను 5-1తో సొంతం చేసుకుంది. అన్ని విభాగాల్లో విఫలమైన సౌతాఫ్రికా ఓదార్పు కూడా దక్కించుకోలేకపోయింది. టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన ఆతిథ్య జట్టు 46.5 ఓవర్లలో 204 పరుగులకే కుప్పకూలింది. ఖయా జోండో (54) అర్ధ సెంచరీతో రాణించాడు. పెహ్లుక్వాయో (34), ఏబీ డివిల్లీర్స్ (30) కాసేపు పోరాడారు. భారత బౌలర్లలో శార్దూల్ 4, చాహల్, బుమ్రా రెండేసి వికెట్లతో రాణించారు. అనంతరం కోహ్లీ బ్యాటింగ్ ధాటికి భారత్ 32.1 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. కోహ్లీకే 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌తో పాటు ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డులు దక్కాయి.

విరాట్ వీరవిహారం...

భీకర ఫామ్‌లో ఉన్న రన్ మెషీన్ విరాట్ కోహ్లీ మరింతగా రెచ్చిపోవడంతో చిన్న లక్ష్యం ఇట్టే కరిగిపోయింది. టీ-20 సిరీస్‌కు సన్నద్ధం కావాలనుకున్నాడో ఏమో కానీ.. విరాట్ ధనాధన్ బ్యాటింగ్‌తో చెలరేగాడు. సఫారీ బ్యాట్స్‌మెన్ తడబడిన చోట కోహ్లీ తన ట్రేడ్ మార్క్ షాట్లతో అలరించాడు. సహచరులు పరుగులు తీసేందుకు ఇబ్బంది పడుతున్నా.. విరాట్ మాత్రం మంచినీళ్ల ప్రాయంలా బౌండ్రీలు రాబట్టాడు. వాస్తవానికి ఛేదనలో భారత్‌కు మంచి ఆరంభం దక్కలేదు. గత మ్యాచ్‌లో సెంచరీ కొట్టిన రోహిత్ (15) నాలుగో ఓవర్లోనే వెనుదిరిగాడు. అతణ్ణి ఎన్‌గిడి అవుట్ చేశాడు. అయితే, కోహ్లీ వచ్చీరావడంతో బ్యాట్ ఝుళిపించాడు. మరో ఎండ్‌లో ధవన్ (18) స్ట్రయిక్ రొటేట్ చేయగా.. విరాట్ బౌండ్రీలనే లక్ష్యంగా పెట్టుకున్నాడు. మోర్కెల్, ఎన్‌గిడి ఓవర్లలో వరుసగా రెండేసి ఫోర్లు బాదాడు. 13వ ఓవర్లో ధవన్‌ను ఎన్‌గిడి అవుట్ చేసినా విరాట్ ఏ మాత్రం వెనక్కుతగ్గలేదు. రహానె (34 నాటౌట్) సహకారం అందించగా.. నాణ్యమైన ఫుట్‌వర్క్‌తో చూడచక్కటి డ్రైవ్‌లు, కట్, పుల్ షాట్లతో బౌండ్రీలు రాబట్టాడు. ప్రత్యర్థి బౌలర్లకు ఎలాంటి అవకాశం ఇవ్వని అతను.. 36 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత అదే జోరుతో చూస్తుండగానే సెంచరీ మార్కు దాటాడు. తాహిర్ బౌలింగ్‌లో స్ట్రెయిట్ డ్రైవ్‌తో బౌండ్రీ కొట్టి 82 బంతుల్లోనే కెరీర్‌లో 35వ శతకాన్ని అందుకున్నాడు. ఆపై, తాహిర్ బౌలింగ్‌లోనే వరుసగా రెండు భారీ సిక్సర్లు బాదాడు. అతని ఓవర్లోనే బౌండ్రీతో మ్యాచ్‌ను ముగించాడు.



శార్దూల్ (4/52)

శార్దూల్ సూపర్ షో..

భువనేశ్వర్ స్థానంలో బరిలోకి దిగిన యువ పేసర్ శార్దూల్ ఠాకూర్ ఆతిథ్య బ్యాట్స్‌మెన్‌ను హడలెత్తించాడు. మిగతా బౌలర్లు కూడా క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ సఫారీలను సమర్థవంతంగా కట్టడి చేయగలిగారు. తొలుత ఓపెనర్ మార్‌క్రమ్ (24) తొలి ఓవర్లోనే వరుసగా రెండు ఫోర్లతో శార్దూల్‌కు స్వాగతం పలికాడు. మరో ఎండ్‌లో ఆమ్లా (10) జాగ్రత్తగా బ్యాటింగ్ చేయగా.. మార్‌క్రమ్ స్వేచ్ఛగా షాట్లు కొట్టాడు. అయితే, షార్ట్‌లెంగ్త్ బాల్స్‌తో పరీక్షపెట్టిన శార్దూల్ పది ఓవర్లలోపే ఈ ఇద్దరినీ అవుట్ చేసి భారత్‌కు గొప్ప ఆరంభాన్ని ఇచ్చాడు. ఈ దశలో డివిల్లీర్స్, జోండో ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టే ప్రయత్నం చేశారు. చాహల్ వేసిన 19వ ఓవర్లో జోండో రెండు సిక్సర్లు కొట్టి జట్టు స్కోరు వంద దాటించాడు. అయితే ప్రమాదకరంగా మారుతున్న ఏబీని చాహల్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత చాహల్, పాండ్యా కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో జోండో, క్లాసెన్ (22) తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. దాంతో 20-28 ఓవర్ల మధ్యలో 17 పరుగులే వచ్చాయి. చివరకు బుమ్రా ఓవర్లో రెండు, శార్దూల్ బౌలింగ్‌లో ఒక బౌండ్రీతో మళ్లీ వేగం పెంచిన జోండో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అప్పటికి 30 ఓవర్లలో సఫారీల స్కోరు 135/3. చేతిలో మరో ఏడు వికెట్లు ఉండడంతో ఆ జట్టు మంచి స్కోరు చేసేలా కనిపించింది. ఈ దశలో భారత బౌలర్లు వరుస పెట్టి వికెట్లు తీస్తూ ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేశారు. 31వ ఓవర్లో క్లాసెన్‌ను బుమ్రా, బెహర్డీన్ (1)ను శార్దూల్, మోరిస్ (4)ను కుల్దీప్ అవుట్ చేశారు. జోండోను చాహల్ వెనక్కుపంపడంతో సౌతాఫ్రికా 151/7తో డీలా పడింది. అయితే, పెహ్లుక్వాయోతో పాటు చివర్లో మోర్కెల్ (20) భారీ షాట్లు ఆడి విలువైన పరుగులు అందించారు. మోర్కెల్ వెనుదిరిగినా.. శార్దూల్ బౌలింగ్‌లో 2 సిక్సర్లు కొట్టిన పెహ్లుక్వాయో జట్టు స్కోరు 200 దాటించాడు. మరో షాట్ ఆడే ప్రయత్నంలో అతను శార్దూల్‌కే రిటర్న్ క్యాచ్ ఇవ్వడంతో సఫారీల ఇన్నింగ్స్ ముగిసింది.



అనుష్కే నా ప్రేరణ..

వన్డే క్రికెట్‌లో అద్భుత ఫామ్‌తో రాణించడానికి తన భార్య అనుష్క శర్మే కారణమని విరాట్ కోహ్లీ కొనియాడాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన ఆరు వన్డేల సిరీస్‌లో తను మూడు శతకాలు బాదడంతో పాటు మొత్తం 558 పరుగులు సాధించాడు. 'మైదానం వెలుపలి నుంచి నాకు మద్దతుగా నిలిచినవారు కూడా నా ఫామ్‌కు కారణమే.. ముఖ్యంగా నా భార్యకు ఈ విషయంలో అధిక భాగం దక్కుతుంది. ఈ పర్యటనలో తను నాకు ఎంతో మద్దతుగా నిలిచింది. నిరంతరం నాకు ప్రేరణగా నిలుస్తూ ముందుకెళ్లేలా చేస్తోంది. గతంలో ఆమెపై చాలా మంది విమర్శలు గుప్పించారు. ఇక జట్టు సారథిగా విజయాలు అందించడం ఎంతో సంతోషాన్నిచ్చే విషయం. ఇంకా నాకు ఎనిమిది లేక తొమ్మిదేళ్ల కెరీర్ ఉంది. అందుకే ప్రతీ రోజునూ ఆస్వాదించాలనుకుంటున్నాను. ఆరోగ్యంగా ఉండి జట్టును నడిపిస్తుండడం నా అదృష్టంగా భావిస్తున్నాను' అని కోహ్లీ తెలిపాడు. స్పిన్నర్లు కుల్దీప్, చాహల్ రాణించిన తీరు అమోఘమని అన్నాడు. అలాగే వన్డే సిరీస్‌ను 5-1తో నెగ్గినా ఇంకా పర్యటన ముగియలేదని, టీ20 సిరీస్‌లో రాణించడంపై దృష్టి పెడతామని కోహ్లీ చెప్పుకొచ్చాడు.

స్కోరుబోర్డు

దక్షిణాఫ్రికా: మార్‌క్రమ్ (సి) అయ్యర్ (బి) శార్దూల్ 24, ఆమ్లా (సి) ధోనీ (బి) శార్దూల్ 10, డివిల్లీర్స్ (బి) చాహల్ 30, జోండో (సి) పాండ్యా (బి) చాహల్ 54, క్లాసెన్ (సి) కోహ్లీ (బి) బుమ్రా 22, బెహర్డీన్ (సి) బుమ్రా (బి) శార్దూల్ 1, మోరిస్ (సి) ధవన్ (బి) కుల్దీప్ 4, పెహ్లుక్వాయో (సి అండ్ బి) శార్దూల్ 34, మోర్కెల్ (సి) అయ్యర్ (బి) పాండ్యా 20, తాహిర్ (సి) కోహ్లీ (బి) బుమ్రా 2, ఎన్‌గిడి (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 46.5 ఓవర్లలో 204 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-23, 2-43, 3-105, 4-135, 5-136, 6-142, 7-151, 8-187, 9-192; **బౌలింగ్:** శార్దూల్ 8.5-0-52-4, బుమ్రా 8-1-24-2, పాండ్యా 10-0-39-1, కుల్దీప్ 10-0-51-1, చాహల్ 10-0-38-2.

భారత్: ధవన్ (సి) జోండో (బి) ఎన్‌గిడి 18, రోహిత్ (సి) క్లాసెన్ (బి) ఎన్‌గిడి 15, కోహ్లీ (నాటౌట్) 129, రహానె (నాటౌట్) 34; **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 32.1 ఓవర్లలో 206/2; వికెట్ల పతనం:** 1-19, 2-80; **బౌలింగ్:** మోర్కెల్ 7-0-42-0, ఎన్‌గిడి 8-1-54-2, మోరిస్ 6-0-36-0, పెహ్లుక్వాయో 4-0-27-0, తాహిర్ 7.1-0-42-0.

ఆస్ట్రేలియా 'రికార్డు' విజయం

- టీ20ల్లో అత్యధిక లక్ష్య ఛేదన
- గప్టిల్ సెంచరీ వృథా
- న్యూజిలాండ్‌తో మ్యాచ్



షార్ట్ (44 బంతుల్లో 3 సిక్సర్లతో 76)

ఆక్లాండ్: 244 పరుగుల లక్ష్యం.. అదీ ఓ టీ20 మ్యాచ్‌లో.. అయితేనేం.. ఆస్ట్రేలియా జట్టు పరుగుల మోత మోగిస్తూ మరో ఏడు బంతులుండగానే ఉఫ్‌మని ఊదేసింది. దీంతో అంతర్జాతీయ టీ-20 క్రికెట్‌లో అత్యధిక పరుగుల లక్ష్య ఛేదన చేసిన జట్టుగా రికార్డు సృష్టించింది. 2015లో దక్షిణాఫ్రికాపై వెస్టిండీస్ జట్టు చేసిన 236 పరుగుల లక్ష్య ఛేదనే ఇప్పటిదాకా రికార్డుగా ఉంది. శుక్రవారం ముక్కోణపు సిరీస్‌లో భాగంగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో ఆసీస్ నెగ్గింది. ఇక్కడి ఈడెన్ పార్క్‌లో తక్కువ దూరంలోనే బౌండరీ ఉండడంతో బ్యాట్స్‌మెన్ పండగ చేసుకున్నారు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 243 పరుగులు చేసింది. ఓపెనర్ గప్టిల్ (54 బంతుల్లో 105) టీ-20ల్లో రెండో సెంచరీ సాధించాడు. మరో ఓపెనర్ మన్రో (33 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 76) కూడా ధాటిగా ఆడడంతో స్కోరు పరిగెత్తింది. 18వ ఓవర్లో కివీస్ 220/4 స్కోరుతో ఉన్న దశలో స్టాన్‌లేక్ వేసిన బంతి చాప్‌మన్ హెల్మెట్‌ను తాకి వికెట్లపై పడడంతో అతడు హిట్ వికెట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత ఆసీస్ 18.5 ఓవర్లలో 5 వికెట్లకు 245 పరుగులు చేసింది. ఓపెనర్లు షార్ట్ (44 బంతుల్లో 3 సిక్సర్లతో 76), డేవిడ్ వార్నర్ (24 బంతుల్లో 59) ఆకాశమే హద్దుగా చెలరేగడంతో 8.3 ఓవర్లలోనే 121 పరుగులు వచ్చాయి. ఆఖర్లో ఫించ్ (36 నాటౌట్), మ్యాక్స్‌వెల్ (36) తమ వంతు సహకారం అందించడంతో భారీ లక్ష్య ఛేదన సులువైంది. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా షార్ట్ నిలిచాడు. ఈ సిరీస్‌లో ఆసీస్ ఇప్పటికే ఫైనల్‌కు వెళ్లగా ఆదివారం కివీస్, ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌లో మరో జట్టు ఖరారవుతుంది.

- **టీ20 కెరీర్‌లో అత్యధిక పరుగులు (2,188) చేసిన బ్యాట్స్‌మన్‌గా మార్టిన్ గప్తిల్ నిలిచాడు. మెకల్లమ్ (2140)ను అధిగమించాడు.**
- **49 బంతుల్లోనే శతకం సాధించిన గప్తిల్ కివీస్ తరఫున ఫాస్టెస్ట్ టీ20 సెంచరీ చేసిన ఆటగాడయ్యాడు.**
- **టీ20ల్లో తమ అత్యధిక స్కోరు (243)ను కివీస్ మరోసారి సమం చేసింది.**
- **టీ20లో అత్యధిక సిక్సర్ల (32) రికార్డు సమం.**
- **టీ20 మ్యాచ్‌లో అత్యధిక పరుగులు (488) నమోదు కావడం ఇది రెండోసారి. భారత్, విండీస్ మ్యాచ్ (489) తొలి స్థానంలో ఉంది.**

మెరిసిన మిథాలీ, మంధాన



స్మృతి-మిథాలీ

రెండో టీ20లో భారత్ గెలుపు

ఈస్ట్ లండన్ : దక్షిణాఫ్రికాతో టీ20ల్లోనూ భారత మహిళలు అదరగొడుతున్నారు. శుక్రవారం ఇక్కడ జరిగిన రెండో టీ20లో తొమ్మిది వికెట్లతో ఘన విజయం సాధించారు. టాస్ గెలిచిన భారత్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. బౌలర్ల సమష్టి ప్రదర్శనతో ప్రత్యర్థిని నిర్ణీత 20 ఓవర్లలో 142/7కే హర్మన్‌ప్రీత్ సేన పరిమితం చేసింది. సున్ లూస్ (32 బంతుల్లో 2 ఫోర్లతో 33) టాప్ స్కోరర్‌కాగా..డి క్లెర్క్ (28 బంతుల్లో ఫోర్‌తో 26) పర్లేదనిపించింది. ఆఫ్ స్పిన్నర్ అనుజా పాటిల్ (2/37), లెగ్ స్పిన్నర్ పూనమ్ యాదవ్ (2/18) చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఆపై..ఓ మోస్తరు లక్ష్యాన్ని భారత్ ఇంకా ఐదు బంతులు మిగిలి ఉండగానే 144/1తో ఛేదించింది. ఓపెనర్లు మిథాలీరాజ్ (61 బంతుల్లో 8 ఫోర్లతో 76 నాటౌట్), స్మృతి మంధానా (42 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 57) హాఫ్ సెంచరీలతో మెరిశారు. దక్షిణాఫ్రికా బౌలర్లను ఆడుకున్న వీరు తొలి వికెట్‌కు 106 పరుగులు జోడించారు. సఫారీలపై టీ20ల్లోభారత ప్రారంభ జోడీకి ఇది మొదటి సెంచరీ భాగస్వామ్యం కావడం గమనార్హం.

మిథాలీ..హాఫ్ సెంచరీల స్పెషాలిటీ..

ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మిథాలీ ఈ సిరీస్‌లో వరుసగా రెండో అర్ధ సెంచరీ నమోదు చేసింది. అంతేకాదు గత నాలుగు ఇన్నింగ్స్‌ల్లోనూ ఆమె హాఫ్ సెంచరీలు చేయడం విశేషం. ఇంకా..వరుసగా మూడు ఇన్నింగ్స్‌ల్లోనూ రాజ్‌కు మూడో అజేయ అర్ధసెంచరీ.

సంక్షిప్తస్కోర్లు: దక్షిణాఫ్రికా : 20 ఓవర్లలో 142/7 (లూస్ 33, డి క్లెర్క్ 26, ఇస్మాయిల్ నాటౌట్ 16, పాటిల్ 2/37, పూనమ్ 2/18)

భారత్ : 19.1 ఓవర్లలో 144/1 (మిథాలీ రాజ్ 76 నాటౌట్, స్మృతి మంధాన 57, డేనియల్స్ 1/21)



విష్ణు

విష్ణువర్ధన్ జోడీకి టైటిల్

- ఫైనల్లో యుకీ భాంబ్రీ
- టాప్ సీడ్‌తో నేడు అమీతుమీ
- చెన్నై ఓపెన్

చెన్నై: తెలుగు ఆటగాడు విష్ణువర్ధన్ చెన్నై ఓపెన్ ఏటీపీ చాలెంజర్ ట్రోఫీలో మెరిశాడు. శ్రీరామ్ బాలాజీతో కలిసి విష్ణు పురుషుల డబుల్స్ టైటిల్ గెలుచుకున్నాడు. శుక్రవారం జరిగిన ఫైనల్లో విష్ణు-బాలాజీ జంట 7-5 (5), 5-7, 10-5తో కెమ్ ఇల్కెల్ (టర్కీ)-డానిలో పెట్రోవిక్ (సెర్బియా) ద్వయంపై విజయం సాధించింది. ఇక, సింగిల్స్‌లో స్టార్ ప్లేయర్ యుకీ భాంబ్రీ ట్రోఫీకి అడుగు దూరంలో నిలిచాడు. టోర్నీలో అద్భుత ప్రదర్శన చేస్తున్న యుకీ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. టైటిల్ కోసం టాప్ సీడ్ జోర్డాన్ థాంప్సన్‌తో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమయ్యాడు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో రెండో సీడ్ భాంబ్రీ 7-5, 6-2తో వరుస సెట్లలో మూడో సీడ్ డుకీ లీని చిత్తు చేశాడు. మరో సెమీస్‌లో థాంప్సన్ (ఆస్ట్రేలియా) 6-1, 7-6తో స్పెయిన్ ఆటగాడు పెడ్రో మార్టినెజ్‌ను ఓడించాడు.

ముజీబ్ కొత్త చరిత్ర

షార్జా: జింబాబ్వేతో జరిగిన నాలుగో వన్డేలో అఫ్ఘానిస్థాన్ టీనేజ్ ఆఫ్ స్పిన్నర్ ముజీబ్ జద్రాన్ చరిత్ర సృష్టించాడు. 16 ఏళ్ల ఈ సంచలన బౌలర్ అత్యంత పిన్న వయస్సులోనే ఐదు వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. ఈక్రమంలో అతడు వకార్ యూనిస్ (18 ఏళ్ల వయస్సు లో) రికార్డును బ్రేక్ చేశాడు. గత నెలలో జరిగిన ఐపీఎల్ వేలంలో ఈ ఆటగాడిని పంజాబ్ జట్టు ఏకంగా 4 కోట్లకు కొనుగోలు చేసింది. ముజీబ్ ప్రదర్శనతో ఈ మ్యాచ్‌లో అఫ్ఘాన్ 10 వికెట్ల తేడాతో నెగ్గడంతో పాటు మరో మ్యాచ్ ఉండగానే 3-1తో సిరీస్ కూడా దక్కించుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే 38 ఓవర్లలో 134 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఆ తర్వాత వికెట్ నష్టపోకుండా అఫ్ఘాన్ 21.1 ఓవర్లలో 135 పరుగులు చేసి నెగ్గింది. షెహజాద్ (75 నాటౌట్), ఎహ్‌సానుల్లా (51 నాటౌట్) అజేయ అర్ధసెంచరీలు చేశారు.



*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107*
Editor : K. Srinivas,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

News Everyday

Everyday NewsPapers

https://play.google.com/store/apps/details?id=com.newseveryday